
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 109

గురువారం 10-7-2025



యాపిల్ సీవోవోగా 'ప్రవాసీ' సబీహ్ ఖాన్

- 15లో



ఎన్విడియా @ 4 లక్షల కోట్ల డాలర్లు

- 15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

గురువారం 10-7-2025



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 109

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆధిక్యమే లక్ష్యంగా...

నేటి నుంచి భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య మూడో టెస్టు -14లో



కొత్త ప్రపంచ రికార్డు

మాడ్రిడ్‌లో జరుగుతున్న ఆర్చరీ వరల్డ్‌కప్‌లో జ్యోతి -రిషభ్ ప్రపంచ రికార్డు -14లో



కలిసి సాగుదాం..

భవిష్యత్తును నిర్ణయించేందుకు భారత్, నమీబియా కలిసికట్టుగా పని చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



ఒక్క ఇంక్యుబేటర్‌లో ఐదుగురు!

ఇజ్రాయెల్ ఆర్మీ దిగ్బంధంలో ఉన్న గాజాలో హృదయ విదారక పరిస్థితులున్నాయి. చిన్నారులకు సరైన వైద్యం అందడం లేదు.

వివరాలు 6లో ▸



గుజరాత్‌లో కూలిన వంతెన

గుజరాత్‌లో 4 దశాబ్దాల క్రితంనాటి పాత వంతెన కూలిన ఘటనలో 13 మంది వాహనదారులు జలసమాధి అయ్యారు.

వివరాలు 6లో ▸




అమెరికా వీసా మరింత భారం

అమెరికా వీసా మరింత భారం కానుంది. సెక్యూరిటీ డిపాజిట్ రూపంలో అదనంగా రూ.21,000 చెల్లించాల్సి ఉంటుంది.

వివరాలు 6లో ▸

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా , డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



మీరు ఎప్పుడంటే అప్పుడే

అసెంబ్లీ, మండలి సమావేశాలు ఏర్పాటు చేస్తాం | లేదంటే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో మాక్ అసెంబ్లీ పెడదాం

- అక్కడికి మా మంత్రులను పంపిస్తా..పిలిస్తే నేనూ వస్తా
- కృష్ణా, గోదావరి జలాలపై చర్చిద్దాం.. న్యాయ, నీటిపారుదల నిపుణులనూ పిలుద్దాం
- మాజీ సీఎం కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్
- రైతులకు కేసీఆర్ మరణ శాసనం రాశారని ఫైర్.. క్లబ్బులు, పబ్బులకు తనను పిలవద్దని కేటీఆర్‌కు సూచన
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా మాట్లాడిన సీఎం

సాక్షి, హైదరాబాద్

మాజీ సీఎం కేసీఆర్ సుదీర్ఘ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ఆయన ఏ తారీఖు ఇచ్చినా శాసనసభ, మండలి సమావేశాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 'కృష్ణా, గోదావరి జలాలకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో, ఆ తర్వాత తొమ్మిదిన్నరేళ్లలో మీరు, ఏడాదిన్నరలో మేము తీసుకున్న నిర్ణయాలపై చర్చిద్దాం..' అని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. న్యాయ, సాగునీటి రంగ నిపుణులను పిలిపించి వారి అభిప్రాయాన్ని కూడా ప్రజలకు వినిపిద్దామని అన్నారు. 'ఏ చిన్న గందరగోళం ఏర్పడకుండా, ఎవరి గౌరవానికి భంగం కలిగించకుండా చట్ట పరిధిలో సభ నిర్వహించే బాధ్యత నాది. ఆరోగ్యం సహకరించక కేసీఆర్ రాకపోతే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు మా మంత్రుల బృందాన్ని పంపిస్తా. తారీఖు చెప్తే మా వాళ్లు మొత్తం సెటప్ తీసుకుని వస్తారు. అక్కడే మాక్ అసెంబ్లీ నిర్వహించి చర్చ పెడదాం. కోదండరాం అందులో కూర్చోవాలి. కేసీఆర్ పిలిస్తే నేనూ వస్తా..' అని సీఎం సవాల్ విసిరారు. మేడిగడ్డ బరాజ్‌కు సంబంధించి తప్పుడు నిర్ణయాలు, ఏపీ కృష్ణా జలాల అక్రమ తరలింపు అంశాలపై బుధవారం ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్ నిర్వహించిన

మిగతా 3వ పేజీలో ▶

బరాజ్‌లు కూలితే బాధ్యులెవరు?: ఉత్తమ్

- మేడిగడ్డ నుంచి నీళ్లు తరలించాలని బీఆర్ఎస్ నేతలు పదేపదే అంటున్నారు
- కానీ కాళేశ్వరం కట్టడాలు ప్రమాదకరంగా ఉన్నట్టు ఎన్డీఎస్ఏ తేల్చింది
- వాటిలో నీళ్లు నింపితే కూలిపోయే ప్రమాదం ఉంది
- 44 గ్రామాలు, సమ్మక్క బరాజ్ కొట్టుకుపోతాయి

- వివరాలు 3లో▶

కల్తీ కల్లుకు మరో నలుగురు బలి

ఆరుకు చేరిన మృతుల సంఖ్య



నిమ్స్‌లో బాధితురాలిని పరామర్శిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- ఆస్పత్రుల్లో 32 మందికి చికిత్స
- వీరిలో నలుగురి పరిస్థితి విషమం
- కల్లు దుకాణం నిర్వాహకుల అరెస్టు
- బాధితులను పరామర్శించిన మంత్రి జూపల్లి

కూకట్‌పల్లి/ లక్డీకాపూల్/ సాక్షి, హైదరాబాద్: కల్తీ కల్లు మృతులు, బాధితులు అంతకంతకూ పెరుగుతున్నారు. కూకట్‌పల్లి, హైదర్‌నగర్ కల్లు దుకాణాల్లో కల్తీ కల్లు సేవించినవారిలో మూడు రోజుల క్రితం ఇద్దరు మరణించగా, బుధవారం మరో నలుగురు మృతిచెందారు. బాధితుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. బుధవారం రాత్రి వరకు 31 మంది నిమ్స్‌లో, రామ్‌దేవ్‌రావ్ ఆస్పత్రిలో ఒకరు చికిత్స పొందుతున్నారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కల్తీ కల్లు తాగి బొజ్జయ్య, నారమ్మ అనే వ్యక్తులు సోమవారం మృతిచెందిన విషయం తెలిసిందే. బుధవారం సీతారాం (47) అనే వ్యక్తి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. హైదర్‌నగర్‌కు చెందిన స్వరూప (61) సాయంత్రం 4 గంటలకు మృతి చెందగా, సాయిచరణ్ కాలనీకి చెందిన మౌనిక (24) సాయంత్రం 6 గంటలకు మరణించింది. రాత్రి 8 గంటలకు నారాయణ అనే వ్యక్తి రామ్‌దేవ్ రావ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాంధీ ఆస్పత్రిలో చేరిన విజయ్, కృష్ణయ్య అనే బాధితులను మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు తరలించినట్లు గాంధీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్ తెలిపారు. నిమ్స్‌లో మోహనప్ప, పెంటయ్య, యాదగిరి, రాములు అనే బాధితులు ఇప్పటికే వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. మాధవి, యోబు, నర్సింహ, దేవదాసు, గోవిందమ్మ, లక్ష్మి, కోటేశ్వరరావు, పోచమ్మ,

మిగతా 12వ పేజీలో ▶

న్యూస్‌రీల్

టీచర్లకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు



ప్రభుత్వ టీచర్ల హాజరువిధానం మారబోతోంది. త్వరలో ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా హాజరు తీసుకోనున్నారు. పెద్దపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు.

- వివరాలు 16లో▶

న్యాయవాదుల బీమా రూ.10 లక్షలకు పెంపు



న్యాయవాదుల జీవిత బీమాను రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి తెలిపారు. న్యాయవాదుల విజ్ఞప్తులను పరిశీలించి కౌన్సిల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

- వివరాలు 2లో▶

రేపో ఎల్లుండో నీట్ స్టేట్ ర్యాంకులు



రాష్ట్రంలో ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించేందుకు కాళోజీ ఆరోగ్య వర్సిటీ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా వీలైనంత త్వరలో నీట్ స్టేట్ ర్యాంకులను విడుదల చేసేందుకు కసరత్తు జరుగుతోంది.

- వివరాలు 2లో▶

నిజాలు చెప్పే దమ్ము లేదు



సాగునీటి రంగంపై చర్చకు రావాలంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాభవన్‌లో బుధవారం నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ప్రధాన విపక్షమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఎందుకు ఆహ్వానించలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు.

- వివరాలు 3లో▶



చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డు వద్దకు భారీ సంఖ్యలో తరలివచ్చిన రైతులు, ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్



ఈ ప్రభుత్వం భయపడుతోంది

నేను రైతులను కలవడానికి ఇన్ని ఆంక్షలా?
నన్ను కలవడానికి వస్తున్న మామిడి రైతులను ఎందుకు అడ్డుకున్నారు?
చంద్రబాబు కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్

- కిలో మామిడి 2 రూపాయలట.. మరీ ఇంత దారుణమా?
- మామిడి రైతుల సమస్యలపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం
- ఈ ప్రభుత్వాన్ని నిద్ర లేపడం కోసమే నా పర్యటన
- రైతుల సమస్యలు ప్రస్తావించడం కూడా తప్పేనా?
- ఎక్కడా లేని విధంగా ఆంక్షలు పెట్టడం దుర్మార్గం
- నన్ను కలవకుండా రైతులను ఎక్కడికక్కడ నిర్బంధించారు
- అయినా సమస్యలు లేకపోతే ఇంత మంది రైతులు వస్తారా?
- జగన్ వస్తున్నాడంటే మీకు భయం.. అందుకే ఎక్కడికక్కడ కట్టడి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కిలో మామిడి రూ.22–29 పలికింది.. ఏటా మే మొదటి వారంలోనే పంట కొనుగోలు
- కూటమి ప్రభుత్వంలో నెల రోజులకు పైగా జాప్యం
- ఫలితంగా దిక్కు తోచని స్థితిలో రైతులు.. పంటల విధ్వంసం
- ఇప్పటికైనా కళ్లు తెరిచి కిలో రూ.12తో ప్రభుత్వమే కొనాలి
- తర్వాత ప్రభుత్వమే మార్కెట్‌లో అమ్ముకోవాలని డిమాండ్

12 లో

"76 వేల మంది రైతులు 2.20 లక్షల ఎకరాల్లో మామిడి సాగు చేస్తుండగా, 6.45 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. ఈ 76 వేల మంది రైతులకు మీరే కిలోకు రూ.12 చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో వేయాలి. మామిడి పంటను మీరే కొనుగోలు చేసి, ఆ తర్వాత మీరే (ప్రభుత్వం) మార్కెట్‌లో అమ్మాలని చంద్రబాబు నాయుడిని గట్టిగా డిమాండ్ చేస్తున్నా.

–వైఎస్ జగన్



దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా హైదరాబాద్‌లో అమరవీరుల స్మారక స్తూపం వద్ద జేఏసీ సభ్యుల ధర్నా

సార్వత్రిక సమ్మె ప్రశాంతం

నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ నినదించిన కార్మికులు

- వివరాలు 16లో



ఎఫ్-1 వీసాలు తగ్గాయ్!

మార్చి-మే మధ్య మన విద్యార్థులకు 9,906 వీసాలు

గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 27% తగ్గుదల

వలసలపై ట్రంప్ కఠిన చర్యల ప్రభావమే కారణం

యూఎస్‌లో చదువుకోవాలని, అక్కడ స్థిరపడాలన్న భారతీయ విద్యార్థుల కలలపై ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలస వ్యతిరేక విధానం తీవ్ర ప్రభావం చూపుతోంది. దాని ఫలితంగానే భారతీయ విద్యార్థులకు వీసాలు భారీగా తగ్గాయి. 2025 మార్చి-మే మధ్య జారీ అయిన ఎఫ్-1 విద్యార్థి వీసాలు.. గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 27% క్షీణించాయి. డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత వలసలపై కఠిన చర్యలు తీసుకోవడం, అలాగే అభ్యర్థుల సామాజిక ఖాతాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే అనుమతించడం ఇందుకు ప్రధాన కారణాలు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి నుంచి అంతర్జాతీయ విద్యార్థుల జీవితాలు కష్టాల్లో పడ్డాయి.

అమెరికన్ యూనివర్సిటీలు ఏటా ఆగస్టు-డిసెంబర్, జనవరి-మే సెమిస్టర్లకు రెండుసార్లు ప్రవేశాలు కల్పిస్తాయి. భారతీయ విద్యార్థులు సాధారణంగా ఆగస్టు-డిసెంబర్ సెమ్‌నే ఎక్కువగా ఎంపిక చేసుకుంటారు. దీని కోసం 6 నెలల ముందు నుంచే వీసా కోసం ప్రయత్నాలు మొదలుపెడతారు. అలా సాధారణంగా ఏటా మార్చి-జూలై మధ్య వీసాల సందడి ఉంటుంది. అందులో భాగంగా ఈ సంవత్సరం మార్చి-మే మధ్య భారతీయ విద్యార్థులు 9,906 ఎఫ్-1 (విద్యా) వీసాలను పొందారు. గత ఏడాది ఇదేకాలంలో 13,478 వీసాలను అందుకున్నారు. కోవిడ్-19 తర్వాత 2025 మార్చి-మే నెలల్లో అత్యల్ప స్థాయిలో వీసాలు మంజూరు అయ్యాయని అమెరికా విదేశాంగ శాఖ తాజా నివేదిక తెలిపింది. భారతీయ విద్యార్థులకు అమెరికా ప్రభుత్వం మార్చి-మే నెలల్లో 2022లో 10,894, 2023లో 14,987 వీసాలు జారీ చేసింది. ఏప్రిల్ నాటికి యూఎస్ అధికారులు అక్కడి కనీసం 32 రాష్ట్రాల్లో అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేశారని ఎన్‌బీసీ న్యూస్ తెలిపింది. వీసా దరఖాస్తుదారుల పరిశీలన కోసం యూఎస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త మార్గదర్శకాలను జారీ చేస్తోంది.



ప్రాసెసింగ్‌కు సమయం..

విద్యార్థుల దరఖాస్తులు తగ్గడం, తిరస్కరణలు పెరగడం, ఇంటర్వ్యూలను షెడ్యూల్ చేయడంలో జాప్యం వీసాల తగ్గుదలకు కారణం అయి ఉండొచ్చని యూఎస్ రాయబార కార్యాలయం చెబుతోంది. ఎఫ్-1 వీసాల ప్రాసెసింగ్‌కు ఎక్కువ సమయం పడుతుందన్న అంచనాతో దరఖాస్తుదారులు వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తోంది. విద్యార్థులకు ఇచ్చే నాన్-ఇమిగ్రెంట్ వీసా దరఖాస్తుల షెడ్యూలింగ్ ప్రారంభం అయిందని, దరఖాస్తుదారులు అపాయింట్‌మెంట్ కోసం సంబంధిత ఎంబసీ, కాన్సులేట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది. 'ప్రపంచవ్యాప్తంగా వీసా జారీ ప్రక్రియ అత్యున్నత ప్రమాణాలకు లోబడి ఉందని నిర్ధారించుకోవడానికి, దరఖాస్తుల పూర్తి పరిశీలనకు తగినంత సమయం ఇవ్వడానికి కాన్సులర్ విభాగాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. వీసా దరఖాస్తుదారులకు యూఎస్‌కు లేదా మా ప్రయోజనాలకు హాని కలిగించే ఉద్దేశం లేదని, వారు కోరిన వీసా కోసం వారి అర్హతను విశ్వసనీయంగా వెల్లడించారని నిర్ధారించుకోవడానికి అనునిత్యం పని చేస్తున్నాం' అని యూఎస్ ఎంబసీ ప్రతినిధులు చెబుతున్నారు.


మనవాళ్లే ఎక్కువ..

వీసా జారీలో ఇటీవల తగ్గుదల ఉన్నప్పటికీ.. వాస్తవానికి అమెరికాలో భారతీయ విద్యార్థుల సంఖ్య వృద్ధి గణనీయంగా ఉంది. ఓపెన్ డోర్స్ 2024 డేటా ప్రకారం 2023-24 విద్యా సంవత్సరంలో యూఎస్‌లో అడ్మిషన్స్ తీసుకున్న విదేశీ విద్యార్థుల్లో భారతీయులే అధికం కావడం విశేషం. గత ఏడాది జనవరి-సెప్టెంబర్‌లో భారతీయ విద్యార్థులు 64,008 ఎఫ్-1 వీసాలు అందుకున్నారు. ఇదే కాలంలో 2023లో 1.03 లక్షలు, 2022లో 93,181 వీసాలు జారీ అయ్యాయి.

తనిఖీలు కఠినం

ట్రంప్ ప్రభుత్వం విదేశీ విద్యార్థుల గురించి లోతుగా పరిశీలించడం ప్రారంభించిన తరుణంలో ఈ తగ్గుదల నమోదు కావడం గమనార్హం. పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు, ప్రభుత్వ వ్యతిరేక చర్యలతో ముడిపడి ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భారతీయులతో సహా అనేక మంది వ్యక్తులకు వీసాల రద్దు కూడా జరిగింది. దరఖాస్తుదారుల సోషల్ మీడియా కార్యకలాపాలపై మరింత కఠినమైన తనిఖీలను ప్రవేశపెట్టడానికి మే 27 నుంచి జూన్ 18 వరకు కొత్త దరఖాస్తులను నిలిపివేశారు. విద్యార్థి వీసా దరఖాస్తుదారుల కోసం కొత్త ఇంటర్వ్యూలను షెడ్యూల్ చేయడాన్ని నిలిపివేయాలని రాయబార కార్యాలయాలు, కాన్సులర్ విభాగాలను మే నెలలో యూఎస్ ప్రభుత్వం ఆదేశించింది. అంతర్జాతీయ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాల పరిశీలన తప్పనిసరి చేయాలని భావించడం కూడా ఇందుకు కారణం కావచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎఫ్, ఎం, జే విభాగాల వీసాల స్క్రీనింగ్ ప్రక్రియను సులభతరం చేయడానికి సోషల్ మీడియా ఖాతాల అయిదు సంవత్సరాల వివరాలను బహిరంగపరచాలని న్యూఢిల్లీలోని యూఎస్ రాయబార కార్యాలయం దరఖాస్తుదారులకు ఆదేశించింది.

భారతీయ విద్యార్థులు అందుకున్న ఎఫ్-1 వీసాలు



తిరస్కరణలే ఎక్కువ ఏటా ఎఫ్1 వీసాలకు వస్తున్న దరఖాస్తుల్లో మంజూరైన వాటికంటే తిరస్కరణకు గురవుతున్నవే ఎక్కువ ఉంటున్నాయి.

	2021-22	2022-23	2023-24
మొత్తం దరఖాస్తులు	6,31,807	6,98,773	6,79,290
తిరస్కరణకు గురైనవి	2,20,676	2,53,355	2,78,553

సాక్షి, స్పెషల్ డెస్క్

ఆధారం: అమెరికా విదేశాంగ శాఖ

క్లుప్తంగా...

సివిల్స్ అభయ హస్తం గడువు 12 వరకు పెంపు

సాక్షి, హైదరాబాద్: రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్టు సింగరేణి సీఎండీ ఎన్.బలరాం తెలిపారు. సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన విద్యార్థులకు మెయిన్స్ సన్నద్ధత కోసం ఒక్కొక్కరికీ రూ.లక్ష సింగరేణి అందజేస్తుంది.

న్యాయమూర్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాజగోపాల్



ఖమ్మం లీగల్: న్యాయమూర్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ఎన్నికలు ఈనెల 19న జరగాల్సి ఉండగా నామినేషన్ల గడువు బుధవారం ముగిసింది. అధ్యక్ష పదవికి ఒకే నామినేషన్ రావడంతో రాజగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. మహిళా ప్రతినిధిగా ఆర్థిక నేరాల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జె.మైత్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంకా ఒక ప్రధాన కార్యదర్శి, ముగ్గురు చొప్పున ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, 12 మంది కార్యవర్గ సభ్యుల ఎన్నికకు ఈనెల 19న పోలింగ్ నిర్వహించి, 27న ఫలితాలు ప్రకటిస్తామని ఎన్నికల అధికారి, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి శశిధర్‌రెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా ఎన్నికైన రాజగోపాల్ మాట్లాడుతూ న్యాయమూర్తులకు నివాస సముదాయాలు, నూతన కోర్టుల ఏర్పాటు, న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి పని చేస్తానని వెల్లడించారు.

39 లక్షల ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ గురువారంతో ముగుస్తుంది. దీంతో విద్యార్థులు ఆప్షన్ల ఎంపిక వేగాన్ని పెంచారు. బుధవారం 95,216 మంది రిజిస్ట్రేషన్, ధ్రువ పత్రాల పరిశీలన పూర్తి చేశారు. వీరిలో 74,542 మంది ఆప్షన్లు ఇచ్చారు. గరిష్టంగా ఒక్కో విద్యార్థి 1,051 ఆప్షన్లు ఇచ్చారు. దీంతో మొత్తం 39,54,951 ఆప్షన్లు అందాయని క్యాంపు కార్యాలయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులు 14, 15 తేదీల్లో ఆప్షన్లు మార్చుకునే వెసులుబాటు ఉంటుందన్నారు.

రేపో ఎల్లుండో నీట్ స్టేట్ ర్యాంకులు

త్వరలో రాష్ట్రంలో ఎంబీబీఎస్ కౌన్సెలింగ్
- కాళోజీ విశ్వవిద్యాలయం కసరత్తు
- 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో ప్రవేశాలకు ఎన్ఎంసీ ఆమోదం
- ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో పరిస్థితిపై కౌన్సిల్‌కు త్వరలో నివేదిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించేందుకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వ విద్యాలయం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా వీలైనంత త్వరలో నీట్ స్టేట్ ర్యాంకులను విడుదల చేసేందుకు కసరత్తు జరుగుతోంది. వర్సిటీ వీసీ డాక్టర్ నందకుమార్‌రెడ్డి బుధవారం ఢిల్లీకి వెళ్లి నీట్ ర్యాంకర్లకు సంబంధించిన సీడీని తీసుకువచ్చారు. సీడీలో ఉన్న.. రాష్ట్రం నుంచి నీట్ రాసిన విద్యార్థులు, వారికి వచ్చిన మార్కులు, జాతీయ స్థాయిలో ర్యాంకులకు సంబంధించిన పూర్తి వివరాలు పరిశీలించిన తర్వాత, రెండు మూడురోజుల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. అనంతరం ర్యాంకర్లు యూనివర్సిటీలో రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉంటుంది. రాష్ట్ర స్థాయి ర్యాంకులను విడుదల చేసిన వెంటనే జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నేతృత్వంలోని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఆలిండియా కోటా కింద ఎన్ఎంసీ కౌన్సెలింగ్ నిర్వహించనుండగా, రాష్ట్ర ర్యాంకర్లకు కాళోజీ వర్సిటీ ఆధ్వర్యంలో మెరిట్ లిస్ట్ ప్రకారం కౌన్సెలింగ్ జరుగుతుంది.



పూర్తయిన ప్రభుత్వ కళాశాలల రెన్యువల్

రాష్ట్రంలో మెడికల్ కళాశాలల్లో సీట్ల కేటాయింపునకు సంబంధించి రెన్యువల్ ప్రక్రియ పూర్తి కావస్తోంది. 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఎన్ఎంసీ ఆమోదం తెలిపింది. మే నెలలో జరిపిన తనిఖీల సందర్భంగా 26 కాలేజీల నిర్వహణపై కౌన్సిల్ అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా కళాశాలలను నిర్వహిస్తున్నారని, అనుబంధ ఆసుపత్రులలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బెడ్లు, రోగులు లేరని, విద్యార్థుల ప్రాక్టికల్స్‌కు అవసరమైన మౌలిక వసతులు లేవని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులను ఢిల్లీకి పిలిపించి క్లాస్ తీసుకుంది. ఈ నేపథ్యంలో 26 కళాశాలల్లోని సీట్ల రెన్యువల్ విషయంలో అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే రాష్ట్రంలో 2022 నుంచి 2024 మధ్యలో ఒకేసారి 25 కాలేజీలు ఏర్పాటైన తీరును, వెంటనే సౌకర్యాలు కల్పించలేని పరిస్థితిని ఎన్ఎంసీకి అధికారులు వివరించారు. తర్వాత ఎన్ఎంసీ సూచనల మేరకు ఫ్యాకల్టీ పెంపు, కొత్త నియామకాలు, సౌకర్యాల మెరుగు వంటి చర్యలను ప్రభుత్వం చేపట్టింది.

ప్రైవేటు మెడికల్ కళాశాలల తీరే వేరు..!

ప్రభుత్వ కళాశాలలను ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు సర్కారు కృషి చేస్తుంటే, ప్రైవేటు కళాశాలలు నానాటికీ తీసికట్టుగా తయారవుతుండడం విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరానికి రెన్యువల్ కోసం కాళోజీ వర్సిటీ గత వారం రోజులుగా తనిఖీలు నిర్వహిస్తుండగా, పలు కళాశాలల్లో ఎన్ఎంసీ నిబంధనల జాడే లేదని, ఇష్టానుసారంగా నిర్వహణ సాగుతోందని తేలింది. ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు తాత్కాలిక ఫ్యాకల్టీలతో పాఠాలు చెప్పడం తప్ప ప్రాక్టికల్స్ అంటే ఏంటో తెలియని పరిస్థితి మెజారిటీ కళాశాలల్లో ఉన్నట్లు తనిఖీల్లో తేలింది. తనిఖీలు మరో వారం రోజుల్లో పూర్తి చేయాలని విశ్వవిద్యాలయం భావిస్తోంది. అనంతరం నివేదికను ఎన్ఎంసీకి పంపిస్తే, ఎన్ని కళాశాలల్లో సీట్ల రెన్యువల్‌కు అనుమ తి వస్తుందో తెలుస్తుందని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రైవేటు కళాశాలల తనిఖీలతో సంబంధం లేకుండా స్టేట్ ర్యాంకులను నిర్ణయించి, అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించాలని వర్సిటీ భావిస్తున్నట్లు సమాచారం.

ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లకు సంబంధించి ఎన్ఎంసీ ఎలాంటి కోత విధించలేదు. అలాగే ఎలాంటి జరిమానాలూ విధించలేదు. ఈ నేపథ్యంలో 4,090 ఎంబీబీఎస్ సీట్లు యథావిధిగా వచ్చే సంవత్సరం కూడా కొనసాగనున్నాయి. ఎన్ఎంసీ గ్రీన్‌సిగ్నల్ నేపథ్యంలో ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రక్రియలో వేగం పెరిగిందని యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి.

మానవతా దృక్పథంతోనే చర్యలకు వెనుకడుగు

ఫాతిమా కాలేజీ వ్యవహారంపై వివరణ ఇచ్చిన హైడ్రా కమిషనర్

సాక్షి, హైదరాబాద్: ఫాతిమా కాలేజీ వ్యవహారంపై రాజకీయ దుమారం రేగుతున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. ఆ కళాశాల సూరం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న మాట వాస్తవమే అయినా, వేల మంది మైనార్టీ విద్యార్థినుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకునే చర్యలకు వెనుకాడుతున్నట్టు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఫాతిమా ఒవైసీ ఉమెన్స్ కాలేజ్ అనేది అక్బరుద్దీన్ ఒవైసీ ఆధ్వర్యంలో నడుస్తున్న చారిటీ సంస్థ. నిరుపేద మైనార్టీ బాలికలు, యువతులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా విద్యనందిస్తున్నారు. కొన్ని కోర్సులకు మాత్రం నామమాత్రపు ఫీజు ఉంది. ఈ కాలేజీలో ఏటా 10 వేల మందికి పైగా విద్యనభ్యసిస్తుంటారు. నిరుపేద మైనార్టీ యువతులకు విద్యనందించడం ద్వారా ఈ కాలేజీ సామాజిక వెనుకబాటుతనం నుంచి వారికి విముక్తి కల్పించడానికి ప్రయత్నిస్తోంది. హైడ్రా ఎంఐఎం పట్ల ఉద్దేశపూర్వకంగా మెతకవైఖరిని అవలంబిస్తోందని కొందరు విమర్శిస్తున్నారు. ఆ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు చేసిన కొన్ని ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల పట్ల హైడ్రా కఠినంగా వ్యవహరించిందింది. గత ఏడాది ఆగస్టు 8న హైడ్రా చేపట్టిన మొదటి కూల్చివేత బమ్ రుక్ ఉద్ దౌలా చెరువులోని భవనాలే. ఇవి ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సంబంధించినవే. 25 ఎకరాల చెరువును ప్లాట్లుగా మార్చిన కింగ్స్ గ్రూపు విక్రయిస్తోంది. ఈ గ్రూపు యజమాని ఒవైసీ కుటుంబానికి చాలా కీలకమైన వ్యాపార భాగస్వామి. హైడ్రా ఇప్పుడు ఆ చెరువును అభివృద్ధి చేస్తోంది. చాంద్రాయణగుట్టలోని ప్రభుత్వ భూమిలో ఉన్న ఎంఐఎం కార్పొరేటర్లకు చెందిన అనేక వాణిజ్య దుకాణాలను తొలగించి ఆ భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. హైడ్రా ఎవరి పట్లా మెతక వైఖరిని అవలంబించదు. సామాజిక కారణాల వల్ల మాత్రమే ఫాతిమా కాలేజీ కూల్చివేతను నిలిపివేసింది. అన్నింటికీ ఒకే మంత్రం అనే తీరుతో ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరిస్తే అది సామాజిక, దేశ పురోగతికి గొడ్డలి పెట్టవుతుంది' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



సూరం చెరువు ఇలా..

సర్కారీ ఉద్యోగాల 'సమీక్ష'

- ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలపై సమీక్షకు కమిటీ
- మాజీ సీఎస్ శాంతికుమారి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో ఉన్న ఉద్యోగాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ సీఎస్ ఎ.శాంతికుమారి అధ్యక్షతన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎన్.శివశంకర్, సీనియర్ ఐఏఎస్ అధికారులు సందీప్‌కుమార్ సుల్తానియా, రఘునందన్‌రావులతో కమిటీని ఏర్పాటు చేస్తూ ఆర్థిక శాఖ జీవో నం:111ను జారీ చేసింది. ఈ జీవోలో పేర్కొన్న ప్రకారం ప్రభుత్వ శాఖల్లో మారుతున్న పనితీరు, ఉద్యోగుల విధులు, ప్రాధాన్యతల్లో వస్తున్న మార్పులను కమిటీ సమీక్షిస్తుంది. ఉద్యోగుల కేడర్ స్ట్రెంగ్త్, ప్రస్తుతం పనిచేస్తున్న వారి సంఖ్య, ఖాళీలు, ఉద్యోగాల కొనసాగింపునకు గల కారణాలు, కొత్త నియామకాలు తదితర అంశాలపై ప్రస్తుత ప్రాధాన్యతలు, అవసరాలు, అనివార్యతలపై అధ్యయనం చేస్తుంది. తాత్కాలిక ప్రాతిపదికన నియమించే అన్ని రకాల సిబ్బంది (కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌తో సహా) గురించి కూడా అధ్యయనం చేస్తుంది. 60 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

లండన్ థేమ్స్ తరహాలో మూసీ అభివృద్ధి

సామాజిక న్యాయం, సమానత్వం, సమగ్రత మా విధానం
- సీఐఐ సీఎఫ్‌వోల సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పట్టణీకరణ శరవేగంగా జరుగుతుండటంతో తెలంగాణ ఆధునికత, అభ్యుదయానికి కేంద్రంగా మారుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఔటర్ రింగు రోడ్డు ద్వారా సాధించిన ఫలితాలను దృష్టిలో పెట్టుకుని రీజినల్ రింగు రోడ్డు నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోందని, రీజినల్ రింగు రోడ్డుకు అనుసంధానంగా ఫార్మా, ఐటీ, హౌసింగ్, అగ్రికల్చర్‌తో పాటు పారిశ్రామిక క్లస్టర్ల నిర్మాణం కూడా జరుగుతుందని తెలిపారు. ప్రపంచం నలుమూలల నుంచి హైదరాబాద్‌కు పెట్టుబడులు తరలివస్తుండటంతో లండన్‌లోని థేమ్స్ నది తరహాలో మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. హైదరాబాద్ సోమాజిగూడలోని ఓ ప్రైవేటు హోటల్లో బుధవారం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎఫ్‌వోల (చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్స్) సదస్సులో డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పెట్టుబడులకు స్వర్గధామంగా ఉన్న తెలంగాణలో నైపుణ్యం కలిగిన కార్మికులు, నాణ్యమైన విద్యుత్, కాలుష్య రహిత వాతావరణం వంటి ఎన్నో అనుకూలతలు ఉన్నాయన్నారు. త్వరలో అందుబాటులోకి వస్తున్న ఫ్యూచర్ సిటీలో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు తమ సీఎస్ఆర్ నిధులను పాఠశాలలు, నాలెడ్జ్ సెంటర్ల కోసమే కాకుండా రైతులు, మహిళల ప్రగతి కోసం కూడా ఖర్చు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. సీఎఫ్‌వోలు ఆర్థిక నాయకులుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టుకోవాలని సూచించారు.


జ్ఞాపికను అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సామాజిక న్యాయం, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా..

సామాజిక న్యాయం, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో ఎన్నో కీలక కార్యక్రమాలు చేపట్టామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, నైపుణ్య శిక్షణకు అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో పారిశ్రామికరంగం భాగస్వామిగా ఉంటూ అభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐఐ నిర్వాహకులు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ స్ఫూర్తితోనే సైకిళ్ల పంపిణీ


జెండా ఊపి విద్యార్థుల ర్యాలీని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం

- త్వరలో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులందరికీ 'మోదీ కిట్స్'
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'విద్యార్థులకు అందిస్తున్న సైకిళ్లు మోదీ గిఫ్ట్.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు త్వరలో మోదీ కిట్స్‌ను అందజేయబోతున్నాం.. ఎన్ని లక్షల మందికైనా మోదీ కిట్స్‌ను అందిస్తాం' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో టెన్త్ చదివే విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. మొత్తం 20 వేల సైకిళ్లను స్వయంగా కొనుగోలు చేసిన సంజయ్, వాటిని దశల వారీగా పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తొలుత కరీంనగర్ టౌన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. ఈ సైకిళ్ల పంపిణీ ఆలోచన ఇచ్చింది కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బేటీ బచావో- బేటీ పఢావో కార్యక్రమంలో బాలికలకు సైకిళ్లు ఇస్తే బాగుంటుందని కలెక్టర్ ప్రతిపాదించారని, ఆ ఆలోచనతోనే ఈరోజు టెన్త్ విద్యార్థులందరికీ సైకిళ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మా దగ్గరకు వచ్చిన కొందరు కార్పొరేట్ కంపెనీల యాజమానులను మీ లాభాల్లో కొంత సీఎస్సార్ ఫండ్ కింద ఇవ్వాలని కోరితే వారు సానుకూలంగా స్పందించారని, ఆ నిధులతోనే సైకిళ్లను కొని మీకు పంపిణీ చేస్తున్నానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల రీ ఎంట్రీ..!

మైనార్టీ గురుకుల సొసైటీలో మళ్లీ మాజీలదే పెత్తనం

నిబంధనలకు విరుద్ధంగా నలుగురు ఉద్యోగులకు కీలక బాధ్యతలు

TELANGANA MINORITIES RESIDENTIAL EDUCATIONAL INSTITUTIONS SOCIETY (TMREIS)

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ విరమణ చేసిన వారిని తిరిగి కొనసాగించొద్దంటూ ప్రభు త్వం జారీచేసిన ఆదేశాలను తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ అటకెక్కించింది. ఎలాంటి ప్రకటన లేకుండా కొత్తగా పలువురు మాజీలను విధుల్లోకి తీసుకుంది. సాధారణంగా గురుకుల విద్యా సంస్థల్లో నియామకాల్లో సబ్జెక్ట్ నిపుణులకు ప్రాధాన్యం ఇస్తారు. కానీ రెవెన్యూ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేసిన వ్యక్తికి రాష్ట్రంలోని అన్ని టీఎంఆర్ స్కూళ్ల అకడమిక్ ఇన్‌చార్జిగా బాధ్యతలు కట్టబెట్టారు. ఓ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైరైన వ్యక్తిని ఎలాంటి ఎంపిక ప్రక్రియ లేకుండానే అన్ని మైనార్టీ గురుకుల జూనియర్ కాలేజీలకు ఇన్‌చార్జిగా నియమించారు. రిటైర్డ్ తహసీల్దార్‌కు గురుకుల హాస్టళ్లకు కన్సల్టెంట్‌గా బాధ్యతలు కట్టబెట్టారు. ఫార్మాసిస్టుగా రిటైరైన ఇంకో వ్యక్తిని అకడమిక్ సెక్షన్ ఇన్‌చార్జిగా నియమించారు.

న్యాయవాదుల బీమా రూ.10 లక్షలకు పెంపు

బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి వెల్లడి


మాట్లాడుతున్న నరసింహారెడ్డి. చిత్రంలో విష్ణువర్ధన్‌రెడ్డి, సునీల్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: న్యాయవాదుల జీవిత బీమాను రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమ నిధి నిర్వహణ కోసం ఏర్పాటైన కమిటీకి బార్ కౌన్సిల్ చైర్మన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారన్నారు. జీవితా బీమా, పదవీ విరమణ ప్రయోజనం, వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం, జూనియర్ న్యాయవాదులకు గ్రంథాలయ రుణం లాంటివి కమిటీ పరిష్కరిస్తుందని నరసింహారెడ్డి తెలిపారు. జీవిత బీమాను రూ.4 లక్షలు పెంచామని, న్యాయవాది మరణించినప్పుడు అంత్యక్రియలకు ఇచ్చే మొత్తాన్ని రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పెంచామని వెల్లడించారు. వైద్య ఖర్చుల సాయం రూ.లక్షకు, జూనియర్లకు ఇచ్చే లైబ్రరీ రుణం రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచామని నరసింహారెడ్డి చెప్పారు. తాజా పెంపు ఈ ఏడాది అక్టోబర్ 6 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి వెంట వైస్ చైర్మన్ సునీల్‌గౌడ్, బీసీఐ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్పులే అప్పులు

అనుకుంటాంగానీ.. అప్పులేనిదే అమెరికాకూ గడవదు. ప్రపంచంలో సంపన్నదేశం, అగ్రరాజ్యం అని చెప్పుకొనే అమెరికానే.. ప్రపంచంలో అత్యంత ఎక్కువ అప్పు చేసిన దేశం కావడం విశేషం. ఐక్యరాజ్యసమితి వాణిజ్యం, అభివృద్ధి విభాగం (యూఎన్ సీటీఏడీ) రూపొందించిన 'అప్పుల ప్రపంచం 2025' నివేదిక ప్రకారం 2024లో ప్రపంచ దేశాల అప్పు గతంలో ఎన్నడూ లేనంతగా 102 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఇందులో దాదాపు సగం అమెరికా, చైనాలదే. 2010 నుంచి చూస్తే.. అభివృద్ధి చెందుతున్న దేశాల అప్పు భారీగా పెరుగుతోంది. దీంతో ఆ దేశాలకు వడ్డీల భారం తడిసి మోపెడవుతోంది. - సాక్షి, స్పెషల్ డెస్క్

ప్రపంచ దేశాల అప్పు 102 ట్రిలియన్ డాలర్లు
- సగం వాటాతో అగ్రస్థానంలో అమెరికా, చైనా
- 3.2 ట్రిలియన్ డాలర్లతో టాప్-10లో భారత్
- అప్పుల ఊబిలోకి అభివృద్ధి చెందుతున్న దేశాలు



ఈ ఏడాది ఏప్రిల్ నాటికి ప్రపంచంలో అత్యధిక అప్పు ఉన్న దేశం అమెరికా. దాని అప్పు 35 ట్రిలియన్ డాలర్లు. ఆ తరువాతి స్థానంలో చైనా ఉంది. ఆసక్తికర విషయం ఏంటంటే.. మొత్తం ప్రపంచ అప్పులో సుమారు 70 శాతం అభివృద్ధి చెందిన దేశాలదే అయితే అందులో అమెరికా, చైనాలదే సగభాగం. ఆ తరువాత సుమారు 25 శాతం ఆసియా, ఓషనియా దేశాలది. అభివృద్ధి చెందుతున్న దేశాల అప్పు మొత్తం ప్రపంచ అప్పులో 31 శాతం. ఐక్యరాజ్యసమితి వాణిజ్యం, అభివృద్ధి విభాగం (యూఎన్‌సీటీఏడీ) రూపొందించిన 'అప్పుల ప్రపంచం 2025' నివేదికలో ఇలాంటి ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 2024లో ప్రపంచ దేశాల అప్పు రికార్డు స్థాయిలో 102 ట్రిలియన్ డాలర్లకు ఎగబాకింది.

అభివృద్ధి చెందుతున్న దేశాలు 2024లో రికార్డు స్థాయిలో 921 బిలియన్ డాలర్లు కేవలం వడ్డీల కోసమే చెల్లించాయి. 2017తో పోలిస్తే ఇది రెట్టింపుకాగా, 2023తో పోలిస్తే ఇది 10 శాతం ఎక్కువ. 2024లో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 61 దేశాలు.. ప్రభుత్వ ఆదాయంలో 10 శాతం కంటే ఎక్కువ కేవలం తీసుకున్న రుణానికి వడ్డీకింద చెల్లిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు విద్య, వైద్యం వంటి రంగాలకు ప్రభుత్వాలు విరివిగా ఖర్చు చేయాలి. కానీ, వడ్డీల భారం అందుకు అవకాశం ఇవ్వడం లేదు.

వడ్డీల భారం తడిసిమోపెడు

2011-13 నుంచి 2021-23 మధ్య విద్య కోసం ఈ దేశాలు చేసిన వ్యయం 52 శాతం పెరిగింది. ఇదే సమయంలో ఆరోగ్యం కోసం చేసిన ఖర్చు 77 శాతం పెరిగింది. కానీ, తీసుకున్న అప్పులకు చెల్లించాల్సిన వడ్డీల భారం ఏకంగా 84 శాతం ఎగబాకింది. ఇలా విద్య, ఆరోగ్యం కంటే వడ్డీలకే ఎక్కువ వ్యయం చేస్తున్న దేశాల్లో నివసిస్తున్న జనాభా దాదాపు 340 కోట్లు.

అభివృద్ధి చెందుతున్న సుమారు 60 దేశాల్లో.. జీడీపీలో అప్పు వాటా ఏకంగా 60 శాతానికి చేరిపోయింది. 2020లో ఆఫ్రికా, ఆసియా, ఓషనియా, లాటిన్ అమెరికా, కరీబియన్‌లో ఇలాంటి దేశాల సంఖ్య 67 కాగా.. తరువాత స్వల్పంగా తగ్గుతూ 2024 నాటికి 58కి చేరింది. 2010లో ఈ సంఖ్య 35. 2013తో పోలిస్తే ప్రైవేటు సంస్థల నుంచి దేశాలు తీసుకునే అప్పు రెండింతలకుపైగానే పెరిగింది. ఆఫ్రికా దేశాల్లో ఇది 42 శాతం, ఆసియాలో 61, లాటిన్ అమెరికా, కరీబియన్‌లో ఏకంగా 71 శాతం.

జీడీపీలో 60 శాతం!

అభివృద్ధి చెందిన దేశాలు అప్పులపై చెల్లించే వడ్డీ కంటే.. అభివృద్ధి చెందుతున్న దేశాలు చెల్లించే వడ్డీ చాలా ఎక్కువగా ఉంటోంది. ఉదాహరణకు అమెరికా చెల్లించే వడ్డీ కంటే ఇతర దేశాలు దాదాపు 2 నుంచి 4 రెట్లు ఎక్కువ వడ్డీ చెల్లిస్తున్నాయి. మరి ఈ దేశాలకు ఆర్థిక సహాయం రావడం లేదా అంటే.. వస్తోంది. కానీ.. రాయితీ రుణాల రూపంలో! గతంలో గ్రాంట్ల రూపంలో వచ్చేది కాస్తా ఇప్పుడు మారిపోయింది. 2011-13 మధ్య అధికారిక అభివృద్ధి సాయం కింద వచ్చే మొత్తంలో 28 శాతంగా ఉన్న ఈ రుణం 2021-23 మధ్య 33 శాతానికి పెరిగింది.

వడ్డీ కూడా ఎక్కువే

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సగానికిపైగా దేశాల మొత్తం ఎగుమతుల ద్వారా వచ్చిన ఆదాయంలో.. ఆయా దేశాల బహిరంగ రుణం విలువ దాదాపు 88 శాతం. అంటే.. దాదాపుగా వస్తు, సేవల ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయమంత అప్పు అన్న మాట! ఈ దేశాలు తమ మొత్తం ఆదాయంలో 8.6 శాతాన్ని అప్పు కోసమే (అసలు, వడ్డీ) కేటాయిస్తున్నాయి. 2010తో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు. దీనివల్ల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు, మూలధన వ్యయానికి సరిపడా నిధులు ఉండటం లేదు.

8.6 శాతం అప్పుల కోసమే..

దేశం	అప్పు (బిలియన్ డాలర్లలో)
అమెరికా	35,251
చైనా	16,559
జపాన్	9,528
యూకే	3,689
ఫ్రాన్స్	3,576
ఇటలీ	3,209
భారత్	3,177
జర్మనీ	2,976
కెనడా	2,482

క్లుప్తంగా...

పేద విద్యార్థులకు అన్నం కూడా పెట్టరా: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యార్థులకు నాణ్యత లేని భోజనం పెడుతున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మిస్ వరల్డ్ పేరిట లక్ష రూపాయలకు ఒక ప్లేటు చొప్పున భోజనం పెట్టిన ప్రభుత్వం పేద విద్యార్థులకు కనీసం అన్నం కూడా పెట్టడం లేదు. ముఖ్యమంత్రి, మంత్రులు వేములవాడ దేవాలయాన్ని సందర్శించినప్పుడు హైదరాబాద్ నుంచి రూ.32 వేలకు ప్లేటు చొప్పున భోజనం తెప్పించుకుని తిన్నారు. కానీ పేద విద్యార్థులకు కారం నీళ్ల భోజనం పెడుతున్నారు. విద్యార్థులకు నీళ్ల సాంబార్ భోజనం పెట్టడమే ప్రజాపాలనలో సాధించిన విజయమా? ఇప్పటివరకు 90 మంది గురుకుల విద్యార్థులు చనిపోతే ముఖ్యమంత్రికి కనీసం వారి మరణాలను గుర్తించే సమయం కూడా లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరైన భోజనం అందించడం కూడా చేతకాదా'అని కేటీఆర్ ప్రశ్నించారు. డబుల్ ఇంజిన్ సర్కారుగా చెప్పుకునే గుజరాత్ నమూనా ప్రభుత్వంలో బ్రిడ్జీలు కూలిపోతున్నాయని, బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో ఆ ఘటనలపై విచారణలు ఎందుకు జరపరని కేటీఆర్ ప్రశ్నించారు.

బీజేపీ చుట్టూ రేవంత్ ప్రదక్షిణ

బీఆర్ఎస్ మైనారిటీ విభాగం సమావేశంలో హరీశ్‌రావు ధ్వజం

సాక్షి, హైదరాబాద్: పొద్దుతిరుగుడు పువ్వు తరహాలో బీజేపీ చుట్టూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రదక్షిణలు చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. పేదలకు కొత్తగా ఇళ్లు నిర్మించాల్సిన ప్రభుత్వం.. కనీసం పరిహారం కూడా ఇవ్వకుండా హైడ్రాతో ఉన్న ఇళ్లను కూల్చివేయిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన బీఆర్ఎస్ హైదరాబాద్ మైనారిటీ విభాగం సమావేశంలో హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సెక్యులర్ ప్రభుత్వంగా చెప్పుకుంటున్న సీఎం రేవంత్.. గడిచిన 20 నెలలుగా ఒక్క మైనారిటీ నాయకుడికీ మంత్రివర్గంలో చోటు కల్పించలేదన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

మేడిగడ్డపై ఎన్డీఎస్ఏది ప్రేరేపిత నివేదిక

బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో వంతెనలు కూలిపోతున్నా ఎలాంటి విచారణలు లేవని, అదే మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే రెండ్రోజుల్లో ఎన్డీఎస్ఏ వచ్చి విచారణ పేరుతో రాజకీయ ప్రేరేపిత నివేదికలు ఇచ్చిందని హరీశ్‌రావు విమర్శించారు. మధ్యాహ్న భోజన బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

బరాజ్‌లు కూలితే బాధ్యులెవరు?

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- మేడిగడ్డ నుంచి నీళ్లు తరలించాలని బీఆర్ఎస్ నేతలు పదేపదే అంటున్నారు
- కానీ కాళేశ్వరం కట్టడాలు ప్రమాదకరంగా ఉన్నట్టు ఎన్డీఎస్ఏ తేల్చింది
- వాటిలో నీళ్లు నింపితే కూలిపోయే ప్రమాదం ఉంది... 44 గ్రామాలు, సమ్మక్క బరాజ్ కొట్టుకుపోతాయి



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'మేడిగడ్డ బరాజ్ నుంచి నీళ్లను ఎందుకు ఎత్తిపోయడం లేదని బీఆర్ఎస్ నేతలు పదేపదే ఆరోపణలు చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల డిజైన్లు, నిర్మాణం, నిర్వహణలో లోపాలున్నట్టు ఎన్డీఎస్ఏ తేల్చింది. ఆ కట్టడాలు ఇంకా ప్రమాదకరంగానే ఉన్నాయని, వాటిలో నీళ్లను నింపవద్దని సూచించింది. బరాజ్‌లలో నీళ్లు నింపితే అవి కూలిపోయి దిగువన ఉన్న 44 గ్రామాలతో పాటు సమ్మక్క సారక్క బరాజ్ కొట్టుకుపోతాయ్. భద్రాచలం ఆలయం, పట్టణం ప్రమాదాన్ని ఎదుర్కొంటుంది. బరాజ్‌లు కూలితే ఎవరు బాధ్యులు?'అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ఏపీ కృష్ణా జలాల అక్రమ తరలింపు, తప్పుడు నిర్ణయంతో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణం అనే అంశాలపై బుధవారం ప్రజాభవన్‌లో ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం మాట్లాడారు.

కమీషన్ల కక్కుర్తితో కాళేశ్వరం

'రూ.38 వేల కోట్ల అంచనాలతో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కక్కుర్తితో రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించింది. నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ చెప్పడం వల్లే తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్‌ను తరలించినట్టు బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వాదనలో నిజం లేదు. నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ చెప్పలేదు. ప్రాణహిత కింద 16.4 లక్షల ఎకరాలకు సాగునీరు అందేది. అదనంగా 2 లక్షల ఎకరాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టి వ్యయాన్ని నాలుగింతలు పెంచారు. ఐదేళ్లలో మేడిగడ్డ నుంచి 165 టీఎంసీలను గత ప్రభుత్వం తరలించింది. ఏడాదికి సగటున 13 టీఎంసీలతో కొత్తగా 1.4 లక్షల ఎకరాలకే సాగునీరు అందించింది..'అని ఉత్తమ్ చెప్పారు.

బీఆర్ఎస్ పాలనలోనే ఏపీ సామర్థ్యం పెరిగింది..

'ఉమ్మడి రాష్ట్రంతో పోల్చితే బీఆర్ఎస్ పాలనలోనే శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి ఏపీ అక్రమ నీటి తరలింపు సామర్థ్యం రోజుకు 47,850 క్యూసెక్కుల (4.1 టీఎంసీలు) నుంచి 1,11,400 క్యూసెక్కుల (9.6 టీఎంసీలు)కు పెరిగింది. 2019 మే, 2020 జనవరి, జూన్‌లో నాటి ఏపీ సీఎం జగన్, తెలంగాణ సీఎం కేసీఆర్‌తో గోదావరి, కృష్ణా జలాల వినియోగంపై జరిపిన చర్చల ఫలితమే ఇది. 2004- 14 మధ్య కాలంలో ఉమ్మడి ఏపీలో శ్రీశైలం నుంచి ఏపీ బేసిన్ వెలుపలి ప్రాంతాలకు మొత్తం 727 టీఎంసీలను తరలించుకుపోగా, తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్ఎస్ పాలనలో 2014-2023 మధ్యకాలంలో ఏకంగా 1,200 టీఎంసీలను తరలించుకుపోవడం నిర్ఘాంతపరిచే అంశం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2024-25లో 286 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించాం. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పోల్చితే ఇదే అత్యధికం. బీఆర్ఎస్ పాలనలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం 44 వేల క్యూసెక్కుల నుంచి 92 వేలకు, మల్యాల లిఫ్టు సామర్థ్యం 3,850 క్యూసెక్కుల నుంచి 6 వేలకు, ముచ్చుమర్రి లిఫ్టు సామర్థ్యం 3,850 క్యూసెక్కుల నుంచి 6,300 క్యూసెక్కులకు పెరిగింది. రాయలసీమకు రోజూ 12,600 క్యూసెక్కుల (1.09 టీఎంసీలు)ను అక్రమంగా తరలించుకునే సామర్థ్యాన్ని ఏపీ పెంచుకుంది..'అని ఉత్తమ్ వివరించారు.

34% నీళ్లు చాలని రాసిచ్చారు..

'బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి గంపగుత్తగా కేటాయించిన 811 టీఎంసీల కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు (34 శాతం) సరిపోతాయంటూ, ఏపీకి పదేళ్ల పాటు 512 టీఎంసీలు (66 శాతం) ఇచ్చేందుకు.. 2016 సెప్టెంబర్‌లో జరిగిన తొలి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో నాటి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌లు అంగీకారం తెలిపారు. మా ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్.. కృష్ణా జలాల్లో మాకు 71 శాతం వాటా ఇవ్వాలని కోరుతూ కేంద్ర జల సంఘానికి లేఖ రాశారు. పరీవాహక ప్రాంతం, సాగుకు యోగ్యమైన భూమి, కరువును పరిగణనలోకి తీసుకుని తెలంగాణకు 575 టీఎంసీలు (71 శాతం), ఏపీకి 236 టీఎంసీలు(29 శాతం) కేటాయించాలని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట వాదనలు వినిపిస్తున్నాం..'అని మంత్రి తెలిపారు.

నాగార్జున సాగర్ ఆయకట్టుకు ప్రమాదం

శ్రీశైలం జలాశయంలో 797 అడుగుల లోతు నుంచి నీళ్లను తరలించడానికి ఏపీ చేపట్టిన రాయలసీమ లిఫ్టు స్కీమ్‌తో నాగార్జునసాగర్ ఆయకట్టు ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఉత్తమ్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రెండు రాష్ట్రాల సీఎంలతో 2020 ఆగస్టు 5న కేంద్రం అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించతలపెట్టగా, ఆ సమావేశాన్ని వాయిదా వేయాలని నాటి సీఎం కేసీఆర్ కేంద్రాన్ని కోరారన్నారు. అప్పట్లో రాయలసీమ లిఫ్టుకు ఏపీ పిలిచిన టెండర్లకు సహకరించడానికే ఈ కుట్ర చేశారని ఆరోపించారు.

బీఆర్ఎస్ సర్కారుతోనే పూడ్చలేని నష్టం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్
- ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే బనకచర్ల సమస్య వచ్చేది కాదు
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో బీఆర్ఎస్ ప్రచారానికి అడ్డుకట్ట వేయాలి



సాక్షి, హైదరాబాద్: కృష్ణా, గోదావరి నదులకు సంబంధించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎలా ప్రయత్నిస్తున్నారో పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో స్పష్టమవుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. బుధవారం ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ సందర్భంగా మాట్లాడుతూ.. బనకచర్లపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడటం లేదంటూ బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను దృష్టిలో పెట్టుకుని బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేస్తుందని, 2004లో కృష్ణా నదిపై కాంగ్రెస్ ప్రభుత్వం త్వరితగతన ప్రాజెక్టులు ప్రారంభించిందని, వీటిని పూర్తి చేసి ఉంటే ప్రస్తుత సమస్య ఏర్పడేది కాదని భట్టి పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి పూడ్చలేని నష్టం చేకూర్చిందన్నారు.

రూ.42 వేల కోట్లు ఖర్చు చేస్తే ఆ ప్రాజెక్టులు పూర్తయ్యేవి..

గోదావరి జలాల విషయానికొస్తే, కేవలం రూ.42 వేల కోట్లు ఖర్చు చేస్తే ఇచ్చంపల్లి, తుమ్మిడిహెట్టి, తుపాకులగూడెం, దేవాదుల, ఇందిరా, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేవని, తద్వారా రాష్ట్రంలో 24 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని భట్టి చెప్పారు. కానీ వీటిని పక్కనపెట్టి రీడిజైన్ పేరుతో కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టులను నిర్మిస్తామంటూ రూ.1.45 లక్షల కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసిందని విమర్శించారు. ఇంత పెద్ద మొత్తంలో రాష్ట్ర బడ్జెట్ ఖర్చు చేసినా అదనంగా ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన శ్రీపాద, మిడ్ మానేరు, కాకతీయ కాలువల నుంచే గోదావరి నీరు పారుతోందని భట్టి చెప్పారు. గోదావరిపై ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే బనకచర్ల సమస్య వచ్చేది కాదన్నారు. గోదావరిపై ఎగువ భాగాన ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులు ప్రారంభించకపోతే, చివర్లో ఉన్నప్పటికీ బనకచర్లకు ట్రిబ్యునల్ అధికారికంగా జలాలు కేటాయించే అవకాశం ఉంటుందని, తద్వారా ఎగువన తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులకు నీటి హక్కులు కోల్పోతామని భట్టి చెప్పారు. బీఆర్ఎస్ చేస్తున్న గోబెల్స్ ప్రచారానికి అడ్డుకట్ట వేసేలా ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను మీడియాకు, రిటైర్డ్ ఇంజనీర్లకు చూపించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారంలో పెట్టాలని చెప్పారు.

నిజాలు చెప్పే దమ్ము లేదు

- పీపీటీల పేరిట అజ్ఞానాన్ని చాటుకున్న సీఎం, మంత్రులు
- ఎన్నిసార్లు వాస్తవాలు చెప్పినా.. అవే తప్పుడు మాటలు
- చర్చకు పిలిచే దమ్ము లేక ప్రజాభవన్‌లో సొంత సమావేశం
- గౌరవానికి భంగం కలిగించినందుకు ప్రివిలేజ్ మోషన్ ఇస్తాం: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: సాగునీటి రంగంపై చర్చకు రావాలంటూ రంకెలు వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాభవన్‌లో బుధవారం నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఎందుకు ఆహ్వానించలేదని మాజీమంత్రి టి.హరీశ్‌రావు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను ఆహ్వానించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు. సభ్యుల హక్కులకు భంగం కలిగించినందుకు స్పీకర్, శాసనమండలి చైర్మన్‌కు ప్రివిలేజ్ మోషన్ ఇస్తామని హరీశ్‌రావు ప్రకటించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అబద్ధాల పుట్ట అంటూ బుధవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం సవాలులో నిజాయితీ ఉంటే బీఆర్ఎస్‌ను కూడా ఆహ్వానించి ఉండేవారన్నారు.

ఎన్ని కొరడాలైనా తక్కువే..

'ఐదు దశాబ్దాలుగా తెలంగాణ నీటి హక్కులను కాలరాసి, గోదావరి, కృష్ణాలో తెలంగాణ వాటాను ఆంధ్రకు అప్పజెప్పిన కాంగ్రెస్‌ను కొట్టేందుకు ఎన్ని కొరడాలైనా సరిపోవు. బనకచర్ల ద్వారా ఏపీకి గోదావరి, కృష్ణా నీళ్లను ధారాదత్తం చేసేందుకు కుట్రలు చేస్తున్న సీఎం రేవంత్‌ను ఎన్ని కొరడా దెబ్బలు కొట్టాలో చెప్పాలి. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ పేరిట కాంగ్రెస్ చెబుతున్న అబద్ధాలతో సీఎం రేవంత్, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ తమ అజ్ఞానాన్ని మరోమారు బయటపెట్టుకున్నారు. ప్రతిపక్షాల మీద నిందారోపణలు చేయడానికి ఇంత నీచమైన స్థాయికి దిగజారడాన్ని చూసి తెలంగాణ సమాజం అసహ్యించుకుంటోంది. సీఎం, మంత్రులు చెబుతున్న అబద్ధాలను అసెంబ్లీ లోపలా, బయటా అనేకసార్లు సాక్ష్యాధారాలతో సహా వివరించాం. అయినా కుక్క తోక వంకర అన్నట్టు పదే పదే చెప్పిన అబద్ధాలు చెబుతూ నిజాలుగా భ్రమింపచేసే కుట్రలకు పాల్పడుతుండటం సిగ్గుచేటు'అని హరీశ్ విమర్శించారు.

పాలమూరు-రంగారెడ్డిపై కుట్రలు

'ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనబెట్టి రంగారెడ్డి, నల్లగొండ ప్రాంతాలను విస్మరించామని విభజన చట్టం చూపుతూ రేవంత్ తప్పుదోవ పట్టిస్తున్నాడు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా 12.30 లక్షల ఆయకట్టుకు నీళ్లు ఇచ్చే విషయం గురించి దాచిపెట్టే కుట్ర చేస్తుండు. ఉమ్మడి రాష్ట్రంలో 50 లక్షల ఎకరాలకు కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు ఇచ్చిందని పచ్చి అబద్ధాలు చెబుతున్న రేవంత్‌రెడ్డి దమ్ముంటే ఆధారాలు బయటపెట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లనే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు మూలనపడింది. ప్రాణహిత-చేవెళ్ల తరహాలోనే మేడిగడ్డ ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకుండా పండ బెడుతున్నారు. కేవలం 7 టీఎంసీల సామర్థ్యమున్న జూరాలపై అదనంగా రోజుకు 2 టీఎంసీలు ఎత్తిపోసే పాలమూరు ప్రాజెక్టు భారం మోపడం సాధ్యం కాదని రేవంత్‌రెడ్డికి తెలియదా.. కృష్ణా జలాల్లో 299:512 వాటాకు రాష్ట్రం ఏర్పడక ముందే ఒప్పుకొని కాంగ్రెస్ మరణ శాసనం రాయడం వల్లే తెలంగాణ శిక్ష అనుభవిస్తోంది'అని హరీశ్‌రావు మండిపడ్డారు.

నేడు పీసీ ఘోష్ కమిషన్ వద్దకు హరీశ్‌రావు

కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీసీ ఘోష్ కమిషన్‌ను గురువారం ఉదయం 11 గంటలకు మాజీ మంత్రి హరీశ్‌రావు కలవనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మరింత అదనపు సమాచారం అందించేందుకు హరీశ్ సమయాన్ని కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు గురువారం ఉదయం 11 గంటలకు బీఆర్కే భవన్లో కలవడానికి కమిషన్ సమయం ఇచ్చింది.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి: రాంచందర్‌రావు

సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి బహిరంగలేఖ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలప్పుడు దివ్యాంగులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు కోరారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచుతామని, 80% పైబడి వైకల్యం ఉన్న దివ్యాంగులకు రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తామని, చేయూత కింద వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు ఇచ్చే నెలవారీ పెన్షన్ రూ.4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావొస్తున్నా వీటిని అమలు చేయకపోవడంతో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల జీవితాల్లో ఆర్థిక భద్రత కరువైందని చెప్పారు. కొత్తగా దరఖాస్తు చేసిన దివ్యాంగులకు పింఛన్ల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోందని, ఈ జాప్యం ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానాలకు తావిస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించేందుకు చట్ట సవరణ లేదా ఆర్డినెన్స్ తీసుకురావాలని, దివ్యాంగులకు ప్రభుత్వ శాఖల్లో 4% ఉద్యోగ రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని, క్యారీ ఫార్వర్డ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, దివ్యాంగుల శాఖకు స్వతంత్రత కల్పించి, పూర్తిస్థాయి సిబ్బందిని నియమించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌ను కోరుతూ బుధవారం రాంచందర్‌రావు బహిరంగ లేఖ రాశారు.

▶ మొదటి పేజీ తరువాయి

మీరు ఎప్పుడంటే అప్పుడే

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా ఆయన మాట్లాడారు.

చట్ట సభల్లో చర్చిద్దాం..లేదంటే ఫామ్‌హౌస్‌కు వస్తా

'చట్టసభల్లో కృష్ణా, గోదావరి జలాలపై చర్చకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ ఏ తారీఖున వస్తారో చెబుతూ స్పీకర్‌కు లేఖ రాయమన్నాం. అంతేకానీ సవాలు విసరలేదు. ఆయన (కేటీఆర్) సడన్‌గా బయలుదేరిండు. పేరు ప్రస్తావిస్తే నాస్థాయి తగ్గుతుంది. పొద్దటి పూట క్లబ్బుల్లో, రాత్రిపూట పబ్బుల్లో చర్చజేద్దామని ఉబలాటపడుతున్నడు. వీధుల్లో, క్లబ్బుల్లో, పబ్బుల్లో కాకుండా మనం చట్టసభల్లో చర్చిద్దాం. క్లబ్బులు, పబ్బులకు, ఆ కల్చర్‌కు నేను చదువుకునే రోజుల నుంచే దూరం. నన్ను వాటికి పిలవద్దు. అయితే అసెంబ్లీకి, లేకుంటే మండలికి, లేకపోతే ఎర్రవల్లి ఫార్మ్‌హౌస్‌కి వస్తా..' అని రేవంత్ అన్నారు.

వీధి బాగోతాలు మంచివి కావు..

'ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ ఆరోగ్యం బాగుండాలి. ప్రజలకు ఉపయోగపడాలని అని నేను అంటుంటే ఆయన ఎందుకూ పనికి రాడు..ఆయనతో ఏం పని అని ఆయన కొడుకు (కేటీఆర్) అంటాడు. నేపాల్‌లో రాజ్యం రాలేదని డిన్నర్‌కి పిలిపించి (యువరాజు)16 మందిని ఏకే 47తో పటపటా కాల్చిండు. అందరూ పోయాక వాడొకడే మిగిలి నేపాల్‌కు రాజైండు. కుటుంబంలో సమస్యలుంటే కుటుంబ పెద్దలు, కుల పెద్దలతో కూర్చొని పంచాయతీ తేల్చుకోవాలి. తమ్ముడు చెల్లెలకు, బావబామ్మర్దికి పంచాయతీలు ఉంటాయి. కానీ ఈ వీధి భాగోతాలు మంచివి కావు..' అని సీఎం వ్యాఖ్యానించారు.

కేసీఆర్ ఏపీకి అన్ని రకాలుగా సహకరించారు

'కృష్ణా జలాల్లో ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలను 2015, 2020లో కేసీఆర్ మంజూరు చేసి వచ్చిండు. సముద్రంలో కలుస్తున్న 3 వేల టీఎంసీలను కృష్ణా బేసిన్‌కు అక్కడి నుంచి పెన్నా బేసిన్‌కు తీసుకెళ్లండని ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి సలహాలిచ్చిండు. ఏపీకి అన్ని రకాలుగా సహకరించిండు. రాయలసీమను రత్నాల సీమ చేస్తానని ప్రకటించిండు. కృష్ణా బేసిన్‌లోని రైతులకు శాశ్వత మరణ శాసనం రాసే అధికారం కేసీఆర్‌కు ఎవరూ ఇవ్వలేదు. హైదరాబాద్‌లో ఏపీ, ఇతర రాష్ట్రాల ప్రజలు 20 శాతం ఉన్న నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్ర కోటా నుంచి నగర అవసరాలను వేరు చేసి మిగిలిన జలాలను పంపకాలు చేద్దాం అని ఆనాడు కేసీఆర్ అని ఉంటే పరిస్థితి మరోలా ఉండేది..' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

కృష్ణా జలాల దోపిడీకి అవకాశం కల్పించారు

'జూరాల ప్రాజెక్టు నుంచి రోజుకు 2 టీఎంసీల తరలింపు కోసం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల నిర్మాణానికి సర్వేలు జరపాలని 2011లో కిరణ్‌కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు జీవో ఇచ్చారు. అయితే కేసీఆర్ సోర్సు(నీటిని తీసుకునే ప్రదేశం)ను జూరాల నుంచి శ్రీశైలంకు మార్చడంతో తెలంగాణకు తీవ్ర నష్టం జరిగింది. తుంగభద్ర, కృష్ణా, భీమా నదుల నుంచి తెలంగాణలోని గద్వాల, ఆలంపూర్‌లో ముందుగా కృష్ణా జలాలు ప్రవేశిస్తాయి. ఆ నీళ్లను అక్కడే ఒడిసి పట్టుకుని తెచ్చుకుని ఉంటే.. ఈ రోజు శ్రీశైలం బ్యాక్‌వాటర్ వద్ద ఏపీకి మనం పైనుంచి వదిలితేనే నీళ్లు దొరుకుతుండే. పోతిరెడ్డిపాడు, రాయలసీమ, మల్యాల, ముచ్చుమర్రి లిఫ్టుల ద్వారా నీళ్లు తరలించుకుపోవడానికి ఏపీకి అవకాశం ఉండేది కాదు. కిందికి పోయాక పట్టుకోవాలనే నిర్ణయంతో పూర్తిగా రాయలసీమ ప్రాంతానికి నీళ్లు తరలిపోతున్నాయి. అక్కడి నుంచి అక్కడే దారిదోపిడీ చేసే అవకాశాన్ని ఏపీకి కేసీఆర్ కల్పించాడు..' అని ముఖ్యమంత్రి ఆరోపించారు.

సీమాంధ్ర పాలకుల కంటే వెయ్యి రెట్లు ఎక్కువ ద్రోహం

'శ్రీశైలం నుంచి ఏపీ పెద్ద మొత్తంలో నీళ్లు తీసుకుంటుండడంతో శ్రీశైలం, సాగర్, పులిచింతలలో విద్యుదుత్పత్తి అవకాశాన్ని తెలంగాణ కోల్పోయి ఆర్థికంగా నష్టపోతోంది. 'పాలమూరు' ప్రాజెక్టు సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి టీఎంసీకి తగ్గించి కేసీఆర్ మరో అన్యాయం చేశారు. శ్రీశైలం నుంచి నీటి తరలింపు సామర్థ్యాన్ని ఏపీ రోజుకు 4 టీఎంసీల నుంచి 10 టీఎంసీలకు పెంచుకోగా, కేసీఆర్ మాత్రం తెలంగాణ సామర్థ్యాన్ని తగ్గించారు. కృష్ణా జలాల్లో కేసీఆర్ చేసిన ద్రోహం ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర పాలకులు చేసిన అన్యాయం కంటే వెయ్యి రెట్లు ఎక్కువ.

కేసీఆర్‌ను వంద కొరడా దెబ్బలు కొట్టాలి

సీమాంధ్ర పాలకులను ఒక కొరడా దెబ్బ కొట్టాల్సి వస్తే కేసీఆర్‌ను వంద కొరడా దెబ్బలు కొట్టాల్సిందే. బేసిన్లు లేవు..భేషజాలు లేవని చెప్పే అధికారం కేసీఆర్‌కు ఎవరు ఇచ్చారు? ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పేరును కాళేశ్వరంగా మార్చి రంగారెడ్డి జిల్లాలోని ఆయకట్టును పూర్తిగా, నల్లగొండ జిల్లాలోని 4 లక్షల ఆయకట్టును కేసీఆర్ తొలగించిండు. కృష్ణా బేసిన్‌లోని రంగారెడ్డి జిల్లాకు గోదావరి జలాలను తరలిస్తే కృష్ణా ట్రిబ్యునల్‌లో నీటి కేటాయింపుల సమస్య వస్తది అని సమర్థించుకుండు. ప్రాజెక్టుల నిర్మాణంతో ఉమ్మడి రాష్ట్రంలో 54 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తే ఎకరాకు రూ.93 వేలు ఖర్చు కాగా, కేసీఆర్ ధనదాహంతో 15 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చి ఎకరాకు రూ.11 లక్షలు ఖర్చు పెట్టిండు..' అని రేవంత్ ధ్వజమెత్తారు.

ఏపీ సీఎంకు అభ్యంతరం ఎందుకు?

'బనకచర్లతో వరద జలాలే తీసుకెళ్తామంటున్న ఏపీ సీఎంకు, మా నల్లగొండకు వరద, నికర జలాలు తీసుకెళ్తే అభ్యంతరం ఏమిటి? మా ప్రాజెక్టులన్నీ కట్టుకుంటే వరద ఉందా? లేదా? అనేది తెలుతుంది. కాళేశ్వరం ప్రాజెక్టు కూలింది కాబట్టి కింద మీకు వరద కనిపించవచ్చు..' అని ఏపీ సీఎం చంద్రబాబును ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. కాగా మంత్రి శ్రీధర్‌బాబుకు మాజీమంత్రి హరీశ్‌రావు ఫోన్ చేసి ప్రజాభవన్‌లో సమావేశాల నిర్వహణపై అభ్యంతరం తెలపడంపై రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది గడీ కాదని అన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎంలో భారీ చోరీ

- గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కత్తిరించిన దొంగలు
- రూ.34 లక్షల 70 వేలు అపహరణ



దొంగలు గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసిన ఏటీఎం భాగాలు..

జీడిమెట్ల: జీడిమెట్ల పీఎస్ పరిధి మార్కండేయనగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏటీఎంలో భారీ చోరీ జరిగింది. గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం మిషన్‌ను కత్తిరించిన దొంగలు రూ.34 లక్షల 70 వేలు తీసుకుని ఉడాయించారు. దొంగతనానికి 6 గంటల ముందే పోలీసులు ఆ ప్రాంతంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించడం గమనార్హం. జీడిమెట్ల డీఐ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం ప్రధాన రోడ్డులోని మార్కండేయనగర్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం ఉంది. మంగళవారం తెల్లవారుజామున 2.40 గంటల ప్రాంతంలో మాస్క్ ధరించిన ఒక దొంగ మొదట ఏటీఎంలోకి ప్రవేశించి సీసీ కెమెరా వైర్లను కత్తిరించాడు. అనంతరం ముగ్గురు వ్యక్తులు ఏటీఎం రూంలోకి వచ్చి గ్యాస్ కట్టర్ సాయంతో క్యాష్ బాక్స్‌ను కత్తిరించి అందులో ఉన్న నగదు తీసుకుని అక్కడ నుండి ఉడాయించారు. దొంగలు షాపూర్‌నగర్ ప్రాంతం నుంచి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. కాగా, ఏటీఎంలో భారీ మొత్తంలో నగదు ఉందని తెలిసే దొంగతనానికి పాల్పడ్డారా అన్న అనుమానం కలుగుతోంది. హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం పక్కనే ఉన్న యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంను మాత్రం దొంగలు ముట్టుకోలేదు. సీసీ ఫుటేజీ, ఇతర సాంకేతిక ఆధారాలతో దొంగలను పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



దాన్ని చెయ్యి, చెయ్యకపో - రెండింటికీ పశ్చాత్తాపం చెందుతావు.
- సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 10 జూలై 2025

ట్రంప్ తిరుగుబాట!

ఈసారి ఎలాగైనా నోబెల్ శాంతి బహుమతి చేజిక్కించుకోవాలన్న ఆత్రపడుతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన కాల్పుల విరమణ ప్రతిపాదనకు అంగీకరించని రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఆగ్రహించి ఉక్రెయిన్‌కు తిరిగి ఆయుధాలు సరఫరా చేయబోతున్నట్టు మంగళవారం ప్రకటించారు. ట్రంప్ వచ్చే నాటికే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతుండగా దాన్ని ఆపాలంటూ పిలుపునిచ్చి పలు దఫాలు రెండు దేశాలతోనూ మాట్లాడారు. దూతల్ని పంపారు. కానీ పుతిన్ ముందు అవేమీ పనిచేయలేదు. మారణాయుధాల డ్రోన్‌లతో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో పాటు పలు నగరాలపై దాడులు సాగిస్తూనే ఉన్నారు. అమెరికా నుంచి ఆయుధ సరఫరా నిలిచిపోవటం, దాడులకు అనువైన వేసవి కాలం కావటం రష్యాకు కలిసొచ్చింది. తూర్పు ఉక్రెయిన్‌లోని డొనెస్క్ ప్రాంతాన్ని కైవసం చేసుకోవటం ఆయన లక్ష్యంగా కనబడుతోంది. 2022 తర్వాత ఈ ప్రాంతంలో రష్యాది పైచేయి కావటం ఇదే తొలిసారి. ఇప్పటికే డొనెస్క్ ప్రాంతంలో మూడింట రెండొంతుల ప్రాంతం రష్యా దళాల అధీనమైంది. అక్కడి కాన్‌స్టన్‌టీనుకా నగరం తమ వశమైతే డొనెస్క్ ప్రాంతంలో వరసగా ఉన్న నగరాలన్నీ కుప్పకూలుతాయని ఆ దళాలు భావిస్తున్నాయి.

దౌత్యం నెరపదల్చుకున్నప్పుడు నిర్దిష్టమైన ప్రతిపాదనలతో ముందుకు రావాలి. మధ్యవర్తిగా రెండు పక్షాలతో మాట్లాడి వారి డిమాండ్లేమిటో ముందు తెలుసుకోవాలి. అటు ఉభయ పక్షాలూ కొంత తగ్గటానికి సిద్ధపడాలి. తగ్గటం మాట అటుంచి రష్యా–ఉక్రెయిన్‌లు రెండూ యుద్ధం కొనసాగింపులోని నిరర్థకతను గుర్తించటం లేదు. ఎప్పటిలా అమెరికా ఆయుధాలు అందజేస్తే తన వంతుగా రష్యాపై దాడులు సాగిస్తాననీ, పర్యవసానంగా ఎప్పటికైనా ఆధిక్యత సాధించగలననీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెబుతున్నారు. ఈ మాటలు మాట్లాడేది ఆయనే అయినా, పలికిస్తున్నది పాశ్చాత్య దేశాలు. ట్రంప్ ఊగిసలాట ధోరణి, దేనికీ కట్టుబడి ఉండని ఆయన వైఖరి వగైరాలు ఏదో దశలో ఉక్రెయిన్‌కు అక్కరకొస్తాయని అవి భావిస్తున్నాయి. నిజానికి ఉక్రెయిన్ ఈ యుద్ధంలో ఎప్పుడో ఓటమిపాలైంది. దాన్ని కప్పిపుచ్చటానికి బైడెన్ ఏలుబడిలోని అమెరికా, పాశ్చాత్య దేశాలూ ఎప్పటికప్పుడు ఉక్రెయిన్‌కు అధునాతన ఆయుధాలందిస్తూ రష్యా నగరాలపై, దాని యుద్ధ నౌకలపై, ఇతరేతర కీలక ప్రాంతాలపై దాడులు కొనసాగేలా చూశాయి. కానీ ట్రంప్ వచ్చాక ఆయుధ సాయం ఆగిపోయింది. ఆర్థిక సాయమూ నిలిచిపోయింది. పాశ్చాత్య దేశాలు అతి కష్టమ్మీద తమ వంతుగా ఆ బరువును భుజాలకెత్తుకున్నా అది ఏ మూలకూ చాలటం లేదు.

అందుకే గత పక్షం రోజులుగా రష్యా సాగిస్తున్న వరస దాడులతో ఉక్రెయిన్‌కు ఊపిరాడటం లేదు. డొనెస్క్ నగరాన్ని రక్షించటంలో నిమగ్నమైన తన దళాలకు ఆహారమూ, ఆయుధాలూ పంపటం మాట అటుంచి కనీసం గాయపడినవారిని వెనక్కి తీసుకొచ్చే వెసులుబాటు కూడా దొరకటం లేదు. ఆ నగరం చుట్టూవున్న ప్రాంతాలన్నీ రష్యా చేజిక్కించుకుంది. నిజానికి ఈ యుద్ధం ఉక్రెయిన్ స్వయంకృతం. అమెరికా, పాశ్చాత్య దేశాల మాట విని రష్యాపై గిల్లికజ్జాలకు పోయింది. పక్షంరోజుల్లో రష్యాను దారికి తీసుకురాగలమని పాశ్చాత్య దేశాలు విశ్వసించాయి. రష్యా తమపైకి దండెత్తి వస్తే 'నాటో' సైన్యాలతో దాన్ని సులభంగా మట్టికరిపించగలమనుకున్నాయి. ఇందుకోసం ఉక్రెయిన్‌లో తమకు అనుకూలుడైన జెలెన్‌స్కీకి పట్టంగట్టాయి. రష్యాతో సమవుజ్జీ కాకపోవటంతో ఇప్పటికే ఆ దేశం తీవ్రంగా నష్టపోయింది. పాశ్చాత్య దేశాల బాసటతో రష్యాకు నష్టం కలిగించిన మాట నిజమే అయినా, అదే ఇప్పుడు రష్యా పట్టుదలకు కారణమైంది.

యుద్ధం ఆపాలని ట్రంప్ నేరుగా పుతిన్‌తో ఫోన్ సంభాషణలు సాగించినప్పుడు ఆయన 'మూల కారణాల'ను ప్రస్తావించారని, అవి పరిష్కారం అయితే తప్ప యుద్ధం ఆపేది లేదన్నారని కథనాలు వెలువడ్డాయి. ఆ మూల కారణాల్లో నాటో దూకుడు ఒకటైతే, ఉక్రెయిన్‌ను ఉసిగొల్పటం రెండోది. యూరప్ భద్రతకు సంబంధించి కొత్త అమరిక ఉండాలని, యుద్ధం ఆగాక ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వమీయరాదని పుతిన్ కోరుతున్నారు. నాటో కూటమి ఏర్పడినప్పుడు సోవియెట్ యూనియన్ నుంచి పశ్చిమ యూరప్‌ను పరిరక్షించటమే ధ్యేయమని అది ప్రకటించింది. అదే నిజమైతే 1989లో సోవియెట్ కుప్పకూలి అనేక దేశాలుగా విడివడినాక నాటో అవసరం ఏముంది? సోవియెట్ చివరి అధినేత గోర్బచెవ్ అప్పట్లో ఒక ప్రతిపాదన చేశారు. 'నాటోను రద్దయినా చేయండి... లేక ఆ కూటమిలో మాకు చోటైనా ఇవ్వండి' అన్నదే దాని సారాంశం. అందువల్ల యూరప్ బలపడుతుందనీ, సౌభాగ్యవంతమవుతుందనీ ఆయన చెప్పారు. కానీ అమెరికా ఇందులో కీడు శంకించింది. యూరప్ తనను మించి ఎదుగుతుందని భయపడింది.

తూర్పు యూరప్ దేశాలను నాటోలో చేర్చుకోబోమని అప్పట్లో గోర్బచెవ్‌కి హామీ ఇచ్చారు. కానీ అర డజను దేశాలకు సభ్యత్వమిచ్చారు. వేరే దేశాలతో సరిహద్దు తగాదాలు లేని దేశాలను మాత్రమే చేర్చుకోవాలన్న నిబంధనకు మంగళం పాడారు. చివరకు ఉక్రెయిన్‌ను చేర్చుకోవటానికీ సిద్ధపడ్డారు. రష్యాపైకి ఉసిగొల్పారు. వీటిని చర్చించకుండా, ఎలాంటి పరిష్కారం అవసరమో యోచించకుండా ట్రంప్ తన ట్రూత్ సామాజిక మాధ్యమం ద్వారా 'యుద్ధం ఆపండం'టూ సందేశాలు పెడుతూ, నోబెల్ శాంతి బహుమతి కోసం ఎదురుచూస్తూ కాలం గడిపితే ఫలితం ఉండదు. ట్రంప్ నిజంగా యుద్ధం ఆపదల్చుకుంటే తటస్థ ఉక్రెయిన్‌కు పూచీపడాలి. నాటో విస్తరణ ఉండబోదని తెలపాలి. ట్రంప్ ఆ పని చేయగలరా?

అన్నదాత అరిగోస

అభిప్రాయం



కల్వకుంట్ల కవిత

పొలాల్లో వానాకాలం పంట పనుల్లో తలమునకలై ఉండాల్సిన రైతన్న ఆగమాగమవుతున్నాడు. బస్తా యూరియా కోసం గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడాల్సిన దుఃస్థితి మళ్లీ వచ్చింది. రైతు ఆధార్ కార్డు ఇస్తేగానీ యూరియా బస్తా ఇవ్వడం లేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి రాష్ట్రంలో ఎరువులు, విత్తనాల కోసం రైతన్నలు ఎన్ని అగచాట్లు పడ్డారో మళ్లీ అవే పరిస్థితులు వచ్చాయి. ఇందిరమ్మ రాజ్యం తెస్తానని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులను నడి బజార్లో నిలబెట్టింది.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్వయంగా వరంగల్ వేదికగా ప్రకటించిన రైతు డిక్లరేషన్ ఎప్పటికి అమలవుతుందో తెలియని పరిస్థితి. ఒక్కో రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని నమ్మబలికి, సగం మంది రైతులకు మాత్రమే మాఫీ వర్తింపజేశారు. మిగిలిన రైతులందరూ బ్యాంకులు, సొసైటీల్లో ఉన్న అప్పులను తిరిగి చెల్లించేందుకు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతులు రుణాలు చెల్లించకపోతే సొసైటీ అధికారులు, బ్యాంకర్లు రైతన్నల ఇంటి తలుపులు, బిందెలు, ఇతర సామగ్రి జప్తు తీసుకుపోయిన దృశ్యాలు ఇందిరమ్మ రాజ్యంలో మళ్లీ అగుపిస్తున్నాయి. కొందరు రైతులు రుణాలు తిరిగి చెల్లించలేదని పేర్కొంటూ వారి ఆస్తులు జప్తు చేసేందుకు సైతం అధికారులు నోటీసులు ఇవ్వడం ఈ ప్రభుత్వంలోనే ఆవిష్కృతమయ్యింది.

చేతులు దులుపుకొన్నారు!

తెలంగాణలో పంటల బీమా పథకం అమలు కావడం లేదనీ, కాంగ్రెస్‌ను గెలిపిస్తే బీమాతో ఆపన్న హస్తం అందిస్తామనీ ఇచ్చిన హామీ అతీగతీ లేదు. పంటల బీమాకు రూ.1,400 కోట్ల బీమా ప్రీమియం కూడా చెల్లించలేదు. కనీసం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ప్రకృతి విపత్తులతో రైతులు పంట నష్టపోతే వారికి పరిహారం వచ్చే అవకాశం లేకుండా ఈ ప్రభుత్వం చేసింది. కేసీఆర్ పాలనలో అకాల వర్షాలు, వడగండ్ల వానలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వ పరంగా పరిహారం చెల్లించేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విధానాన్ని కూడా అటకెక్కిచ్చింది. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలు, వడగండ్లతో 55 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టుగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఒక్కో ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం ఇస్తామని ప్రకటించింది. కొందరు రైతులకు మాత్రమే పరిహారం ఇచ్చి చేతులు దులుపుకొన్నది. అత్యధిక మంది రైతులకు పరిహారం ఇవ్వకుండా ముఖం చాటేసింది.

రైతుకు పెట్టుబడి సాయం అందజేసి వెన్నుదన్నుగా నిలిచేందుకు కేసీఆర్ 'రైతుబంధు' పథకం ప్రవేశపెట్టారు. ప్రతి రైతుకు రెండు సీజన్లకు కలిపి ఎకరానికి రూ.10 వేల చొప్పున నగదు బదిలీ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకంపై అనేక ఆరోపణలు చేశారు. అనర్హులకు సాయం అందుతోందని ప్రజలను తప్పుదోవ పట్టించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఏడాదికి ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని నమ్మబలికారు. తీరా



గద్దెనెక్కాక రెండు పంట సీజన్లు రైతుబంధును ఎగ్గొట్టారు. స్థానిక సంస్థల్లో రాజకీయ ప్రయోజనం కోసం ఈ ఒక్క సీజన్‌లో మాత్రమే రైతులకు భరోసా కింద నిధులు జమ చేశారు. ఒక చేత్తో ఇచ్చి ఇంకో చేత్తో లాక్కున్నట్టుగా రైతు భరోసా డబ్బును పంట రుణాలు, ఇతర అప్పుల కింద జమ చేసుకొని ఆ సాయం కూడా అందకుండా అడ్డుకున్నారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి చివరికి సన్న వడ్లు పండించే రైతులకు మాత్రమే బోనస్‌ను పరిమితం చేశారు. బోనస్ కింద రైతులకు ప్రభుత్వం రూ. 1,200 కోట్లు బాకీ పడింది. వాటి కోసం అగ్రికల్చర్ ఆఫీసుల చుట్టూ రైతులు తిరిగినా ఎప్పుడు నిధులు జమ చేస్తారో తెలియని పరిస్థితి.

ఎరువుల కోసం తిప్పలు

పంట సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం సాగుకు సన్నద్ధమవ్వాల్సి ఉంటుంది. రైతులు తమ పొలాలను దున్నుకొని పంటలు వేసేందుకు ఎలా సిద్ధంగా ఉంటారో... విత్తనాలు, ఎరువులు సకాలంలో పంపిణీ చేయడానికి ప్రభుత్వం అంతకన్నా ఎక్కువే శ్రద్ధ కనబరచాల్సి ఉంటుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎరువులు, విత్తనాలే కాదు, పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో కూడా రైతులకు అగచాట్లు తప్పడం లేదు. ముందస్తు ప్రణాళిక లేకపోవడం, సాగు విస్తీర్ణానికి అనుగుణంగా కేంద్రం నుంచి ఎరువులను తెప్పించకపోవడంతో యూరియా, డీఏపీ, పొటాష్ కోసం ఇప్పుడు రైతులంతా రోడ్లపైకి రావాల్సిన దుఃస్థితి ఏర్పడింది. తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం ఇంకెవరిపైనో నెపం వేసే ప్రయత్నం చేస్తోంది. ఎరువులు ముఖ్యంగా యూరియా కోసం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో రైతులు నిత్యం తిప్పలు పడుతున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలో రైతులు ఎరువుల కోసం నడిరోడ్డులో బైఠాయించారు. సిర్పూర్‌లో రైతులు, మహిళలు యూరియా కోసం గంటల తరబడి వేచిచూశారు. ముగ్గురు మంత్రులు ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల పరిస్థితి ఘోరంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగానూ ఎరువుల కోసం రైతులకు సమస్యలు ఎదురవుతున్నాయి.

ఏది భరోసా?

బీఆర్ఎస్ పాలనలో 24 గంటలు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా అయ్యేది. ప్రతి రైతుకు ప్రతి సీజన్‌లో క్రమం తప్పకుండా రైతుబంధు నేరుగా ఖాతాలో జమయ్యేది. రైతు దురదృష్టవశాత్తు మరణిస్తే రైతు బీమా పథకం కింద ఆ కుటుంబానికి రూ.5 లక్షల సాయం అందేది. భూమిశిస్తు రద్దు, నీటి తీరువా రద్దు, ప్రాజెక్టుల పంట కాల్వలపై ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ల క్రమబద్ధీకరణ లాంటి రైతు అనుకూల నిర్ణయాలతో ప్రభుత్వం అన్నదాతకు భరోసానిచ్చింది.

కానీ తమది రైతు ప్రభుత్వం అని చెప్పుకొంటూనే కాంగ్రెస్ అన్నదాతలను వంచిస్తోంది. రైతులకు ఇచ్చిన ప్రతి హామీ మోసంగా మారుతుండటంతో వ్యవసాయం పట్ల, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదని మళ్లీ మళ్లీ నిరూపితమవుతోంది. ఇకనైనా నిర్లక్ష్యం వీడి రైతు సంక్షేమం తక్షణ కర్తవ్యంగా భావించి పంటల బీమా పథకం అమలుకు చర్యలు చేపట్టాలి. వెంటనే బీమా అమలుకు టెండర్లు పిలిచి ఇన్సూరెన్స్ ఏజెన్సీని ఖరారు చేయాలి. యూరియా సహా ఇతర ఎరువులను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలి. ఎరువులను బ్లాక్ మార్కెట్ చేసి అమ్ముతున్న వారిపై ఉక్కుపాదం మోపాలి. రైతులకు బాకీ పడ్డ 'రైతు భరోసా' సాయం విడుదల చేయాలి.

రాష్ట్రంలో అన్ని కోణాలలో రైతులను వంచించి, వ్యవసాయాన్ని అస్తవ్యస్తం చేసి... పండుగ చేశామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకుంటున్నారు. వారి మాటలకు, సంబరాలకు సంబంధం లేదని తెలుసుకోవాలంటే తమ మేనిఫెస్టోను ఒకసారి చదువుకోవాలి. 'మాట ఇచ్చినవాడు మారిపోవచ్చు, కానీ మాట మరిచిపోవద్దు' అని తెలంగాణ రైతులు సామెతలాగా చెప్తుంటారు. రైతుల ఆర్థిక భద్రత కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిజం చేయకపోతే, రైతుల నుంచి తీవ్ర నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒక్క సీజన్‌కు, అదీ ఎన్నికల్లో ప్రయోజనం కోసం రైతుభరోసా ఇచ్చి దానిని గొప్పగా చెప్పుకోవాలని చూస్తే... అదే రైతుల నుంచి ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందన్న వాస్తవాన్ని గ్రహించాలి.

వ్యాసకర్త శాసన మండలి సభ్యురాలు, 'తెలంగాణ జాగృతి' అధ్యక్షురాలు

- ప్రణాళిక లేకపోవడం, సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులను తెప్పించక పోవడంతో యూరియా కోసం రైతులు రోడ్లపైకి రావాల్సిన దుస్థితి ఏర్పడింది.
- పంటల బీమాకు రూ.1,400 కోట్ల బీమా ప్రీమియం కూడా చెల్లించలేదు. బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు.
- ఒక్కో రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి, సగం మందికే మాఫీ వర్తింప జేశారు. మిగిలిన రైతులందరూ బ్యాంకులు, సొసైటీల్లో ఉన్న అప్పులను తిరిగి చెల్లించేందుకు అవస్థలు పడుతున్నారు.

సోషల్ మీడియా

ఎందుకు వెళ్లిపోతున్నారు?



భారత పౌరసత్వాన్ని వదిలేసుకున్న ఒక పెద్ద నటుడిని ఈమధ్య అనుకోకుండా కలిశాను. తర్వాత విచారిస్తే, ఎంతోమంది ప్రముఖులు, నటులు, కళాకారులు, క్రీడాకారులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నట్టో, వదులుకుంటున్నట్టో తెలిసింది. చిత్రంగా అనిపించినా, ఎంతోమంది రాజకీయ నాయకుల పిల్లలు కూడా దేశాన్ని వదిలేసినట్టు అర్థమైంది. వ్యాపారవేత్తలు దేశాన్ని వదిలేయడానికి అధిక పన్నులు ఒక కారణం. ఇంకా ఏమున్నాయి? ఈ వలసలకు బాధ్యులు ఎవరు?

- సుదీప్తో సేన్, సినిమా దర్శకుడు

దేశాలు–విధానాలు



తమ అణిచివేత విధానాలపై తాలిబన్లు వెనక్కి మరలాలంటూ ఐక్యరాజ్యసమితి సాధారణ సభ ప్రవేశపెట్టిన తీర్మానానికి పాకిస్తాన్‌తో సహా 116 దేశాలు మద్దతిచ్చాయి. రెండు దేశాలు– ఇజ్రాయెల్, యూఎస్ వ్యతిరేకించాయి. ఇండియా, చైనా, రష్యా, ఇరాన్ సహా 12 దేశాలు దూరంగా ఉన్నాయి. రష్యా ఇప్పటికే తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించింది. ఇండియా, ఇరాన్, చైనా సమీప భవిష్యత్తులో గుర్తించొచ్చు.

- స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

ఆల్ డాక్టర్



త్వరలో రానుంది: 'అల్లోపతీ–ఆల్‌పతీ' క్రాష్ కోర్స్! ఆధునిక వైద్యం, ఆయుర్వేద, హోమియోపతి, యునానీ, సిద్ధ అన్నింటినీ ఒకేసారి నేర్చుకోవచ్చు. దేన్నయినా ఏ పద్ధతిలోనైనా చికిత్స చేయొచ్చు. బోనస్: వినియోగదారుల కోర్టు నుంచి పూర్తి రక్షణ!

- ఎస్.పి. కాలంత్రి, వైద్య–పరిశోధకుడు

భరించగలవా?




మరో బ్రిడ్జి కుప్పకూలింది (గుజరాత్, వడోదర గంభీర వంతెన). మన నగరాల్లోని ఫ్లైఓవర్ల మీద నాదో ప్రశ్న. రద్దీ ట్రాఫిక్ కోసం వాటిని డిజైన్ చేసి ఉండొచ్చు; కానీ వందలాది వాహనాలు నిలిచిపోయే వరుస ట్రాఫిక్ జామ్‌లను భరించగలిగేలా అవి నిర్మితమై ఉన్నాయా?

- యూసుఫ్ ఉంర్భూవాలా, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

భారతీయ గురు పరంపర

జ్ఞాన భాండాగారంగా, పంచమ వేదంగా ప్రసిద్ధి గాంచిన మహాభారతాన్ని ప్రపంచానికి అందించిన వారు వ్యాస మహర్షి. వీరిని భారతీయుల తొలి గురువుగా భావిస్తారు. వ్యాస మహర్షి జన్మదినాన్ని 'గురుపౌర్ణమి'గా అనాది నుంచి భారతీయ సమాజం జరుపుకొంటున్నది. ఒక్కటిగా ఉన్న వేద జ్ఞానాన్ని ఋగ్, యజుర్, సామ, అధర్వణ వేదాలుగా విభజించాడు కావున వ్యాసుడు వేద వ్యాసుడు అయ్యాడంటారు. ఆయన తప్పు చేసిన వారిని మందలించేవాడు, ధర్మ మార్గాన నడిచే వారిని ప్రోత్సహించేవాడు. దీనులను ఆదరించే వాడు. అందుకే అనాది నుంచి హిందూ సమాజం వేద వ్యాసుణ్ణి తొలి గురువుగా భావిస్తున్నది.



భారత దేశంలో గురువుకి విశేషమైన స్థానం ఉంది. సమాజ క్షేమాన్ని కోరే ఒక ఉత్తమ గురువు తాను శ్రమపడి సంపాదించిన జ్ఞానాన్ని అర్హత గలవారికి అందిస్తూ తనతో సమానమైన ఎందరో శిష్యులను తీర్చిదిద్ది సమాజానికి ఉపకారం చేస్తాడు. ఆదిశంకరులు చెప్పినట్టుగా ఉత్తమ గురువుకు ఎవరూ సాటి లేరు, ఏదీ సాటి రాదు. పూర్వం విద్యాభ్యాసం కోసం పిల్లలు తల్లిదండ్రులకు దూరంగా గురు కులాలలోనే ఉండేవారు. కానీ నేటి ఆధునిక సమాజంలో విద్యాలయాల్లో కంటే అధిక సమయం తల్లిదండ్రుల దగ్గరే ఉంటున్నారు. కావున తల్లిదండ్రులను కూడా విద్యార్థులు గురువులుగానే భావించాల్సి ఉంటుంది. గురువు, తల్లిదండ్రులు విద్యార్థిని 'ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానానికి' చేర్చే బాధ్యతలు స్వీకరించాలి. ఆధ్యాత్మిక భావ బీజాలు, నైతిక విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే విద్యార్థి ఉత్తమ పౌరుడిగా తయారవుతాడు. ఈ బాధ్యత గురువుతోపాటు తల్లిదండ్రులపైనా ఉంది.

మారుతున్న జీవన శైలి కారణంగా నేడు మన సమాజంలో విలాసవంతమైన జీవితం, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు, అపరిమితమైన సామాజిక మాధ్యమాల వినియోగం, హింసా ప్రవృత్తి, పెద్దలతో పాటు స్త్రీలను కూడా గౌరవించక పోవడం, తల్లితండ్రుల అతి గారాబం వంటి అనేక రుగ్మతలు, సమస్యలు పుట్టుకొస్తున్నాయి. వీటన్నింటి నుండి యువతని రక్షించాల్సిన బాధ్యతను గురువులు స్వచ్ఛందంగా స్వీకరించాలి. ఆర్థిక, సైనిక శక్తులు ఎంత బలీయంగా ఉన్నప్పటికీ సామాజిక పరివర్తన, ప్రజల మధ్య ఐకమత్యం, జాతీయభావం లేనట్లయితే ఆ జాతి నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని మనకు అనేక ప్రపంచ దేశాల చరిత్రలు తెలియజేస్తున్నాయి. ప్రముఖ శాస్త్రవేత్త, భారత మాజీ రాష్ట్రపతి డా॥ అబ్దుల్ కలాం స్వప్నమైన 'అభివృద్ధి చెందిన భారతదేశం' సాకారం కావాలంటే కష్టపడే మనస్తత్వం, దేశాన్ని పరమేశ్వరునిగా ఆరాధించే నిష్ఠ, విజయం సాధించాలనే పట్టుదల, దేశభక్తి కలిగిన యువకులను తయారు చేయవలసిన బాధ్యత నేటి ఆధునిక గురువుపై ఉంది.

– ఆచార్య వై. వి. రామిరెడ్డి । శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి
(నేడు వ్యాస జయంతి: గురుపౌర్ణమి)

మూడో వంతుతో సర్దుకుపోవాలా?

విశ్లేషణ



మాజా దారూవాలా

భారత్ ప్రగతి బాటలో పయనించేందుకు మహిళలకు సమ స్థానం కల్పించడం అవసరం. లేకపోతే దేశం వెనుకబడిపోతుంది. 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్'కు చెందిన '2025 గ్లోబల్ జెండర్ గ్యాప్' నివేదికలో అనాసక్తంగా కనిపించే గణాంక వివరాలను పరిశీలిస్తే తేలే వాస్తవం ఇది. ఇటీవల విడుదలైన ఈ నివేదికలో, మొత్తం 148 దేశాలలో భారత్ స్థానం 131గా ఉంది. బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికాల కన్నా, పొరుగునున్న చాలా భాగం దక్షిణాసియా దేశాలకన్నా కూడా మనం దిగువన ఉన్నాం.

ఆ నివేదికలో ఆనందింపజేసే, దిగులుపరచే అంశాలు రెండూ ఉన్నాయి. భారత మహిళా రాజకీయ సాధికారత చైనాకన్నా ఎక్కువగా, బ్రెజిల్‌కు దగ్గరగా ఉంది. బహుశా, పంచాయతీ రాజ్ సంస్థలలో స్త్రీలకు 33% ప్రాతినిధ్యం కల్పించడం దానికి తోడ్పడి ఉండవచ్చు. పంచాయతీ రాజ్ సంస్థలలో మహిళలు 45% మేరకు ఉన్నారు. కానీ, పార్లమెంట్ మొత్తం సభ్యుల్లో స్త్రీలు 14% మాత్రమే ఉన్నారు.

ఆర్థిక రంగంలో మహిళల భాగస్వామ్యం అంతంతమాత్రంగా ఉండటం వల్ల, ఈ విషయంలో ప్రపంచంలోని ఐదు అట్టడుగు దేశాల్లో భారత్ ఒకటిగా ఉంది. నిరుద్యోగం అధికంగా ఉన్న స్థితిలో, ఉన్న కొద్దిపాటి ఉద్యోగాలను పురుషులే చేజిక్కించుకుంటున్నారు. మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యపు రేటు గత దశాబ్ద కాలంలో గణనీయంగా తగ్గిందని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. స్థూల జాతీయ ఉత్పత్తి (జి.డి.పి.)లో స్త్రీల వాటా 20% కన్నా తక్కువగా ఉంది.

ఇది కేవలం స్త్రీ–పురుష అసమానతా సమస్య కాదు. ఆర్థిక అభిలాషతో ముడిపడిన అంశం. ఉద్యోగాల్లో స్త్రీ–పురుషులకు సమత్వం కల్పిస్తే, 2025 నాటికి భారత్ జీడీపీకి 770 బిలియన్ల డాలర్లు జత కాగలవని మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ అంచనా వేసింది. ప్రస్తుత రేటును పరిగణనలోకి తీసుకుంటే, అందుకు మరో 135 ఏళ్లు పట్టవచ్చు. ఇది ప్రతి విధాన నిర్ణేతను ఆలోచింపజేయాలి. మహిళల భాగస్వామ్యాన్ని ఒక ప్రత్యేక హక్కుగా గుర్తిస్తూ, జాతీయ ప్రాధాన్యాలలో ఒక విప్లవాత్మక, సత్వర మార్పునకు వారు పురికొల్పాలి.

మహిళలు సాధించగల అభివృద్ధి పైనే దేశ ప్రగతి ఆధారపడి ఉందని సాక్షాత్తు ప్రధాన మంత్రే పదే పదే చెబుతూ వస్తున్నారు. అయితే, ఆ ప్రాధాన్యతను గుర్తించడం తొలి అడుగు మాత్రమే. ఆర్థిక, రాజకీయ, సామాజిక జీవన రంగాల్లో మహిళలకు సమాన భాగస్వామ్యం లభించేటట్లుగా విధానాలు రూపొందిస్తే సరిపోదు. అవి ఆచరణకు నోచుకునేట్లు అటు



- ఇటీవల విడుదలైన '2025 గ్లోబల్ జెండర్ గ్యాప్' నివేదికలో మొత్తం 148 దేశాలలో భారత్ 131వ స్థానంలో ఉంది.

ప్రభుత్వాలూ, ఇటు ప్రైవేటు రంగమూ రెండూ గరిష్ఠ స్థాయిలో కృషి చేయాలి. ఇది ప్రతి ఒక్కరి బాధ్యత. కానీ, రూపాంతరం చెందడాన్ని చూపించవలసిన ప్రాథమిక బాధ్యత ప్రభుత్వాలదే.

ఇటీవలి సంవత్సరాల్లో, స్త్రీలను కూడా భాగస్వాములను చేసే గతి నిజంగానే వేగం పుంజుకుంది. కానీ, ఆ చేర్చుకోవడం ఇష్టపూర్వకంగా కాక, ఇక తప్పదన్నట్లుగా జరుగుతోంది.

ఈమధ్య ఇండియన్ ఎడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌కు ఎంపికైన వారిలో స్త్రీలు 41%గా, ఇండియన్ ఫారిన్ సర్వీస్‌లో నియమితులైన వారిలో స్త్రీలు 38%గా ఉన్నారు. ఇది ఉత్సాహపరచే అంశమే. అయితే, ఆ రెండు సర్వీసుల్లోనూ మొత్తంమీద వారి ప్రాతినిధ్యం ఎంత మేర ఉన్నదీ స్పష్టం కాలేదు. సాయుధ దళాల్లో స్త్రీలు 3% కన్నా తక్కువగా ఉన్నారు. అన్ని రకాల పోలీసు దళాలలో స్త్రీలు 12% మేర ఉన్నారు. దీన్ని బట్టి రక్షణ, భద్రతా విభాగాలు ఇప్పటికీ మహిళలను అడుగుపెట్టనివ్వేవిగా లేవని అనిపిస్తోంది. సుప్రీం కోర్టులో 2021లో అత్యధికంగా 33 మంది న్యాయమూర్తులలో, నలుగురు మహిళలు ఉండేవారు. మళ్ళీ ఒకే మహిళా న్యాయమూర్తి ఉన్న స్థితికి తిరిగొచ్చింది.

మహిళల నేతృత్వంలోని స్వయం సహాయక బృందాలు, మహిళలకు ఉద్దేశించిన పొదుపు పథకాలు, తక్కువ వడ్డీకి రుణ సదుపాయాలు అందుబాటులోకి తేవడం వంటివి ఆర్థిక స్థితిగతులలో మార్పులు తేవడం ప్రారంభించాయి. కేరళ నుంచి ఉత్తర ప్రదేశ్ వరకు ప్రభుత్వాలు చేపట్టిన పథకాల వల్ల లక్షలాది మంది గ్రామీణ మహిళలు జీవనాధారం కోసం వేటిపైనో ఆధారపడటం నుంచి తామే పది మందికి ఉపాధి కల్పించగల సంస్థలను నడిపే స్థితికి చేరుకున్నారు.

జనాభా లెక్కల సేకరణ, నియోజకవర్గాల పునర్విభజనను అలా ఉంచి, పార్లమెంట్, శాసన సభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించాలన్న ఏనాటి డిమాండ్‌నో అమలులోకి తేవాలి. వ్యవస్థలే సమాజాల రూపు రేఖల్ని నిర్ణయించి, వాటి విలువలను, పక్షపాతాలను ముందుకు తీసుకెళ తాయి. మహిళలు తమ సామాజిక, శారీరక వాస్తవిక తలను లెక్కలోకి తీసుకోవాలని కోరడాన్ని, వారు విలాసాలను కోరుకుంటున్నట్లుగా చిత్రించడం పరి పాటి.

ఏ రంగంలోనైనా సరే, స్త్రీ–పురుషులలో ఏ ఒక్కరూ 50–60% మించకుండా ఉన్నప్పుడే సమత్వం సాధ్యమవుతుంది. కానీ, సమాన స్థానాన్ని, స్థాయిని కోరుకోవడాన్ని అసమంజసమైనదిగా చిత్రిస్తూ, జాతీయ తర్జన భర్జనలు స్త్రీలను 33%కి పరిమితం చేసేశాయి. స్త్రీలు 33%తోనే సంతోషపడితే, ఒక అసంతృప్తితోనే దాన్ని అంగీకరించినట్లవుతుంది. అసమంజసమైన కోటాకే సర్దుకుపోయినట్లు అవుతుంది. మహిళలను భాగస్థులను చేయడానికి అన్ని సంస్థలు సత్వరం, ఇష్టపూర్వకంగా రూపాంతరం చెందాల్సిన అవసరం ఉంది. ఏనాటి నుంచో కాలరాచిన హక్కుకు పరిహారం చెల్లిస్తున్నట్లుగా ఆ పని సాగాలి.

వ్యాసకర్త 'ఇండియా జస్టిస్ రిపోర్ట్'కు చీఫ్ ఎడిటర్ ('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సంసారి ముక్తిమార్గం

సంసారికి సంసారం ఉంటుంది. సంసారం అంటే భార్యా బిడ్డలు, ఇల్లు వాకిలి కలిగి ఉండటమే కాదు, దీని మూలమైన జనన మరణాత్మకమైన జీవనం కూడాను. అసలిదే సంసారమంటే. ఇది లేకుండా చేసుకోవటమే 'ముక్తి'.

లౌకిక జీవనంలో భార్యాపుత్రాదులతో, రకరకాల సంపదలతో అనుభవించిన ఇంద్రియ సుఖాలకు బాగా అలవాటు పడిన సంసారి మరణం సమీపించినా వాటిని మరచిపోలేడు. ముసలితనం మీద పడినా, ఒకప్రక్క రోగాలు పీడి స్తున్నా, అల్లంత దూరాన మృత్యు దేవత దర్శనం ఇస్తున్నా సరే... మనిషి ఇంద్రియాలు మాత్రం విషయ సుఖాలను విడిచిపెట్ట లేవు. మనిషి ఇంకా సుఖాలకు ఆరాటపడుతూనే ఉంటాడు కాని, అప్పుడైనా భగవ న్నామ స్మరణ చేయడు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

పాము ఒక కప్పను పట్టి మెల్లగా తింటూంటుంది. పూర్తిగా తినటానికి చాలా సేపు పడుతుంది. కప్ప శరీరం సగభాగం పాము నోటిలో ఉన్న స్థితిలోనూ ఆ కప్ప తన ముందుకు వచ్చిన పురుగును పట్టుకోవడానికి నాలిక చాస్తూనే ఉంటుంది. అదే ఇంద్రియ లోలత్వమంటే! సంసారి కూడా ఇలాగే ప్రవర్తిస్తాడు. కానీ, సంసారియైన పరీక్షిన్మహారాజు వేరే విధంగా ప్రవర్తించి అందరికీ మార్గదర్శకంగా నిలిచాడు.

పరీక్షిన్మహారాజు శాపగ్రస్తుడై ఒకవారంలో పాము కాటుచే మరణిస్తాడని స్పష్టమైంది. అప్పుడు ఇక చేయవలసిన కర్తవ్యమేమిటో ఆలోచించాడు. అందుకని ఆ వారమంతా మోక్షప్రదమైన శ్రీమద్భాగవత కథా శ్రవణం శుకయోగీంద్రుని ద్వారా చేశాడు. ప్రాణప్రయాసమయంలో చేయదగిందిదే! ప్రాజ్ఞుడు కనుక పరీక్షిత్తు తాను సంసారి అయినా ఇంద్రియ లోలుడు కాక, రాజ్య సుఖాలు వదిలివేసి భగవత్ కథా శ్రవణంలోనే కాలాన్ని సద్వినియోగం చేశాడు.

ఎవరైనా సరే 'పరోపకారః పుణ్యాయ' అనే సూక్తిని గమనించి బాధలోనున్నవారికి ఉపకారం చేసి ఆదుకోవాలి. మన సంపదకు మనం కేవలం ధర్మకర్తలమనే భావంతో ప్రవర్తిస్తే, మన దేశమే కాదు యావత్ ప్రపంచమూ సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. జయ గురు దత్త.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** పౌర్ణమి రా.1.56 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** పూర్వాషాఢ పూర్తి (24 గంటలు), వర్జ్యం ప.3.26 నుండి 5.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.48 వరకు, తదుపరి ప.3.07 నుండి 3.59 వరకు, **అమృతఘడియలు:** రా.1.30 నుండి 3.11 వరకు, గురుపూర్ణిమ ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.35.

రెండు బైపాస్ రోడ్ల నిర్మాణం చకచకా

అప్పా కూడలి-మన్నెగూడ హైవే విస్తరణలో కీలక పురోగతి

- 11 కి.మీ. మేర 60 మీటర్ల వెడల్పుతో మొయినాబాద్, చేవెళ్ల వద్ద నిర్మాణం
- ప్రధాన క్యారేజ్‌వే విస్తరణపై ఉన్న ఎన్‌జీటీ స్టే తొలగించేలా చర్యలు
- జడ్ఎస్ఐ-బీఎస్ఐ నిపుణుల ఆధ్వర్యంలో పర్యావరణ ప్రభావ అంచనా సర్వే మొదలు



మొయినాబాద్ వద్ద బైపాస్ నిర్మాణానికి పూర్తయిన ఎర్త్ వర్క్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కీలక బైపాస్ రోడ్ల నిర్మాణం మొదలైంది. నగర శివారులోని అప్పా కూడలి నుంచి మన్నెగూడ వరకు 46 కి.మీ. నిడివిని ఎన్‌హెచ్ఏఐ నాలుగు వరుసలుగా విస్తరించనున్న విషయం తెలిసిందే. ప్రధాన రోడ్డుపై ఉన్న 915 మర్రి వృక్షాలను సంరక్షించే విషయంలో ఎన్‌హెచ్ఏఐ సరైన ప్రణాళిక ఇవ్వకపోవటంతో..జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసు దాఖలు కావటంతో రోడ్డు నిర్మాణంపై స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ప్రధాన రోడ్డు విస్తరణ పనులు మొదలుకాలేదు. కానీ విస్తరణలో కీలకంగా ఉండే 11 కి.మీ. నిడివితో ఉండే బైపాస్ రోడ్ల నిర్మాణం మొదలై వేగంగా జరుగుతోంది.

మొయినాబాద్, చేవెళ్ల వద్ద..

ఈ రోడ్డును 60 మీటర్ల వెడల్పుతో విస్తరించాల్సి ఉంది. మొయినాబాద్, చేవెళ్ల పట్టణాల వద్ద అంతమేర రోడ్డు విస్తరణ జరగాలంటే భారీగా ప్రైవేట్ భవనాలను తొలగించాల్సి ఉంటుంది. దీంతో ఆ రెండు చోట్ల బైపాస్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

- తొలుత మొయినాబాద్ పట్టణం ముందు జేబీఐటీ వద్ద తొలి బైపాస్ రోడ్డు మొదలవుతుంది. ఇది పట్టణం దాటిన తర్వాత తాజ్ హోటల్ కూడలి వద్ద ముగుస్తుంది. దాదాపు 4.8 కి.మీ. నిడివితో సాగుతుంది.
- చేవెళ్ల శివారులోని కేసారం గ్రామం వద్ద మొదలయ్యే బైపాస్ రోడ్డు దాదాపు 6 కి.మీ. మేర కొనసాగి చేవెళ్ల దాటిన తర్వాత ఇబ్రహీంపల్లి గ్రామ సమీపంలో ప్రధాన రోడ్డును కలుస్తుంది.
- రెండు బైపాస్‌ల నిర్మాణానికి 135 హెక్టార్ల భూమిని సేకరించిన అధికారులు రూ.200 కోట్ల మొత్తాన్ని పరిహారంగా చెల్లించారు. చేవెళ్ల బైపాస్‌లో కొంత భాగంలో పరిహారం వివాదం కొనసాగుతుండటంతో ఆ భాగం మినహా మిగతా భాగం పనులు వేగంగా జరుగుతున్నాయి. భూమిని 60 మీటర్ల వెడల్పుతో చదును చేసి గ్రావెల్ పరిచి కంప్రెస్ చేసే పని పూర్తయ్యింది. మొయినాబాద్ నుంచి సురంగల్, శ్రీరామ్‌నగర్ గ్రామాల మీదుగా షాబాద్ రోడ్డుకు కలిసే రోడ్డు క్రాస్ చేసే చోట విశాలమైన అండర్‌పాస్ నిర్మాణం జరుగుతోంది. మరో నాలుగు చోట్ల కల్వర్టులు నిర్మిస్తున్నారు. ఈ బైపాస్ సిద్ధమైతే సురంగల్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలు మొయినాబాద్ కూడలి నుంచి రావాల్సిన అవసరం లేకుండా దీనిమీదుగా వచ్చే వీలుంటుంది. బైపాస్ నుంచి దిగువ రోడ్డుకు అనుసంధానించే లింక్ రోడ్లు కూడా నిర్మిస్తున్నారు. దీంతో తక్కువ సమయంలోనే అప్పా కూడలి నుంచి అక్కడకు చేరుకోవచ్చు. ఇక చేవెళ్ల బైపాస్‌లో చేవెళ్ల-షాద్‌నగర్ రోడ్డు, దామరగిద్ద గ్రామానికి వెళ్లే దారిలో అండర్‌పాస్‌ల నిర్మాణం మొదలైంది. మరో ఆరు కల్వర్టుల పనులు కూడా ప్రారంభించారు. మార్చి నాటికి ఈ రెండు బైపాస్ పనులు పూర్తి చేసి వాహనాల రాకపోకలను అనుమతిస్తామని ఎన్‌హెచ్ఏఐ పేర్కొంటోంది.

పర్యావరణ ప్రభావ అంచనా సర్వే మొదలు..

ప్రధాన రహదారిపై మర్రి వృక్షాల రక్షణకు ఎన్‌హెచ్ఏఐ నడుంబిగించింది. ఆ వృక్షాల రక్షణకు పక్కా ప్రణాళికను అందజేయాలని ఇప్పటికే జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశించింది. దీనికి సంబంధించి పర్యావరణ ప్రభావ అంచనా (ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ స్టడీ) సర్వే చేయాలని చెప్పింది. గతంలో ఈ సర్వే జరిగినా, అది పక్కాగా లేదని ఇటీవల ఆక్షేపించింది. దీంతో తాజాగా ఎన్‌హెచ్ఏఐ జెడ్ఎస్ఐ-బీఎస్ఐల నిపుణుల ఆధ్వర్యంలో ఆ సర్వే కూడా ప్రారంభమైంది. త్వరలో నివేదిక అందించనున్నారు. దాన్ని హరిత ట్రిబ్యునల్‌కు అందించి, రోడ్డు నిర్మాణంపై ఉన్న స్టే తొలగించేలా ఎన్‌హెచ్ఏఐ ఏర్పాట్లు చేస్తోంది.

త్వరలో మళ్లీ రాష్ట్రంలో ఆదర్శ రైతు వ్యవస్థ

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: త్వరలోనే ఆదర్శ రైతు వ్యవస్థను ప్రతి గ్రామంలో తీసుకురావాలని భావిస్తున్నట్లు రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి తెలిపారు. ఈ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు. రైతు కమిషన్ కార్యాలయంలో బుధవారం ఆయన సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవానిరెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ, గతంలో ఆదర్శ రైతు వ్యవస్థ ఉండేదని, దాన్ని గత పాలకులు తొలగించారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఆదర్శ రైతును ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లోకి వెళ్లి ఆదర్శ రైతును ఎంపిక చేస్తారని చెప్పారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ పథకాలు ఆదర్శ రైతుల ద్వారా ప్రజల్లోకి వెళ్లేలా చూస్తామన్నారు.

ఆ 50 ఎకరాలు భూదాన్ భూములే

'భూదాన్' పిటిషన్‌లో పిటిషనర్ కౌంటర్

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం సర్వే నంబర్ 181, 182లోని 103 ఎకరాలు భూదాన్ (50 ఎకరాలు), గైరాన్ (45), ఇతర సర్కారీ భూములని హైకోర్టులో 'భూదాన్'పిటిషనర్ బిర్లా మహేశ్ కౌంటర్ దాఖలు చేశారు. ముగ్గురు ఐఏఎస్‌లు, మండల రెవెన్యూ అధికారులు కుమ్మక్కై అక్రమ లావాదేవీలు, మోసపూరిత రిజిస్ట్రేషన్లతో ఈ భూములను ప్రైవేట్‌పరం చేశారన్నారు. రెవెన్యూ రికార్డులు తారుమారు చేయడం, అక్రమ వారసత్వాలను సృష్టించడం, పట్టాదార్ పాస్‌బుక్‌ల జారీలో వీరు కీలకంగా వ్యవహరించారని చెప్పారు. మోసపూరిత చర్యలతో భూదాన్, గైరాన్ భూములను పదేపదే అక్రమంగా అమ్మడం, నకిలీ పత్రాలు తయారు చేసి.. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. ఈ భారీ భూకబ్జాలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ అంబర్‌పేట్‌కు చెందిన బిర్లా మహేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌లతో స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై భూములను బదిలీ చేయించుకున్నారని.. దీనిపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం ఏప్రిల్ 24న ప్రతివాదులకు నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌లో తహసీల్దార్ (ప్రతివాది 6) దాఖలు చేసిన కౌంటర్‌కు పిటిషనర్ తాజాగా రిప్లై కౌంటర్ దాఖలు చేశారు. సర్వే నంబర్ 181, 182పై తహసీల్దార్ చెబుతున్నదంతా తప్పులతడకని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సిఫార్సు మేరకు ఆ భూములను డీనోటిఫై చేసి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారన్నారు. తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ భూదాన్ అండ్ గ్రామ్‌డాన్ చట్టం 1965 ప్రకారం భూదాన్ భూముల క్రయవిక్రయాలు చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.

ఆ ఎనిమిది మంది ఆచూకీ అసాధ్యమే

- మ్యాచ్ కాని డీఎన్ఏ రిపోర్టులు
- సిగాచి పరిశ్రమ దుర్ఘటనలో కీలక నిర్ణయం తీసుకున్న అధికారులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో ఆచూకీ లభించని ఎనిమిది మంది విషయంలో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. వీరి ఆచూకీ కనుగొనడం అసాధ్యమని తేల్చారు. శిథిలాల్లో దొరికిన సుమారు 100కు పైగా శరీర అవశేషాల డీఎన్ఏలకు, ఆయా కుటుంబ సభ్యుల డీఎన్ఏలు మ్యాచ్ కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పేలుడు తీవ్రతకు ఎనిమిది మంది మృతదేహాలు కాలి బూడిదైపోయినట్లు భావిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు తక్షణ సాయం కింద రూ.15 లక్షల చెక్కులను పంపిణీ చేసిన అధికారులు.. మూడు నెలల తర్వాత రావాలంటూ వారికి సూచించి స్వస్థలాలకు వెళ్లిపోవాలని కోరారు. సిగాచి పరిశ్రమ యాజమాన్యం ఈ చెక్కులను అందజేసింది. సిగాచి పరిశ్రమలో జూన్ 30న జరిగిన భారీ విస్ఫోటనంలో ఇప్పటి వరకు 44 మంది మృత్యువాత పడిన విషయం విదితమే. 16 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఎనిమిది మంది ఆచూకీ గల్లంతైంది. ఆచూకీ గల్లంతైన వారిలో జస్టిన్ (కర్ణాటక, ప్రస్తుత హైదరాబాద్‌లో నివాసం), రాహుల్‌శర్మ (యూపీ), అఖిలేశ్‌నిసాద్ (యూపీ), విజయ్ నిషాద్ (యూపీ), శివ్‌జీ (బిహార్), ఎస్.రవి (తెలంగాణ), గుండేపల్లి వెంకటేశ్ (ఏపీ), ఇర్ఫాన్ (జార్ఖండ్)లు ఉన్నారు. ఆచూకీ తెలియని 8 మంది విషయమై ప్రభుత్వానికి నివేదించామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.



బాధిత కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న అధికారులు

అంతిమ సంస్కారాలైనా చేసుకుందామని..

తమ వారి మృతదేహాలకు కోసం బాధిత కుటుంబాలు పది రోజులుగా సిగాచి పరిశ్రమ వద్ద అధికారులు ఏర్పాటు చేసిన సహాయ శిబిరం వద్ద పడిగాపులు కాశారు. వారి ఆచూకీ కూడా దొరకడం అసాధ్యమని తేల్చడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. కనీసం అంతిమ సంస్కారాలు కూడా చేసుకోలేని పరిస్థితిలో ఇంటిబాట పట్టడం అందరినీ కలిచివేసింది. ఈ ఎనిమిది మంది మరణ ధ్రువీకరణ విషయంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. గల్లంతైన వారి ఆచూకీ దొరికే వరకు రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతుందని ప్రకటించారు. ఐలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కొనసాగిస్తామని చెప్పారు. బాధిత కుటుంబసభ్యుల నుంచి సిగాచి యాజమాన్యం ఎన్‌ఓసీలు తీసుకోవడం గమనార్హం.

1,200 డిగ్రీల ఉష్ణోగ్రత!

దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రమాదాల్లో ఒకటిగా నమోదైన సిగాచి పరిశ్రమ పేలుడు దుర్ఘటనలో వెలువడిన ఉష్ణోగ్రత 1,200 డిగ్రీలు దాటినట్టు స్పష్టమవుతోందని నిపుణులు అంచనాకు వచ్చారు. సాధారణంగా శవదహన కేంద్రాలో మానవ శరీరం, ఎముకలు బూడిదగా మార్చడానికి 800 డిగ్రీల నుంచి 1200 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతతో రెండు నుంచి మూడు గంటల పాటు దహనం చేస్తుంటారు. ఈ లెక్కన సిగాచి పరిశ్రమలో ఎనిమిది శరీర అవశేషాలు కూడా దొరకని స్థాయిలో కాలిబూడిదై ఉండొచ్చని అధికారులు అంచనాకు వచ్చారంటే ఈ ప్రమాదంలో వెలువడిన ఉష్ణోగ్రత 1,200 డిగ్రీలు దాటి ఉంటుందని ఎస్‌డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల జరిగిన అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో వెలువడిన మంటల కంటే..సిగాచి పరిశ్రమ పేలుడులో వెలువడిన మంటల తీవ్రత అధికంగా ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

హ్యామ్ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు హైబ్రిడ్ యాన్యుటీ మోడ్‌లో నిర్మించే రోడ్లు అత్యంత కీలకంగా మారనున్న నేపథ్యంలో ఆ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్బన్, సెమీ అర్బన్, రూరల్ ఏరియా..ఇలా మూడు రకాలుగా రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించబోతున్నామని, ఈ రోడ్డు ప్యాకేజీలకు సీఎం నుంచి అనుమతి రాగానే టెండర్లు పిలిచేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ రోడ్లు ఎన్‌హెచ్ఏఐ ప్రమాణాలకు తీసిపోని విధంగా ఉండాలని మంత్రి సూచించారు. బుధవారం ఆయన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్‌తో కలిసి అధికారులతో హ్యామ్ రోడ్లపై సమీక్షించారు. ఈ రోడ్లు పదేళ్ల వరకు చెక్కు చెదరకుండా ఉండే విధంగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని ముందుగానే నిర్మాణ సంస్థలను ఆదేశించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వంతెనల నిర్మాణ అవసరం గుర్తించి, వాటి డిజైన్లు సిద్ధం చేసుకోవాలన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం పనుల ప్రారంభంతోపాటు దక్షిణ భాగానికి అనుమతి కోసం త్వరలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రి గడ్కరీని కలవనున్నట్లు వెల్లడించారు. మదీనాగూడ నుంచి సంగారెడ్డి వరకు 6 వరుసల రోడ్డు విస్తరణ పనులు, ఆస్పత్రులు, మెడికల్ కళాశాలలు, కలెక్టరేట్ భవనాల పనుల పురోగతి పై చర్చించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్ కృష్ణప్రసాద్, ఈఎన్‌సీ జయభారతి, చీఫ్ ఇంజనీర్లు రాజేశ్వర్‌రెడ్డి, మోహన్‌నాయక్, ఎస్ఈ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

ఉన్న డబ్బంతా పోయింది

- పరిహారాన్ని ప్రైవేట్ ఫైనాన్స్‌వారు గద్దలా తన్నుకుపోయారు
- డబ్బు వచ్చేమార్గం లేక 105 మందికి పైగా ఆత్మహత్య చేసుకున్నారు
- నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఫైనాన్స్ మాఫియా మాయాజాలం.. మీడియా ముందు గోడు వెల్లబోసుకున్న బాధితులు

సాక్షి,హైదరాబాద్: 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కోసం ఉన్న భూములు, ఇళ్లు ఇచ్చి పరిహారం తీసుకున్నాం. మాకు ప్రభుత్వం డబ్బులివ్వగానే ఫైనాన్స్ సంస్థలు వాలాయి. దాచుకునే సొమ్ముకు అధిక వడ్డీ ఇస్తామని ఆశచూపి గద్దలా తన్నుకుపోయాయి. ఫైనాన్స్‌లో పెట్టుబడిగా పెట్టితే వడ్డీ చెల్లించడమే కాకుండా ఎప్పుడు అడిగితే అప్పుడు తిరిగి చెల్లిస్తామని నమ్మించారు. వారి మాటలు నమ్మి డిపాజిట్ చేస్తే నిండా ముంచారు'అని నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలోని 30 గ్రామాలకుపైగా ఉన్న బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల బాధితులు మీడియాతో బోరుమన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష సమావేశంలో వారు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ బాధితుల అధ్యక్షుడు పర్వతాలు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ఆమ్‌ఆద్మీ పార్టీ సుదర్శన్, సీపీఎం నేత శోభన్‌రాజు, వివిధ సంఘాల నేతలు పసునూరి రవీందర్, వెంకట్‌దాసు, పృథ్వీరాజ్ క్రాంతిదళ్, అర్జున్‌రెడ్డి పాల్గొన్నారు. 'ఈ నెల 20లోగా బాధితులకు న్యాయం జరగాలి. లేదంటే డబ్బులు తీసుకున్న వాళ్ల ఇళ్ల ఎదుట కూర్చుంటాం. నాగర్‌కర్నూలు జిల్లా ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తాం. వడ్డీతో సహా చెల్లించేలా ఫైనాన్స్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి. దోచుకున్నవారిని కఠినంగా శిక్షించాలి'అంటూ తీర్మానాలు చేశారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ ఏరియాల్లోని సుమారు 30 గ్రామాల ప్రజలను ఫైనాన్స్ కంపెనీలు మోసం చేశాయన్నారు. డబ్బుల రాకపోవడంతో 105 మందికి పైగా ఆత్మహత్య ..మరో 30 మంది అనారోగ్యం, బెంగతో చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

చేతిలో చిల్లిగవ్వ లేదు



భూమిని ఇచ్చిన తర్వాత కొన్ని గొర్లను కూడా అమ్మాం. వచ్చిన డబ్బును అందరూ ప్రైవేట్ ఫైనాన్స్‌లో జమ చేస్తున్నారంటే మేము కూడా రూ.8 లక్షల వరకు జమ చేశాం. ఇప్పుడు వారు ఎక్కడ ఉన్నారో కూడా తెలియడం లేదు. ఆడపిల్లలు పెద్దగా అయ్యారు. పెళ్లిళ్లు చేయాలి. చేతిలో చిల్ల గవ్వకూడా లేదు. అమ్ముదామంటే ఇళ్లు, భూమి కూడా లేదు.

– భాగమ్మ, నర్సయ్యపల్లి గ్రామం, నాగర్‌కర్నూల్ జిల్లా

ప్రైవేట్ ఫైనాన్స్‌లో డిపాజిట్ చేశా



ఉన్న భూమిని అమ్మిన.. కష్టపడి బయట చిట్టీ వేసుకున్నా. తెలిసిన వాళ్లే కదా అని నమ్మి నా దగ్గర ఉన్న రూ.7.5 లక్షలు ప్రైవేట్ ఫైనాన్స్‌లో డిపాజిట్ చేసిన. ముందు రెండు మూడు నెలలు బాగానే వడ్డీ ఇచ్చారు. ఆ తర్వాత చేతులు ఎత్తేశారు. ఇప్పుడు ఇళ్లు లేదు. భూమిలేదు.

– శ్రీశైలం, నాగాపూర్ గ్రామం, వనపర్తి జిల్లా

న్యాయం జరిగే వరకు పోరాటం



బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం. వాళ్ల డబ్బులు వాళ్లకు వచ్చే వరకు దేనికీ వెనుకాడం. ప్రభుత్వం దీన్ని సీరియస్‌గా తీసుకోవాలి. బాధితుల పక్షాన నిలబడాలి. అందరికీ న్యాయం జరిగేలా చూడాలి.

– పర్వతాలు, ఫైనాన్స్ బాధితుల అధ్యక్షుడు

గుజరాత్‌లో ఘోరం

కుప్పకూలిన వడోదర-ఆనంద్ వంతెన ● నదిలో పడి 13 మంది సజీవ సమాధి



- పలువురికి గాయాలు
- నదీప్రవాహంలో కొట్టుకుపోయిన పలు వాహనాలు
- ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు చర్యలు

వడోదర: ప్రధాని నరేంద్ర మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఘోర ప్రమాదం జరిగింది. దాదాపు నాలుగు శతాబ్దాల క్రితంనాటి పాత వంతెన కుప్పకూలిన ఘటనలో 13 మంది వాహనదారులు జలసమాధి అయ్యారు. నదీప్రవాహంలో పడి ప్రయాణికులతోసహా ట్రక్కులు, వ్యాన్‌లు, ఆటో, ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. దీంతో ఎన్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టారు. మరణాల సంఖ్య పెరిగే అవకాశముందని అధికా రులు తెలిపారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు వడోదర జిల్లాలోని మహీసాగర్ నదిపై నిర్మించిన గంభీర వంతెన కూలడంతో ఈ ఘోరం జరిగింది. పద్రా పట్టణ సమీపంలో నిర్మించి ఈ వంతెన కూలడంతో వడోదర, ఆనంద్ నగరాల మధ్య సంబంధాలు పూర్తిగా తెగిపో యాయి. నదీ ప్రవాహంలో నిర్మించిన రెండు పిల్లర్ల మధ్యలోని శ్లాబులు పూర్తిగా కుప్పకూలడంతో ప్రమాదతీవ్రత ఎక్కువగా ఉందని వడోదర రూరల్ ఎస్పీ రోహన్ ఆనంద్ చెప్పారు. నదిలో పడగా నే కొందరిని స్థానికులు కాపాడారు. రక్షించిన వారిలో గాయాలపాలైన వారిని ఆస్పత్రులకు తరలించారు. బ్రిడ్జ్ కూలడంతో ఒక ట్యాంకర్ కొనకు వేలాడుతూ ప్రమాదకరంగా మారింది. దీంతో 4 గంటలపాటు శ్రమించి వెనక్కిలాగారు. కానీ అందులోని డ్రైవర్ ఆచూకీ గల్లంతైంది.


నదిలో కొనసాగుతున్న సహాయక చర్యలు

బిడ్డను కాపాడాలంటూ తల్లి రోదన

బ్రిడ్జి కూలినప్పుడు కొన్ని వాహనాలు నది ప్రవాహం మధ్యలో పడి కొట్టుకుపోతే మరికొన్ని ఒడ్డు వైపున పడిపోయాయి. అప్పుడు ఒక ప్రయాణికుడు కారుతోసహా నదినీటిలో చిక్కుకు పోయాడు. అతని తల్లి మాత్రం క్షేమంగా బయటపడింది. నడుం లోతు ఉన్న నీటిలో నిలబడి ఒడ్డు వైపున్న స్థానికులను తల్లి ఏడుస్తూ వేడుకుంటున్న వీడియో చూపరులను కంటతడి పెట్టించింది. ''నా బిడ్డ ఇందులో ఇరుక్కుపోయాడు. నది నీటిలో మునిగిపోయి విలవిల్లాడిపోతున్నాడు. కాపాడండయ్యా'' అంటూ ఆమె దిక్కులు పిక్కటిల్లేలా రోదిస్తున్న వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతోంది. స్థానికుల సమాచారం ప్రకారం ఆ మహిళ తన భర్త, కుమారుడు, కుమార్తె, అల్లుడితో కలిసి కారులో బాగ్దానాకు వెళ్తోంది. కారు నీటిలో పడినప్పుడు వెనకవైపు అద్దం పగలగొట్టి బయటపడింది. కుమారుడు మాత్రం నదిలో మునిగిన వాహనంలో ఇరుక్కుపోయాడు.

దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన ప్రధాని మోదీ

దుర్ఘటన వార్త తెల్సి మోదీ, రాష్ట్ర సీఎం భూపేంద్ర పటేల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధాని సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు తలో రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగా త్రులకు తలో రూ.50వేల సాయం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు తలో రూ.4 లక్షలు ఇస్తామని సీఎం చెప్పారు. ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న వేళ వంతెన కూలడంతో ఇలాంటి పాత వంతెన పటిష్టతపై సమీక్ష జరపాలని రాష్ట్ర అధికారులకు ప్రధాని సూచించారు. 1981లో వంతెన నిర్మాణాన్ని మొదలెట్టి 1985లో వాహన రాకపోకలకు అందుబాటులోకి తెచ్చారు. మరమ్మతులు ఎప్పటికప్పుడు చేయిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. 23 పిల్లర్లతో నదిపై 900 మీటర్ల పొడవునా బ్రిడ్జిని నిర్మించారు. అయితే వడోదర, ఆనంద్ నగరాలను కలిపే ఏకైక వంతెన కావడంతో దీనిపై వాహన రద్దీ ఎక్కువై పాడైందని స్థానికులు చెబుతున్నారు. కొత్త వంతెన కోసం మూడు నెలల క్రితమే రూ.212 కోట్లతో నిధులు మంజూరు అయ్యాయని తెలుస్తోంది. వంతెన పరిస్థితి దారుణంగా ఉందని, రాకపోకలను నిలిపివేయాలని 2017లోనే కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం.

సార్వత్రిక సమ్మె పాక్షికంగా విజయవంతం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మె పాక్షికంగా విజయవంతమైంది. దేశవ్యాప్తంగా కార్మికులు వీధుల్లోకి వచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలు తక్షణమే నిలిపివేయాలని తేల్చిచెప్పారు. సార్వత్రిక సమ్మె వల్ల సాధారణ జనజీవనానికి ఎలాంటి ఆటంకాలు వాటిల్లలేదు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వ్యాపార, వాణిజ్య సంస్థలు యథావిధిగా పనిచేశాయి. అయితే, సమ్మె పూర్తిస్థాయిలో విజయవంతమైందని కార్మిక సంఘాలు ప్రకటించాయి. పోస్టల్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, మైనింగ్ రంగాల్లో ఉద్యోగులు, కార్మికులు విధులకు గైర్హాజరయ్యారు. సమ్మె సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో కొన్నిచోట్ల స్వల్ప హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. తమిళనాడు, పుదుచ్చేరి, అస్సాం, బిహార్, జార్ఖండ్, పంజాబ్, కేరళ, ఒడిశా, కర్ణాటక, గోవా, మేఘాలయా, మణిపూర్ తదితర రాష్ట్రాల్లో సార్వత్రిక సమ్మె ప్రశాంతంగా ముగిసింది. రాజస్తాన్, హరియాణా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో పాక్షికంగా బంద్ పాటించారు.

'ఆధార్' ఎప్పటికీ తొలి గుర్తింపు కాదు

యూఐడీఏఐ సీఈఓ భువనేశ్ కుమార్ వెల్లడి

న్యూఢిల్లీ: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బిహార్‌లో ఓటర్ల జాబితాలపై ప్రత్యేక తనిఖీ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కొనసాగుతోంది. అర్హులైన ఓటర్లను గుర్తించే విషయంలో 'అంగీకరించే గుర్తింపు కార్డుల' జాబితా నుంచి ఆధార్ కార్డును తొలగించడం పట్ల వివాదం మొదలైంది. ఓటర్ల గుర్తింపు పత్రంగా ఆధార్ కార్డును స్వీకరించడం లేదని బిహార్‌లో రాజకీయ పార్టీల నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆధార్‌పై భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) సీఈఓ భువనేశ్ కుమార్ స్పష్టత ఇచ్చారు. ఆధార్ అనేది ఎప్పటికీ మొదటి గుర్తింపు కాదని స్పష్టంచేశారు. నకిలీ ఆధార్ కార్డులను కట్టడి చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. కొత్త కార్డుల్లో క్యూఆర్ కోడ్ పొందుపరుస్తున్నామని తెలిపారు. నకిలీ ఆధార్ కార్డులు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయని, అవన్నీ గుర్తింపు కార్డులుగా పరిగణించలేమని తేల్చిచెప్పారు.

గోల్డెన్ వీసాపై అవన్నీ వదంతులే: యూఏఈ

దుబాయ్: ఇటీవల ప్రకటించిన గోల్డెన్ వీసా పథకం దరఖాస్తుల పరిశీలన బాధ్యతను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించినట్లుగా వస్తున్న వార్తలను యూఏఈ ప్రభుత్వం ఖండించింది. గోల్డెన్ వీసా దరఖాస్తులను యూఏఈలో ఉండే సంబంధిత ప్రభుత్వ అధికారులు మాత్రమే స్వీకరించి, పరిశీలిస్తారని స్పష్టం చేసింది. దేశం లోపల లేదా వెలుపలి కన్సల్టెన్సీ సంస్థలకు గోల్డెన్ వీసా దరఖాస్తులను పరిశీలించే లేదా ప్రభుత్వానికి ఫార్వర్డ్ చేసే అధికారం ఇవ్వలేదని తెలిపింది. ఈ మేరకు ఫెడరల్ అథారిటీ ఫర్ ఐడెంటిటీ, సిటిజన్‌షిప్, కస్టమ్స్ అండ్ పోర్ట్ సెక్యూరిటీ(ఐసీపీ) బుధవారం ఒక ప్రకటన వెలువరించింది.

ఐఎస్ఎస్‌లో మెంతి, పెసర విత్తనాలు నాటిన శుభాంశు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో భారత వ్యోమగామి శుభాంశు శుక్లా కాసేపు రైతుగా మారారు. గురుత్వాకర్షణ శక్తి ఏమాత్రం లేని రోదసిలో విత్తనాలు ఎలా మొలకెత్తుతాయన్న దానిపై ఆయన పరిశోధన ప్రారంభించారు. చిన్నపాటి గాజు నాళికల్లో మెంతి, పెసర విత్తనాలు వేసి, ఐఎస్ఎస్‌లోని స్టోరేజీ ఫ్రీజర్‌లో భద్రపరిచారు. విత్తనాలు మొలకెత్తడం, మొక్కల ప్రాథమిక ఎదుగుదలపై మైక్రోగ్రావిటీ ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్నది గుర్తించడమే ఈ పరిశోధన ఉద్దేశం. విత్తనాలు నాటిన ఫొటోలను శుభాంశు శుక్లా సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ పరిశోధనలో తాను భాగస్వామి కావడం ఆనందంగా ఉందని చెప్పారు. యాక్సియోమ్ స్పేస్ చీఫ్ సైంటిస్టు లూసీ లోతో ఆయన బుధవారం సంభాషించారు. ఈ పరిశోధన విషయంలో శుక్లాకు ధార్వాడలోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ శాస్త్రవేత్త రవికుమార్ హోసమణి, ఐఐటీ సైంటిస్టు సుధీర్ సిద్ధపురెడ్డి సహకరించారు.

కలిసి సాగుదాం..ప్రగతి సాధిద్దాం

నమీబియాకు ప్రధాని మోదీ పిలుపు ● పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగం

విండ్‌హోక్: అంతర్జాతీయ వ్యవహారాల్లో ఆఫ్రికా పాత్రను భారత్ గుర్తిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అధికారం, ఆధిపత్యం ద్వారా కాకుండా, భాగస్వామ్యం, దౌత్యంతో భవిష్యత్తును నిర్ణయించేందుకు భారత్, నమీబియా కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం రిపబ్లిక్ ఆఫ్ నమీబియా పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మోదీ ప్రసంగించారు. ఆఫ్రికా ఖండం కేవలం ముడి సరుకులకు వనరుగా మిగిలిపోవద్దని.. విలువ సృష్టి, సుస్థిరాభివృద్ధిలో నాయకత్వ పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. రక్షణ రంగంలో ఆఫ్రికాతో సహకారాన్ని మరింత పెంపొందించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఇండియా అభివృద్ధి అనుభవాలను నమీబియాతో, ఆఫ్రికాతో పంచుకోవడం గర్వకారణమని చెప్పారు. ''ఆఫ్రికాతో బంధానికి 2018లో 10 సూత్రాలు ప్రతిపాదించా. వాటికి కట్టుబడి ఉన్నాం. గౌరవం, సమానత్వం, పరస్పర ప్రయోజనాల ఆధారంగా ఆ సూత్రాలు రూపొందాయి. మనం ఒకరితో ఒకరు పోటీ పడడం కాదు.. ఒకరికొకరం సహకరించుకోవాలి. కలసికట్టుగా ఎదగడం మన లక్ష్యం కావాలి'' అని స్పష్టంచేశారు.

ఇది క్రికెట్ గ్రౌండ్‌లో వార్మప్

భారత్, నమీబియా మధ్య బలమైన చరిత్రాత్మక, సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. నమీబియాతో స్నేహ సంబంధాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టంచేశారు. ఇండియాలో చీతాల పునరుద్ధరణ ప్రాజెక్టుకు నమీబియా ఎంతగానో సహకరించిందని అన్నారు. నమీబియాలో తదుపరి తరం శాస్త్రవేత్తలు, డాక్టర్లు, నాయకులకు సహకారం అందిస్తామని ప్రకటించారు. రేడియో థెరపీ మిషన్లు సరఫరా చేయబోతున్నామని వివరించారు. ఇండియా-నమీబియా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 800 మిలియన్ డాలర్లకు చేరిందని, ఇది క్రికెట్ గ్రౌండ్‌లో వార్మప్ మాత్రమేనని, ఇకపై మరింత వేగంగా పరుగులు చేయాలని పిలుపునిచ్చారు. నమీబియాకు తొలి అధ్యక్షురాలిగా ఎన్నికైనందుకు నెటుంబో నంది-ఎన్‌డైత్వాను ప్రధాని మోదీ అభినందించారు. భిన్న నేపథ్యం కలిగిన పౌరుల ఎదుగుదలకు నమీబియా రాజ్యాంగం చక్కటి తోడ్పాటు అందిస్తోందని ప్రశంసించారు. భారత రాజ్యాంగం సమానత్వం, స్వేచ్ఛ, న్యాయాన్ని బోధిస్తోందన్నారు. ఒక నిరుపేద గిరిజన మహిళ రాష్ట్రపతి అయ్యారంటే అది భారత రాజ్యాంగం గొప్పతనమేనని వ్యాఖ్యానించారు. సాధారణ కుటుంబంలో జన్మించిన తాను ప్రధాన మంత్రి అయ్యానంటే అందుకు తమ రాజ్యాంగమే కారణమన్నారు.


మోదీకి పురస్కారం ప్రదానం చేస్తున్న నెటుంబో

సంబంధాలు బలోపేతం చేసుకుందాం

ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవాలని, కీలక రంగాల్లో కలిసికట్టుగా పనిచేయాలని, పరస్పరం సహకరించుకోవాలని భారత్, నమీబియా నిర్ణయించుకున్నాయి. ద్వైపాక్షిక పర్యటన నిమిత్తం భారత ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం నమీబియా చేరుకున్నారు. అధికార లాంఛనాలతో ఆయనకు ఘన స్వాగతం లభించింది. తొలుత స్టేట్‌హౌస్‌లో నమీబియా అధ్యక్షురాలు నెటుంబో నంది-ఎన్‌డైత్వాతో మోదీ సమావేశమయ్యారు. డిజిటల్ సాంకేతికత, రక్షణ, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, అరుదైన ఖనిజాలు, విద్య తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలు, అందుబాటులో ఉన్న మార్గాలపై చర్చించారు.

నాలుగు ఒప్పందాలపై సంతకాలు

నాలుగు ముఖ్యమైన ఒప్పందాలపై భారత్, నమీబియా సంతకాలు చేశాయి. ఆరోగ్యం, ఔషధ రంగాల్లో సహకారంతోపాటు నమీబియాలో ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెంటర్, సీడీఆర్‌ఐ ఫ్రేమ్‌వర్క్, గ్లోబల్ బయోఫ్యూయెల్స్ అలయెన్స్ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు కోసం రెండు దేశాల మధ్య ఈ ఒప్పందాలు కుదిరాయి.


తనకు ఆహ్వానం పలికిన కళాకారులతో ప్రధాని మోదీ

మోదీకి నమీబియా అత్యున్నత పురస్కారం

ప్రధాని మోదీని నమీబియా ప్రభుత్వం తమ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ద మోస్ట్ ఏన్షియెంట్ వెల్విచియా మిరాబిలిస్'తో సత్కరించింది. నమీబియా అధ్యక్షురాలు నెటుంబో ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు. భారత్, నమీబియా మధ్య చెదిరిపోని స్నేహానికి ఈ అవార్డు ఒక ప్రతీకగా నిలుస్తోందని మోదీ పేర్కొన్నారు. ఇరుదేశాల ప్రజలకు దీన్ని అంకితం చేస్తున్నానని తెలిపారు. నమీబియా అత్యున్నత పౌర పురస్కారం స్వీకరించిన తొలి భారతీయ నాయకుడిగా మోదీ రికార్డుకెక్కారు.

కూలిన జాగ్వార్

- ఇద్దరు వాయుసేన పైలట్ల దుర్మరణం
- రాజస్థాన్‌లో ఘటన


విమాన శకలాల నుంచి చెలరేగుతున్న మంటలు

జైపూర్/న్యూఢిల్లీ: ఓవైపు రఫేల్ వంటి అత్యాధునిక యుద్ధవిమానాలతో భారత వాయుసేన గగనతల శక్తిని ఎప్పటికప్పుడు పెంచుకుంటుంటే పాత తరం యుద్ధవిమానాలు అనూహ్యంగా విఫలమై కుప్పకూలుతున్నాయి. ఈ దుర్ఘటనల పరంపర బుధవారం రాజస్థాన్‌లో కొనసాగింది. రాష్ట్రంలోని చురు జిల్లాలోని భానోడా గ్రామ శివారులో వాయుసేనకు చెందిన జాగ్వార్ రకం యుద్ధ విమానం కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు పైలెట్లు ప్రాణాలు కోల్పోయారు. ఘటనపై కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీకి ఆదేశిస్తున్నట్లు వాయుసేన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మార్చి నెల నుంచి చూస్తే జాగ్వార్ రకం యుద్ధ విమానాలు కూలడం ఇది మూడోసారి కావడం గమనార్హం. ''పైలట్ల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. ఈ కష్టకాలంలో మీకు తోడుగా నిలుస్తాం'' అని పైలట్ల కుటుంబాలకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఒక సందేశం పంపించింది. ప్రమాదంలో ఎలాంటి పౌర ఆస్తినష్టం జరగలేదని రాజల్‌దేశార్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కమలేశ్ చెప్పారు.

అగ్నిగోళంగా మారి..

బుధవారం మధ్యాహ్నం సూరత్‌గఢ్ పట్టణంలోని సూరత్‌గఢ్ ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్‌నుంచి బయల్దేరిన జాగ్వార్ రకం శిక్షణా విమానం కొద్దిసేపటికే తర్వాత గాల్లో ఉండగానే నియంత్రణ కల్పోయి ఒక్కసారిగా మంటలంటుకుని అగ్నిగోళంగా మారింది. కిందకు పడిపోతూ పేలిందని స్థానికులు చెబుతున్నారు. శకలాల్లో ఒక పైలట్ మృతదేహాన్ని, దూరంగా పొలాల్లో ఇంకొకరు మృతదేహాన్ని గుర్తించారు. శకలాల మంటలు అంటుకుని అక్కడి పొలం కొంత తగలబడింది. దీంతో స్థానికులు వెంటనే మంటలు ఆర్పేశారు. విషయం తెల్సుకున్న వాయుసేన అధికారులు హెలికాప్టర్లలో ఘటనాస్థలికి చేరుకున్నారు. ఏప్రిల్ రెండో తేదీన గుజరాత్ నుంచి బయల్దేరిన జాగ్వార్ శిక్షణా విమానం జామ్‌నగర్ సమీప గ్రామం వద్ద కూలిపోయింది. ఈ ఘటనలో ఒక పైలట్ ప్రాణాలు కోల్పోయారు. మరొకరు గాయాలతో బయటపడ్డారు. మార్చి ఏడో తేదీన హరియాణాలోని అంబాలా వైమానిక స్థావరం నుంచి బయల్దేరిన జాగ్వార్ యుద్ధవిమానం సాంకేతిక సమస్యల కారణంగా కూలిపోయింది.

ఒక్క ఇంక్యుబేటర్.. ఐదుగురు శిశువులు!

గాజా ఆస్పత్రుల్లో హృదయ విదారక దృశ్యాలు

- ఇంధన కొరతతో మూతబడే పరిస్థితి
- ఇజ్రాయెల్ ఆర్మీ దిగ్బంధనం ఫలితం

గాజా: దాదాపు రెండు నెలలుగా ఇజ్రాయెల్ ఆర్మీ దిగ్బంధంలో ఉన్న గాజాలో హృదయ విదారక పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆహారం, మందులు, అత్యవసర సరఫరాలతోపాటు నీరు, ఇంధన సరఫరాలను సైతం ఇజ్రాయెల్ ఆర్మీ అడ్డుకుంటోంది. హమాస్ తమపై దాడులకు ఇంధనాన్ని వాడుకుంటుందని ఆరోపిస్తున్న ఇజ్రాయెల్.. పెట్రోల్, డీజిల్, కిరోసిన్ సరఫరాలను అడ్డుకుంటోంది. ఈ చర్యతో జనం ఆకలి చావులకు గురవుతున్నారు. చిన్నారులకు సరైన వైద్యం అందడం లేదు. గాజా ప్రాంతంలోని ఆస్పత్రులను ఇప్పుడు ఇంధన కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇజ్రాయెల్ దాడులతో విద్యుత్ సరఫరా వ్యవస్థ ఛిన్నాభిన్నం కావడంతో ఆస్పత్రులు డీజిల్‌తో నడిచే జనరేటర్లపైనే ఆధారపడి నడుస్తున్నాయి. ఇంధనం నిల్వలు అడుగంటుతుండటంతో ఆస్పత్రుల్లోని ఒక్కో ఇంక్యుబేటర్‌లో నలుగురైదుగురు చిన్నారులను ఉంచాల్సి వస్తోందని నిర్వాహకులు ఆవేదన చెందుతున్నారు. గాజా ఆస్పత్రుల్లో ఇంధన కొరత తీవ్ర స్థాయికి చేరుకుందని ఐరాస సైతం ఆందోళన వ్యక్తం చేసింది. 'అదనంగా ఎటువంటి నిల్వలు లేకపోవడంతో ఆస్పత్రులు ఇంధనం వాడకంపై పరిమితులు పెట్టుకున్నాయి. ఇంధనం లేక ఇప్పటికే అంబులెన్సులు సైతం నిలిచిపోయాయి. నీటి సరఫరా వ్యవస్థలు పతన దశలో ఉన్నాయి. ఇజ్రాయెల్ ప్రభుత్వం వెంటనే ఇంధన సరఫరాను పునరుద్ధరించకుంటే మరణాలు పెరగడం అనివార్యంగా కనిపిస్తోంది'అని ఐరాస పేర్కొంది. ఇప్పటికి 11 వారాలుగా మానవతా సాయం అందకుండా ఇజ్రాయెల్ సాగిస్తున్న దిగ్బంధంతో 20 లక్షలమందికి పైగా పాలస్తీ నియన్లు ఆకలి చావులకు చేరువలో ఉన్నారని తెలిపింది. మేలో పరిమితంగా ఆహార సరఫరా లను పునరుద్ధరించినా అవసరా లకు ఏమాత్రం సరిపోవని తెలిపింది.

ఇలాంటి చోట ఏ చిన్నారీ పుట్టకూడదు

ఒకే ఇంక్యుబేటర్‌పై నలుగురైదుగురు నవజాత శిశువులను ఉంచిన ఫొటోను గాజా సిటీలోని అల్-అహ్లి ఆస్పత్రి డైరెక్టర్ బుధవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఇంక్యుబేటర్ సైతం అల్-హెలా ఆస్పత్రి నుంచి తీసుకొచ్చిందేనని డైరెక్టర్ ఫదెల్ నయీం 'ఎక్స్'లో తెలిపారు. గాజా దిగ్బంధం కారణంగా ఇక్కడి ఆరోగ్య వ్యవస్థలు పూర్తిగా కుప్పకూలాయన్నారు. 'నెలలు నిండకుండానే పుట్టిన శిశువులకు ఇది జీవన్మరణ విషయంగా మారింది. తాము చావాలో బతకాలో నిర్ణయించే బాంబు దాడులు, దిగ్బంధాలు నడిచే చోట ఏ ఒక్క చిన్నారీ పుట్టరాదు'అంటూ ఆయన ఆవేదన చెందారు. ఇంధన కొరత కారణంగానే తాము కిడ్నీ డయాలసిస్ విభాగాన్ని మూసేశామని ఉత్తర గాజాలోని అల్-షిఫా ఆస్పత్రి డైరెక్టర్ మహ్మద్ అబూ సిల్మియా చెప్పారు. ప్రస్తుతం ఇంటెన్సివ్ కేర్, ఆపరేషన్ థియేటర్లను మాత్రం నడిపిస్తున్నామన్నారు. ఆస్పత్రిలోని జనరేటర్లు మరో మూడు గంటలపాటు మాత్రమే నడుస్తాయని, ఆ తర్వాత ఇంక్యుబేటర్లలోని 22 మంది శిశువులతోపాటు వందలాది మంది రోగులకు మరణమే శరణమన్నారు. రోగులకు వైద్య పరీక్షలు చేసేందుకు ఈ ఆస్పత్రిలోని వైద్యులు టార్చిలైట్లను వాడుతున్నారు.



'స్టార్‌లింక్' ఇంటర్నెట్ సేవలకు పచ్చజెండా

అనుమతులు మంజూరు చేసిన 'ఇన్-స్పేస్'

న్యూఢిల్లీ: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సారథ్యంలోని 'స్టార్‌లింక్' ఇంటర్నెట్ సేవల సంస్థకు భారత్‌లో ద్వారాలు తెరచుకున్నాయి. ఇంటర్నెట్ సేవలు అందించేందుకుగాను సంస్థకు కీలక అనుమతులు వచ్చాయి. భారత్‌లో వాణిజ్యపరంగా ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలు మొదలుపెట్టేందుకు అవసరమైన అనుమతులను భారత అంతరిక్ష సేవల నియంత్రణ సంస్థ అయిన 'ఇండియన నేషనల్ స్పేస్ అథరైజేషన్ అండ్ ప్రమోషన్ సెంటర్(ఇన్-స్పేస్)' మంజూరు చేసింది. 2022 నుంచి వాణిజ్య లైసెన్స్ పొందేందుకు ఎదురుచూస్తున్న ఈ సంస్థకు ఎట్టకేలకు ఆమోదం లభించింది. టెలికాం విభాగం నుంచి గత నెలలో స్టార్‌లింక్ అనుమతులు పొందిన విషయం తెల్సిందే. తాజాగా అంతరిక్ష సేవల నియంత్రణ సంస్థ నుంచి కూడా అనుమతులు రావడంతో స్టార్ లింక్‌కు మార్గం సుగమమైంది.

అమెరికా వీసా మరింత భారం

విద్యార్థి, పర్యాటక, హెచ్-1బీ వీసా అభ్యర్థుల నుంచి 250 డాలర్ల సెక్యూరిటీ ఫీజు వసూలు

వాషింగ్టన్: వచ్చే ఏడాది నుంచి అమెరికా వీసా పొందాలని భావించే భారతీయులకు మరింత ఆర్థికభారం నెత్తిన పడనుంది. 250 డాలర్లు అంటూ దాదాపు రూ.21,000లను సెక్యూరిటీ డిపాజిట్ రూపంలో అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థి(ఎఫ్/ఎం) వీసాలతోపాటు పర్యాటక(బీ-1), ఉద్యోగ(హెచ్-1బీ), బిజినెస్(బీ-2), ఎక్స్ఛేంజ్(జే) వీసాల కోసం దరఖాస్తుచేసుకునే విదేశీయులు తప్పనిసరిగా ఈ సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సిందేనని ట్రంప్ సర్కార్ ప్రకటించింది. ట్రంప్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ' ది వన్ బిగ్ బ్యూటిఫుల్' చట్టం నిబంధనల్లో ఈ మేరకు మార్పులు చేశారు. ఈ ఫీజును వీసా మంజూరు చేసేటప్పుడు హోం ల్యాండ్ సెక్యూరిటీ విభాగం వసూలుచేస్తుంది. వీసా పొందాక ఆయా వీసాదారులు సంబంధిత కఠిన నిబంధనావళిని ఖచ్చితంగా పాటించినట్లు ప్రభుత్వం భావిస్తే ఈ ఫీజును తిరిగి ఇచ్చేస్తారు. 2026 ఏడాదికి మాత్రమే ఫీజును 250గా నిర్ణయించారు. ఆ తర్వాతి ఏడాది ద్రవ్యోల్బణం, వినియోగదారుల ధరల సూచీ(సీపీఐ)లకు అనుగుణంగా ఫీజును పెంచుతారు. అన్ని కేటగిరీ వీసా దరఖాస్తుదారుల నుంచి వసూలు చేస్తున్నందున దీనిని 'వీసా ఇంటిగ్రిటీ ఫీజు'గా పేర్కొంటున్నారు. ఏ, జీ రకం దౌత్య వీసా కేటగిరీలకు మాత్రం ఈ అదనపు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సిన పనిలేదు.

ఇతర ఫీజులూ వడ్డింపు

ఐ-94 దరఖాస్తుకు 24 డాలర్లు, 90 రోజుల్లోపు అమెరికాలో ఉండే పర్యాటకులు, వ్యాపారులకు ఇచ్చే ఎలక్ట్రానిక్ సిస్టమ్ ఫర్ ట్రావెల్ ఆథరైజేషన్(ఈఎస్‌టీఏ)కు 13 డాలర్లు వసూలుచేయనున్నారు. ఇక చైనీయులకు ఇచ్చే పర్యాటక, బిజినెస్ వీసాలపై మరో 30 డాలర్ల ఫీజు వసూలుచేస్తారు. శరణార్థులుగా వచ్చే వాళ్లు దరఖాస్తుతోపాటు 1,000 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. శరణార్థులుగా వచ్చి అమెరికాలో తాత్కాలిక చిన్న ఉద్యోగాలు చేసుకోవాలనుకునే వాళ్లు అదనంగా 500 డాలర్లు చెల్లించాలి. చట్టప్రకారం శాశ్వత స్థిర నివాస హోదా దరఖాస్తుతోపాటు మరో 1,500 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. తమ వీసా పొందాలనుకునే విదేశీ పౌరులు అమెరికా ఇమిగ్రేషన్ చట్టనిబంధనలను పాటించాల్సిందేనని వన్ బిగ్ బ్యూటిఫుల్ చట్టంలో ట్రంప్ ప్రభుత్వం స్పష్టంచేసింది. ప్రస్తుతమున్న అమెరికా వీసా ఫీజుల విధానం ప్రకారం ఒక భారతీయుడు పర్యాటక(బీ-1) లేదా బిజినెస్(బీ-2) వీసా పొందాలంటే ఖచ్చితంగా 185 డాలర్లు చెల్లించాల్సి వచ్చేది. ఇకపై కొత్త నిబంధనల ప్రకారం ఈ 185 డాలర్లతోపాటు సెక్యూరిటీ ఫీజు(250 డాలర్లు), ఐ-94ఫీజు(24 డాలర్లు), ఈఎస్‌టీఏ ఫీజు(13 డాలర్లు) కలిపి మొత్తంగా 472 డాలర్లు(దాదాపు రూ.41వేలు) చెల్లించాల్సి ఉంటుంది. అంటే వాస్తవ ఫీజు కంటే ఇది రెండున్నర రెట్లు ఎక్కువ అని అమెరికాలోని ప్రైవేట్ ఇమిగ్రేషన్ సేవల సంస్థ ఫ్రాగోమెన్ పేర్కొంది. అఫ్గానిస్తాన్, సిరియా వంటి పేద దేశాల నుంచి వలసలను అడ్డుకునే దురుద్దేశంతో ట్రంప్ ప్రభుత్వం ఇలా శరణార్థులు సైతం ఏకంగా 1,000 డాలర్ల సెక్యూరిటీ డిపాజిట్ ఫీజును చెల్లించాలనే కఠిన నిబంధనను చేర్చిందని అమెరికాలోని వలసదారుల హక్కుల సంస్థ 'నేషనల్ ఇమిగ్రేషన్ ఫోరమ్' ఆగ్రహం వ్యక్తంచేసింది. అక్రమ వలసదారులను తగ్గిస్తున్నామంటూ ఆ వంకతో ప్రభుత్వం అన్ని రకాల కేటగిరీ వీసా దరఖాస్తుదారుల నుంచి అదనపు ఫీజులు వసూలుచేస్తోందని నేషనల్ ఇమిగ్రేషన్ ఫోరమ్ ఆరోపించింది.

నాకూ నోబెల్ దక్కాల్సిందే

అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ హోదాలో వీకే సక్సేనా తరచూ తమ పరిపాలనకు అడ్డు తగులుతున్నాసరే విజయవంతంగా ప్రభుత్వపాలన కొనసాగించినందుకుగాను తాను కూడా నోబెల్ బహుమతికి అర్హుడినేనని ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. బుధవారం పంజాబ్‌లోని మొహాలీలో ఒక కార్యక్రమంలో కేజ్రీవాల్ మాట్లాడారు. 'అధికారంలో ఉన్నప్పుడు ప్రతి ప్రభుత్వ పనికి లెఫ్టినెంట్ గవర్నర్ మోకాలడ్డు పెట్టేవారు. ఎన్నో అడ్డంకులు ఎదురైనా నేను ప్రజారంజకంగా పరిపాలించా. అందుకు నాకు నోబెల్ బహుమతి దక్కాల్సిందే' అని అన్నారు.

సీబీఐ అదుపులో మోనికా

సాక్షి, న్యూఢిల్లీ: దాదాపు 26 ఏళ్లుగా అమెరికాలో దాక్కున్న ఆర్థిక నేరస్థురాలు మోనికా కపూర్‌ను ఎట్టకేలకు సీబీఐ అధికారులు అమెరికాలో అదుపులోకి తీసుకున్నారు. 1999లోనే భారత ప్రభుత్వానికి రూ. 5కోట్ల నష్టంచేకూర్చి అమెరికాకు వెళ్లిపోయిన మోనికాను అమెరికా అధికారులు తాజాగా సీబీఐకి అప్పగించారు. అమెరికా కోర్టు అనుమతులతో ఇప్పుడు భారత్‌కు మోనికాను తీసుకొస్తున్నారు. వీళ్ల విమానంలో బుధవారం అర్ధరాత్రి కల్లా భారత్‌కు చేరుకోనుంది.

సాక్షి హైదరాబాద్

గురువారం । 10 । జూలై । 2025



డెంగీ డేంజర్ బెల్స్

మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 150 డెంగీ, 104 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి.

-10లో



డిటాక్స్.. రిలాక్స్..

నగరంలో డిజిటల్ డిటాక్స్ పట్ల ఆసక్తి పెరుగుతోంది. స్వల్ప కాలమైనా టెక్నాలజీకి దూరమవ్వాలనే ఆలోచన కలుగుతోంది.

- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.





4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ ధర్నా చౌక్ వరకు సాగింది.

హెచ్‌టీ కనెక్షన్ ఇక ఈజీ

సింగిల్ విండో విధానంతో..

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌టీ వినియోగదారులకు శుభవార్త. కొత్త విద్యుత్ కనెక్షన్ల కోసం ఏఈ, ఏడీఈ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే ఎస్టిమేషన్లు సిద్ధం కాబోతున్నాయి. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తు సింగిల్ విండో సిస్టం ద్వారా నేరుగా కమర్షియల్ సీజీఎంకు చేరుతుంది. అటు నుంచి దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కొత్తగా అందుబాటులోకి తెచ్చిన 'సాసా (సెక్షన్ ఆటోమైజేషన్ సిస్టం) యాప్' సాంకేతిక పరిజ్ఞానంతో సమీపంలోని లైన్లు, సామర్థ్యాన్ని గుర్తించి ఆటోమేటిక్‌గా వర్క్ ఎస్టిమేషన్ తయారు చేయనుంది. ఆ తర్వాత ఎస్టిమేషన్ ఫైల్ నేరుగా వినియోగదారుడి ఈ మెయిల్‌కు చేరుతుంది. సింగిల్ విండో విధానం అమలుతో వినియోగదారులు ఇంజినీర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. దరఖాస్తు, కనెక్షన్ల జారీలో మధ్యవర్తుల ప్రమేయం, అనవసర ఖర్చులు ఉండవు. నిర్దేశిత సమయంలోగా వినియోగదారుకు కనెక్షన్ జారీ చేసే అవకాశం ఉంది. అంతేకాదు.. ఇప్పటికే ఉన్న హెచ్‌టీ కనెక్షన్లకు నెలవారీ విద్యుత్ వినియోగం, బిల్లుల జారీ కోసం ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ విధానాన్ని అమల్లోకి వచ్చింది. గతంలో ఏఈ, ఏడీఈలు స్వయంగా ఆయా సంస్థలకు చేరుకుని రీడింగ్ నమోదు చేసే వారు. ఒక్కోసారి రీడింగ్‌లో జాప్యం చోటు చేసుకునేది. దీంతో రీడింగ్‌లో భారీ వ్యత్యాసం నమోదు అయ్యేది. ఫలితంగా నెలవారీ బిల్లు కూడా భారీగా వచ్చేది. ప్రస్తుతం అందుబాటులోకి తెచ్చిన ఏఎంఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్దేశిత సమయంలోనే మీటర్ రీడింగ్ నమోదు, బిల్లుల జారీ వంటి వివరాలు నేరుగా వినియోగదారు ఫోన్/మెయిల్‌కు చేరవేస్తుంది. పారదర్శకతతో పాటు కచ్చితమైన బిల్లింగ్ అవకాశముంటుంది. మానవ తప్పిదాలకు ఆస్కారం ఉండదు. ప్రస్తుతం గ్రేటర్ జిల్లాల్లో 12 వేలకుపైగా హెచ్‌టీ కనెక్షన్లు ఉన్నాయి. ఏటా 10 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగమవుతోంది. వీటి ద్వారా ప్రతి నెలా రూ.1200 కోట్ల వరకు బిల్లుల రూపంలో డిస్కం ఖాతాలో జమ అవుతోంది.



కల్తీ కల్లు కల్లోలం!

అమాయకుల ప్రాణాలను హరించిన కల్లు కాంపౌండ్లు

- కూకట్‌పల్లి ఘటనలో ఆరుకు చేరిన మృతుల సంఖ్య
- వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న మరో 32 మంది
- క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ఫాజోలమ్‌తో కల్లు తయారీ
- మోతాదుకు మించిన రసాయనాలతో ప్రాణాలకే ప్రమాదం
- గ్రేటర్‌లోని కల్లు కాంపౌండ్లలో కొరవడిన తనిఖీలు
- మామూళ్ల మత్తులో జోగుతున్న ఎక్సైజ్ అధికారులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాజధాని నగరంలో కల్తీ కల్లు కల్లోలం రేపింది. ఆరుగురి అమాయకుల ప్రాణాలను బలిగొంది. మోతాదుకు మించిన రసాయనాలు కలిపి తయారు చేసిన కల్లు తాగి నిరుపేదలు తమ ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. మంగళవారం నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీలో ఉన్న కల్లు కాంపౌండ్లలో హైదర్‌నగర్, సాయిచరణ్ కాలనీలకు చెందిన పలువురు కల్తీ కల్లు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని వివిధ ఆస్పత్రులకు చికిత్స నిమిత్తం తరలించగా.. బుధవారం వరకు ఆరుగురు మృతి చెందారు. మరో 32 మంది నగరంలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది.

తనిఖీలు నామమాత్రం..

నగరం సహా శివారులోని పలు కాంపౌండ్లలో కల్లు అమ్మకాలపై తనిఖీలు చేయాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. దీంతో కల్తీ కల్లు విక్రయాలకు అడ్డే లేకుండా పోయింది. ఆమ్యామ్యాలకు అలవాటు పడిన అధికారులు కల్లు కాంపౌండ్‌లపై నిఘా ఉంచకపోవడంతోనే వాటి యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలున్నాయి. మోతాదుకు మించి రసాయనాలు కలిపి కల్తీ కల్లును తయారు చేసి ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. కల్లు మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన ఎక్సైజ్‌శాఖ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం వల్లే కూకట్‌పల్లి విషాదాంతం జరిగినట్లు తెలుస్తోంది.

ఇష్టారాజ్యంగా కల్లు కాంపౌండ్లు..

ప్రకృతి సిద్ధమైన తాటి, ఈత చెట్ల నుంచి తీసిన కల్లు ఆరోగ్యకరమైంది. స్వచ్ఛమైన ఈ కల్లును తాగితే కిడ్నీ సంబంధిత సమస్యలు కూడా తొలగుతాయి. సాధారణంగా చెట్ల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట్ల కల్తీ కల్లు ఉండదని చెప్పవచ్చు. డిమాండ్ మేరకు కల్లు ఉత్పత్తి లేకపోవడం, అప్పటి వరకు ఈ వృత్తిపై ఆధారపడిన గీత కార్మికులు కూడా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడం ఫలితంగా కల్లుకు కొరత ఏర్పడింది. మద్యం ధరలు భారీగా ఉండటంతో రోజువారీ కూలీలు కృత్రిమంగా లభించే కల్లుతో సేదతీరుతున్నారు. వీరి బలహీనతను కొంత మంది కల్లు వ్యాపారులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు.

– తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ఫాజోలమ్ వంటి ప్రమాదకర రసాయపాలను వినియోగించి కల్లు తయారు చేస్తున్నారు. తయారీలో మోతాదుకు మించి రసాయనాలను వినియోగిస్తుండటంతో.. ఈ కల్లు తాగినవారు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరుతున్నారు. గ్రేటర్‌తో సహా శివారుల్లోని పలు ప్రాంతాలు, బస్తీలు, పురపాలక సంఘాల్లో కల్తీ కల్లు విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కల్లు కాంపౌండ్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, నమూనాలు సేకరించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో కల్తీ జరుగుతోందనే ఆరోపణలుతున్నాయి.

ఒకే లైసెన్స్‌తో.. ఎన్నో కాంపౌండ్లు..

నగరంతో సహా పలు చోట్ల ఒకే కల్లు దుకాణం లైసెన్సు పొంది ఎక్కువ దుకాణాలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం ఒక లైసెన్స్ ఒకటే దుకాణం నడిపించాల్సి ఉంటుంది. అయినా వ్యాపారులు మాత్రం ఈ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. వీరిపై ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యంగానే మారుతోంది.

నాడీ వ్యవస్థపై ప్రభావం..

డైజోఫాం ఇతర రసాయనాలతో తయారు చేసిన కృత్రిమ కల్లు తాగిన వారిలో నాడీ వ్యవస్థ దెబ్బతింటుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఒంటి నొప్పులతో పాటు కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంటుందని, మానసిక విచక్షణ కోల్పోయి పిచ్చిగా ప్రవర్తిస్తుంటారని చెబుతున్నారు. ఈ సమయంలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ క్షతగాత్రులకు సర్జరీల సమయంలో నొప్పి నివారణ కోసం ఇచ్చే మత్తు ఇంజక్షన్లు కూడా పని చేయవని, మోతాదుకు మించిన డోసు ఇంజక్షన్లు ఇవ్వాల్సి వస్తుందంటున్నారు. సాధ్యమైనంత వరకు ఈ కల్లు తాగకపోవడమే ఉత్తమమని సూచిస్తున్నారు.



టిఫిన్స్ @ రూ.11.43 కోట్లు

ఇందిరమ్మ క్యాంటీన్లలో అమలు..

- కంటైనర్ల కొనుగోళ్లు, 11 క్యాంటీన్ల ఆధునికీకరణ
- నేడు స్టాండింగ్ కమిటీ ముందుకు ప్రతిపాదనలు

సాక్షి, సిటీబ్యూరో: ఇందిరమ్మ క్యాంటీన్లలో టిఫిన్ అమలుకు అవసరమైన ఏర్పాట్ల కోసం జీహెచ్‌ఎంసీకి దాదాపు రూ.11.43 కోట్లు ఖర్చు కానుంది. గతంలో అన్నపూర్ణ కేంద్రాలుగా ఉన్న రూ.5కే భోజన సదుపాయాల కేంద్రాల పేర్లను ఇందిరమ్మ క్యాంటీన్లుగా మార్చడంతో పాటు మధ్యాహ్నం భోజనంతో పాటు ఉదయం పూట టిఫిన్‌ను కూడా రూ.5కే అందించేందుకు ఇటీవల స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో టిఫిన్ సదుపాయం కల్పించేందుకు క్యాంటీన్లకు అవసరమైన కంటైనర్ల కొనుగోళ్లకు, 11 క్యాంటీన్లకు బ్రాండింగ్ చేసేందుకు దాదాపు రూ.11,43,05,000 ఖర్చు కానుంది. ఈ మొత్తాన్ని ఒకే పర్యాయం కాకుండా మూడు విడతలుగా చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతిపాదనల్ని గురువారం జరగనున్న స్టాండింగ్ కమిటీ ముందుంచుతున్నారు. ఆమోదానంతరం అమలు చర్యలు చేపట్టనున్నారు.

ప్రతిపాదనలు ఇలా..

- ఒక్కో కంటైనర్‌కు (10X40 అడుగులు) రూ. 10లక్షల వంతున 60 కంటైనర్లకు రూ. 6 కోట్లు.
- ఒక్కో కంటైనర్‌కు (10X20 అడుగులు) రూ.6.70 లక్షల చొప్పున 79 కంటైనర్లకు రూ.5,29,30,000
- ప్రస్తుతమున్న క్యాంటీన్లలో 11 క్యాంటీన్లను బ్రాండింగ్‌తో ఆధునికీకరించేందుకు ఒక్కోదానికి రూ.1.25 లక్షల వంతున రూ.13.75 లక్షలు
- మొత్తం రూ. 11,43,05,000.

124 కేంద్రాలు..

హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా జీహెచ్‌ఎంసీ రూ. 5కే భోజనం అందజేస్తోంది. టిఫిన్ కూడా రూ.5కే అందించనుంది. ఒక్కో టిఫిన్‌కు రూ.19 ఖర్చు కానుండగా, మిగతా రూ.14 ప్రభుత్వం భరించనుంది. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలో 124 కేంద్రాల ద్వారా రోజూ దాదాపు 30వేల మందికి ప్రయోజనం చేకూరుతోంది.

ఆ స్థలాన్ని వదులుకునేది లేదు

ఉప్పల్ క్రికెట్ స్టేడియం గేట్ల వద్ద ప్రైవేట్ సంస్థ ప్రహరీ నిర్మాణం

- స్టేడియం గేట్లకు గోడలు అడ్డుగా ఉన్నాయని తొలగింపు
- ఘటనా స్థలానికి చేరుకున్న వీహెచ్, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్
- సదరు భూమిని కాపాడుకుంటామన్న కాంగ్రెస్, బీజేపీ నేతలు
- నాటకీయ పరిణామాల మధ్య ప్రహరీ కూల్చివేతలు



ఘటనా స్థలంలో వీహెచ్ తదితరులు

ఉప్పల్: నగరలోని ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద బుధవారం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. క్రికెట్ స్టేడియం వద్ద ఓ ప్రైవేట్ సంస్థ ప్రహరీ నిర్మించి గేట్లు మూసివేశారన్న సమాచారంతో మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత వి.హన్మంతరావు ఉప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మేకల శివారెడ్డితో కలిసి స్టేడియం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఉప్పల్ ఐలా అధికారులకు సమాచారం ఇచ్చారు. నిర్మించిన ప్రహరీని వెంటనే తొలగించాలని చెప్పడంతో ఐలా మున్సిపల్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. గేట్లకు అడ్డుగా ఉన్న ప్రహరీని తొలగించారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. ఉప్పల్‌లో క్రికెట్ స్టేడియం ఏర్పాటుతోనే ఈ ప్రాంతానికి గుర్తింపు వచ్చిందని, స్థలాన్ని పోనివ్వమన్నారు. ప్రహరీని పూర్తిగా తొలగించే వరకు ఆయన అక్కడే బైఠాయించారు. స్వయంగా జేసీబీని తెప్పించి ప్రహరీని పూర్తిగా తొలగించే ప్రయత్నం చేయించడంతో పోలీసులు అడ్డుకున్నారు. తర్వాత ఐలా ఆధ్వర్యంలో పూర్తిగా తొలగించడంతో వీహెచ్ అక్కడినుంచి అనుచరులతో కలిసి వెళ్లిపోయారు. కాగా.. మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సదరు స్థలం ఐలా అధీనంలోనే ఉందని, ఎలాంటి సంస్థకు అప్పగించలేదన్నారు.

అందుకే కూల్చివేశాం..

ఉప్పల్ ఐలా కమిషనర్ ప్రభాకర్ రెడ్డి స్పందిస్తూ.. సదరు స్థలం కోర్టు వివాదంలో ఉందన్నారు. ప్రస్తుతం అది ఐలా అధీనంలోనే ఉందని తెలిపారు. ప్రహరీ, స్టేడియం గేట్ల ముందు నిర్మించిన వాటికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతోనే కూల్చివేస్తున్నామన్నారు.

ఎందుకీ స్థల వివాదం?

ఉప్పల్ ప్రధాన రహదారిపై కొంత పారిశ్రామికవాడ స్థలం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఇతరులతో పాటు పెంగ్విన్ టెక్స్‌టైల్స్‌కు కలిపి 46 ఎకరాల స్థలాన్ని కేటాయించిది. అందులో కొన్నాళ్లు పరిశ్రమ నడిపించిన సంస్థ లాకౌట్ చేసి వెళ్లిపోయింది. పరిశ్రమ నెలకొల్పే సమయంలో బ్యాంక్ నుంచి రుణాలు పొందింది. లాకౌట్ కారణంగా రుణం ఇచ్చిన బ్యాంకు సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. ఇందులో నుంచి 16 ఎకరాల స్థలాన్ని అప్పటి ప్రభుత్వ చొరవతో ఏపీఐసీ ఉప్పల్ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కేటాయించింది. స్టేడియం నిర్మాణ సమయంలోనే అదనంగా 7 ఎకరాల 20 గుంటల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టింది. కాగా.. అది కూడా వివాదం కావడంతో పెద్దల సమక్షంలో నిర్ణయం తీసుకుని రెగ్యులరైజ్ చేయించినట్లు సమాచారం. మిగిలిన 22.5 ఎకరాల స్థలాన్ని ఓ ప్రైవేట్ సంస్థ వేలం ద్వారా దక్కించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సమాచారం.

తెలంగాణ రవాణా శాఖ దేశానికే ఆదర్శం



ఉత్తమ ప్రతిభ కనబర్చిన నేహాకు బహుమతి అందజేస్తున్న మంత్రి పొన్నం

ఆర్టీసీలో సంస్కరణలు తీసుకొచ్చాం

- మంత్రి పొన్నం ప్రభాకర్

బండ్లగూడ: రవాణా శాఖలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజ బహదూర్ వెంకట్రామిరెడ్డి పోలీస్ అకాడమీలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లుగా 96 మంది 4 నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రవాణా శాఖ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సిబ్బంది పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఆర్టీసీలో ఇటీవల సీఎన్జీ బస్సులను తీసుకొచ్చామని, ఎలక్ట్రికల్ బస్సులను కూడా ప్రవేశపెడతామని తెలిపారు. ప్రమాదాల నివారణకు ఏఎంవీఐలు కృషి చేయాలని మంత్రి సూచించారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన నేహా, మహమ్మద్ రఫీ, నబితలకు అవార్డులను బహూకరించారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్. రవాణా, ఆర్‌అండ్‌బీ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, కమిషనర్ సురేంద్ర మోహన్, జాయింట్ డైరెక్టర్ మురళీధర్, డీటీఓ కోర్స్ కోఆర్డినేటర్ రఘునందన్ గౌడ్, డీఎస్పీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాల కట్టడికి అడుగులు!

- అనుమతి లేని భవనాల క్రమబద్ధీకరణ బాధ్యత జడ్‌సీలకు
- అధికారాల వికేంద్రీకరణ చర్యల్లో జీహెచ్‌ఎంసీ

'ఇన్‌స్టంట్' అనుమతుల రద్దు అధికారం డీసీలకు

సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణ అనుమతుల సరళీకరణలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా లభిస్తున్న ఇన్‌స్టంట్ అనుమతులు దుర్వినియోగమవుతుండటం, అనుమతి లేని నిర్మాణాలు పెరిగిపోతుండటం, తదితర పరిణామాల నేపథ్యంలో అక్రమాల కట్టడి చర్యలకు జీహెచ్‌ఎంసీ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా నిబంధనలు పాటించని ఇన్‌స్టంట్ అనుమతుల రద్దు అధికారం స్థానిక డిప్యూటీ కమిషనర్లకే అప్పగించేందుకు సిద్ధమైంది. దాంతోపాటు ఎలాంటి అనుమతుల్లేకుండా నిర్మించే భవనాలు.. అన్ని నిబంధనలకు లోబడి ఉంటే అనుమతి ఇచ్చే అధికారం జోనల్ కమిషనర్లకు కల్పించనుంది. ఈ మేరకు స్టాండింగ్ కమిటీకి ప్రతిపాదనలు పంపింది. గురువారం జరగనున్న కమిటీ సమావేశంలో ఆమోదానంతరం అమలు చర్యలు చేపట్టనుంది.



డీసీలకు అనుమతుల రద్దు అధికారం

ప్రతిపాదనల మేరకు, సర్కిళ్లలోని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లకు 'ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్', 'ఇన్‌స్టంట్ అప్రూవల్' కేటగిరీల కింద పొందిన భవన అనుమతులను రద్దు చేసే అధికారం ఉంటుంది. ఇన్‌స్టంట్ అనుమతుల తర్వాత ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తారు.అన్నీ సవ్యంగా ఉంటే వర్క్ కమెన్స్‌మెంట్ లెటర్ జారీ చేస్తారు. నిబంధనల ఉల్లంఘనలుంటే అనుమతి రద్దు చేస్తారు. ప్రస్తుతం ఈ రద్దు ప్రతిపాదనలు కూడా కమిషనర్‌కే చేరుతున్నాయి.

జోనల్ కమిషనర్లకు అదనపు అధికారాలు

అనుమతి లేకుండా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణ కోసం సర్కిల్ కార్యాలయాల్లో స్వీకరించే దరఖాస్తులను పరిశీలించే అధికారం జోనల్ కమిషనర్లకు లభిస్తుంది. జీహెచ్‌ఎంసీ చట్టంలోని సెక్షన్ 455–ఏ మేరకు నిబంధనలకు అనుగుణంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి సక్రమంగా ఉంటే రెగ్యులరైజ్ చేస్తారు. ఈ అధికారం ప్రస్తుతం కమిషనర్‌కే ఉంది. వర్క్ కమెన్స్‌మెంట్ లెటర్ జారీ అయిన తర్వాత కూడా డిప్యూటీ కమిషనర్లు జారీ చేసిన 'ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్' 'ఇన్‌స్టంట్ అప్రూవల్' అనుమతుల్లో సరైన పత్రాలు లేకున్నా, లోపాలున్నా వాటిని రద్దు చేసే అధికారం కూడా జోనల్ కమిషనర్లకు ఉంటుంది. ప్రస్తుతం, కమెన్స్‌మెంట్ లెటర్ జారీ అయిన తర్వాత అనుమతుల రద్దుకు సంబంధించిన ప్రతిపాదనలు కమిషనర్‌కు పంపుతున్నారు.

అక్రమ నిర్మాణాలు లేకుండా..

- ఇటీవల కాలంలో జీహెచ్‌ఎంసీ యాక్ట్ సెక్షన్ 455 –ఎ కింద అనుమతి లేని నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. వాటిని క్రమబద్ధీకరించేదుకు కమిషనర్‌కు అధికారాలున్నాయి. వాటిని జోనల్ కమిషనర్లకు బదలాయించనున్నారు. అయితే అందుకు పలు నిబంధనలు, షరతులు ఉన్నాయి. ఆమేరకు
- నిర్మాణదారు బల్డింగ్‌ప్లాన్‌తో పాటు అన్ని రకాల ఫీజులు, చార్జీలు చెల్లించాలి.
- భవన నిర్మాణం సంబంధిత చట్టాలు, మాస్టర్ ప్లాన్, జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్, బిల్డింగ్ బై–లాస్, బిల్డింగ్ రూల్స్, తెలంగాణ అగ్నిమాపక సేవల చట్టం–1999 నేషనల్ బిల్డింగ్ కోడ్, ఇతరత్రా ప్రభుత్వ ఉత్తర్వులలో నిర్దేశించిన అన్ని ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి.
- భవన అనుమతి పొందడం కోసం దరఖాస్తుదారు చెల్లించాల్సిన వివిధ కేటగిరీల ఫీజులు, చార్జీలతో పాటు అదనంగా 33 శాతం జరిమానాగా చెల్లించాలి.
- జీహెచ్‌ఎంసీ చట్టంలోని సెక్షన్ 450 మరియు 455–ఎ కింద మిగిలిన అధికారాలు మాత్రం కమిషనర్‌కే ఉంటాయి.



క్రికెట్ స్టేడియం వద్ద గేట్లకు అడ్డుగా నిర్మించిన ప్రహరీని తొలగిస్తున్న ఐలా సిబ్బంది

శాంతిభద్రతలకు పెద్దపీట: మంత్రి పొన్నం



శాలిబండ పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చాంద్రాయణగుట్ట/బహదూర్‌పురా: తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలకు పెద్ద పీట వేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పాతబస్తీ పురానీహవేళీలోని పాత కమిషనర్ కార్యాలయం మరమ్మతు, శాలిబండ, కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ భవనాలను నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్‌తో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ప్రజల సౌకర్యార్థం పోలీస్‌స్టేషన్లను కూడా పెంచుతున్నామన్నారు. పురానీహవేళీలో 1920 నుంచి 2002 వరకు పోలీస్ కమిషనర్ కార్యాలయంగా కొనసాగిన ప్రాచీన కట్టడమైన పాత కార్యాలయాన్ని దాతల సహకారంతో సీపీ కార్యాలయంగా పునరుద్ధరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్, రహ్మత్ బేగ్, చార్మినార్ ఎమ్మెల్యే మీర్జా ముల్పీకర్ అలీ, బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబిన్ బేగ్, ఐపీఎస్ అధికారులు విశ్వ ప్రసాద్, జోయల్ డేవిస్, స్నేహ మెహ్రా, ఏ.ఆర్.శ్రీనివాస్, రమేష్ రెడ్డి, అపూర్వ రావు, రక్షిత కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



ఉస్మానియా యూనివర్సిటీ: ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడుపుతూ అదుపుతప్పి ఫుట్‌పాత్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం రాత్రి పది గంటల సమయంలో రవీంద్రానగర్ నుంచి (పిట్టల బస్తీ) సీతాఫల్‌మండి ఫ్లై ఓవర్ మీదుగా లక్కీ అనే యువకుడు బైకుపై వేగంగా వచ్చి ఫ్లై ఓవర్ ఫుట్‌పాత్‌ను ఢీకొట్టి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోయిన లక్కీని స్థానికులు 108కు ఫోన్ చేసి అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా యువకుడు మద్యం తాగి వాహనం నడిపినట్లుగా స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు.

ఫోర్జరీ పత్రాలతో పట్టుబడ్డ హరియాణా వాసి

శంషాబాద్: ఫోర్జరీ పత్రాలు, నకిలీ ఆధార్ కార్డుతో పాటు ఎలక్ట్రానిక్స్ పరికరాలతో అనుమానాస్పదంగా కనిపించిన ఓ ప్రయాణికుడిని ఎయిర్‌పోర్టులో సీఐఎస్ఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకుని ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి..హరియాణా రాష్ట్రానికి చెందిన అమిత్‌కుమార్ మంగళవారం అర్ధరాత్రి ఇండిగో 6ఈ–949 విమానంలో హైదరాబాద్ నుంచి బెంగళూరు బయలుదేరేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. అతడి లగేజీని పరిశీలించిన సీఐఎస్ఎఫ్ అధికారులకు ఐదు బ్లూటూత్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ సామాగ్రి ఉండడంతో అనుమానించి అతడి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. ఆధార్ కార్డులో అవకాశ్‌కుమార్, పాస్‌పోర్టులో అమిత్‌కుమార్ అని ఉండడాన్ని గుర్తించారు. ఇతర పత్రాలు కూడా ఫోర్జరీవిగా ఉన్నట్లు గుర్తించి పోలీసులకు అప్పగించారు. అయితే అతడు పోటీపరీక్షలకు సంబంధించిన పేపర్ లీకేజీలు చేస్తున్నట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మాటిచ్చి..

యువకుడు మోసగించడంతో యువతి ఆత్మహత్య

సనత్‌నగర్: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని పెద్దల సమక్షంలో మాటిచ్చి ఆ తర్వాత పెళ్లికి నిరాకరించడంతో తీవ్ర మనస్తానికి గురైన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో నివాసం ఉండే మెహరున్నీసా కుమార్తె ఆయేషా ఫాతిమా (19)కు అదే బస్తీకి చెందిన అజరుద్దీన్ అలియాస్ సోహెల్‌తో పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. ఈ క్రమంలో సోహెల్ వద్ద ఆయేషా ఫాతిమా పెళ్లి ప్రస్తావన చేయడంతో పట్టించుకోవడం మానేశాడు. ఈ విషయం పెద్దల వరకు వెళ్లడంతో పలుమార్లు ఇరుకుటుంబాల వారు కూర్చొని మాట్లాడుకున్నారు. ఆ సమయంలో పెళ్లి చేసుకుంటానని ఒప్పుకున్న సోహెల్ ఆ తర్వాత ప్లేటు ఫిరాయించాడు. దీంతో ఆవేదన చెందిన ఆయేషా ఫాతిమా మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. సోదరుడు అయాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాపురానికి వెళ్లాలన్నందుకు..

కన్న తండ్రినే కడతేర్చింది..

ప్రియుడు, తల్లితో కలిసి కూతురు ఘాతుకం

- నిద్రమాత్రలు వేసి, మద్యం తాగించి దారుణం
- శవాన్ని ఇంట్లో ఉంచి సినిమాకు వెళ్లిన వైనం..
- అర్ధరాత్రి తరువాత ఏదులాబాద్ చెరువులో శవాన్ని పడేసి ఇంటికి..
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



హత్య వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ పరశురాం, చిత్రంలో నిందితులు

ఘట్‌కేసర్: భర్త దగ్గరికి వెళ్లాలని మందలించాడని, తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ వివాహిత తన తండ్రినే హత్య చేయించింది. తల్లి, ప్రియుడితో కలిసి ఘాతుకానికి పాల్పడింది. అనుమానాస్పద మృతిగా నమ్మించాలని యత్నించి కటకటాలపాలైంది. ఈ సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. హత్య వివరాలను బుధవారం ఇన్‌స్పెక్టర్ పరశురాం తెల్పిన మేరకు..ముషీరాబాద్ పరిధిలోని ముగ్గుబస్తీకి చెందిన వడ్లూరి లింగం(45), శారద దంపతులు. లింగం సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తుండగా, శారద జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికురాలు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా ఈ నెల 6న లింగం విధులు నిర్వహించడానికి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు సెక్యూరిటీ ఏజెన్సీని సంప్రదించగా ఆ రోజు విధులకు రాలేదని తెలిపారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 7న మధ్యాహ్నం పెద్ద కుమార్తె మనీషాకు పోలీసులు వాట్సాప్‌లో ఓ ఫోటో పంపి గుర్తించాలని కోరారు. మృతుడ్ని తండ్రిగా గుర్తించి..తల్లి శారదతో కలిసి ఘట్‌కేసర్ పరిధి ఏదులాబాద్ శ్రీ లక్ష్మీనారాయణ చెరువు వద్దకు వెళ్లారు. లింగం శవాన్ని చూసి బోరున విలపించారు. తన భర్తను గుర్తు తెలియని వ్యక్తులు గొంతకోసి చంపారని శారద పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టగా అసలు విషయం బయటపడింది.

ముగ్గురూ కలిసి ...

లింగం పెద్ద కూతురు మనీషా భర్తతో విడిపోయి ఇద్దరు పిల్లలతో వీరి ఇంటి సమీపంలో ఉంటుంది. మహ్మద్ జావీద్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. దీనిపై లింగం కోపగించి..అతనితో సంబంధం మానేయాలని హెచ్చరించాడు. భర్త దగ్గరకు కాపురానికి వెళ్లిపోవాలని మనీషాను ఒత్తిడిచేశాడు. దీంతో కక్ష పెంచుకున్న మనీషా తండ్రిని అంతమొందించాలని నిర్ణయించుకుంది. దీనికి ఆమె తల్లి శారద, మహ్మద్ జావీద్ సహకరించారు. ఈమేరకు హత్య చేసిన తర్వాత శవాన్ని ఎక్కడ వేయాలో అని చర్చించి 15 రోజుల క్రితమే ఏదులాబాద్ చెరువును పరిశీలించి వెళ్లారు.

కల్లులో నిద్ర మాత్రలు కలిపి...

లింగంకు కల్లు తాగే అలవాటు ఉండడంతో అందులో నిద్రమాత్రలు కలపాలని జావీద్ ఈ నెల 5న శారదకు టాబ్లెట్లు అందించాడు. లింగం కల్లు తాగి ఇంట్లో పడుకోగా.. విషయాన్ని శారద..కుమార్తె మనీషా, జావీద్‌లకు సమాచారం ఇచ్చింది. మనీషా సమీపంలోని వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి వచ్చి..మరోసారి లింగంకు తాగించారు. అనంతరం శారద, మనీషాల సహకారంతో లింగం కాళ్లు చేతులు కట్టేసిన జావీద్..అతడి ముఖంపై దిండుతో అదిమి..పిడికిలితో గుండెపై మోది, గొంతు కోసి చంపేశారు. శవాన్ని ఇంట్లో వేలాడదీశారు.

సినిమాకు వెళ్లి..క్యాబ్‌లో శవాన్ని తరలించి..

హత్య అనంతరం ముగ్గురు జావీద్ ఉండే ఇంటికి బైక్‌పై వెళ్లి.. అటునుంచి సెకెండ్ షో సినిమాకు వెళ్లారు. తిరిగొచ్చి శవాన్ని ఎదులాబాద్ చెరువులో పడేయడానికి క్యాబ్ బుక్ చేసుకున్నారు. లింగం అపస్మారక స్థితిలో ఉండడంతో డ్రైవర్ అనుమానించి కారు బుకింగ్ రద్దు చేసుకున్నాడు. మద్యం సేవించాడని, ఎదులాబాద్‌లో కుటుంబ సభ్యులకు అప్పగించాలని డ్రైవర్‌కు నచ్చజెప్పి ఒప్పించారు. కారులో శవంతో మనీషా, శారద ఉండగా..జావీద్ బైక్‌పై వెనుక అనుసరించి.. శవాన్ని చెరువు కట్టపై దించారు. క్యాబ్ వెళ్లగానే శవాన్ని చెరువులో పడేసి ముగ్గురు బైక్‌పై ఇంటికి వెళ్లిపోయారు. ఏమీ తెలియనట్లు మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి కుటుంబ సభ్యుల పైనే అనుమానం కలగడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

181 గజాల ప్లాట్లకు ముగిసిన లాటరీ

కందుకూరు: మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో ఏర్పాటు చేసిన ఫార్మా లేఅవుట్‌లో భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల పంపిణీ బుధవారం కొనసాగింది. మూడో రోజు 181 గజాల ప్లాట్లను ఆర్డీఓలు జగదీశ్వర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు లాటరీ ద్వారా కేటాయించారు. మొత్తం 581 మందికి గాను 340 మంది లాటరీలో పాల్గొన్నారు. కాగా గురువారం అన్ని గ్రామాలకు సంబంధించి 242 గజాలు మరియు 302 గజాలకు సంబంధించిన ప్లాట్లకు లాటరీ నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు 242 గజాల ప్లాట్లకు మధ్యాహ్నం 12 గంటల నుంచి 302 గజాల ప్లాట్లకు లాటరీ నిర్వహించనున్నట్లు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.

మద్యం మత్తులో కార్లు నడిపి..

- ఓ చోట డివైడర్‌ను..మరో చోట చెట్టును ఢీకొన్న వైనం
- కేసులు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్: కొండాపూర్‌లోని క్వేక్ ఎరీనా పబ్‌లో పీకలదాకా మద్యం తాగి కారు నడిపి..అర్ధరాత్రి రోడ్డు ప్రమాదాలకు కారణమైన నలుగురు యువకులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..కొంపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బద్దం ప్రణవ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. బుద్ధిరాజు రాజా అభిషేక్‌కుమార్, ఆకొండి వ్యాసాయి ఆశిష్‌కుమార్, చామకూర అనురాగ్‌రెడ్డిలు మద్యం తాగి కారు నడుపుతూ బంజారాహిల్స్ నుంచి వెళ్తుండగా ఎన్టీఆర్ భవన్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఫుట్‌పాత్ ధ్వంసమైంది. సిమెంట్ పోల్ కూడా దెబ్బతిన్నది. కారు నడుపుతున్న ప్రణవ్ మద్యం మత్తులో ఉన్నట్లు తేలింది. కారు ముందుభాగం అంతా నుజ్జునుజ్జ కాగా పోలీసులు సీజ్ చేశారు. కారులో ఉన్న నలుగురూ మద్యం సేవించినట్లు బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌లో నిర్ధారణ అయ్యింది. ఇందులో అభిషేక్ కుమార్ కళ్లకు గాయాలైనట్లు తేలింది. పోలీసులు వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

మరో ఘటనలో..

మణికొండలో నివసించే సురేందర్‌సింగ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా, జూబ్లీహిల్స్‌లోని బ్రాడ్‌వే పబ్‌లో స్నేహితులతో కలిసి పీకలదాకా మద్యం తాగాడు. అర్ధరాత్రి 12.45 గంటల ప్రాంతంలో మద్యం మత్తులోనే కారు నడుపుతూ రోడ్డునెంబర్–51 వైపు వెళ్తుండగా అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సురేందర్ సింగ్‌కు శ్వాస పరీక్షలు నిర్వహించగా 185 బీఏసీ నమోదైంది. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఇంటి ముందు పబ్ కస్టమర్ల పార్కింగ్..

జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–23లోని బేబీలాన్ పబ్ పార్కింగ్ సిబ్బంది తన ఇంటి ముందు పబ్‌కు వచ్చే కస్టమర్ల కార్లు అక్రమంగా పార్కింగ్ చేయడమే కాకుండా నిర్లక్ష్యంగా నడుపుతూ తన కారును ఢీకొట్టాడని ఓ ఇంటి యజమాని జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జూబ్లీహిల్స్‌లో ప్లాట్‌నెంబర్–350లో నివసించే టీఏ వీరమోహన్ ఇంటి ముందు పబ్ సిబ్బంది రాత్రిపూట కస్టమర్ల కార్లను పార్కింగ్ చేస్తున్నారు. అంతేకాకుండా ఓ కారు పార్కింగ్ చేసే క్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో కారును ఢీకొట్టాడని, దీంతో తన కారు ముందుభాగం అంతా దెబ్బతిన్నదని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పెడ్లర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్

అడ్డగుట్ట: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఓ పెడ్లర్‌ను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సికింద్రాబాద్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన జి.సరస్వతి భర్తతో కలిసి నగరానికి వలస వచ్చింది. రెండేళ్ల క్రితం ఆమె భర్త కరణ్‌సింగ్ మరణించడంతో అప్పటి నుంచి స్థానికంగా ఓ ఇంట్లో పనిమనిషిగా చేస్తుంది. భర్తకు స్నేహితుడైన గోపాల్‌సింగ్ అనే వ్యక్తి ఇటీవల సరస్వతిని కలిశాడు. బెర్హంపూర్ నుంచి సికింద్రాబాద్‌కు గంజాయి తరలిస్తే ట్రిప్‌కు రూ.5 వేల చొప్పున ఇస్తానని చెప్పడంతో ఆమె ఒప్పుకుంది. ఈ క్రమంలో మంగళవారం బెర్హంపూర్‌కు వెళ్లిన సరస్వతి అక్కడ ఓ వ్యక్తి నుంచి గంజాయి బ్యాగును తీసుకొని అదే రోజు విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్‌కు తిరుగుపయనమైంది. బుధవారం ఉదయం 7.30 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి విశాఖ ఎక్స్‌ప్రెస్ నుంచి దిగిన సరస్వతి ప్లాట్‌ఫాం నెం.1లోని వెయిటింగ్ హాల్ వద్ద గంజాయి బ్యాగుతో నిలబడి ఉంది. అదే సమయంలో తనిఖీలు నిర్వహిస్తున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు, టీజీఏఎన్‌బీ బృందం సరస్వతి వద్దకు వెళ్లి బ్యాగును తనిఖీ చేయగా సుమారు రూ.1.50 లక్షల విలువైన 3 కిలోల గంజాయిని గుర్తించారు. ఆమెను అరెస్ట్ చేసి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వివాహితకు బెదిరింపులు..

ఫిలింనగర్: పాత పరిచయం ఉన్న ఓ వివాహితను వేధిస్తూ..వ్యక్తిగత ఫోటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఫిలింనగర్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే..ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసిస్తున్న యువతి (26) ఓ డెంటల్ క్లినిక్‌లో పనిచేస్తున్నది. 2018లో ఆమెకు వివాహం జరగ్గా అంతకుముందు కిరణ్ అనే ఓ యువకుడితో పరిచయం ఉండేది. వివాహం జరిగిన తర్వాత కూడా కిరణ్ ఆమెతో మాట్లాడుతూ తనతో రావాలని బలవంతం చేస్తున్నాడు. తాను చెప్పినట్లు వినకపోతే భర్తకు, బంధుమిత్రులకు ఫోటోలు షేర్ చేస్తానంటూ బెదిరించసాగాడు. అయినా సరే ఆమె మాట్లాడకుండా ఊరుకుంది. ఈ నెల 7వ తేదీన సాయంత్రం 4 గంటల ప్రాంతంలో నిందితుడు కిరణ్ ఆమె పనిచేస్తున్న ప్రాంతానికి వెళ్లి తనతో రావాలంటూ మెట్లపై నుంచి కిందికి ఈడ్చుకొచ్చాడు. తీవ్రంగా కొట్టాడు. దీంతో బాధితురాలు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధిస్తున్నాడని..

భర్తను హత్య చేసిన భార్య



మహ్మద్ సైఫ్ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: నిత్యం మద్యం తాగి వచ్చి వేధిస్తుండడంతో భర్తను భార్య హతమార్చిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం..వట్టేపల్లి సైఫ్ కాలనీ ప్రాంతానికి చెందిన మహమ్మద్ సైఫ్ (30), ఫరీదా సుల్తానాలు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. ఫరీదా ప్రతిరోజు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. మద్యానికి బానిసైన మహమ్మద్ సైఫ్ ప్రతి రోజు భార్యను వేధిస్తున్నాడు. బుధవారం రాత్రి కూడా మద్యం తాగి వచ్చి వేధించగా..ఫరీదా కోపంతో బండరాయితో తలపై మోదడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనాస్థలికి చేరుకుని సుల్తానాను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాపైన బాలిక క్షేమం

- ఒక్కరోజులోనే కిడ్నాపర్ ఆచూకీ కనుగొన్న పోలీసులు
- తల్లిదండ్రులకు బాలిక అప్పగింత



బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



కిడ్నాప్ చేసిన రజిని

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో కలకలం రేపిన బాలిక కిడ్నాప్ కేసును ఆర్‌జీఐఏ పోలీసులు ఫిర్యాదు అందిన ఇరవై నాలుగు గంటలలోపే ఛేదించారు. ఇన్‌స్పెక్టర్ బాలరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 1న పట్టణంలోని కల్లుకంపౌండ్‌లో మహబూబ్‌నగర్ జిల్లా కంచన్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, రమేష్ దంపతుల కుమార్తె కీర్తన (6)ను గుర్తు తెలియని మహిళ మచ్చిక చేసుకుని కిడ్నాప్ చేసింది. వారం రోజుల తర్వాత కుటుంబ సభ్యులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ముందుగా కిడ్నాప్ చేసిన మహిళ పట్టణంలోని రాళ్లగూడ దొడ్డి బస్తీకి చెందిన రంగాపురం రజినిగా గుర్తించారు. కిడ్నాప్ చేసిన రోజే మహిళ శంషాబాద్ బస్టాండ్‌లో చేవెళ్ల బస్సు ఎక్కి వెళ్లినట్లు సీసీ ఫుటేజీల్లో కనిపించింది. బాలికతో మహిళ తన సొంతూరు వికారాబాద్‌కు వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు వికారాబాద్ పోలీసుల సహకారంతో బాలికను బుధవారం ఉదయం తమ ఆధీనంలోకి తీసుకోవడంతో పాటు మహిళను అరెస్ట్ చేశారు. బాలికను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. మహిళపై కిడ్నాప్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

వైద్య విద్యార్థులపై కేసు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 10లోని 040 పబ్‌లో పీకలదాకా మద్యం తాగి అర్ధరాత్రి అదుపుతప్పిన వేగంతో దూసుకెళ్తుండగా కారు అదుపుతప్పి మరో కారును ఢీకొట్టిన ఘటనలో ఐదుగురు వైద్య విద్యార్థులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రైవేట్ మెడికల్ కళాశాలలో చదువుకుంటున్న వైద్య విద్యార్థులు ఐదుగురు మంగళవారం రాత్రి 040 పబ్‌కు వచ్చి మద్యం తాగి తిరుగు ప్రయాణమయ్యారు. ప్రశాసన్ నగర్ సమీపంలో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న మరో కారును ఢీకొట్టడంతో కారు నడుపుతున్న విద్యార్థితో పాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఐదుగురిని ఆస్పత్రికి తరలించారు. శ్వాస పరీక్ష నిర్వహించగా అందరూ మద్యం తాగినట్లు వెల్లడి అయింది. వీరందరిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

రూ.10 లక్షల విలువైన కాపర్ లోడ్ మాయం

సనత్‌నగర్: ఐరన్, కాపర్ లోడ్‌తో సనత్‌నగర్ నుంచి బయలుదేరిన ఓ లారీ డ్రైవర్ గమ్యస్థానానికి చేరకుండా మార్గమధ్యంలో దాదాపు రూ.10 లక్షల విలువైన కాపర్‌ను మాయం చేసి లారీని అక్కడే వదిలేసి పరారైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం..ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ డానిష్ అలియాస్ ఆర్షిఫ్ గత నెల 29న సనత్‌నగర్‌లో దాదాపు 20 లక్షల విలువ చేసే ఐరన్‌తో పాటు కాపర్‌ను లారీ (టీఎస్08 యూఎల్ 3240)లో లోడ్ వేసుకుని బయలుదేరాడు. ఈ మెటీరియల్‌ను కర్ణాటక రాష్ట్రం బెహల్గం ప్రాంతానికి చేర్చాల్సి ఉంది. అయితే డ్రైవర్ డానిష్ జహీరాబాద్ ప్రాంతానికి చేరుకోగానే యజమానికి ఫోన్ చేసి లారీలోని కాపర్ మెటీరియల్ దొంగతనానికి గురైందని చెప్పాడు. దీంతో యజమాని లారీ ఆగి ఉన్న చోటికి వెళ్లి పరిశీలించగా లారీలో సగం వరకు ఉన్న కాపర్ మెటీరియల్ కనిపించకపోవడంతో పాటు డ్రైవర్ కూడా కనిపించలేదు. దీంతో అతనికి ఫోన్ చేయగా తాను ఉద్యోగం మానేశానని, తన స్వస్థలమైన యూపీకి వెళ్లిపోయానంటూ చెప్పుకొచ్చాడు. దీంతో అతనిపై అనుమానం వ్యక్తం చేస్తూ బుధవారం ఉషా ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన స్క్రాప్ డీలర్ అమిత్‌గార్గ్ సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లారీలోని కాపర్ మెటీరియల్‌ను మాయం చేసి దొంగతనానికి గురైనట్లుగా నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారులో ఉంచిన రూ.4 లక్షలు నగదు మాయం

ఫిలింనగర్: భార్యను ఆస్పత్రిలో చికిత్స కోసం తీసుకువచ్చి లోనికి వెళ్లే సమయంలో కారులో దాచిన రూ.4లక్షలు మాయం అయిన ఘటన ఫిలిం నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..సిద్దిపేటలోని యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డా.రవినాథ్ ఈ నెల 4న తన భార్యను జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స కోసం తీసుకువచ్చారు. అత్యవసర చికిత్స కోసం అవసరం అవుతాయనే ఉద్దేశంతో రూ.4 లక్షల నగదు తనతో పాటు తెచ్చిన డా.రవినాథ్ కారు డిక్కీలో దాచారు. కారును వ్యాలెట్ డ్రైవర్‌కు ఇచ్చాడు. రెండున్నర గంటల అనంతరం ఆస్పత్రి నుంచి బయటకు వచ్చి కారు తీసుకుని ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లారు. అదేరోజు రాత్రి సొంతూరు వెళ్లారు. రెండ్రోజుల తర్వాత కారు డిక్కీలో డబ్బుల గురించి గుర్తుకి వచ్చి చూడగా అవి మాయం అయ్యాయి. దీంతో బుధవారం వచ్చి అపోలో ఆసుపత్రి సీసీ ఫుటేజ్ పరిశీలించారు. అయితే అక్కడ సీసీ కెమెరాలు పని చేయడం లేదని తేలింది. దీంతో బాధితుడు డా.రవినాథ్ బుధవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కమిటీ సభ్యులు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 26వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలో 22 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వీరందరి కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్ : భరత్‌నగర్, బ్రాహ్మణవాడీ, ప్రేమ్‌నగర్, కుమ్మరిబస్తీ 11కెవీ ఫీడర్లు ఐడీపీఎల్, కుమ్మరిబస్తీ సబ్‌స్టేషన్ల పరిధిల్లో మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు వైట్‌హౌస్, మీనాబజార్, బ్రాహ్మణవాడీ, హెచ్‌పీ రోడ్డు, లక్ష్మీకళ, శ్రీరాములు థియేటర్లు, అశ్వినీ హెయిర్ ఆయిల్ లైన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ బుధవారం తెలిపారు.

ఖైరతాబాద్ డివిజన్‌లో..

సైఫాబాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజినల్ ఇంజనీర్ తెలిపారు. నిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎర్రమంజిల్, బాలాపూర్ బస్తీ, ఎర్రమంజిల్ చమాన్, పంచాయతీరాజ్ కార్యాలయం, శ్రీ కావేరి సాంబశివరావు రెసిడెన్సీ, పోస్ట్ ఆఫీస్ లేన్, జీవీకే మాల్ వెనుక భాగం, హుస్సేన్ సాగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఖైరతాబాద్ ఏరియా, నాసర్ స్కూల్ గల్లీ, ఎన్టీఆర్ గార్డెన్ ఏరియా, ఐమాక్స్ సర్కిల్. ఎర్రమంజిల్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎర్రమంజిల్ కాలనీ, రవీంద్ర నికేతన్ స్కూల్, ఆర్ అండ్ బి కార్యాలయం, హెరిటేజ్ లేన్ పంజాగుట్ట, నిమ్స్ మేయిన్ రోడ్డు ఏరియా, ఏసీ గార్డ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో కేర్ హాస్పిటల్, విరించి హాస్పిటల్, సాక్షి దినపత్రిక కార్యాలయం, వాటర్ వర్క్స్ కార్యాలయం, డాక్టర్ నూర్ గల్లీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నల్ల చట్టాలను రద్దు చేయాలి

హిమాయత్‌నగర్: కార్మికుల సంక్షేమం కోసం గత కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి.చంద్రశేఖర్, ఎరగాని నాగన్న గౌడ్, ఆదిల్ షరీఫ్ అన్నారురు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అన్ని ట్రేడ్ యూనియన్ల దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం నారాయణగూడలో ఐఎన్‌టీయూసీ తెలంగాణ కార్మికులతో భారీ ప్రదర్శన నిర్వహించింది. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమా నాగేంద్ర మణి, విజయ్ కుమార్ యాదవ్ నాయకులు జగన్మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, మల్లేష్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

137 ఆలయాలు.. | రూ. 80 లక్షల నిధులు..

బోనాల చెక్కులు పంపిణీ | ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలని సూచన



షేక్‌పేట తహశీల్దార్ అనితారెడ్డి చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న గురుబ్రహ్మనగర్ బస్తీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాల ఉత్సవాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమ్మవారి ఆలయాలకు అందిస్తున్న బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. బుధవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని ఆలయాల నిర్వాహణ ఖర్చుల కింద మంజూరైన చెక్కులను అందజేశారు. షేక్‌పేట మండల తహశీల్దార్ వై.అనితారెడ్డి, ఖైరతాబాద్ మండల డిప్యూటీ తహసీల్దార్, దేవాదాయ శాఖ అధికారి శేఖర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని డివిజన్ల వారీగా చెక్కులను పంపిణీ చేశారు. ఆయా దేవాలయాల కమిటీ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో 137 అమ్మవారి ఆలయాల్లో బోనాల వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రూ.80 లక్షలు మంజూరయ్యాయి. ఆయా చెక్కులను సంబంధిత ఆలయ కమిటీలకు అందజేసిన అనంతరం అధికారులు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. ఆలయాల గోడలకు రంగులు వేయడం, ప్రాంగణాల్లో మరమ్మతులు చేసుకోవడం, ఆలయ పరిసరాలను శుభ్రం చేసుకునేందుకు ఈ మొత్తాన్ని వినియోగించుకోవాలన్నారు. ఏటా తెలంగాణ ప్రభుత్వం బోనాల పండుగ జరిగే అమ్మవారి ఆలయాలకు నిధులు అందజేస్తోంది. ఈ ఏడాది కూడా ఆయా ఆలయాలకు చెక్కులు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ వై.అనితారెడ్డి తెలిపారు.

బోనాల చెక్కుల పంపిణీ

ఖైరతాబాద్: బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బోనాల పండుగ చెక్కులను బుధవారం కార్పొరేటర్ విజయారెడ్డి అందజేశారు. నియోజకవర్గం పరిధిలోని పలు ఆలయాల నిర్వాహకులకు ఖైరతాబాద్ డివిజన్‌లోని కార్యాలయంలో విజయారెడ్డి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయాల నిర్వాహకులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

భద్రాద్రి ఈఓపై దాడి అమానుషం



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ గౌడ్

పంజగుట్ట: భద్రాద్రి రామాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా అడ్డుకున్న భద్రాద్రి ఈఓ రమాదేవిపై దాడి అమానుషమని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. బుధవారం ఎర్రమంజిల్‌లో ప్రధానకార్యదర్శి డాక్టర్ దేశబోయిన రమతో కలిసి మాట్లాడుతూ .. భద్రాద్రి రామాలయ భూములు ఏపీలోని పురుషోత్తపట్నంలో కబ్జాకు గురవుతుండగా అడ్డుకున్న ఈఓ రమాదేవిపై దాడి చేయడం దారుణమన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా పురుషోత్తపట్నంలోని ఆలయ భూముల్లో భవన నిర్మాణ పనులు చేపడుతుండగా దేవాలయ సిబ్బంది అడ్డుకున్నందుకు ఈఓ రమాదేవిపై దాడి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో భద్రాద్రి రాముడికి సుమారు 1300 ఎకరాల భూములు ఉన్నాయని, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం, పురుషోత్తపట్నంలో 889.5 ఎకరాల భూమి ఉందన్నారు. కోర్టు తీర్పు ప్రకారం ఈ భూమిపై దేవస్థానానికి పూర్తి హక్కులుఉన్నాయని, దేవుని పేరుతోనే పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ఉన్నట్లు తెలిపారు. అలాంటి భూములను కబ్జా చేస్తుండగా అడ్డుకుంటే దాడులు చేశారని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలతో మాట్లాడుతున్న కార్పొరేటర్, ఇతర అధికారులు

వెంగళరావునగర్: ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 కార్యాలయంలో బుధవారం మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగడానికి, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగడానికి ఎన్నో పథకాలు అమలులో ఉన్నాయన్నారు. అర్హులైన ప్రతి మహిళ వాటిని సద్వినియోగం చేసుకోవాలని, లేనిపక్షంలో నిధులు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతి మహిళ పొదుపు సంఘాల్లో తప్పని సరిగా చేరాలని, వారితో పాటు మీ చుట్టుపక్కల వారిని సైతం చేర్పించాలని తెలిపారు. సర్కిల్ పరిధిలో ఉన్న మహిళా సంఘాల కంటే మరిన్ని అధికంగా ఉండేలా మహిళలు, సంఘాల సభ్యులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూసీడీ జాయింట్ కమిషనర్ దేవేందర్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి సీ.ఓ. శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట్ కిషన్, ఆర్‌పీలు, ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

గోపన్‌పల్లి బాధితులకు శాశ్వత నివాసం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాస్టార్జీ

పంజగుట్ట: ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు గోపన్‌పల్లి బాధితులకు అక్కడే శాశ్వత నివాసాలు ఏర్పాటు చేయాలని బసవతారకనగర్ బస్తీ కమిటీ వాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, కళాకారులు మాస్టార్జీ, అన్వర్ పటేల్ మాట్లాడుతూ ..రంగారెడ్డి జిల్లా, గోపన్‌పల్లి గ్రామం సర్వే నెంబర్ 37లోని ఐదు ఎకరాల స్థలంలో గత 45 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆ స్థలం విలువ పెరగడంతో తమను అక్కడి నుంచి తరిమేసేందుకు కొందరు భూ కబ్జాదారులు యత్నిస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి రాగానే 60 గజాల చొప్పున స్థలం కేటాయించి ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత నెలరోజులుగా కొందరుభూకబ్జాదారులు తమను బెదిరిస్తూ కొన్ని గుడిసెలు కూల్చేశారని వెంటనే ఖాళీ చేయకపోతే మీ అంతు చూస్తామని బెదిరిస్తున్నారని ముఖ్యమంత్రి స్పందించి ఇచ్చిన హామీ మేరకు వెంటనే తమకు ఇక్కడే శాశ్వత నివాసాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని గౌరీ శంకర్ కాలనీలోని సీతారామచంద్ర స్వామి 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఆఖరి రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం త్రిశూల స్నానం ఘట్టాలను పూర్తి చేశారు. వారం రోజుల పాటు స్వామివారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సూర్యనారాయణ తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాగంటి గోపీనాథ్ ఆశయ సాధనకు కృషి



మాగంటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాగంటి వజ్రనాథ్ తదితరులు

రహమత్‌నగర్: దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆశయ సాధనకు కృషి చేస్తానని, ప్రజలు సంపూర్ణ మద్దతు అందించి తమకు ముందుకు నడిపించాలని దివంగత మాగంటి గోపీనాథ్ సోదరుడు, బీఆర్‌ఎస్ నియోజక వర్గం నాయకుడు మాగంటి వజ్రనాథ్ అన్నారు. బుధవారం శ్రీరాంనగర్‌లో సదానంద్ సిద్దార్థ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన గోపీనాథ్ సంతాప సభలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సోదరుడు గోపీనాథ్ భౌతికంగా ప్రజలకు దూరమైనా ఆయన చేసిన అభివృద్ధి చిరస్థాయిగా ఉంటుందన్నారు. గోపీనాథ్ తల్లి మహానంద కుమారి మాట్లాడుతూ తన కొడుకు గోపీనాథ్ కుటుంబం కంటే ప్రజా సేవపైనే ఎక్కువ శ్రద్ధ చూసేవాడన్నారు. రాబోయే ఎన్నికల్లో మాగంటి వజ్రనాథ్ అభ్యర్థిత్వాన్ని ప్రజలు బలపర్చాలని కోరారు. అంతకు ముందు గోపీనాథ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అన్నదాన కార్య క్రమం నిర్వహించి, మహిళలకు కానుకలు అందజేశారు. నాయకులు మాగంటి అనూష, ప్రహ్లాద్, మామిడాల రాజు, బస్వరాజ్, గోపీ, శివాజీ, ఇంతియాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన



ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లను బుధవారం పీఎంఓ ఆఫీస్ డైరెక్టర్ మన్మీత్ కౌర్ స్వయంగా పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె సముదాయంలో నిర్మించిన కమర్షియల్ షాపుల నిర్వహణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడి, బస్తీ దవాఖాన, పాఠశాల దగ్గర్లో ఉన్నాయా అని మహిళా లబ్ధిదారులను ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన వారికి అందజేసేందుకు మేళాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా హౌసింగ్ అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతం, తదితరులు ఉన్నారు.

కల్లు కాంపౌండ్‌లలో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

రహమత్‌నగర్: కూకట్‌పల్లి కల్తీ కల్లు సంఘటన నేపథ్యంలో అమీర్‌పేట్ ఎక్సైజ్ పోలీసులు బుధవారం బోరబండ కల్లు కాంపౌడ్‌లో శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు తరలించారు. బోరబండతో పాటు పలు ప్రాంతాల్లోని కల్లు కాంపౌడ్‌లలో శాంపిల్ సేకరించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్‌ఐలు రాధ, వాణీ మాట్లాడుతూ కూకట్‌పల్లి కల్తీ కల్లు సంఘటనతో ఎక్సైజ్ శాఖ అప్రమత్తమైందని, పోలీస్ పరిధిలోని అన్ని కల్లు కాంపౌండ్‌లతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ముమ్మరంగా డీ సిల్టింగ్ పనులు



బంజారాహిల్స్: వరదలు వచ్చిన ప్రతిసారి చింతల్ బస్తీ నాలా పొంగి పొర్లుతుండటంతో ఈ ఏడాది ఆ పరిస్థితి పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. బంజారాహిల్స్ రోడ్‌నెం. 1లోని చింతల్ బస్తీ వైపు నాలాపై అక్రమ కట్టడాలు ఉన్నట్లు గుర్తించిన హైడ్రా అధికారులు గత కొన్ని రోజుల క్రితం వాటిని నేల మట్టం చేశారు. కూల్చివేసిన ప్రాంతంలో పెద్ద ఎత్తున వ్యర్థాలు తట్టుకుపోతుండటం వల్ల ఒక్కసారిగా వచ్చే వరదతో చింతల్‌బస్తీ నీట మునుగుతున్నదని అధికారులు గుర్తించారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచనల మేరకు నాలాలో వ్యర్థాలను తొలగిస్తున్నారు. దీంతో ఇక్కడ వరద సాఫీగా ముందుకు సాగుతుందని పెద్ద వర్షాలు వచ్చినా ఎటువంటి సమస్య ఉండదని అధికారులు చెబుతున్నారు. బుధవారం నాలా నుంచి వ్యర్థాలు తొలగించడంతో పాటు తొలగించిన వ్యర్థాలను అక్కడి నుంచి తరలించారు.

మహిళల అభ్యున్నతే ధ్యేయం

రహమత్‌నగర్: స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి అన్నా రు. బుధవారం రహమత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పట్టణ మహిళా సమాఖ్య సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తున్నదన్నారు. ఇందులో భాగంగానే స్వయం సేవా సంఘాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏసీయూసీడీ జాయింట్ కమిషనర్ దేవేందర్, ప్రాజెక్ట్ అధికారి వెంకట్‌కిషన్,సీడీ వెంకటయ్య, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖైరతాబాద్: గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ శివాజీ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..మంగళవారం రాత్రి ఖైరతాబాద్‌లోని శ్రీరామ్ టెంట్ హౌస్ ముందు గుర్తుతెలియని వ్యక్తి పడి ఉన్నట్లు 100 డయల్‌కు సమాచారం అందంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కార్లు ఢీ

బంజారాహిల్స్: వేగంగా వెళ్తున్న కారు ఒక్కసారిగా సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వచ్చి మరో కారు ఢీకొన్న ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం ఉదయం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో కమాండ్ కంట్రోల్ సెంటర్ దాటిన తర్వాత బస్టాప్ వద్ద నలుగురు యువతులు రోడ్డు దాటుతుండగా ఒక్కసారిగా ముందు వెళ్తున్న కారు బ్రేక్ వేయడంతో దాని వెనకే వస్తున్న బెంజ్ (ఏపీ 39 బీఎస్ 3578) కారు ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో ముందు వెళ్తున్న కారుతో పాటు వెనుకాల నుంచి ఢీకొట్టిన కారు కూడా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



వెంగళరావునగర్: జిహెచ్‌ఎంసీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు రాపర్తి అశోక్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం యూసుఫ్‌గూడ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాపర్తి అశోక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ తీసుకువచ్చిన 10 గంటల పనిదినం జీవో 282 రద్దు చేయాలన్నారు. ప్రతి కార్మికునికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, రిటైర్ అయిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్మిక వ్యతిరేక జీవోలను తక్షణమే వెనక్కు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు నగేష్, సుగుణమ్మ, నాగమణి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ లైసెన్స్ మేళాకు విశేష స్పందన



దరఖాస్తు చేసుకుంటున్న వ్యాపారులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఫుడ్ లైసెన్స్ మేళాకు విశేష స్పందన లభించినట్లు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సౌమ్యారెడ్డి తెలిపారు. ఖైరతాబాద్ జోనల్ లెవల్‌లో నిర్వహించిన ఈ ఫుడ్ లైసెన్స్ మేళాలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, గోషామహల్, కార్వాన్, మెహిదీపట్నం సర్కిళ్ళ పరిధిలో రూ.12 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు టర్నోవర్ ఉన్న వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సాయంత్రం వరకు సుమారు 40 మందికిపైగా వ్యాపారులు ఫుడ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తులను పరిశీలించి వీరికి లైసెన్స్‌లు మంజూరు చేస్తామన్నారు. ఫుడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు కొనసాగించడం నేరమని ప్రతి వ్యాపారి ఫుడ్‌లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్ పొంది ఉండాలని సూచించారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ



గొడుగులు పంపిణీ చేస్తున్న నీరజ గొడవర్తి తదితరులు

బంజారాహిల్స్: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ ఆధ్వర్యంలో బుధవారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్-5లోని దేవరకొండ బస్తీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. వర్షాకాలం కావడంతో విద్యార్థులు తమతో పాటు పుస్తకాల బ్యాగ్‌లు కూడా తడవకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో సంస్థ 120 మంది విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేసింది. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ అధ్యక్షురాలు నీరజ గొడవర్తి, సెక్రటరీ రాహుల్ జైన్, సవిధానాయుడు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మరణం తర్వాతైనా 'స్వేచ్ఛ'గా ఉండనిద్దాం..



స్వేచ్ఛ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, అల్లం నారాయణ

పంజగుట్ట: ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించి, ఎన్నో సమస్యలు పరిష్కరించిన సీనియర్ జర్నలిస్టు స్వేచ్ఛ అర్థాంతరంగా మన నుంచి దూరం కావడం బాధాకరమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో 'స్వేచ్ఛ యాదిలో' పేరుతో ఇటీవల మృతి చెందిన స్వేచ్ఛ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు మారుతీ సాగర్, గోపరాజు, రమణ, బాపూరావు. నవీన్ కుమార్, యోగి స్వేచ్ఛ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కట్ట కవిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ .. స్వేచ్ఛ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, దోషులకు కఠిన శిక్ష పడేలా చేయాలన్నారు. ఆమె కుమార్తె చదువుకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. అల్లం నారాయణ మాట్లాడుతూ ..ఒక చిన్న పిల్ల తన తండ్రి వద్దకు ఎలా వస్తుందో స్వేచ్ఛ అలా తన దగ్గరకు వచ్చేదని గుర్తు చేసుకున్నారు. ఎంతో తెలివిగా చర్చలు నిర్వహించే మహిళా జర్నలిస్టుల్లో ఆమె ముందు వరసలో ఉండేదన్నారు. ఏ మీడియా అయినా వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూడడం సరికాదని, ఆమె మృతి చెందిన తరువాత యూ ట్యూబ్ చానళ్లు బాధితురాలిని మరోమారు చంపే ప్రయత్నం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛ మరణించిన తర్వాతైనా స్వేచ్ఛగా ఉండనిద్దామని, నిందితుడు పూర్ణచందర్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు.

15న బీసీల మహాధర్నా


బీసీల ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ గౌడ్

పంజగుట్ట: బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టబద్ధత తెచ్చిన తరువాతే ఎన్నికలకు వెళ్లాలని మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో వెనకబడిన తరగతుల ప్రజా ప్రతినిధుల వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ఇందిరాపార్క్ వద్ద 10 వేల మందికిపైగా బీసీ నాయకులతో మహాధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు. మహాధర్నా పోస్టర్‌ను రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గడీల కుమార్ గౌడ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు యాదయ్య, ప్రణీత్ చందర్‌తో కలిసి బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జీవోల పేరుతో ప్రభుత్వం మరోమారు మోసం చేసేందుకు యత్నిస్తోందని, ఇప్పటికే కేబినెట్ మీటింగ్‌లో జీవో విడుదల చేస్తామని లీకులు బయటకు పంపిందని అన్నారు. జీవోపై ఎవరైనా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే ఎలా అని ప్రశ్నించారు. జీవో పేరిట బీసీలను మోసం చేస్తామంటే సహించేది లేదని హెచ్చరించారు. బీసీ బిల్లును కేంద్రానికి పంపిన తరువాత అన్ని పార్టీల నాయకులను ఎప్పుడైనా ఢిల్లీకి తీసుకువెళ్లారా అని ప్రశ్నించారు. కేసులు లేకుండా రిజర్వేషన్లు ఎలా ఇవ్వాలనే అంశంపై బీసీ రిటైర్డ్ జడ్జీల సలహాలు తీసుకోవాలని సూచించారు. చిరంజీవులు మాట్లాడుతూ రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెడితేనే బీసీల రిజర్వేషన్లకు చట్టబద్ధత వస్తుందని అన్నారు.

జీఓ ఇవ్వకుంటే మూల్యం చెల్లించుకోవాల్సిందే..

- బీసీల 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ను హెచ్చరించిన ఆర్.కృష్ణయ్య


అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, బీసీ సంఘాల నాయకులు

పంజగుట్ట/హిమాయత్‌నగర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గురువారం జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జీఓ విడుదల చేయాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాజకీయంగా కోలుకోలేని దెబ్బ పడుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యకుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో పలు బీసీ సంఘాలు బీసీ జన సభ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేశాయి. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డి ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు పెంచుకుని స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించుకోవచ్చని అన్నారు. అవకాశం, సందర్భాన్ని బట్టి రిజర్వేషన్లు పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశంపై జూలై 23, 24 తేదీల్లో చలో ఢిల్లీ జాతీయ సదస్సు ఏర్పాటు చేసినట్లు బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన జాతీయ బీసీ సంఘం సమావేశంలో తెలిపారు. సమావేశాల్లో నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ నారగోని, బత్తుల సిద్ధేశ్వర్, గోవర్ధన్, మేకల కృష్ణ, వాసుకే యాదవ్, అయోధ్య, అంజి యాదవ్, బీసీ సంఘం నేతలు జిల్లపల్లి అంజి, విక్రమ్, శారద, కవిత, హైందవి, రాందేవ్ మోదీ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో కవిత్వానికి స్థానం కల్పించిన దాశరథి

- దాశరథి శత జయంతి
  సాహిత్య సదస్సులో నందిని సిధారెడ్డి


దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

చార్మినార్: చరిత్రలో కవిత్వానికి దాశరథి స్థానం కల్పించారని సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి అన్నారు. దాశరథి శత జయంతి సందర్భంగా సిటీ కళాశాల తెలుగు శాఖ, సాహిత్య అకాడమీ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన సాహిత్య సదస్సులో ఆయన మాట్లాడారు. 'తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రజాభిమానం పొందిన మహాకవి దాశరథి అని, ఆయన రాసిన పాటలు, గేయాలు సామాన్యుల్లోకి చొచ్చుకుపోయి వారిలో చైతన్యాన్ని నింపాయి'' అని పేర్కొన్నారు. 'నా తెలంగాణ కోటిరత్నాల వీణ'అనే ఆయన నినాదం మలిదశ ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందని సిధారెడ్డి అన్నారు. దాశరథి ఉద్యమాల్లో పాల్గొని ప్రజాకవిగా మన్ననలు పొందారని పేర్కొన్నారు. రుబాయి, గజల్స్ వంటి సాహిత్యప్రక్రియలను తెలుగులో ప్రవేశపెట్టి ఉర్దూ-తెలుగు భాషల మధ్య దాశరథి అనుసంధాన కవిగా నిలిచారని అన్నారు. రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ గత వందేళ్లలో జరిగిన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, వైజ్ఞానిక పరిణామాలను దాశరథి సాహిత్యం ఆధారంగా విశ్లేషించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడెమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ సి.మృణాళిని, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్, దాశరథి కుమార్తె ఇందిర, అల్లుడు గౌరీశంకర్, డా.ఏనుగు నరసింహారెడ్డి, డా.సీతారాం, డా.గంధ్ర లక్ష్మణ రావు, డా.సమ్మెట విజయ, సిద్దెంకి యాదగిరి, అరిగెల అశోక్, ప్రభాకర్, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో యూజీ అడ్మిషన్లు ప్రారంభం

ప్రొఫెసర్ వనజ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ ఆరంభించినట్లు 'మనూ'అడ్మిషన్ల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వనజ బుధవారం తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించిన కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ)-2025 ద్వారా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. అడ్మిషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు గడువు ఉంటుందని తెలిపారు. మొదటి తాత్కాలిక జాబితా జూలై 17న విడుదల చేయనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు జూలై 18 నుంచి 22 వరకు పత్రాలను అప్‌లోడ్‌చేయవచ్చన్నారు. సర్టిఫికెట్ పరిశీలన జూలై 23న ఉంటుందని, ఫీజు చెల్లింపు 24, 25 తేదీలలో చేయవచ్చన్నారు. రెండవ తాత్కాలిక జాబితా జూలై 28న ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. బీఏలో అడ్మిషన్లు ఆనర్స్/రీసెర్చ్‌లలో హైదరాబాద్, లక్నో, భోపాల్, దర్భంగా, ఫలక్‌నుమా (పాతనగరం-హైదరాబాద్), వారణాసి, నుహ్‌లలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బీఏ జేఎంసీ(ఆనర్స్/రీసెర్)బీకామ్(ఆనర్స్/రీసెర్చ్), బీఎస్సీ(ఆనర్స్/రీసెర్చ్) బీ.వోక్(మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ, మెడికల్ లాబోరేటరీ టెక్నాలజీ, ఎమర్జెన్సీ అండ్ ట్రామా కేర్ టెక్నాలజీ) హైదరాబాద్‌లో మాత్రమే అందుబాటులో ఉన్నాయని వివరించారు. సీయూఈటీ-2025లో హాజరైన దరఖాస్తుదారులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు 'మనూ'అడ్మిషన్ పోర్టల్‌లో నమోదు చేసుకొని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

'హెచ్‌సీయూ' ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో అడ్మిషన్లు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. 2025-26 విద్యాసంవత్సరానికి ఐదేళ్ల కాలపరిమితితో కూడిన ఈ 17 ఇంటిగ్రేటెడ్ పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను వర్సిటీ అధికారులు ఆహ్వానిస్తున్నారు. ముఖ్యంగా కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ)-2025 స్కోర్ కార్డుల ఆధారంగా ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించారు. ఈ నెల 14 నుంచి జూలై 30వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారి రిపోర్టింగ్, డాక్యుమెంట్ల పరిశీలన ఆగస్టు 14న నిర్వహిస్తారు. 18వ తేదీ నుంచి తరగతులను ఆరంభించాలని నిర్ణయించారు. కాగా, 19న ఖాళీ సీట్ల వివరాలు, వెయిటింగ్ లిస్టు విద్యార్థుల జాబితా ప్రకటిస్తారు. 28న వెయిటింగ్ జాబితా విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. వెబ్‌సైట్ http://acad.uohyd.ac.in లేదా http://www.uohydac.in ద్వారా దరఖాస్తు, ప్రాస్పెక్టస్ అందుబాటులో ఉంటాయి. 5 ఏళ్ల ఐఎంఎస్సీ-మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, అప్లైడ్ జియాలజీ, ఎం.ఆప్టమ్- మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ, ఐఎంఏ సైకాలజీ, తెలుగు, హిందీ, లాంగ్వేజ్ సైన్సెస్, ఉర్దూ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఆంత్రపాలజీ, 4 ఏళ్ళ బీఎస్(హానర్స్/రీసెర్చ్) వంటి కోర్సులు అందుబాటులో ఉంటాయి. ఈ 17 కోర్సుల్లో మొత్తం 465 సీట్లు అందుబాటులో ఉండగా, అందులో జనరల్ కేటగిరీలో 187 సీట్లు, ఎస్సీలకు 71, ఎస్టీ 34, ఓబీసీలకు 126, ఈడబ్ల్యూఎస్ 47, పీడబ్ల్యూడీ 22, డీపీ కింద 22 సీట్లు అందుబాటులో ఉంటాయి.

డెంగీ డేంజర్ బెల్స్

ప్రతీరోజు 2, 3 కేసులు నమోదు

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఇప్పటికే 150 కేసులు
- వైద్యశాఖ గుర్తించిన జ్వర పీడితులు 20 వేల మంది
- లోపించిన పరిశుభ్రత... విజృంభిస్తున్న వ్యాధులు


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం


సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 150 డెంగీ, 104 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి. గతేడాది ఇదే సీజన్‌లో 103 డెంగీ కేసులను అధికారులు గుర్తించారు. పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో విషజ్వరాలు, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు వంటి కేసులు పెరిగాయి. బస్తీలు, పురపాలికల్లో బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు లభించకపోవడంతో నగరలోని ప్రైవేట్ ఆసుపత్రులను రోగులు ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్యశాఖ దోమల నిర్మూలన, పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది.

జ్వర పీడితులు 20 వేల మంది..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో జనవరి నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన ఇంటింటి ఫీవర్ సర్వేలో 20 వేల మంది ప్రజలు జ్వరంతో బాధపడుతున్నట్లు వైద్య శాఖ గుర్తించింది. ఈ మేరకు వారికి మందులు అందజేసింది. ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ సిబ్బంది వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, నీటి శుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే, అవసరమున్న చోట హెల్త్ క్యాంపులతోపాటు రక్త నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో శరీరంలో రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వారు త్వరగా వ్యాధుల బారిన పడుతున్నారు.

దోమల నియంత్రణపై..

జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతో బస్తీలు, గ్రామిక వాడలు, పట్టణాలు, కాలనీల్లోని పలు చోట్ల వర్షపు నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమల నియంత్రణకు ఫాగింగ్ వంటి చర్యలతోపాటు వైద్య, ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో అవగాహనతో కూడిన ప్రచార కార్యక్రమాలను చేపడుతోంది. మరోవైపు ప్రైవేట్ ఆసుపత్రులు పరీక్షలు, వైద్య సేవల పేరుతో రోగ పీడితుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నాయి.



కానరాని ఫాగింగ్

జిల్లాలో మూసీ పరీవాహక ప్రాంతం ఉండటంతోపాటు కూకట్‌పల్లి, గాజులరామారం, మల్కాజిగిరి, ఉప్పల్, కాప్రా, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిళ్లలో బస్తీలతోపాటు బోడుప్పల్, పీర్జాదిగూడ, దమ్మాయిగూడ, ఘట్కేసర్, మేడ్చల్ పట్టణాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంతో దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయి. వాటి నివారణకు ఫాగింగ్ చేపట్టడాన్ని అధికారులు విస్మరించారు.

జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయొద్దు



జిల్లాలో జ్వరాలకు సంబంధించిన మందులు అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయి. ఎవరికైనా జ్వరం ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం పొందాలి. డెంగీ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్ పరీక్షలు ఉచితంగా చేస్తారు. జ్వరమే కదా అనుకుంటే.. ప్రాణాల మీదకు వచ్చే ప్రమాదం ఉంది. ఫీవర్ సర్వేలో జ్వర పీడితులను గుర్తించి మందులు పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్ ఉమాగౌరి, డీఎంహెచ్ఓ, మేడ్చల్ జిల్లా

ప్రజాయుద్ధనౌక గద్దర్‌పై రచనలకు ఆహ్వానం

గద్దర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సూర్య కిరణ్

హిమాయత్‌నగర్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ అమరత్వంపై, ఆయన చేసిన సాహిత్య, సాంస్కృతిక విశిష్టత, కృషిని తెలియజెబుతూ వచ్చిన పాటలు, కవిత్వం, వ్యాసాలను ఆహ్వానిస్తున్నట్లు గద్దర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జి.వి.సూర్య కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గద్దర్ పోరాట చరిత్రను చెబుతూ అనేకమంది కవులు, రచయితలు, ప్రజా కళాకారులు, మేధావులు రాసిన వ్యాసాలు, పాటలను ప్రజలకు అందించేందుకు ఫౌండేషన్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ రచనలు అన్నింటిని పుస్తకం రూపంలో తీసుకురానున్నట్లు తెలిపారు. పాటలు, కవితలు ఇంతకు ముందు ఎక్కడైనా ప్రచురితమైనా, కాకపోయినా పంపించాలని కోరారు. యూట్యూబ్ చానల్ పాటలను రచయితల అనుమతితో ప్రచురించనున్నట్లు తెలిపారు. తమ రచనలను 73960 65999, 9000741188 వాట్సాప్ నంబర్లకు, పోస్టులో అయితే ప్లాట్ నెంబర్: 26, ఇంటి నెంబర్: 23/126/1/ఏ నల్ల పోచారం టెంపుల్, భూదేవినగర్ కాలనీ, సికింద్రాబాద్-500015 కు పంపాలని సూచించారు. తమ రచనలతోపాటు అడ్రస్, ఫోన్ నెంబర్, ఒక పాస్ ఫొటో పంపించాలని కోరారు.

11న యూపీఐటీఎస్ రోడ్ షో

నాంపల్లి: ఉత్తరప్రదేశ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో (యూపీఐటీఎస్)-2025 రోడ్ షో ఈ నెల 11న ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) రెడ్‌హిల్స్ ప్రాంగణంలో జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఇండియా ఎక్స్‌పొజిషన్ మార్ట్ లిమిటెడ్ (ఐఇఎంఎల్) సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమని తెలిపారు. ఉత్తరప్రదేశ్ ఎంఎస్ఎంఇ, ఎగుమతి ప్రోత్సాహక విభాగం ముఖ్యకార్యదర్శి అలోక్ కుమార్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ఆ రాష్ట్ర గ్రామీణ పరిశ్రమలు, ఖాదీ శాఖల మంత్రి రాకేష్ సచాన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఉత్తరప్రదేశ్‌ను వ్యాపార, పెట్టుబడి గమ్యస్థలంగా అభి వృద్ధి చేయడమే ఈ రోడ్డు షో లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

బస్తీల్లో ఇంజినీర్ల ముఖాముఖి

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాల మేరకు విద్యుత్ ఇంజినీర్లు క్షేత్రస్థాయి పర్యటనల్లో నిమగ్నమయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయా సర్కిళ్ల సూపరింటెండింట్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు బస్తీల్లో/ కాలనీల్లో పర్యటిస్తూ వినియోగదారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. మిగిలిన వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత సెక్షన్ ఇంజినీర్లను ఆదేశించారు.

పాతబస్తీ కాదిది.. చారిత్రక నగరం


చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

- పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

చార్మినార్: బోనాల పండుగను అత్యంత వైభవంగా కన్నుల పండువగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసిందని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో దేవాలయాల కమిటీ ప్రతినిధులకు ఆర్థిక సహకారం చెక్కులను బుధవారం ఆయన హరిబౌలిలోని అక్కన, మాదన్న దేవాలయ ప్రార్థనా మందిరంలో అందజేశారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ పాతబస్తీ కాదని, చారిత్రక నగరమని పేర్కొన్నారు. తెలంగాణ బోనాల పండుగకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ఇక్కడ జరిగే వేడుకలు మతసామరస్యాన్ని కాపాడుతూ ఐకమత్యాన్ని చాటి చెప్తాయని పేర్కొన్నారు. బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ అధ్యక్షుడు గాజుల అంజయ్య, రాకేష్ తివారి, పాటిల్ సదానంద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులొస్తున్నాయి.. జాగ్రత్త!

- జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి వెంకటి

సాక్షి, సిటీ బ్యూరో: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి జె.వెంకటి అన్నారు. బుధవారం పబ్లిక్ హెల్త్, మెడికల్ ఆఫీసర్లు, జీహెచ్ఎంసీ సిబ్బందితో సికింద్రాబాద్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత తాగునీరు, దోమల వల్లే అత్యధిక రోగాలు ప్రబలుతాయని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో డయేరియా, టైఫాయిడ్, దగ్గు, జలుబు, మలేరియా, డెంగూ, చికున్ గున్యా, బోధకాలు, మెదడువాపు వ్యాధుల ముప్పు పొంచి ఉందన్నారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, నీటిని నిల్వ, మురుగు నీటి నిర్వహణపై అవగాహన కల్పించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో జీహెచ్ఎంసీ, వైద్యారోగ్య సిబ్బంది కలసి లార్వా నివారణ, ఫీవర్ సర్వే పనులు చేపట్టాలన్నారు. బస్తీ దవాఖానా, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ ప్రత్యేక అధికారి ఆర్ పుష్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లపై కదం తొక్కిన కార్మికులు

- ఆ చట్టాలను వెనక్కి తీసుకోవాలని నేతల డిమాండ్
- ధర్నా చౌక్‌లో భారీ బహిరంగ సభ

కవాడిగూడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక విధానాలను వ్యతిరేకిస్తూ బుధవారం కార్మికులు కదం తొక్కారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ముగింపు సభ నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ, టీఎన్‌టీయూసీ, ఏఐయూటీయూసీ తదితర కార్మిక సంఘాల నేతలు, కార్మికులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులు, పరిశ్రమల యజమానుల కోసం 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా మార్చిందని దుయ్యబట్టారు. వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, లేని పక్షంలో కార్మిక వర్గం ఆగ్రహానికి బలి కావలసి వస్తుందని అన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సైతం 10 గంటలకు పనిదినాన్ని పెంచుతూ జీవో ఇవ్వడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఆర్డీ చంద్రశేఖర్, కిషన్, యాదగిరి, కుమారస్వామి ఎం.వెంకటేష్, ప్రవీణ్, అనురాధ, అరుణ, బోస్, నారాయణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్రానికి గుణపాఠం తప్పదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించకోకుంటే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి వీఎస్‌టీ , ఆర్టీసి క్రాస్ రోడ్డు మీదుగా ఇందిరాపార్క్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా బీజేపీ ప్రభుత్వం ప్రజలను అణిచివేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. దేశ సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పగించేందుకు కుట్ర చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. కనీస వేతనాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని అన్నారు. ధరలను నియంత్రణ చేయడంతోపాటు పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

3వ తేదీన టీటీసీ పరీక్షలు

సాక్షి,సిటీ బ్యూరో: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్(టీటీసీ) లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షలు వచ్చే నెల 3న నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి రోహిణి తెలిపారు. మే, జూన్ నెలల్లో 42 రోజులపాటు టీటీసీ సమ్మర్ ట్రైనింగ్ పూర్తి చేసిన వారితోపాటు గతంలో పరీక్ష ఫెయిలైన అభ్యర్థుల కోసం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 3న ఉదయం 11:00 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు ఎడ్యుకేషనల్ సైకాలజీ, స్కూల్ అడ్మినిస్ట్రేషన్, మధ్యాహ్నం 2:00 నుంచి 3:00 గంటల వరకు బోధనా పద్ధతులు(జనరల్), మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల వరకు బోధనా పద్ధతులు(స్పెషల్) పరీక్షలు జరుగుతాయని ఆమె వివరించారు.

సమ్మెలో గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్స్

సాక్షి,సిటీబ్యూరో: జాతీయ సమ్మెలో భాగంగా తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఫ్లాష్ స్ట్రైక్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 వేలమంది కాబ్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, డెలివరీ వర్కర్లు, కార్మికులు పాల్గొన్నట్లు గిగ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ తెలిపారు. గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్ల కోసం ప్రత్యేక చట్టం, సామాజిక భద్రతతో కూడిన వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా నిలుస్తున్న గిగ్ కార్మికులకు న్యాయం చేయాలన్నారు.

చెరువు భూముల్ని కబ్జా చేస్తే సహించేది లేదు


బైరామల్‌గూడ చెరువు కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న రంగనాథ్, మల్‌రెడ్డి రాంరెడ్డి

చంపాపేట: చెరువు భూముల్ని కబ్జా చేస్తే సహించబోమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ చెరువులో కబ్జాకు గురైన స్థలాన్ని బుధవారం ఆయన రాష్ట్ర రోడ్స్ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, నాయకులు ఆలె వెంకటరెడ్డితో కలిసి పరిశీలించారు. బైరామల్‌గూడ చెరువు రెవెన్యూ రికార్డుల ప్రకారం ఎంత ఉంది... ప్రస్తుతం ఎంత ఉంది.. అని ఆయన స్థానికులను ఆరా తీశారు. త్వరలో రికార్డుల ఆధారంగా చెరువు స్థలాన్ని సర్వే చేయించి హద్దుల ఏర్పాటు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

ఇంటర్‌తో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలు

ఎంఏ కోర్సులకు మెడికల్, ఇంజనీరింగ్ విద్యార్థులు అర్హులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులని సీపీగెట్-2025 కన్వీనర్ ప్రొ.పాండురంగా రెడ్డి బుధవారం తెలిపారు. శాతావాహన, తెలంగాణ వర్సిటీల్లో ఐదేళ్ల ఎంబీఏ, పాలమూరు, మహాత్మ గాంధీ వర్సిటీల్లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, కేయూలో ఐదేళ్ల ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు సీపీగెట్-2025 ద్వారా ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. పలు పీజీ కోర్సుల్లో ఇంజినీరింగ్, మెడిసిన్, అడిగ్రీ కల్చరల్, ఫార్మసీ తదితరల డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఎంఏ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులని తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 17 వరకు సీపీగెట్-2025కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సీపీగెట్-2025కు ఇంత వరకు 35 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో 24 వేల మంది విద్యార్థినులేనని వివరించారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 10, జూలై, 2025

ఫోన్ లేదు, ల్యాప్‌టాప్ లేదు, గాడ్జెట్లు లేవు.. ప్రశాంతతను ఆస్వాదిస్తూ కామ్‌గా తోచిన పని చేసుకుంటూ.. తలుచుకుంటేనే ఓహ్ అనిపిస్తోంది కదా.. ప్రస్తుతం నగరంలో కొందరు అనుసరిస్తున్న మార్గం ఇదే.. డిజిటల్ డిటాక్స్. ఫోన్లు మన జీవితంలో ఒక అనివార్యమైన భాగం అయినప్పుడు నడిపించే అవయవాల్లో ఒకటిగా మారిపోయినప్పుడు.. డిజిటల్ డిటాక్స్ ఖచ్చితంగా చాలా కష్టమైన పని అనేది నిస్సందేహం. అయితే అది అందించే ప్రయోజనాలు ఇతర మార్గాల ద్వారా అసాధ్యం అనేది కూడా నిర్వివాదమే. - సాక్షి, సిటీబ్యూరో





మలేషియాలో ఫుట్‌బాల్ టోర్నమెంట్

నగరం నుంచి 9మంది క్రీడాకారులు

సాక్షి, సిటీబ్యూరో: మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరగనున్న లాలీగా యూత్ ఫుట్‌బాల్ టోర్నమెంట్(అండర్-16)కు నగరం నుంచి 9 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. భారత్ తరఫున ఎంపికైన 16 మంది క్రీడాకారుల్లో తొమ్మిది మంది నగరానికి చెందిన వారే కావడం విశేషం. వారిలో ఫవ్వాజ్ మహ్మద్ ఖాన్, అమాష్ యూసుఫ్ సుబ్హాని, మహ్మద్ అబాన్ హుస్సైన్, మహ్మద్ ఆఫూ తాహా కురేషి, మహ్మద్ మహబూబ్ ఖాన్, ఐమాన్ సుబ్హాని, అర్మాన్ హుస్సైన్, అన్వర్ కురేషి ఫహద్ మహ్మద్ ఖాన్ ఉన్నారు. ఈ క్రీడాకారుల బృందం బుధవారం రాత్రి నగరం నుంచి బయలుదేరి, జూలై 15న తిరిగి వస్తుందని వీరికి శిక్షణ ఇస్తున్న కోచ్ తెలిపారు.





డిటాక్స్..! రిలాక్స్..

సిటీలో డిజిటల్ డిటాక్స్ పట్ల పెరుగుతున్న ఆసక్తి

- స్వల్ప కాలమైనా టెక్నాలజీకి దూరమవ్వాలనే ఆలోచన
- పట్టుదలగా ప్లాన్ చేస్తే సక్సెస్ అవుతారంటున్న సైకాలజిస్టులు
- అనుకుంటున్నా ఫెయిలవుతున్నవాళ్లే ఎక్కువ

'గాడ్జెట్‌లు, స్క్రీన్స్ లేదా ఇంటర్నెట్ ప్లాట్‌ఫారమ్‌లను నిర్ణీత సమయం వరకు ఉపయోగించకుండా ఉండటమే.. డిజిటల్ డిటాక్స్' అని గేట్‌వే ఆఫ్ హీలింగ్ వ్యవస్థాపకులు, మానసిక వైద్యులు డాక్టర్ చాందిని నిర్వచిస్తారు. ఇది విశ్రాంతి తీసుకోవడానికి, రీసెట్ చేయడానికి మధ్యన సాగే ఒక సంక్షిప్తమైన అభ్యాసం. సెల్‌ఫోన్స్, ల్యాప్‌టాప్‌లు, సోషల్ మీడియా ఇమెయిల్స్ నుంచి డిస్‌కనెక్ట్, అలాగే ఆఫ్‌లైన్ ప్రపంచంతో తిరిగి కనెక్ట్ అవ్వడానికి ఉద్దేశించింది అంటున్నారామె. అధిక డిజిటల్ కమ్యూనికేషన్ ద్వారా వచ్చే మానసిక అలసటను తగ్గించడం దీని ప్రధాన లక్ష్యం.

డిజిటల్ డిటాక్స్ సాధ్యమేనా?

'స్కూళ్లలో ఫోన్లతో చెల్లింపులు, ల్యాప్‌టాప్‌లు టాబ్లెట్‌లతో పనిపాటలు, యాప్‌ల ద్వారా సంప్రదింపులు.. కోవిడ్ తర్వాత సమూలమైన జీవిత-సాంకేతికత కనెక్షన్ ఏర్పడింది. సాంకేతికతపై పూర్తిగా ఆధారపడే నేటి ప్రపంచంలో, డిజిటల్ డిటాక్స్ హడావుడిగా ప్రారంభిస్తే గందరగోళం ఏర్పడవచ్చు. సో, చిన్నగా ప్రారంభించవచ్చు. ముందస్తుగా ఒక వారం కాకపోయినా, ఒక రోజుతోనైనా మొదలు పెట్టవచ్చు అంటున్నారు సైకాలజిస్టులు.





'డిటాక్స్' సక్సెస్ కావాలంటే..

- కుటుంబం, స్నేహితులు, సహోద్యోగులు సహా సంప్రదించాల్సిన వారందరికీ నిర్ణయాన్ని తెలియజేయాలి. అత్యవసర పరిస్థితుల కోసం ప్రత్యామ్నాయ సంప్రదింపు మార్గాల్ని సిద్ధం చేయాలి.
- డిజిటల్ కమ్యూనికేషన్ లేదా యాక్సెస్ అవసరమయ్యే వ్యాపార లేదా వ్యక్తిగత విధులు ఉంటే, వేరొకరికి కేటాయించడం లేదా డిటాక్స్ తర్వాత రోజులకి వాయిదా వేయాలి.
- డిజిటల్ కమ్యూనికేషన్‌కు అందుబాటులోకి వచ్చే సమయం గురించి తెలిపే ఆటోమేటిక్ ఇమెయిల్ వాయిస్‌మెయిల్ ప్రత్యుత్తరాలను సెటప్ చేయాలి.
- డిజిటల్ గాడ్జెట్‌ల వైపు ప్రలోభాలను నివారించడానికి, ఆసక్తికరమైన ఆఫ్‌లైన్ కార్యకలాపాలు, అభిరుచులు, విహారయాత్రలను ప్లాన్ చేసుకోవాలి.
- ఉచిత వైఫై ఉన్న కేఫ్‌లు లేదా టీవీ స్క్రీన్‌లతో కూడిన పబ్లిక్ ప్రాంతాలు వంటి డిజిటల్ వైపు నడిపించే ప్రదేశాలు లేదా పరిస్థితులను నివారించాలి.
- ప్రోత్సహించడానికి ఉత్సాహంగా ఉంచడానికి స్వల్ప వ్యవధుల్లో డీటాక్స్‌కు సంబంధించి సక్సెస్ పార్టీలను జరుపుకోవచ్చు.



ప్రయోజనాలెన్నో..

శారీరక, మానసిక ఆరోగ్యంపై డిజిటల్ డిటాక్స్ సానుకూల ప్రభావాలను చూపుతుందంటున్న క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ దినిక ఆనంద్ మాట్లాడుతూ.. 'ఆన్‌లైన్‌లో ఎంత సమయం గడుపుతున్నారనే దానిపై ఆధారపడి డిజిటల్ డిటాక్స్ నిర్దిష్ట ప్రయోజనాలు వ్యక్తి నుంచి వ్యక్తికి మారవచ్చు' అంటున్నారు. అయితే డిజిటల్ డిటాక్స్ మనకు చాలా సమయాన్ని తిరిగి ఇస్తుంది. నిర్ణీత వ్యవధిలో సమాచారం నోటిఫికేషన్స్ సహా డిజిటల్ దాడి నుంచి రక్షిస్తుంది' అంటారామె. డిజిటల్ డిటాక్స్ ప్రయోజనాలను ఢిల్లీకి చెందిన ప్రముఖ మనస్తత్వవేత్త కౌన్సిలర్ డాక్టర్ షీనా సూద్ ఇలా వివరిస్తున్నారు.

- కొత్త విశేషాలను కోల్పోతామనే భయంతో ఫోన్లకు అతుక్కుపోవడం ఆహారం, వ్యాయామం, నిద్ర షెడ్యూల్‌పై ప్రభావం చూపుతోంది. డిజిటల్ డిటాక్స్ ఆరోగ్యకరమైన అలవాట్లను పునరుద్ధరిస్తుంది.
- గాడ్జెట్‌లు విడుదల చేసే రివార్డ్ హార్మోన్ డోపమైన్ మంచి అనుభూతిని ఇవ్వడంతో దాన్ని పదేపదే కోరుకుంటాం. అయితే ప్రతి స్క్రోల్ మన మెదడులోని అదే ప్రాంతాలలో డోపమైన్ విడుదలను ప్రేరేపిస్తుంది. ఇవి హానికరమైన పదార్థాలకు ప్రతిస్పందిస్తాయి. డిజిటల్ డిటాక్స్ మనం ఈ వ్యసనం వలలో పడకుండా సహాయపడుతుంది.



- అవాంఛనీయ ప్రమాణాలను నిర్ణయించుకోడానికి, అనారోగ్యకరమైన ఎక్స్‌పోజర్‌లకు దారి తీసే సోషల్ మీడియాతో తెగతెంపులు మన స్వీయ- ఇమేజ్‌ను పునరుద్ధరించడానికి, నిజమైన స్వభావాన్ని అంగీకరించడానికి మనకు అవకాశం లభిస్తుంది.
- డిజిటల్ పరికరాలు విడుదల చేసే నీలి కాంతి శరీరపు సాధారణ నిద్ర-మేల్కొలుపు చక్రానికి అంతరాయం కలిగిస్తుంది. నిద్ర నాణ్యత కోల్పోయేలా చేస్తుంది. డిజిటల్ డిటాక్స్‌తో ప్రశాంతమైన నిద్ర సాధ్యం.
- గార్డెనింగ్, బుక్ రీడింగ్.. వంటి ఆరోగ్యకర అభిరుచులను తిరిగి తెస్తుంది.



పోనీ సెలూన్స్ కన్వర్షన్

చిన్న స్థాయి, బ్రాండ్ లేని సెలూన్లకు తోడ్పాటు
పింక్స్ అండ్ బ్లూస్ ఆధ్వర్యంలో నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా బ్యూటీ అండ్ వెల్‌నెస్ రంగంలో పేరొందిన పింక్స్ అండ్ బ్లూస్, చిన్నస్థాయి బ్రాండ్ లేని సెలూన్లను సమర్థవంతంగా మారుస్తూ పోనీ సెలూన్స్ కన్వర్షన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ప్రధానంగా నాయీ బ్రాహ్మణుల సంప్రదాయ సేవలకు కొత్త రూపం ఇవ్వడమే కాకుండా వారికి ఆధునిక శిక్షణ, వ్యాపార ప్రక్రియలు, బ్రాండింగ్, మార్కెటింగ్ మద్దతు అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో నగరంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో హైదరాబాద్, పరిసర ప్రాంతాల సెలూన్ యజమానులు పాల్గొన్నారు. జనశక్తి నాయీ బ్రాహ్మణ సంఘం నేతృత్వంలో జరిగిన ఈ ఈవెంట్‌లో 'ఇది కేవలం వ్యాపారం కాదు, ఇది సంప్రదాయాన్ని నిలుపుకునే సామాజిక ఉద్యమం' అని సంస్థ స్థాపకురాలు సీతాదేవి అన్నారు. పోటీగా మారిన బ్యూటీ మార్కెట్‌లో స్థానిక ప్రతిభకు ఊతమిస్తూ, వారసత్వ విలువలను కాపాడే దిశగా పింక్స్ అండ్ బ్లూస్ ఈ కార్యక్రమాన్ని నడిపిస్తోంది.



నగరవాసులకు కబాబ్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పనిలేదు. కుటుంబం, స్నేహితులు, ఆఫీస్ కొలీగ్స్‌తో సందర్భం ఏదైనా సెలబ్రేట్ చేసుకోవాలని రెస్టారెంట్, స్ట్రీట్ ఫుడ్‌కి వెళ్లినప్పుడు సిటీవాసులు బిర్యానీ కంటే ముందు కబాబ్ ఉండాల్సిందే అంటున్నారు. వెజిటేరియన్స్, నాన్ వెజ్ ప్రియులకు వేర్వేరు రకాల కబాబ్స్ నోరూరిస్తున్నాయి. రాత్రి పూట స్ట్రీట్ ఫుడ్‌లో బొగ్గులపై కాల్చిన వేడివేడి చికెన్ కబాబ్‌లను లొట్టలేసుకుని ఆరగించేస్తున్నారు. - సాక్షి, సిటీ బ్యూరో



వావ్.. కబాబ్

- ఆహారప్రియుల నోరూరిస్తున్న వంటకాలు
- ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో ఫేమస్

కబాబ్ అనేది అరబిక్ పదం. కాల్చిన, వేడి చేడిచేసిన అని అర్థం. దక్షిణాసియాలో ఇది పాపులర్ వంటకం. ప్రస్తుతం భారత్, టర్కీ, పర్షియా దేశాల ఆహార ప్రియుల మనసు దోచేస్తోంది. చికెన్, మటన్‌ను మసాలా దినుసులతో మ్యారినేట్ చేసి నిప్పుపై నెమ్మదిగా వేడి చేస్తారు. శాఖాహారులకు సోయాబీన్, పనీర్ తదతర కబాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో వివిధ రకాల కబాబ్‌లకు ప్రత్యేక గుర్తింపు ఉంది.



జఫ్రానీ కల్మీ కబాబ్: జమ్మూకశ్మీర్‌లో జఫ్రానీ కల్మీ కబాబ్ ఫేమస్. ఇది కుంకుమపువ్వు(జాఫ్రాన్)తో రుచికరమైన కల్మీ ముక్కలతో(చికెన్ డ్రమ్ స్టిక్స్) తయారు చేస్తారు. ఇది మొఘలాయ్ వంటకాల నుంచి వచ్చిన ఒక ప్రసిద్ధ వంటకం. చికెన్ ముక్కలను పెరుగు, అల్లం-వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి, నిమ్మరసం, కుంకుమ పువ్వుతో కలిపి మసాలాతో బాగా మ్యారినేట్ చేస్తారు. దీనిని తందూరీ లేదా పాన్‌లో కాల్చుతారు. మృదువైన చికెన్, సున్నితమైన కుంకుమపువ్వు రుచి అద్భుతంగా ఉంటుంది.

పాటియాలా తంగ్డి కబాబ్: పాటియాలా తంగ్డి కబాబ్ పంజాబ్ ప్రాంతానికి చెందిన వంటకం ఇది. చికెన్ డ్రమ్ స్టిక్స్ పెరుగు, అల్లం-వెల్లుల్లి పేస్ట్, మిరప పొడి, గరం మసాలా, ధనియాలు, జీలకర్ర పొడి, నిమ్మరసం వంటివి బాగా కలిపి మ్యారినేట్ చేయాలి. రుచితో పాటే మంచి సువాసనలను వెదజల్లుతుంది. ప్రోటీన్, కొవ్వు అధికంగా ఉంటుంది. మధుమేహం ఉన్నవారు తక్కువ కార్బోహైడ్రేట్ ఆహారంగా తీసుకోవచ్చట.







రేష్మి మలై కబాబ్: రేష్మి మలై కబాబ్ మధ్యప్రదేశ్‌లో ప్రసిద్ధి చెందిన చికెన్ కబాబ్. ఎముకలు లేని చికెన్(బోన్‌లెస్) ముక్కలతో తయారు చేస్తారు. వీటిని పెరుగు, క్రీమ్, జీడిపప్పు పేస్ట్, మసాలాల మిశ్రమంలో మెరినేట్ చేసి, ఆపై తందూరిలో కాలుస్తారు. దీన్నే మలై కబాబ్ అని కూడా అంటారు. ఇది కూడా మొఘలాయి వంటకాల్లోనిదే.

పెషావర్ తంగ్డి కబాబ్: పొరుగు దేశమైన పాకిస్తాన్‌లోని పెషావర్ పుట్టినిల్లు. ఢిల్లీలో పెషావర్ తంగ్డి కబాబ్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. జ్యూసీ చికెన్ లెగ్స్‌ను అల్లం-వెల్లుల్లి, నిమ్మరసం, పెరుగు, క్రీమీ పెషావరి మసాలా దినుసులతో మ్యారినేట్ చేస్తారు. గ్రిల్‌పై కాల్చడం, ఒవెన్‌లో 180 డిగ్రీల వద్ద 25 నిమిషాల నుంచి 30 నిమిషాలు ఉంచుతారు. చికెన్ మృదువుగా జూసీగా ఉంటుంది.

తేచా పన్నీర్ టిక్కా కబాబ్: పన్నీరు ముక్కలను పచ్చిమిర్చి, వెల్లుల్లి, కొత్తిమీరతో తయారు చేసిన మహారాష్ట్ర చట్నీ తేచాలో మ్యారినేట్ చేస్తారు. దీన్ని కబాబ్‌లా కాలుస్తారు. తేచా మసాలా రుచి పన్నీర్ కలిసినప్పుడు ప్రత్యేకమైన రుచిని అందిస్తాయి. పన్నీర్ ముక్కలు జూసీగా ఉంటాయి. ఇది శాకాహార కబాబ్‌గా ఖ్యాతి గాంచింది.



క్లాసిక్ వేదికగా కుమార్ సాను కన్సర్ట్

26వ తేదీన శంషాబాద్ క్లాసిక్ కన్వెన్షన్-3లో నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: ఈ ఏడాది అతి పెద్ద సంగీత కార్యక్రమానికి హైదరాబాద్ సిద్ధం కాబోతోంది. నగరం వేదికగా ప్రముఖ ఇండియన్ లెజెండరీ ప్లేబ్యాక్ సింగర్ కుమార్ సాను ఆధ్వర్యంలో లైవ్ కన్సర్ట్ నిర్వహించనున్నారు. ఈ నెల 26వ తేదీన శంషాబాద్ క్లాసిక్ కన్వెన్షన్-3లో ఈ ప్రతిష్ఠాత్మక కన్సర్ట్ జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్డెక్స్ గ్రూప్ ఎండీ డీ.జయరామ్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ వినోద రంగంలో సరికొత్త ప్రయాణాన్ని సృష్టించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ మ్యూజిక్ వేదికపై కుమార్ సానూ అద్భుత ప్రతిభతో పాటు తమ ప్రొడక్షన్ విలువలతో అభిమానులకు సంగీత హోరు అందించనున్నామని పేర్కొన్నారు. ఈ కన్సర్ట్‌కు సంబంధించిన టికెట్లు బుక్ మై షో ద్వారా అందుబాటులో ఉన్నాయన్నారు.



వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్

కాచిగూడ: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ నారాయణగూడ బ్రాంచి ఆధ్వర్యంలో 24, 25, 26 తేదీల్లో 25వ వార్షిక వైఎంసీఏ కార్గిల్ విక్టరి స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రిస్టిలీ గైస్, ప్రతినిధి బీజే వినయ స్వరూప్ తెలిపారు. నారాయణగూడలోని వైఎంసీఏలో బుధవారం వారు మాట్లాడుతూ బాలబాలికలకు సీనియర్స్, జూనియర్స్ విభాగంలో లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, కరాటే, చెస్, కిక్ బాక్సింగ్, బాక్స్ క్రికెట్, మార్చ్ ఫాస్ట్ తదితర పోటీలు ఉంటాయని తెలిపారు. 17 ఏళ్ల లోపు విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనేందుకు అర్హులు. 22వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని వారు సూచించారు. వివరాలకు ఫోన్: 77996 65544, 70326 60614, 93910 25959.

క్లుప్తంగా...

కుదుటపడ్డ కేసీఆర్ ఆరోగ్యం

నేడు మరోసారి వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి..



సాక్షి, హైదరాబాద్: ఐదు రోజులుగా నందినగర్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యం కుదుటపడినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆస్పత్రిలో రెండ్రోజుల పాటు వైద్య పరీక్షలు చేయించుకున్న కేసీఆర్ నందినగర్ నివాసంలో ఉంటున్న సంగతి తెలిసిందే. వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటున్న కేసీఆర్ వరుసగా పార్టీ నేతలతోనూ భేటీ అవుతున్నారు. రాష్ట్రంలో నెలకొన్న వివిధ సమస్యలపై ఆరా తీస్తూ భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేస్తున్నారు. బనకచర్ల లింక్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణకు జరిగే నష్టంపై కేసీఆర్ త్వరలో మీడియా ముందుకు వస్తారని పార్టీ వర్గాలు ప్రకటించాయి. జిల్లాలవారీగా రాజకీయ పరిస్థితులపై ఆరా తీశారు. కాగా, వైద్యుల సూచనల మేరకు కేసీఆర్ గురువారం మరోసారి వైద్య పరీక్షలకోసం యశోద ఆస్పత్రికి వెళ్తారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

పదేళ్లు ప్రజలు మంత్రులతో మాట్లాడే అవకాశం లేకుండేది

- కార్మిక శాఖమంత్రి వివేక్ వెంకటస్వామి



సాక్షి, హైదరాబాద్: గత పదేళ్ల కాలంలో ప్రజలకెప్పుడూ మంత్రులతో మాట్లాడే అవకాశం లేకుండేదని, ప్రజా ప్రభుత్వంలో ప్రజల వద్దకే మంత్రులు వచ్చి వారి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తున్నారని కార్మిక శాఖమంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చొరవతో మంత్రులమే గాంధీభవన్‌కు వచ్చి అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన 'మంత్రితో ముఖాముఖి'కార్యక్రమానికి వివేక్ హాజరయ్యారు. పలు సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, డీసీసీ అధ్యక్షుడు ఈర్ల కొమురయ్య తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తమ భూములకు వచ్చిన పట్టాలను బీఆర్ఎస్ నేతలు గుంజుకున్నారంటూ బాధితులు తనను కలిశారని, కలెక్టర్‌తో మాట్లాడానని చెప్పారు. జిల్లాలో ఎమ్మెల్యేలే రాజులని, మంత్రులు ఆ రాజులకు అవసరమైన సహాయం చేస్తుంటారని చెప్పారు.

చేతులు మారిన రూ.వెయ్యి కోట్ల ముడుపులు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పౌర సరఫరాల శాఖలో జరిగిన కుంభకోణంలో రూ.1,000 కోట్ల ముడుపులు చేతులు మారాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. ఈ కుంభకోణంపై విచారణ సంస్థలకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకం ద్వారా రూ.7,600 కోట్లు ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందన్నారు. టెండర్ల ప్రక్రియకు 90 రోజులు గడువు విధించగా, ఇప్పటికే 605 రోజులు పూర్తయినా ధాన్యం అమ్మకం ప్రక్రియ పూర్తి కావడం లేదని చెప్పారు గంగుల బుధవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. క్వింటాల్ ధాన్యం ధర రూ.2,007గా నిర్ణయించినా, టెండర్లు దక్కించుకున్న సంస్థలు మిల్లర్ల నుంచి రూ.2,330 చొప్పున వసూలు చేశాయన్నారు. కాంట్రాక్టు సంస్థలు ప్రభుత్వ పెద్దలకు రూ.1,000 కోట్లు ముడుపులు ఇచ్చాయని, దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. పభుత్వ ఖాతాకు సొమ్ము జమ చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం కాపాడుతోందని విమర్శించారు.

ఆస్పత్రుల్లో 'ఆయుష్మాన్'ను తిరస్కరిస్తున్నారు

బీజేపీ నేత యెండల లక్ష్మీనారాయణ

సాక్షి, హైదరాబాద్: నిమ్స్ ఆస్పత్రితో సహా రాష్ట్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు ఆయుష్మాన్ భారత్ పథకం కింద రోగులను చేర్చుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై బీజేపీ నిర్వహించిన భరోసా కార్యక్రమానికి ఈ అంశంపై పెద్ద ఎత్తున వినతులు వచ్చాయన్నారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ భరోసా కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ రాష్ట్రంలో అమలవుతోందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. నిమ్స్ వంటి ప్రధాన ఆస్పత్రుల్లో అమలు కావడం లేదని, ప్రైవేటు ఆస్పత్రులు కూడా ఇదే అనుసరిస్తున్నాయని తెలిపారు. ఏడాదిలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా కేవలం రిసిప్టులతో సరిపెడుతున్నాయని యెండల మండిపడ్డారు. సన్న బియ్యం ఇస్తున్నామని చెబుతూ, కొందరు కాంగ్రెస్ మంత్రులు పేదల ఇళ్లకు వెళ్లి భోజనం చేశారని, కానీ ప్రజలకు ఒక్కొక్కరికి పంపిణీ చేస్తున్న 6 కిలోల సన్నబియ్యంలో 5 కిలోలు కేంద్రమే సరఫరా చేస్తోందని చెప్పారు.



చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డు వద్దకు భారీ సంఖ్యలో తరలివచ్చిన రైతులు, ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

ఈ ప్రభుత్వం భయపడుతోంది

నేను రైతులను కలవడానికి ఇన్ని ఆంక్షలా?

నన్ను కలవడానికి వస్తున్న మామిడి రైతులను ఎందుకు అడ్డుకున్నారు?

చంద్రబాబు కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, తిరుపతి: 'రాష్ట్రంలో ఇవాళ రైతులు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లేని పరిస్థితి. వరి తీసుకుంటే దాదాపు రూ.300 నుంచి రూ.400 తక్కువకు అమ్ముకుంటున్నారు. మిరప, పత్తి, జొన్న, కందులు, మినుములు, పెసలు, మొక్కజొన్న, సజ్జ, రాగులు, అరటి, చీనీ, కోకో, పొగాకు, చివరికి మామిడి.. ఏ రైతు పరిస్థితి చూసుకున్నా దారుణం. ఒక్క ఆంధ్ర రాష్ట్రంలో తప్ప, వేరే రాష్ట్రంలో ఎక్కడైనా కిలో మామిడి రూ.2కే దొరుకుతుందా? కిలో మామిడికి కనీసం రెండున్నర రూపాయలు కూడా రావడం లేదని మామిడి రైతులు చెబుతున్నారు. ఇంత దుర్భర స్థితి ఈరోజు మన రాష్ట్రంలో చూస్తున్నాం'అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస గిట్టుబాటు ధర లేక తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన మామిడి రైతులను పరామర్శించేందుకు బుధవారం ఆయన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డును సందర్శించారు. అక్కడ మామిడి రైతులను కలిసి, వారి కష్టాలు విన్నారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు. 'ఇవాళ నేను మామిడి రైతుల సమస్యలను ఆరా తీసేందుకు ఇక్కడికి వస్తుంటే కూటమి ప్రభుత్వం ఎక్కడా లేని విధంగా ఆంక్షలు పెట్టింది. నా పర్యటనను అడ్డుకునేందుకు విశ్వ ప్రయత్నం చేసింది. ఎక్కడికక్కడ రైతులను సైతం అడ్డుకుంది. రైతులకు మంచి జరగకూడదని కోరుకుంటోంది. ఎవరూ బయటకు తొంగి చూడకూడదని, రైతులు ఎన్ని అగచాట్లు పడుతున్నా కూడా, వాళ్ల జీవితాలు నాశనమైపోతున్నా కూడా ఎవరూ స్పందించ కూడదని ఉద్దేశంగా పెట్టుకుంది. అసలు జగన్ రైతుల్ని కలిస్తే తప్పేమిటి? రైతుల కోసం మాట్లాడితే తప్పేముంది? పోనీ రైతులు అగచాట్లు పడకుండా ఉండి ఉంటే, వారికి అసలు సమస్యే లేకపోతే ఇక్కడికి ఇంత మంది ఎలా వస్తారు? జగన్ వచ్చాడు కాబట్టి.. జగన్ వాళ్లకు తోడుగా నిలబడుతున్నాడు కాబట్టి.. వాళ్ల సమస్య ఇప్పుడైనా ప్రభుత్వం దృష్టికి కచ్చితంగా పోతుందని భావిస్తున్నాం. ఈ ప్రభుత్వాన్ని కుంభకర్ణుడి నిద్ర నుంచి లేపడం కోసమే ఇక్కడికి ఇన్ని వేల మంది వచ్చి తమ ఆక్రందన వినిపిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో కిలో మామిడికి కనీసం రూ.12 వచ్చేలా చూడాలి. ఈ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. లేదంటే వారి తరఫున వైఎస్సార్‌సీపీ పోరాడుతుంది' అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

మరిన్ని వివరాలు, ఫొటోలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఇన్నాళ్లూ గాడిదలు కాశారా?

చంద్రబాబు ప్రభుత్వానికి సూటిగా నా ప్రశ్నలు.. ఏటా మామిడి కొనుగోళ్లు మే 10 నుంచి 15వ తేదీ మధ్యలో మొదలు పెడతారు. మరి ఈ ఏడాది ఎందుకు అలా మొదలు పెట్టలేదు? జూన్ 3వ వారం వరకు కొనుగోళ్లు ఎందుకు మొదలు కాలేదు? ఎప్పటిలాగే మే రెండో వారంలో మామిడి కొనుగోళ్లు జరిగేలా ఈ ప్రభుత్వం చొరవ చూపక పోవడం వల్ల జూన్ 3వ వారం నాటికి మామిడి పంట మార్కెట్‌ను ముంచెత్తడం నిజం కాదా?

→ రైతులంతా మామిడి పల్ప్ కంపెనీల వద్ద బారులు తీరడం మీకు కనిపించ లేదా? ఎవరి వల్ల ఈ దుస్థితి ఏర్పడింది?

→ పల్ప్ ఫ్యాక్టరీలకు ఒకేసారి పంట మొత్తం తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? దీంతో వాహనాల్లోనే మామిడి పంట కుళ్లిపోవడం మీకు కనిపించ లేదా? కేజీ మామిడి కనీసం రూ.3 లేదా రూ.2.50కి కూడా కొనే నాథుడు లేక పోవడం వాస్తవం కాదా? మీ పుణ్యాన ఈ పంటకు ఇక ధర రాదనే బాధతో చెట్లను కొట్టేసుకున్న రైతులను బెదిరిస్తారా?

→ చిత్తూరు జిల్లాలో 52 మామిడి పల్ప్ కంపెనీలు ఉన్నాయి. మే 10–15 తేదీల్లో తెరవాల్సిన ఆ ఫ్యాక్టరీలు జూన్ 3వ వారం వరకు తెరవకపోతే మీరు ఏం గాడిదలు కాశారు?

→ పక్కన కర్ణాటకలో జనతాదళ్‌కు చెందిన కేంద్ర మంత్రి కుమారస్వామి అడిగితే, కిలో మామిడి రూ.16 చొప్పున కొనేందుకు కేంద్రం ముందుకొచ్చిందట. నిజానికి అది మంచి రేటు అని కాదు.. కనీస రేటు అని చెప్పి, అదే పని మీరెందుకు చేయలేకపోయారు? మీరు ఎందుకు కేంద్రాన్ని అడగలేకపోయారు? ఈ విషయంలో చంద్రబాబు ప్రభుత్వం ఏం గాడిదలు కాస్తోంది?

→ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నిరుడు కిలో మామిడి రూ.29కి రైతులు అమ్ముకున్న పరిస్థితి నుంచి ఈరోజు చంద్రబాబు ప్రభుత్వంలో రైతులకు కనీసం కిలోకు రూ.12 కూడా ఇప్పించలేని పరిస్థితి. అలా ఆ రైతుల్ని నడిరోడ్డుపై నిలబెట్టడం భావ్యమా?

→ ఇక్కడికి జగన్ వస్తున్నాడని చెప్పి, మూడు రోజుల నుంచి కిలో మామిడికి రూ.6 ఇస్తామని మెసేజ్‌లు పెడుతున్నారు. అయ్యా చంద్రబాబూ.. రైతులకు వాస్తవంగా కనీసం కిలో మామిడికి రూ.3 కూడా రావడం లేదంటే.. మీరు నిద్ర పోతున్నారా?

రైతన్నలకు అండగా గత ప్రభుత్వం

మా ప్రభుత్వ హయాంలో వ్యవసాయం రూపురేఖలు మారుస్తూ రైతులకు తోడుగా ఉండే వాళ్లం. రైతన్నలకు మే మాసం వచ్చే సరికి పెట్టుబడి సహాయం అందేది. ఇదే జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కిలో మామిడి రూ.22 నుంచి రూ.29 వరకు రైతులు అమ్ముకున్నారు. ఆ ప్రభుత్వం దిగిపోయిన తర్వాత ఈ సంవత్సర కాలంలో రైతుల బతుకులు తలకిందులయ్యాయి. వారు తీవ్ర కష్ట నష్టాల్లో కూరుకుపోయారు. రైతన్నలకు ఇవ్వాల్సిన రైతు భరోసా రూ.20 వేలు ఎగరగొట్టేశారు. ఇంత వరకు రైతులకు పెట్టుబడి సహాయం అందలేదు. ఇంకా చంద్రబాబునాయుడు గారి పుణ్యాన రైతులకు సమయానికే రావాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ రాకుండా పోయింది. ఆయన పుణ్యాన ఉచిత పంటల బీమా కూడా పూర్తిగా ఎగరగొట్టేసిన పరిస్థితి. ఆర్బీకేలన్నీ నిర్వీర్యమయ్యాయి. ఈ – క్రాప్ లేకుండా పోయింది. వ్యవసాయానికి సంబంధించిన అన్ని విభాగాలు ఇవాళ నిర్వీర్యమైపోయిన పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తోంది.

పలికేది జగన్ ఒక్కడే.. గుర్తుంచుకోండి

ప్రతి పోలీసు అధికారికీ ఒకటే చెబుతున్నా. అయ్యా పోలీస్ సోదరుడా.. మీకు కూడా సమస్యలుంటాయి. ఎప్పుడు ఎవరికి ఏ సమస్య వచ్చినా పలికేది ఒక్క జగన్ మాత్రమే. పొగాకు రైతులకు సమస్య అయినా జగనే పలుకుతున్నాడు. మామిడి రైతుల సమస్యలపైనా జగనే పలుకుతున్నాడు. మిర్చి రైతులైనా జగనే పలుకుతున్నాడు. ఉద్యోగుల సమస్యలైనా.. వాళ్లకు మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వాలన్నా, వేతనాల సవరణ (పీఆర్సీ)కు డిమాండ్ చేయాలన్నా, వాళ్లకు కరవు భత్యం (డీఏ) ఇప్పించాలన్నా, చివరికి చంద్రబాబునాయుడు హామీలను నిలదీస్తూ, ఆయన్ను గట్టిగా ప్రశ్నించాలన్నా, ఆయన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్లు అమలు చేయకుండా మోసం చేసిన వైనాన్ని ఎండగట్టాలన్నా.. జగన్ మాత్రమే ముందుంటాడు. ప్రతి పోలీస్ సోదరుడు దీన్ని గుర్తుపెట్టుకోవాలని కోరుతున్నాను. అధికారంలో ఉన్న వారి ఒత్తిళ్లకు లొంగిన ఆ ఎస్పీలు, డీఐజీల మాటలు వినకండి. వాళ్ల ప్రలోభాలకు లొంగకండి. రేప్పొద్దున మీ సమస్యలపైనా ఇదే మాదిరిగానే చంద్రబాబు మిమ్మల్ని మోసం చేసి రోడ్డున పడేస్తే.. అప్పుడు జగన్ అనే వ్యక్తి ముందుకు వస్తాడు. లేదంటే ఈ రాష్ట్రంలో సమస్యల గురించి మాట్లాడేవాడు ఎవడూ ఉండడు. అసలు సమస్యలే లేనట్లు వక్రీకరిస్తారు. డ్రామాలాడతారు. తప్పుదోవ పట్టిస్తారు. అలా సమస్యలను గాలికి వదిలేసే పరిస్థితి వస్తుంది. ఇంకా అందరూ నష్టపోయే పరిస్థితి వస్తుందని ప్రతి పోలీస్ సోదరుడికి ఈ సందర్భంగా తెలియజేస్తున్నా.



కట్టడి ప్రయత్నాలు అత్యంత దారుణం

శశిధర్ రెడ్డి అనే వ్యక్తి రైతు కుటుంబానికి చెందిన వారు కాదా? పోలీసుల దాడిలో ఆయన తలకు తీవ్ర గాయమైంది. ఇంత దారుణమైన పరిస్థితి ఎందుకొచ్చింది అని అడుగుతున్నా.. రాష్ట్రంలో 62 శాతం మంది వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్నారు. చిత్తూరు జిల్లాలో దాదాపు 80 శాతం మంది ఆ రంగం మీద బతుకుతున్నారు. మరి వీళ్లంతా రైతు బిడ్డలు కాదా? ఇక్కడికి రావొద్దని దాదాపు 1200 మంది రైతులను నిర్బంధించారు. ఇక్కడికి వచ్చిన రైతులపై విచ్చలవిడిగా లాఠీఛార్జ్ చేశారు. ఇది అత్యంత దారుణం.

యూరియా వినియోగం తగ్గించుకోండి

- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర మంత్రి జేపీ నడ్డా సూచన
- మోతాదుకు మించి యూరియా వినియోగిస్తున్నారని ఆందోళన
- తెలంగాణ నిజమైన అవసరాలకు సాయం చేస్తామని ప్రకటన
- యూరియా కోటా పెంచాలని మంగళవారం నడ్డాకు సీఎం వినతి
- మరుసటి రోజే వినియోగం తగ్గించుకోవాలని నడ్డా సూచన



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో వ్యవసాయంలో మోతాదుకు మించి యూరియా వినియోగిస్తున్నారని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డా ఆందోళన వ్యక్తం చేశారు. అవసరానికి మించి వినియోగించడం వలన దీర్ఘకాలంలో హాని కలుగుతుందని చెప్పారు. యూరియా వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో మంగళవారం నడ్డాను కలిసి సకాలంలో రాష్ట్రానికి ఎరువులు సరఫరా చేయాలని కోరిన విషయం తెలిసిందే. ఈ అంశంపై బుధవారం రసాయనాల శాఖ అధికారులతో నడ్డా సమీక్ష నిర్వహించారు. దేశంలో ఎంత మొత్తంలో యూరియా ఉత్పత్తి అవుతోంది? విదేశాల నుంచి ఎంత దిగుమతి అవుతోంది? ఏయే రాష్ట్రాలకు సరఫరా ఎంత? ఏ రాష్ట్రం ఎంత మేర యూరియా వినియోగిస్తోందనే విషయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో యూరియా వినియోగం అధికంగా ఉందని ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం ఓ ప్రకటన విడుదల చేసిన నడ్డా.. రాష్ట్రంలో యూరియా వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. రాష్ట్రానికి యూరియా కోటాను పెంచాలని సీఎం కోరగా.. వినియోగం తగ్గించుకోవాలని నడ్డా సూచించటం గమనార్హం.

సేంద్రియ ఎరువులు వాడండి

రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నడ్డా సూచించారు. 'రాష్ట్ర రైతుల నిజమైన డిమాండ్‌ను తీర్చడానికి తెలంగాణ సీఎంకు మద్దతు ఇస్తున్నాం. యూరియా అధిక వినియోగంతో భూముల సారం దెబ్బతినే ప్రమాదం ఉంది. 2023–24 రబీతో పోల్చితే.. 2024–25 రబీలో దాదాపు 21 శాతం అదనంగా యూరియా అమ్మకాలు జరిగాయి. 2024 ఖరీఫ్‌తో పోలిస్తే 2025 ఖరీఫ్‌లో ఇప్పటివరకు 12.4 శాతం అదనపు వినియోగం అయ్యింది'అని సమావేశంలో నడ్డా ఆందోళన వ్యక్తం చేసినట్లు ఎరువులు, రసాయనాల శాఖ తన ప్రకటనలో తెలిపింది. రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే పీఎం ప్రణామ్ స్కీం గురించి ఆ శాఖ సెక్రటరీ రజత్ కుమార్ సీఎం బృందానికి వివరించినట్లు వెల్లడించింది. అలాగే వ్యవసాయేతర అవసరాలకు యూరియాను మళ్లించకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను రజత్ కుమార్ అభ్యర్థించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కమిషనర్ రాకపోతే.. డీజీపీని రప్పిస్తాం

- సైబరాబాద్ పోలీసులపై జాతీయ ఎస్టీ కమిషన్ ఆగ్రహం
- సినీ నటుడు విజయ్ దేవరకొండ కేసుపై వాదనలు
- ఏసీపీ శ్రీధర్ హాజరు కావడంపై అసహనం
- 15 రోజుల్లో కమిషనర్ వచ్చి సమాధానమివ్వాలని ఆదేశం



విచారణ నిర్వహిస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

సాక్షి, న్యూఢిల్లీ: 'విచారణకు పోలీసు కమిషనర్ కదా హాజరు కావాల్సింది? ఏసీపీ గారూ మీరెందుకు వచ్చారు? అధికారులకు ఈమాత్రం తెలియదా?'అని సైబరాబాద్ పోలీసులపై జాతీయ ఎస్టీ కమిషన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. 15 రోజుల్లో సైబరాబాద్ పోలీసు కమిషనర్ విచారణకు స్వయంగా హాజరు కావాలని ఆదేశించింది. ఒకవేళ ఆయన హాజరు కాకపోతే తదుపరి విచారణ తేదీకి రాష్ట్ర డీజీపీని రప్పిస్తామని హెచ్చరించింది. సినీ నటుడు విజయ్ దేవరకొండ గిరిజనులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై విచారణ సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ ఈ హెచ్చరిక చేశారు. ఏప్రిల్ 26న రెట్రో సినిమా వేడుకలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. భారత్, పాక్ మధ్య సమస్యను ప్రస్తావించే క్రమంలో గిరిజనులను కించపర్చే అర్థం వచ్చేలా పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై గిరిజన సంఘం నాయకుడు అశోక్‌కుమార్ రాథోడ్ రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో పోలీసులు విజయ్ దేవరకొండపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో అశోక్ కుమార్ రాథోడ్ జాతీయ ఎస్టీ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేయటంతో కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ బుధవారం విచారణ చేపట్టారు. విచారణకు పోలీస్ కమిషనర్ కాకుండా మాదాపూర్ ఏసీపీ శ్రీధర్ హాజరు కావటంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. 'లక్షల మందిని ప్రభావితం చేసే ఒక నటుడు ఒక వర్గాన్ని కించపర్చేలా ఎలా మాట్లాడతారు? ఆయన వ్యాఖ్యలపై మీరు కేసు నమోదు చేశారు బాగానే ఉంది. ఈ రోజు (బుధవారం) విచారణకు పోలీసు కమిషనర్ హాజరు కావాలని మేం నోటీసులు ఇచ్చాం కదా? ఆయన కదా హాజరు కావాల్సింది? మీరెందుకు వచ్చారు?'అని నిలదీశారు. మరో 15 రోజుల్లో విచారణకు కమిషనర్ హాజరై హీరో విజయ్ దేవరకొండపై తీసుకున్న చర్యలను వివరించాలని ఆదేశించారు. ఆ రోజు కమిషనర్ రాకపోతే డీజీపీని రప్పిస్తామని హెచ్చరించారు.

యూరియాను అధిక ధరలకు అమ్మితే కఠినచర్యలు తీసుకోండి

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



సాక్షి, హైదరాబాద్: యూరియా కొరతను సాకుగా చూపి ఎక్కడైనా డీలర్లు అధిక ధరలకు ఎరువులను అమ్మితే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం యూరియా నిల్వలు, సరఫరాపై మంత్రి అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రైతుల అవసరాల మేరకు యూరియా నిల్వలున్నాయని, చాలా పంటలు ఆరంభ దశలో ఉండటం వల్ల ప్రస్తుతం అవసరం ఉన్నా, లేకపోయినా రైతులు కొనుగోలు చేస్తున్నారని తుమ్మల తెలిపారు. రానున్న రోజుల్లో కేంద్రం నుంచి ఆగస్టు మాసానికి కూడా సరిపడా ఎరువులు త్వరలోనే రాష్ట్రానికి అందుతాయని ఆశిస్తున్నట్టు చెప్పారు. జిల్లాల వారీ సాగు విస్తీర్ణం, కేంద్రం నుంచి సరఫరా అవుతున్న పరిమాణాలను బట్టి జిల్లాల వారీగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రతి జిల్లా కలెక్టర్‌కు రోజువారీ ఎరువుల నిల్వల వివరాలు పంపిస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ రోజువారీ నిల్వలు, వినియోగంపై సమీక్షిస్తూ రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రైతులు తమకు అవసరమైన మేరకే యూరియాను కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల చెప్పారు.

కల్తీ కల్లుకు మరో నలుగురు బలి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రమీల తదితరులకు వైద్యం అందిస్తున్నట్లు నిమ్స్ వర్గాలు తెలిపాయి.

కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు: జూపల్లి

రాష్ట్రంలో కల్తీ కల్లు విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. బుధవారం ఆయన ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కల్తీ కల్లు సరఫరా చేసినవారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కల్తీ కల్లును పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపామని, నివేదికలు వచ్చాక పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. బాధితుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని, మిగతావారు కోలుకుంటున్నారని నిమ్స్ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డా.ఎంవీఎస్ సుబ్బలక్ష్మి తెలిపారు. బాధితులను ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఐదుగురు అరెస్టు

కల్తీ కల్లు ఘటనలో ఐదుగురిని అరెస్టు చేసినట్లు మేడ్చల్ జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ షానవాజ్ ఖాసిం తెలిపారు. దుకాణాల నిర్వాహకులు నగేష్‌గౌడ్, బట్టి శ్రీనివాస్‌గౌడ్, టి.శ్రీనివాస్‌గౌడ్, టి.కుమార్‌గౌడ్, తీగల రమేశ్‌లను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్లు చెప్పారు. హెచ్ఎంటీ కాలనీ, హైదర్‌నగర్, ఎస్పీనగర్ కల్లు దుకాణాలను సీజ్ చేశారు. కూకట్‌పల్లి, హైదర్‌నగర్ కల్లు కాంపౌండ్‌లో లభించిన 674 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకున్నారు. మృతులు స్వరూప కుమారుడు, సీతారాం భార్య కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గనుల నిధులతో గిరిజన ఆవాసాల జీవనోపాధి మెరుగుదల


- తెలంగాణ, ఏపీలో ఊపందుకున్న డీఎంఎఫ్ పనులు
- కలెక్టర్లు చైర్మన్లుగా సమర్థవంతంగా పథకాల అమలు
- 2047 నాటికి మినరల్ రంగాన్ని మరింత పటిష్టం చేస్తాం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: గనుల ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్) నిధులు పెద్ద ఊరటగా నిలుస్తున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో డీఎంఎఫ్ ద్వారా విస్తృత స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. జిల్లా కలెక్టర్లు డీఎంఎఫ్‌లకు చైర్మన్లుగా ఉండటంతో స్థానిక సమస్యల పరిష్కారాల కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం ఢిల్లీలో నిర్వహించిన డీఎంఎఫ్ వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. '2047 నాటికి వికసిత భారత్ సాధించాలనే లక్ష్యంతో మినరల్ రంగాన్ని మరింత పటిష్టం చేస్తాం. తెలంగాణ ఇటీవల సవరించిన డీఎంఎఫ్ మార్గదర్శకాలను అమలు చేస్తోంది. కలెక్టర్ల ఆధ్వర్యంలో మైనింగ్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఆర్థిక వనరులను సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. గనుల ప్రభావిత ప్రాంతాల్లో రైతులు, పేదల భూములు వెళ్లిపోతున్న సందర్భాల్లో, వారి జీవనోపాధి కోసం డీఎంఎఫ్ నిధులు, సంస్థల సహకారం, ప్రజాప్రతినిధుల సూచనలతో సకాలంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు'అని తెలిపారు. గతంలో గనుల కేటాయింపులు ఇష్టారీతిన జరిగేవని.... ప్రధాని మోదీ నిర్ణయంతో వేలం ప్రక్రియ ప్రారంభమై, రాయల్టీ ఆదాయం పెరిగిందన్నారు. దీని ద్వారా స్థానికులకు మరింత మేలు జరుగుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో కేంద్ర సహాయ మంత్రి సతీశ్ చంద్ర దూబే, గనుల శాఖ కార్యదర్శి కాంతారావ్‌లతో పాటు దేశవ్యాప్తంగా 60 జిల్లాల కలెక్టర్లు, మరో 160 మంది జిల్లా స్థాయి అధికారులు, వివిధ రాష్ట్రాల మైనింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను పునరుద్ధరించండి

కేంద్ర మంత్రి కుమారస్వామికి మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి



కేంద్రమంత్రి కుమారస్వామికి జ్ఞాపికను అందజేస్తున్న శ్రీధర్‌బాబు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో మూతపడిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను పునరుద్ధరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన ద్వారా జాతీయ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)కి గణనీయంగా దోహదపడాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి వినతి పత్రం అందచేశారు. సుమారు అరగంటపాటు వీరిద్దరి మధ్య వివిధ పరిశ్రమలకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగింది. 'పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన ద్వారా జాతీయ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)కి గణనీయంగా దోహదపడాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం. ఈ లక్ష్య సాధనలో భాగంగా తెలంగాణలో మూతపడిన పరిశ్రమల పునరుద్ధరణపై దృష్టి సారించాం. పెద్దపల్లిలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) విజయవంతంగా నడుస్తోంది. ఇదే మాదిరిగా ఆదిలాబాద్ జిల్లాలోని సీసీఐ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని ఎస్ఐఎల్‌లను పునరుద్ధరిస్తే తెలంగాణకు మేలు జరుగుతుంది. స్థానిక ప్రజలకు ఉపాధి లభిస్తుంది. ఆ దిశగా కేంద్రం చర్యలు తీసుకోవాలి'అని కోరారు. విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

● స్ఫూర్తి

స్వయం శక్తి

ఆకాశమంతా నాదే... అంటూ విహరించే విహంగాన్ని ఒక మూల పంజరంలో బంధిస్తే ఎలా ఉంటుంది! స్మిను జిందాల్‌కు కూడా అలాగే అనిపించింది. పదకొండు సంవత్సరాల వయసులో యాక్సిడెంట్‌కు గురైంది. అలా అని వీల్‌చైర్‌కే పరిమితం కాలేదు. ఎన్నో పరిమితులు అధిగమించి పారిశ్రామిక వేత్తగా ఎదిగింది. 'ఫార్చ్యూన్ ఇండియా మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్-2025' జాబితాలో చోటు సాధించింది...



ఢిల్లీలో ఎలిమెంటరీ స్కూల్ చదువు పూర్తయిన తరువాత జైపూర్‌లోని ప్రతిష్ఠాత్మకమైన మహారాణి గాయత్రీ దేవి స్కూల్‌లో చేరిన స్మిను కారు ప్రమాదంలో ప్రాణాపాయం నుంచి బయటపడింది. చదువు, ఆటలు, పాటలతో ఎప్పుడూ చురుగ్గా ఉండే అమ్మాయికి కొన్ని నెలల పాటు వీల్‌చైర్‌కే పరిమితం కావడం సంకెళ్లతో బంధించినట్లుగా అనిపించింది. తన రెక్కలు ఎవరో కత్తిరించినట్లుగా అనిపించింది.

స్మినుకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. కథక్ నృత్యంలో మంచి పేరు తెచ్చుకుంది.

'ఇక నేను డ్యాన్స్ చేయలేనా?' అనే బాధ ఉండేది.

అయితే తల్లిదండ్రులు మాత్రం 'నీకేం జరగలేదు. అన్నీ సర్దుకుంటాయి' అంటూ ఏ లోటూ లేకుండా చూసుకున్నారు. స్మినులో ఆత్మవిశ్వాసం పెంచేలా ఎంతోమంది వ్యక్తుల నిజజీవిత గాథలు చెబుతుండేది తల్లి ఆర్తి. బిడ్డను నార్మల్ స్కూల్‌కే పంపించేది.

'అమ్మానాన్నలు నన్ను చాలా జాగ్రత్తగా చూసుకునేవారు. అలా అని అతి గారాబం చేసేవారు కాదు' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంది స్మిను.

కొంతకాలం తరువాత తల్లిదండ్రులు స్మిను కోసం ఒక మెషిన్ తీసుకువచ్చారు. ఆ మెషిన్ సహాయంతో రోజుకు కొన్ని గంటలు నిలబడేది.

ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజి ఆఫ్ కామర్స్‌లో డిగ్రీ చేసిన స్మిను 'జిందాల్ సా లిమిటెడ్'లో మేనేజ్‌మెంట్ ట్రైనీ స్థాయి నుంచి మేనేజింగ్ డైరెక్టర్ స్థాయికి చేరింది. స్మిను జిందాల్ పేరు పక్కన 'ప్రముఖ పారిశ్రామికవేత్త' అనే గౌరవం రావడానికి ఎంతోకాలం పట్టలేదు.

దివ్యాంగులకు దిశానిర్దేశం, సహాయపడడం లక్ష్యంగా 'స్వయం' అనే సంస్థను ప్రారంభించింది. ప్రభుత్వసంస్థలు, విద్యాసంస్థలు, రవాణా సంస్థలతో కలిసి పని చేస్తోంది స్వయం.

'దివ్యాంగులకు ఉపయోగపడే ప్రభుత్వ పథకాలు ఎన్నో ఉన్నప్పటికీ వాటి గురించి చాలా మందికి తెలియదు. స్వయం పోర్టల్ ద్వారా దివ్యాంగులకు ఉపయోగపడే ప్రభుత్వ పథకాల గురించి తెలియజేస్తున్నాం. టూరిజం, స్పోర్ట్స్, శానిటేషన్... మొదలైన రంగాలలో ఇప్పుడు స్వయం పనిచేస్తోంది' అంటుంది స్మిను.

దివ్యాంగులకు మాత్రమే కాదు వృద్ధులు, గర్భిణులు... మొదలైనవారికి 'స్వయం' సహాయపడుతోంది.

'విమానాశ్రయాలు, హోటల్స్, స్టేడియం లాంటి ఎన్నో బహిరంగ ప్రదేశాలలో దివ్యాంగులకు కనీస సదుపాయాలు లేవు' అంటున్న స్మిను జిందాల్ 'యాక్సెసబిలిటీ చాంపియన్'గా పేరు తెచ్చుకుంది.

'క్షణం తీరిక లేని వృత్తి జీవితాన్ని, కుటుంబ జీవితాన్ని ఎలా సమన్వయం చేసుకుంటారు?' అనే ప్రశ్నకు జిందాల్ ఇచ్చిన సమాధానం...

'పని ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుంది. అయితే పనే పాషన్‌గా మారినప్పుడు అలసటగా అనిపించదు. నన్ను అర్థం చేసుకునే కుటుంబం దొరకడం నా అదృష్టం. సరియైన ప్రణాళిక ఉంటే వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోవడం కష్టమేమీ కాదు'.

ఎన్నో సవాళ్లు... అయినా సరే...

ఒకటి రెండు అని కాదు... ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. యాక్సిడెంట్ తరువాత జీవనశైలిని పునర్నిర్మించుకోవడం నుంచి పురుషాధిపత్య రంగాలుగా భావించే స్టీల్, ఆయిల్, గ్యాస్ సెక్టార్‌లలో విజయం సాధించడం వరకు ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాను. ఒక విధంగా చెప్పాలంటే నన్ను ప్రోత్సహించిన వారే కాదు నిరాశ పరిచిన వారు కూడా నేను ఈరోజు ఈ స్థాయిలో ఉండడానికి తోడ్పడ్డారు. 'నీ వల్ల కాదు' అని ఎవరైనా అంటే ఆ మాటలను సవాలుగా తీసుకొని చేసి చూపించేదాన్ని.

- స్మిను జిందాల్

● మన(సు)లో మాట

ఆకర్షణ అశాశ్వతం... కుటుంబ బంధమే శాశ్వతం!

డాక్టరు గారు! నేను కొన్ని సంవత్సరాలుగా పరిచయం ఉన్న వ్యక్తితో వివాహేతర సంబంధంలో ఉన్నాను. అతనికి కూడా వివాహం అయింది. పిల్లలు ఉన్నారు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండు సంవత్సరాలనుండి మా ఈ బంధం కొనసాగుతోంది.. శారీరకంగా కన్నా మానసికంగా మేము ఎక్కువ దగ్గర అయ్యాము. కానీ ఈ మధ్య కాలంలో అతను వేరే అమ్మాయితో క్లోజ్‌గా ఉండటం, నన్ను అంతగా పట్టించుకోకపోవటం నన్ను చాలా మానసిక వేదనకు గురిచేస్తోంది. ఆకలి, నిద్ర బాగా తగ్గిపోయాయి. మనసంతా చికాకుగా, ఏడుపు వస్తుంది. అశాంతితో నరకం అనుభవిస్తున్నాను. అతను నాకు ఏమీ కాదు అని తెలిసినా తట్టుకోలేకపోతున్నాను! ఆఖరికి ఆత్మహత్య ఆలోచనలు కూడా వస్తున్నాయి. దయచేసి ఈ సమస్యకి ఒక పరిష్కారం చూపిస్తారని కోరుకుంటున్నాను!

- ఒక సోదరి, గుంటూరు

మీరు చెప్తున్న దాన్ని బట్టి చూస్తుంటే మీరు తీవ్రమైన మనోవేదన (డిప్రెషన్)కు లోనయినట్లుగా అర్థం అవుతోంది. జీవితంలో ఒక్కోసారి తప్పటడుగులు వేయడం సహజం. మీకు మంచి భర్త, పిల్లలు ఉన్నా, ఆ వ్యక్తికి భార్య పిల్లలున్నారని తెలిసి కూడా సంబంధం పెట్టుకున్నారు! ఒక్కొక్కసారి భార్యా భర్తల మధ్య ఏదైనా గ్యాప్ వచ్చి అసంతృప్తికి లోనయినవారు, ఇలాంటి వివాహేతర సంబంధం పెట్టుకునే అవకాశ ముంటుంది! ఇప్పుడా వ్యక్తి తన భార్యను, మిమ్మల్ని కాదని ఇంకా మూడో వ్యక్తితో, కొత్తగా రిలేషన్ షిప్ పెట్టుకున్నాడంటే అతని వ్యక్తిత్వమేంటో మీకిపాటికి తెలిసే ఉంటుంది. ఇప్పటికైనా మించిపోయిందేం లేదు, చేసిన పొరపాటును సరిదిద్దుకోవడంలోనే మనిషి ఔన్నత్యం బయటపడుతుంది.

ఒక వేళ మీ విషయం మీ భర్తకు తెలిస్తే మీ కుటుంబ పరిస్థితి ఏంటో ఒక్కసారి ఊహించుకోండి. అంతా 'మన మంచికే ' అని 'ఆత్రేయ' గారు అన్నట్లు, ఆ మూడో వ్యక్తి వల్ల ఒక విధంగా మీకు, మీ కుటుంబానికి, మంచి జరిగినట్లయింది. మీరు మీ మనోవేదనలోంచి త్వరగా బయటపడేందుకు మీ దగ్గర్లోని సైకియాట్రిస్ట్‌ని కలిసి మీ కుంగుబాటును తగ్గించేందుకు కొన్ని మందులు అలాగే క్లినికల్ సైకాలజిస్ట్ ఆధ్వర్యంలో 'కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ', మీ భార్య భర్తల మధ్య ఏదైనా అంతరాలుంటే సరిదిద్దుకునేందుకు 'కపుల్ థెరపీ' లాంటి ప్రత్యేక మానసిక చికిత్స పద్ధతుల ద్వారా మీ సమస్యలోంచి త్వరగా బయటపడి మీలో మానసిక ప్రశాంతత, సమస్యను ఎదుర్కొనే ఆత్మ స్థైర్యం వచ్చేలా చేయవచ్చు. కాలమే మనసుకు తగిలిన గాయాలను మాన్పుతుంది! మనసైనా, మనిషైనా, మనది కానిది, ఎన్నటికీ మనది కాబోదనే జీవిత సత్యాన్ని గుర్తుంచుకోవాలి! ఆల్ ది బెస్ట్.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● నేడు గురు పూర్ణిమ

వ్యాసాయ విష్ణు రూపాయ...



మానవ జీవిత చరితార్థానికి, భగవదర్శనానికి బాటలు వేసేవారు గురువులు. అందుకే గురువుని త్రిమూర్తి స్వరూపంగా భావిస్తాం. గురుపూర్ణిమ, ఆషాఢ పూర్ణిమ, వ్యాసపూర్ణిమ.. ఇలా ఏ పేరుతో పిలుచుకున్నా ఈ రోజు ఎంతోపవిత్రమైనది. ఈ రోజు అష్టాదశ పురాణాలను మనకు అందించిన వ్యాసభగవానుని జన్మదినం కారణంగా గురుస్థానంలో ఆ వ్యాసభగవానుని స్మరించుకునే పర్వదినం. గురువులకు గురువుగా ఖ్యాతి గడించిన మహనీయుడు వ్యాస మహర్షి. అందువలన లోకంలో అందరూ శ్రీ వ్యాసమహర్షిని పూజించి, గౌరవించాలి. ఆషాఢ పూర్ణిమను గురు పూజతో ఉత్సవం చేయటం మన భారతీయ సంస్కృతిలో భాగమైంది. మానవ చరిత్రలోనే అపూర్వమైన ఆధ్యాత్మిక పర్వదినంగా నిలచింది వ్యాస జన్మతిథి. ముందుగా ఈ తిథికి సంబంధించిన ఒక చక్కని కథను తెలుసుకుందాం.

ఒక శిష్యుడు తన గురువుగారిని వెదుకుతూ చివరికి ఆయనను కలుసుకుంటాడు. కొంత కాలం తరువాత శిష్యుడు సెలవు తీసుకుంటూ తిరిగి ఎప్పుడు దర్శనమిస్తారు అని గురువుగారిని అడుగుతాడు. అప్పుడు గురువుగారు ''శిష్యా! నీవు నన్ను దర్శించాలని కుతూహలంగా ఉన్నావు గనుక విను. ఎవరైతే పురాణగాథలను, వేద గాథలను వ్యాఖ్యానం చేస్తూ వాటి రహస్యాలను ఉపదేశిస్తుంటారో వారే నా నిజ స్వరూపం అని తెలుసుకుని, వారిని సాక్షాత్తు వ్యాస మూర్తిగా భావించి పూజింపవలసినది. నేను ఎల్లప్పుడూ ఇటువంటి పౌరాణికులందరిలోనూ ఉంటాను'' అని అంటారు. అందువల్ల పౌరాణికులు, కథకులు, బోధకులు అందరూ గురువులే. పురాణాలలో నిగూఢంగా ఉన్న విషయాలను తెలుసుకోవాలంటే వ్యాస మహర్షి అనుగ్రహం అవసరం. అందుచేత మనం వ్యాస పూర్ణిమ నాడు పౌరాణికులను, మన గురువులను పూజించి తగిన విధంగా సత్కరించాలి. హిందూమతంలో భగవంతుని తెలుసుకోవటానికి ముఖ్యమైన ఆలంబనగా గురువును భావిస్తారు. తమ జీవితాలకు సరైన మార్గ నిర్దేశనం చేయటానికి కావలసిన సాధన సంపత్తి గురువు ద్వారా లభిస్తుందని అందరి విశ్వాసం. గురువులుగా ప్రసిద్ధిగాంచిన ఆదిశంకరులు, దత్తాత్రేయుడు, శ్రీషిరిడీ సాయినాథుడు మొదలైనవారిని ఈరోజు కొలుస్తారు. ఈ గురుపూర్ణిమ ఉత్సవాన్ని శ్రీ ఆదిశంకరులే ప్రారంభించారని కూడా చెబుతారు. అజ్ఞానమనే చీకటిని తొలగించి, జ్ఞానమనే జ్యోతిని వెలిగించేవారు గురువు. మనం జన్మించిన తరువాత మన కన్నతల్లిదండ్రులు ప్రథమ గురువులు కాగా, మిగిలిన జీవితం మొత్తం మార్గనిర్దేశనం చేసేవారు గురువు. సమస్త ప్రకృతిలో నిండి నిబిడీకృతుడై జ్ఞానాన్ని, ప్రేమను పంచటానికి గురువులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఆ మహత్తర జ్ఞానాన్ని అందుకోవటానికి శిష్యులకు చిత్తశుద్ధి అవసరం. మనిషిలో గుప్తంగా దాగివున్న జ్ఞానాన్ని, విశేష శక్తియుక్తులను వెలికితీసి మార్గనిర్దేశనం కలిగించేవారు గురువు.

మనమందరం గురువుకు తగిన గౌరవమర్యాదలు కలిగిస్తూ, వారి అడుగుజాడలలో పయనిద్దాం. విశ్వమానవ శాంతికి బంగారు బాటలు వేద్దాం.

– డా. దేవులపల్లి పద్మజ

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూలై 10న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,210
బంగారం (22 క్యారెట్లు)	90,745
వెండి	1,09,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	99,400
బంగారం (22 క్యారెట్లు)	90,000
వెండి	1,10,600
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	98,180
బంగారం (22 క్యారెట్లు)	90,000
వెండి	1,20,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	99,400
బంగారం (22 క్యారెట్లు)	92,700
వెండి	1,10 ,600
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,700
బంగారం (22 క్యారెట్లు)	88,960
వెండి	1,08,500
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	98,180
బంగారం (22 క్యారెట్లు)	90,000
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● బ్యూటిప్స్

గులాబీ రేకుల్లాంటి పెదవుల కోసం...

- ఉదయం బ్రష్ చేశాక, బ్రష్ మీద కొద్దిగా తేనె వేసి పెదవులపైన గుండ్రంగా ఐదు నిమిషాల పాటు రుద్దాలి. ఇలా రోజూ చేయడం వల్ల పెదాలపై పేరుకుపోయిన మృతకణాలు తొలగిపోతాయి. రక్తప్రసరణ సక్రమంగా జరిగి పెదవులు మృదువుగా మారతాయి.



- రాత్రి పడుకునేముందు పెదవులకు మాయిశ్చరైజర్ రాయాలి. ఇందుకోసం.. కొద్దిగా బీట్‌రూట్ రసాన్ని వేడి చేయాలి. ఆ రసంలో అరటీస్పూను కార్న్‌ఫ్లోర్ వేసి ఐదు నిమిషాల తర్వాత దించి, అందులో అర టీస్పూను గ్లిజరిన్, పావు టీస్పూను కొబ్బరి నూనె కలిపి ఎయిర్‌టైట్ కంటైనర్‌లో నిల్వచేయాలి. ఈ మిశ్రమం గట్టిపడిన తర్వాత పెదవులకు రాసిమర్దన చేసి పడుకోవాలి. ఉదయం కడిగేయాలి. ఈ రెండింటిని ఒకదాని తరువాత ఒకటి క్రమం తప్పకుండా పాటిస్తే పెదవులు గులాబీ రేకుల్లా కోమలంగా... ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

● కిచెన్ టిప్స్

- కుల్చా కాల్చేటప్పుడు... పాన్ మీద కుల్చా వేసి చుట్టుపక్కల కొద్దిగా నీళ్లు చల్లి మూత పెట్టాలి. ఒక వైపు కాలాక మరో వైపు తిప్పి చుట్టుపక్కల కొద్దిగా నీళ్లు చల్లి మూతపెడితే కుల్చా చక్కగా కాలుతుంది. చివరిగా నూనె లేదా నెయ్యి వేసి సర్వ్ చేసుకుంటే కుల్చా రుచిగా ఉంటుంది.



- తెల్లని వస్త్రాలపై పడిన పసుపు, టీ మరకలు ఒకపట్టాన వదలవు. ఈ మరకలను వదిలించడానికి ముందుగా పచ్చి పాలను మరకలపై పోసి పది నిమిషాల తర్వాత బాగా రుద్దాలి. తరువాత డిటర్జెంట్‌లో నానబెట్టి ఉతికితే మరకలు పూర్తిగా పోతాయి.

● కొత్త ఆలోచన





'శనార్థి శ్రీకుట్టన్' దర్శకుడు వినేష్ విశ్వనాథ్

ఇకపై బ్యాక్‌బెంచ్‌లు వద్దు

క్లాస్‌లో బెంచీలుంటాయి. ఫ్రంట్ బెంచ్‌లపై కూచునేవారు... బ్యాక్‌బెంచ్‌లకు పరిమితమయ్యేవారు... బ్యాక్‌బెంచ్ స్టూడెంట్‌లపై అందరికీ చిన్నచూపే. వారు గొడవ చేస్తారని సరిగా చదవరని... అసలు బ్యాక్‌బెంచ్‌లు లేకుండా చేస్తే బ్యాక్‌బెంచ్ స్టూడెంట్‌లు ఉండరు కదా అని చెప్పిన సినిమా ఇప్పుడు కేరళ స్కూళ్లను మార్చింది. 'శనార్థి శ్రీకుట్టన్' అనే సినిమా చూసి స్కూళ్లలో బెంచీలను సర్కిల్‌గా వేస్తున్నారు. ఇది అందరూ మెచ్చుకుంటున్నారు. దేశమంతా రావాల్సిన మార్పు ఇది.

కొల్లం జిల్లాలోని ఆర్.వి.వి. సెకండరీ హయ్యర్‌స్కూల్‌కు ఆ రోజు విద్యార్థులు వెళ్లి క్లాస్‌రూమ్‌లోకి అడుగు పెట్టి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే అక్కడ బెంచీలు ఒకదాని వెనుక ఒకటి లేవు. రౌండ్‌గా వేసి ఉన్నాయి.

పాపినిశ్శేరిలోని స్కూల్, అదూర్‌లోని స్కూల్, తూర్పు మంగడ్‌లోని స్కూల్, పాలక్కాడ్‌లోని స్కూల్... ఈ స్కూళ్లన్నింటిలోనూ విద్యార్థులకు ఇదే ఆశ్చర్యం. కారణం... అక్కడ కూడా క్లాస్‌లలో బెంచీలు ఒకదాని వెనుక ఒకటి లేవు. చుట్టూ వేసి ఉన్నాయి.

గత నెల రోజులుగా కేరళలోని ఒక్కోబడి ఒక్కోబడి ఈ మార్పు చేసుకుంటూ వస్తోంది. దానికి కారణం రిలీజైనప్పుడు ఎవరూ పట్టించుకోని ఒక సినిమా నెల క్రితం ఓటీటీలోకి వచ్చాక అందరూ చూస్తూ ఉండటమే. ఆ చూసే వారిలో విద్యార్థులు, టీచర్లు, పాఠశాల కరెస్పాండెంట్‌లు, తల్లిదండ్రులు ఉన్నారు... వారందరినీ ఆ సినిమా కదిలించింది. అందుకే వారందరూ క్లాస్‌రూమ్‌లో బ్యాక్‌బెంచ్ ఉండకూడదని నిశ్చయించుకున్నారు. నిజమే. క్లాస్‌రూమ్‌లో బ్యాక్‌బెంచ్ ఎందుకు?

ఆ సినిమా కథ ఏమిటి?

కె.ఆర్.నారాయణన్ అప్పర్ ప్రైమరీ స్కూల్, కారెట్టు, తిరువనంతపురం. ఈ పల్లెటూరు స్కూల్లోని సెవన్త్ సి సెక్షన్‌లో జరిగే సినిమా కథే 'శనార్థి శ్రీకుట్టన్'.

శ్రీకుట్టన్ అనే కుర్రవాడు ఇంటి పరిస్థితుల వల్ల రోజూ స్కూల్‌కి లేట్‌గా వస్తుంటాడు. బ్యాక్‌బెంచ్‌లో కూచుంటుంటాడు. వాడికి ముగ్గురు ఫ్రెండ్స్. వీళ్లంతా అల్లరి గ్యాంగ్ అని క్లాస్‌లో ఫ్రంట్ బెంచ్‌లో కూచునేవారి అభిప్రాయం. క్లాస్‌కు వచ్చే ఒక ఉపాధ్యాయుడైతే వీరి మీద పగపడతాడు. వీరు దేనికీ పనికి రారన్నది టీచర్ల అభిప్రాయం. ఇక్కడే కథ మలుపు తిరుగుతుంది. శ్రీకుట్టన్ స్కూల్ ఎలక్షన్‌లో నిలబడాలనుకుంటాడు. వీడి మీద పోటీగా ఫ్రంట్ బెంచ్‌లో కూచునే అంబడి అనే కుర్రవాడు నిలబడతాడు. ఎవరు గెలుస్తారు అనేది కథ. పైకి ఇదే కథ అనిపించినా ఇది కాదు దర్శకుడు వినేష్ విశ్వనాథ్ చెప్పాలనుకున్నది. క్లాసురూముల్లో వివక్ష ఎన్ని రూపాల్లో ఉంటుంది... వివక్షకు కారణమైన నిర్మాణం ఎలా ఉంటుంది... క్లాస్‌రూమ్‌లోనే వివక్ష పాటించిన విద్యార్థి బయటకు వెళ్లాక పాటించడని గ్యారంటీ ఏమిటీ... దీనిని ముందు నుంచే మార్చాలి అని చెప్పదలుచుకున్నాడు దర్శకుడు.



1996లో కేంద్రం చెప్పినా...

క్లాస్‌రూమ్‌లో విద్యార్థుల సీటింగ్ వారిలో వివక్షకు కారణం కాకూడదని, పిల్లల తెలివితేటలు... ఆర్థిక స్థితి... ప్రవర్తనను ఆధారంగా ముందు బెంచీలకు కొందరిని, వెనుక బెంచీలకు కొందరిని పరిమితం చేయకూడదని 1996లో కేంద్ర ప్రభుత్వం ఆరు రాష్ట్రాలను మోడల్‌గా తీసుకుని మార్పులకై ప్రతిపాదించింది. అయితే ఆ మార్పులను ఎవరూ పట్టించుకోలేదు. మన దేశంలో స్కూళ్లు మొదలైనప్పటి నుంచి 'మొద్దు'లుగా భావించే పిల్లలను వెనుక కూచోబెట్టడం ఆనవాయితీ. వెనుక కూచుని వెనుకబడితే మళ్లీ వారిదే తప్పుగా నిలబెట్టడం కూడా ఆనవాయితీనే. విద్యార్థిగా పొందే గౌరవం వెనుక బెంచీ విద్యార్థులకు చాలామందికి ఉండదు.

ఈ పరిస్థితి మారాలని ఒక వెనుకబెంచీ కుర్రాడిని హీరోగా చేసి అతనిలోని తెలివితేటలను, చురుకుదనాన్ని చూపుతూ నిరూపించాడు దర్శకుడు ఈ సినిమాలో. అందుకే అది కేరళ బడుల్లో కదలిక తెచ్చింది. ఇక దేశం మొత్తం ఇలాంటి సినిమాలో ఆలోచనలు వచ్చి మార్పు తేవాల్సి ఉంటుంది.

● నయా ట్రెండ్

పెళ్లి ఘనంగా జరిగింది... కానీ వధూవరులు లేరు!



వధూవరులు లేని పెళ్లి గురించి విన్నారా?

అసలు అలాంటి పెళ్లి అనేది ఒకటి ఉంటుందని ఎప్పుడైనా అనుకున్నారా!

సూటిగా మ్యాటర్‌లోకి వస్తే... 'ఫేక్ వెడ్డింగ్' అనేది యువతరంలో ఒక ట్రెండ్‌గా మారింది.

మెట్రో సిటీస్‌లో ఎక్కువగా జరిగే ఈ ఉత్తుత్తి వివాహ వేడుకల్లో బ్యాండ్ బాజాలు ఉంటాయి. అతిథులు ఉంటారు. ఘన స్వాగతాలు ఉంటాయి. దండలు మార్చుకోవడాలు (మాక్) ఉంటాయి. పురోహితుడి వేదమంత్రాలు ఉంటాయి.

అయితే వధూవరులు మాత్రం ఉండరు.

ఢిల్లీ, బెంగళూరు, పుణేలలో ఈ ట్రెండ్ ఊపు అందుకుంటుంది. కాలేజి క్యాంపస్‌లలో, రూఫ్‌టాప్ బార్‌లలో ఈ వేడుకలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ ఫేక్ పెళ్లి వేడుకలకు ఉచిత ప్రవేశాలు ఉండవు. అయిదు వందల నుంచి మూడు వేల వరకు ప్రవేశ రుసుము ఉంటుంది.

సోషల్ మీడియాలో కంటెంట్ క్రియేషన్ కోసం ఈ ఫేక్ వెడ్డింగ్ ట్రెండ్ బాగా ఉపయోగపడుతుంది. విశేషం ఏమిటంటే ఈ లోకల్ ట్రెండ్ కాస్త దేశ సరిహద్దులు దాటింది. అమెరికాలోని కార్నెల్ యూనివర్శిటీలో ఫేక్ వెడ్డింగ్ ఈవెంట్ రెండు రోజుల పాటు ఘనంగా జరిగింది. ఫేక్ వెడ్డింగ్ ట్రెండ్‌పై సోషల్ మీడియాలో భిన్నభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

'ఆహా' అని కొందరు ఆకాశానికి ఎత్తుతుండగా...

'పిదపకాలం పిదప బుద్ధులు' అని కొందరు విమర్శలు కురిపిస్తున్నారు.

● స్టడీ

అలనాటి మహిళా రాజ్యం



పురాతన టర్కిష్ నగరాన్ని 9000 సంవత్సరాల క్రితం మాతృస్వామ్య సమాజంలో నివసించే స్త్రీలు పాలించారని ఒక కొత్త అధ్యయనం ధ్రువీకరించింది. కాటల్హోయుక్లో 35 వేర్వేరు ఇళ్ల నుంచి 130కి పైగా అస్థిపంజరాల డీఎన్ఏను పరిశోధకులు విశ్లేషించారు.

జన్యు శాస్త్రవేత్తలు, పురావస్తు శాస్త్రవేత్తలు, బయోలాజికల్ ఆంత్రోపాలజిస్టులు ఈ అధ్యయనంలో పాలుపంచుకున్నారు. అస్థిపంజరాల డీఎన్ఏ విశ్లేషణకు అత్యాధునిక సాంకేతిక జ్ఞానాన్ని ఉపయోగించారు.

ఆ కాలంలో ప్రతి కుటుంబంలో, వ్యవసాయంలో మహిళలు కీలక పాత్ర పోషించేవారు. వివాహం తరువాత భర్తలు భార్య ఇంటికి వచ్చేవారు.

మరణం తరువాత అంత్యక్రియలకు సంబంధించి పాటించే ఆచారాలలో స్త్రీ, పురుషుల మధ్య తేడా ఉండేదని అధ్యయనం తెలియజేసింది. పురుషులతో పోల్చితే స్త్రీల సమాధిలో ఉంచవలసిన వస్తువులు అయిదు రెట్లు ఎక్కువగా ఉండేవి. మాతృస్వామ్య సమాజానికి సంబంధించిన చిహ్నాలు, మహిళా ప్రతిమలను భారీ స్థాయిలో కలిగిన ఉన్న కారణంగా కాటల్హోయుక్ ప్రసిద్ధి పొందింది. కాలానుగుణంగా సంస్కృతిలో వచ్చిన మార్పులకు సాక్ష్యంగా నిలుస్తోంది.



రెండో రౌండ్ తొలి గేమ్‌లో హంపి విజయం

బతూమి (జార్జియా): మహిళల ప్రపంచకప్ నాకౌట్ చెస్ టోర్నమెంట్ రెండో రౌండ్‌లో భారత క్రీడాకారిణులు రాణించారు. భారత్ నుంచి మొత్తం ఎనిమిది మంది క్రీడాకారిణులు రెండో రౌండ్‌లో బరిలోకి దిగారు. గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, వైశాలి, దివ్య దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్ తమ ప్రత్యర్థులపై గెలుపొందగా... ద్రోణవల్లి హారిక, ప్రియాంక, నందిత, పద్మిని రౌత్ తమ ప్రత్యర్థులతో గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. హంపి 39 ఎత్తుల్లో అఫ్రూజ ఖామ్‌దమోవా (ఉజ్బెకిస్తాన్)పై, వైశాలి 81 ఎత్తుల్లో ఉలెట్ మైలి జేడ్ (కెనడా)పై, వంతిక 36 ఎత్తుల్లో ప్రపంచ మాజీ చాంపియన్ అన్నా ఉషెనినా (ఉక్రెయిన్)పై, దివ్య 45 ఎత్తుల్లో కేసరియా మెగ్‌లాద్జె (జార్జియా)పై విజయం సాధించారు. హారిక-నందిత గేమ్ 123 ఎత్తుల్లో... పద్మిని-అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్) గేమ్ 31 ఎత్తుల్లో... ప్రియాంక-కులోన్ క్లౌడియా (పోలాండ్) గేమ్ 71 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. నేడు జరిగే రెండో గేమ్‌లను హంపి, దివ్య, వైశాలి, వంతిక 'డ్రా' చేసుకుంటే మూడో రౌండ్‌కు అర్హత సాధిస్తారు. హారిక, పద్మిని, నందిత, ప్రియాంక తమ రెండో గేమ్‌లలో గెలిస్తే మూడో రౌండ్‌కు చేరుకుంటారు. 'డ్రా' చేసుకుంటే టైబ్రేక్ గేమ్‌లు ఆడతారు. ఓడిపోతే మాత్రం టోర్నీ నుంచి నిష్క్రమిస్తారు.

జ్యోతి సురేఖ-రిషభ్ జోడీ
ప్రపంచ రికార్డు



మాడ్రిడ్: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-4 టోర్నమెంట్‌లో భారత జోడీ వెన్నం జ్యోతి సురేఖ-రిషభ్ యాదవ్ కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. కాంపౌండ్ విభాగం క్వాలిఫయింగ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ (ఆంధ్రప్రదేశ్), రిషభ్ యాదవ్ (హరియాణా) ద్వయం 1431 పాయింట్లు స్కోరు చేసింది. తద్వారా 2023 యూరోపియన్ గేమ్స్‌లో 1429 పాయింట్లతో టాంజా జెలెన్‌థియెన్-మథియాస్ ఫులర్టన్ (డెన్మార్క్) నెలకొల్పిన ప్రపంచ రికార్డును సురేఖ-రిషభ్ ద్వయం బద్దలు కొట్టింది. మహిళల క్వాలిఫయింగ్‌లో జ్యోతి సురేఖ 715 పాయింట్లు ... పురుషుల క్వాలిఫయింగ్‌లో రిషభ్ 716 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచారు.

ఫైనల్లో సురేఖ బృందం

జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్, ప్రీతికలతో కూడిన భారత మహిళల జట్టు కాంపౌండ్ టీమ్ విభాగంలో ఫైనల్లోకి దూసుకెళ్లింది. క్వాలిఫయింగ్‌లో భారత జట్టు 2116 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు 'బై' పొందింది. క్వార్టర్ ఫైనల్లో సురేఖ బృందం 235-226తో ఎల్ సాల్వడోర్ జట్టుపై... సెమీఫైనల్లో 230-226తో ఇండోనేసియాపై గెలిచింది.

ఆధిక్యమే లక్ష్యంగా...

భారత క్రికెట్ జట్టు ఇంగ్లండ్ గడ్డపై లార్డ్స్ గ్రౌండ్‌లోనే మూడు టెస్టులు గెలిచింది. ఇతర ఏ మైదానంలోనూ రెండుకు మించి విజయాలు సాధించలేదు. మనకు కలిసొచ్చిన వేదికపై ఇప్పుడు మరో సమరం. మ్యాచ్‌లో బుమ్రా పునరాగమనంతో పెరిగిన పేస్ బలం. గత టెస్టులో సాధించిన ఘన విజయం ఇచ్చిన అంతులేని ఆత్మవిశ్వాసం. వెరసి కొత్త ఉత్సాహంతో భారత జట్టు మూడో టెస్టుకు సిద్ధమైంది. మరోవైపు బలహీనమైన ఆటతో రెండో టెస్టును కోల్పోయిన ఆతిథ్య ఇంగ్లండ్ కోలుకోవాలని ఆశిస్తోంది. ఇక్కడా ఆ జట్టు ఓడిందంటే సిరీస్ చేజారినట్లే!



శుబ్‌మన్ గిల్, సిరాజ్, యశస్వి జైస్వాల్, అభిమన్యు ఈశ్వరన్

నేటి నుంచి భారత్, ఇంగ్లండ్ మూడో టెస్టు

- జోరు కొనసాగించాలని టీమిండియా
- కోలుకునే ప్రయత్నంలో ఇంగ్లండ్
- బరిలో బుమ్రా, ఆర్చర్
- మధ్యాహ్నం గం.3:30 నుంచి సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం

లండన్: భారత్, ఇంగ్లండ్ సుదీర్ఘ టెస్టు సమరంలో మరో పోరుకు రంగం సిద్ధమైంది. 1-1తో సిరీస్ సమంగా ఉన్న స్థితిలో నేడు ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానంలో ఇరు జట్ల మధ్య మూడో టెస్టు మొదలవుతుంది. భారత జట్టు బర్మింగ్‌హామ్ ప్రదర్శనను బట్టి చూస్తే అన్ని అస్త్రశస్త్రాలతో ఎలాంటి లోపాలు లేకుండా జట్టు సన్నద్ధమైనట్లు కనిపిస్తోంది. ఇక్కడా విజయం సాధిస్తే 2-1తో దూసుకుపోయి ఆపై సిరీస్ గెలుచుకునే అవకాశం కూడా ఉంటుంది కాబట్టి గిల్ బృందం మరింత పట్టు బిగించాలని భావిస్తోంది. జట్టులో అక్కడక్కడా పూరించలేని లోపాలు కనిపిస్తున్న ఇంగ్లండ్ ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరం.

ప్రసిధ్ స్థానంలో బుమ్రా...

సిరీస్‌లో రెండు టెస్టుల్లో భారత జట్టు బలమైన బ్యాటింగ్ ప్రదర్శనను కనబర్చింది. టాప్-6లో కరుణ్ నాయర్ మినహా మిగతా వారంతా సెంచరీ లేదా కనీసం అర్ధసెంచరీలు నమోదు చేశారు. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, గిల్, రిషభ్ పంత్ శతకాలు బాదగా... రవీంద్ర జడేజా ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లోనూ హాఫ్ సెంచరీలు చేసి తన బ్యాటింగ్ పదును చూపించాడు. ముఖ్యంగా అసాధారణ ప్రదర్శన కనబరుస్తున్న గిల్‌ను ఇంగ్లండ్ బౌలర్లు నిలువరించలేకపోతున్నారు. వైఫల్యాలు ఉన్నా సరే, నాయర్‌కు సిరీస్‌లో మరో అవకాశం దక్కవచ్చు. కాబట్టి బ్యాటింగ్ బృందంలో ఎలాంటి మార్పూ ఉండదు. బౌలింగ్‌లో బుమ్రా ఆడటం ఖాయం కావడంతో ప్రసిధ్ కృష్ణ స్థానంలో అతను నేరుగా జట్టులోకి వస్తాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో చెలరేగిన ఆకాశ్‌దీప్, సిరాజ్‌లకు ఇప్పుడు బుమ్రా జత కలిస్తే బౌలింగ్‌కు తిరుగుండదు. అదనపు స్పిన్నర్ కావాలని భావిస్తే నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో కుల్దీప్ యాదవ్ వస్తాడు. స్పిన్ ఆల్‌రౌండర్లు జడేజా, వాషింగ్టన్ సుందర్ మరోసారి కీలకం కానున్నారు.


ఫొటో సెషన్‌లో పోప్, స్టోక్స్, జో రూట్

నాలుగేళ్ల తర్వాత...

ఎప్పటిలాగే ఇంగ్లండ్ మ్యాచ్‌కు ముందు రోజే తమ తుది జట్టును ప్రకటించింది. జోష్ టంగ్ స్థానంలో ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్‌కు చోటు కల్పించింది. అతని వేగం తమకు అదనపు బలంగా మారుతుందని జట్టు నమ్ముతోంది. అయితే ఆర్చర్ ఏకంగా నాలుగేళ్ల తర్వాత టెస్టు మ్యాచ్‌లో బరిలోకి దిగుతున్నాడు. అతను ఏమాత్రం ప్రభావం చూపుతాడనే చెప్పలేం. మరో ఇద్దరు పేసర్లు వోక్స్, కార్స్ తమ స్థానాలు నిలబెట్టుకున్నారు. వీరిద్దరు సిరీస్‌లో పెద్దగా ప్రభావం చూపకపోయినా... ఈ టెస్టు కోసం ఎంపిక చేసిన అట్కిన్సన్ గాయంతో తప్పుకోవడంతో మరో ప్రత్యామ్నాయం లేకపోయింది. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 71 ఓవర్లలో 286 పరుగులు ఇచ్చినా స్పిన్నర్‌గా షోయబ్ బషీర్‌పైనే ఇంగ్లండ్ నమ్మకం ఉంచింది. అయితే ఈ మ్యాచ్‌లో గెలవాలంటే ఇంగ్లండ్ బ్యాటింగ్ పదునెక్కాల్సి ఉంది. బ్యాటింగ్‌కు మరీ అనుకూలం కాని లార్డ్స్ పిచ్‌పై ఆతిథ్య బ్యాటర్లు స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చాల్సి ఉంది. ఓపెనర్లు క్రాలీ, డకెట్ భారత పేసర్లను ఎలా ఎదుర్కొంటారనేది చూడాలి. ఓలీ పోప్‌తో పాటు జో రూట్ కూడా అంచనాలను అందుకోవాల్సి ఉంది. హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్ ఫామ్ సానుకూలాంశం కాగా, కెప్టెన్ బెన్ స్టోక్స్ బ్యాటింగ్ ఆందోళన రేకెత్తిస్తోంది. అతను ఒక మంచి ఇన్నింగ్స్ ఆడి చాలా కాలమైంది. ఇప్పుడైనా స్టోక్స్ తన బ్యాటింగ్ బలాన్ని చూపించడం జట్టుకు ఎంతో అవసరం.

తుది జట్ల వివరాలు

భారత్ (అంచనా): గిల్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, నాయర్, పంత్, జడేజా, సుందర్, ఆకాశ్‌దీప్, సిరాజ్, బుమ్రా, కుల్దీప్. **ఇంగ్లండ్:** స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బ్రూక్, స్మిత్, వోక్స్, కార్స్, ఆర్చర్, బషీర్.

పిచ్, వాతావరణం

అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌కు సమాన అనుకూలతగా జీవం ఉన్న పిచ్ ఇది. ఆరంభంలోనే కాస్త పేస్‌కు అనుకూలిస్తుంది. ఆపై మంచి బ్యాటింగ్‌కు అవకాశం ఉంది. ఈసారి టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్‌ను ఎంచుకోవచ్చు. మ్యాచ్ రోజుల్లో వర్ష సూచన లేదు.

19
భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య లార్డ్స్ మైదానంలో జరిగిన టెస్టులు. 3 టెస్టుల్లో భారత్, 12 టెస్టుల్లో ఇంగ్లండ్ గెలిచాయి. 4 టెస్టులు 'డ్రా'గా ముగిశాయి.

148
లార్డ్స్ మైదానంలో ఇప్పటి వరకు జరిగిన టెస్టులు. 97 టెస్టుల్లో ఫలితాలు రాగా, 51 టెస్టులు 'డ్రా'గా ముగిశాయి. ఈ వేదికపై ఇంగ్లండ్ 145 టెస్టులు ఆడింది. 59 టెస్టుల్లో నెగ్గి, 35 టెస్టుల్లో ఓడింది. 51 టెస్టులను 'డ్రా' చేసుకుంది.

తొలిసారి సెమీస్‌లోకి...

క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని అధిగమించిన స్వియాటెక్, బెన్‌చిచ్


స్వియాటెక్


బెన్‌చిచ్

లండన్: ఐదు గ్రాండ్‌స్లామ్ టోర్నీ టైటిల్స్ విజేత ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఆరో ప్రయత్నంలో... ప్రపంచ మాజీ నాలుగో ర్యాంకర్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) తొమ్మిదో ప్రయత్నంలో... తొలిసారి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు అర్హత సాధించారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ స్వియాటెక్ 6-2, 7-5తో 19వ ర్యాంకర్ సమ్సోనోవా (రష్యా)పై... 35వ ర్యాంకర్ బెన్‌చిచ్ 7-6 (7/3), 7-6 (7/2)తో 7వ ర్యాంకర్ మిరా ఆంద్రీవా (రష్యా)పై గెలుపొందారు.

సెమీస్‌లో సినెర్‌తో జొకోవిచ్ 'ఢీ'

పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్ వన్ యానిక్ సినెర్ (ఇటలీ), ఏడుసార్లు చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా) సెమీఫైనల్లోకి ప్రవేశించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ సినెర్ 2 గంటల 19 నిమిషాల్లో 7-6 (7/2), 6-4, 6-4తో పదో సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా)ను ఓడించగా... జొకోవిచ్ 3 గంటల 11 నిమిషాల్లో 6-7 (6/8), 6-2, 7-5, 6-4తో 22వ సీడ్ ఫ్లావియో కొబొల్లి (ఇటలీ)పై విజయం సాధించారు. రేపు జరిగే సెమీఫైనల్స్‌లో అల్‌కరాజ్ (స్పెయిన్)తో టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా); సినెర్‌తో జొకోవిచ్ తలపడతారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

సిద్ధు బ్యాడాస్


● సిద్ధు జొన్నలగడ్డ

హీరో సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు రవికాంత్ పేరెపు కాంబినేషన్‌లో వచ్చిన 'కృష్ణ అండ్ హిజ్ లీల' (2020) చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం వీరి కాంబినేషన్‌లో రూపొందుతోన్న ద్వితీయ చిత్రానికి 'బ్యాడాస్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు మేకర్స్. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'బ్యాడాస్' టైటిల్ ఫిక్స్ చేసి, సిద్ధు జొన్నలగడ్డ లుక్ రిలీజ్ చేశారు. "బలమైన కథ, భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న చిత్రం 'బ్యాడాస్'. ఈ చిత్రంలో సిద్ధు కొత్తగా కనిపిస్తారు. పరిణతి చెందిన నటనతో మెప్పిస్తారాయన. ఈ చిత్రానికి రవికాంత్‌తో పాటు సిద్ధు రచయితగా వ్యవహరిస్తున్నారు. 2026లో 'బ్యాడాస్'ని రిలీజ్ చేస్తాం" అని యూనిట్ పేర్కొంది.

ఆమె పాత్ర చూస్తే కన్నీళ్లు ఆగవు



- ఆర్‌కే సాగర్

"'మొగలి రేకులు' సీరియల్‌లో నేను చేసిన పోలీస్ క్యారెక్టర్ ఆర్కే నాయుడు మంచి పేరు తీసుకొచ్చింది. ఆ క్యారెక్టర్‌కి భిన్నమైన క్యారెక్టర్స్ చేయాలనే ఆలోచనతో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, సిద్ధార్థ, షాదీ ముబారక్' వంటి సినిమాలు చేశాను. మళ్లీ ఒక పోలీస్ పాత్ర చేయాలంటే బలమైన కథ కుదరాలి. అలాంటి కథ 'ది 100'లో కుదిరింది. ప్రతి యుగంలో దీనులను కాపాడడానికి ఒక ఆయుధం పుడుతుంది. త్రేతాయుగంలో రామబాణం, ద్వాపరయుగంలో సుదర్శన చక్రం, కలియుగంలో 'ది 100'. ఈ సినిమాకి అంత పవర్ ఉంది" హీరో ఆర్‌కే సాగర్ తెలిపారు. ఆర్‌కే సాగర్ హీరోగా నటించిన చిత్రం 'ది 100 '. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మిషా నారంగ్ కథానాయికగా నటించగా, ధన్యా బాలకృష్ణ, విష్ణుప్రియ కీలక పాత్రలు పోషించారు. రమేశ్ కరుటూరి, వెంకీ పుషడపు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆర్‌కే సాగర్ విలేకరులతో మాట్లాడుతూ– "వెండితెరపై చాలా పోలీస్ క్యారెక్టర్స్ వచ్చాయి. కానీ 'ది 100' మాత్రం ప్రతి పోలీస్ ఆఫీసర్ గర్వంగా ఫీల్ అయ్యేలా ఉంటుంది. నేను చేసిన విక్రాంత్ ఐపీఎస్ పాత్రకి ఎంత ప్రాధాన్యం ఉందో మిషా నారంగ్, ధన్యా బాలకృష్ణ, విష్ణుప్రియ పాత్రలూ సినిమాలో కీలకంగా ఉంటాయి. ప్రత్యేకించి మిషా పాత్ర చూస్తే కన్నీళ్లు ఆగవు... ప్రేక్షకులు అంతలా కనెక్ట్ అవుతారు. రియల్ పోలీస్ ఆఫీసర్ చెప్పిన ఆలోచనతో 'ది 100' మొదలైంది. ఓసారి సుకుమార్‌గారికి ఈ పాయింట్ చెబితే, ఎగ్జైట్ అయ్యారు. ఆ తర్వాత రమేశ్, వెంకీగార్లు ఈ కథపై నమ్మకంతో నిర్మించారు. ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాతో రూపొందిన ఈ సినిమాని కుటుంబమంతా చూడాలి. 'ది 100'కి సీక్వెల్ చేసే చాన్స్ ఉంది" అని చెప్పారు.

తెలంగాణ సంస్కృతి నేపథ్యంలో...


● లెలిజాల రవీందర్, రితికా

లెలిజాల రవీందర్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'రాజుగాని సవాల్'. రితికా చక్రవర్తి హీరోయిన్‌గా నటించారు. లెలిజాల కమల ప్రజాపతి సమర్పణలో ఎల్‌ఆర్ ప్రొడక్షన్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా ఆగస్టు 8న శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ను నటుడు జగపతి బాబు రిలీజ్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు మాట్లాడుతూ– "బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్‌తో తెలంగాణ నేపథ్యంలో వస్తున్న చిత్రమిది. మా మూవీ ప్రేక్షకులను నిరాశ పరచదు" అని తెలిపారు. లెలిజాల రవీందర్ మాట్లాడుతూ– "తెలంగాణ సంస్కృతి నేపథ్యంలో సాగే క్లాసిక్ మూవీ 'రాజుగాని సవాల్'. హైదరాబాద్‌లో జరిగే సాంస్కృతిక వేడుకలు ఎలా ఉంటాయనేది సహజంగా తెరకెక్కించేందుకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కవాడిగూడలో రియల్ లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం" అని చెప్పారు. ముఖ్య అతిథి దామోదర ప్రసాద్, సాంబశివరావు, నిర్మాత తరుణిక, నటి రితికా చక్రవర్తి, నటుడు రవీందర్ బొమ్మకంటి, నటి పద్మ మాట్లాడారు.

చిత్ర పరిశ్రమలో ఎవరైనా కష్టపడాల్సిందే

- మంచు మనోజ్


● హరీశ్, మాళవిక, సుహాస్, మనోజ్, రామ్

"ఎటువంటి నేపథ్యం లేకుండా హీరోగా ఎదిగాడు సుహాస్. నెపో కిడ్స్ (బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవారు) అయినా సినిమా పరిశ్రమలో కష్టపడాల్సిందే. కష్టపడితేనే విజయం. ఈ విషయాన్ని ఓ నెపో కిడ్‌గా చెబుతున్నాను. తమిళంలో విజయ్ సేతుపతిగారిలా తెలుగులో సుహాస్ అలాంటి స్టారే. 'ఓ భామ అయ్యో రామ' మంచి విజయం సాధించాలి" అని మంచు మనోజ్ తెలిపారు. సుహాస్, మాళవికా మనోజ్ జంటగా రామ్ గోధల దర్శకత్వం వహించిన చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. హరీశ్ నల్ల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి మంచు మనోజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ– "ప్రతి అబ్బాయి సక్సెస్‌ఫుల్ లైఫ్‌లో తల్లి, భార్య... ఇద్దరూ ఎంతో కీలకంగా ఉంటారు. మా సినిమాలో ఆ పాత్రలకు సంబంధించిన భావోద్వేగాలు అందరి హృదయాలను హత్తుకుంటాయి" అన్నారు. "రామ్ కొత్త దర్శకుడిలా కాకుండా ఎంతో అనుభవం ఉన్నవాడిలా తీశారు. సుహాస్ నటన మరో రేంజ్‌లో ఉంటుంది" అని హరీశ్ నల్లా తెలిపారు. "మా చిత్రంలో సుహాస్ ఆల్‌రౌండర్ ప్రతిభ చూపారు" అన్నారు రామ్ గోధల.

గేమ్ ఆఫ్ చేంజ్


● సిద్ధార్థ్ రాజశేఖర్, మీనా చాబ్రియా

ఐదో శతాబ్దం నుంచి పన్నెండో శతాబ్దం వరకు నలందా విశ్వవిద్యాలయం నేపథ్యంలో భారత దేశంలో జరిగిన కొన్ని నిజ జీవిత కథనాలతో రూపొందిన సినిమా 'గేమ్ ఆఫ్ చేంజ్'. సిద్ధార్థ్ రాజశేఖర్ ఈ సినిమాలో హీరోగా నటించి, నిర్మించారు. మలయాళ దర్శకుడు సిధిన్ తెరకెక్కించిన ఈ సినిమాకు మీనా చాబ్రియా మరో నిర్మాత. ఎఫ్ టి బ్లైర్ సింగర్, సురేంద్రన్ జయకర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన ఈ 'గేమ్ ఆఫ్ చేంజ్' త్వరలో థియేటర్స్‌తో పాటు ఓటీటీలోనూ రిలీజ్ కానుంది. ఈ చిత్రం విలేకరుల సమావేశంలో సిద్ధార్థ్ రాజశేఖర్ మాట్లాడుతూ– "కష్టాలు ఎదుర్కొన్నప్పుడే జీవితంలో ఎదుగుతామని చెప్పే చిత్రం ఇది" అన్నారు. "'గేమ్ ఆఫ్ చేంజ్' అనేది ఫస్ట్ కమ్యూనిటీ బేస్డ్ మూవీ" అన్నారు మీనా చాబ్రియా.

దర్శకుడు రాంబాబు హఠాన్మరణం



దర్శకుడు కావాలనే కలతో చిత్రపరిశ్రమకి వచ్చి, ఆ అవకాశం అందుకుని ఓ సినిమా తెరకెక్కించి, ఇక ప్రేక్షకుల ముందుకు రావడమే తరువాయి అని సంతోషించేలోపే విషాదం నెలకొంది. తాను ఎంతో కష్టపడి తెరకెక్కించిన 'బ్రహ్మాండ' సినిమా ప్రివ్యూ చూస్తూ దర్శకుడు రాంబాబు హఠాన్మరణం చెందారు. ఆమని, బన్నీ రాజు, జయరామ్, కనికా వాద్య, జోగిని శ్యామల, విజయ రంగరాజు కీలక పాత్రలు పోషించిన చిత్రం 'బ్రహ్మాండ'. ఈ సినిమా ద్వారా రాంబాబు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. తెలంగాణ ఒగ్గు కళాకారుల నేపథ్యంలో దాసరి సురేష్, దాసరి మమత నిర్మించారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా ప్రివ్యూని హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో మంగళవారం రాత్రి యూనిట్ చూస్తుండగా హఠాత్తుగా పడిపోయారట రాంబాబు. ఆయన్ని హాస్పిటల్‌కి తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్‌తో తుది శ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల చిత్ర యూనిట్‌తో పాటు పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం రాంబాబు అంత్యక్రియలు జరిగాయి.


● 'బాహుబలి: ది బిగినింగ్' సినిమాకు పదేళ్లు



సాహోరే బాహుబలి

ఈ తరంలో తెలుగు సినిమా సాహసం... బాహుబలి
తెలుగు సినిమా గర్వం... బాహుబలి
తెలుగు సినిమా గౌరవం... బాహుబలి
తెలుగు సినిమా ధైర్యం... బాహుబలి

అవును... "భళి భళి భళిరా భళి... సాహోరే బాహుబలి" అని ప్రేక్షకులు అనేలా చేసింది 'బాహుబలి' చిత్రం. ప్రభాస్ హీరోగా, రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బాహుబలి'. రాజమౌళి దర్శకత్వంలో శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మించిన బాహుబలి తొలి భాగం 'బాహుబలి: ది బిగినింగ్' 2015 జూలై 10న రిలీజ్ కాగా, మలి భాగం 'బాహుబలి: ది కన్‌క్లూజన్' 2017 ఏప్రిల్ 28న విడుదలైంది. 'బాహుబలి: ది బిగినింగ్' విడుదలై నేటితో పదేళ్లు. ఈ సందర్భంగా ఈ సినిమా గురించి కొన్ని ఆసక్తికర విశేషాలు.

- ఈ సినిమాలోని అమరేంద్ర బాహుబలి, మహేంద్ర బాహుబలి (శివుడు) పాత్రల్లో ప్రభాస్, భల్లాలదేవుడి పాత్రలో రానా, దేవసేనగా అనుష్క, అవంతికగా తమన్నా, శివగామిగా రమ్యకృష్ణ, కట్టప్పగా సత్యరాజ్, బిజ్జలదేవగా నాజర్ కనిపిస్తారు. ముందు శివగామి పాత్రకు శ్రీదేవిని, కట్టప్ప పాత్రకు సంజయ్ దత్‌ను, భల్లాలదేవుడి పాత్రకు జేసన్ మమోవా (హాలీవుడ్ మూవీ 'ఆక్వామేన్' ఫేమ్)లను అనుకున్నారు కానీ కుదరలేదు. అయితే శివగామిగా రమ్యకృష్ణ, కట్టప్పగా సత్యరాజ్ ఎంత సరిగ్గా సరిపోయారో, బాహుబలికి యాంటీ రోల్ అయిన భల్లాలదేవ పాత్రకు రానా ఎంత ఫిట్ అయ్యారో చూశాం. అమరేంద్ర బాహుబలి, మహేంద్ర బాహుబలిగా ప్రభాస్ తప్ప ఎవరూ సూట్ కాదని ప్రేక్షకులు ప్రశంసించారు. అనుష్క, తమన్నా, నాజర్‌ల నటన సూపర్.
- ఇంట్రవెల్ బ్యాంగ్‌ను పంచభూతాలు (గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశం) నేపథ్యంలో డైలాగ్స్ వస్తుంటే... అప్పుడు ప్రభాస్ ఎంట్రీ ఉండేలా ప్లాన్ చేశారు. కానీ మాహిష్మతిలో భల్లాలదేవ విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంగా 'బాహుబలి... బాహుబలి..' అని వచ్చేలా ఆ తర్వాత మార్చారు.
- 'బాహుబలి: ది బిగినింగ్'లో వాటర్ ఫాల్స్ నేపథ్యంలోని సన్నివేశాలు అద్భుతంగా కనిపిస్తాయి. ప్రభాస్ శివలింగాన్ని మోసుకు రావడం, జలపాతంపైకి ఎక్కి వెళ్లడానికి ప్రభాస్ చేసే సాహసాలు ఆడియన్స్‌ని ఆశ్చర్యపరుస్తాయి. అయితే ఇది నిజమైన జలపాతం కాదట. కొంత స్టూడియోలో, కొంత గ్రాఫిక్స్‌లో చేశారు.
- ఈ సినిమాలో కాలకేయుడు (ప్రభాకర్) మాట్లాడే కిలికిలి భాష అప్పట్లో ఓ హాట్ టాపిక్. ఇప్పటికీ ఈ భాష గురించి సరదాగా మాట్లాడేవారు ఉన్నారు. ఈ భాషను రచయిత మదన్ కార్కీ సృష్టించారు. ఈ భాషలో దాదాపు 700 పదాలు, 40 వ్యాకరణ నియమాలు ఉన్నాయట.
- దాదాపు రూ. 150 కోట్లకు పై బడ్జెట్‌తో రూపొందిన 'బాహుబలి: ది బిగినింగ్' ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 600 కోట్ల వసూళ్లు సాధించి, 2015లో ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. అలాగే అప్పటికి అత్యధిక వసూళ్లు సాధించిన రెండో భారతీయ చిత్రంగా రికార్డ్ సాధించింది. ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు రాబట్టిన తొలి పది తెలుగు చిత్రాల్లో 'బాహుబలి: ది బిగినింగ్' పేరు ఉంది. అలాగే ఈ చిత్రం పలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సాధించింది. ఇక ఈ చిత్రానికి సంబంధించిన 50 వేల చదరపు అడుగుల పోస్టర్ గిన్నిస్ రికార్డుగా నిలిచిందట.
- 'బాహుబలి' సినిమాలోని మాహిష్మతి సామ్రాజ్యాన్ని ఇరవై ఎకరాల విస్తీర్ణంలో, సుమారు రూ. 25 కోట్లతో ఏర్పాటు చేశారు. అలాగే ఈ సినిమాలోని గ్రాఫిక్స్ కోసం పదిహేనుకు పైగా స్టూడియోలు, ఐదొందల మందికి పైగా వీఎఫ్ఎక్స్ ఆర్టిస్టులు శ్రమించాల్సి వచ్చిందట. ఇక కేకే సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్, వి. శ్రీనివాస్‌మోహన్ విజువల్ ఎఫెక్ట్స్, కీరవాణి సంగీతం ఈ సినిమాకు ప్లస్ అయ్యాయి.
- 'బాహుబలి' రెండో భాగం 'బాహుబలి: ది కన్‌క్లూజన్'పై ఆసక్తిని పెంచేందుకు తొలి భాగంలో 'బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడు?' అనే ఆసక్తికరమైన క్లిఫ్ హ్యాంగర్‌ను వదిలారు. 'వై కట్టప్ప కిల్డ్ బాహుబలి' అనే హ్యాష్‌ట్యాగ్ సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అయ్యింది. 2015లో గూగుల్‌లో ట్రెండ్ అయిన మొదటి పది అంశాల్లో 'వై కట్టప్ప కిల్డ్ బాహుబలి? అనేది ఒకటి.
- తెలుగు సినిమా 'గ్లోబల్ రేంజ్'కి ఎదిగింది 'బాహుబలి'తోనే. ఒక రకంగా 'పాన్ ఇండియా' ట్రెండ్ ఆరంభమైనదే 'బాహుబలి'తోనే. ఈ సినిమా తర్వాత టాలీవుడ్‌పై వరల్డ్ సినిమా దృష్టి పడింది.

ఇలా 'బాహుబలి' సినిమా గురించి ఆసక్తికరమైన విశేషాలు చాలానే ఉన్నాయి.

అక్టోబరులో బాహుబలి

'బాహుబలి: ది బిగినింగ్, బాహుబలి: ది కన్‌క్లూజన్'లను కలిపి ఒకే చిత్రంగా ఈ ఏడాది అక్టోబరులో రీ-రిలీజ్ చేయాలని అనుకుంటున్నారని సమాచారం.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
176	46
83,536	25,476

విదేశీ సూచీలు

నాస్డాక్	20,554	▲	135
డోజోన్స్	44,294	▲	53
ఎఫ్టీఎస్ఈ 100	8,867	▲	13
డాక్స్	24,550	▲	343
షాంఘై	3,493	▽	4
నికాయ్	39,821	▲	132

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్బీఐ	85.45	86.47
£	బ్రిటన్ పౌండ్	ఎస్బీఐ	115.20	118.13
€	యూరో	ఎస్బీఐ	99.25	102.00
¥	జపాన్ యెన్ (100)	ఎస్బీఐ	57.70	59.18
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్బీఐ	54.93	57.14
S$	సింగపూర్ డాలర్	థామస్కుక్	64.59	69.29
SAR	సౌదీ రియాల్	థామస్కుక్	21.95	23.46
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్కుక్	22.44	24.22
¥	చైనా యువాన్	థామస్కుక్	11.06	12.88

యాపిల్ సీవోవోగా 'ప్రవాసీ' సబీహ్ ఖాన్



న్యూఢిల్లీ: అమెరికన్ టెక్ దిగ్గజం యాపిల్కి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్గా (సీవోవో) భారత సంతతికి చెందిన సబీహ్ ఖాన్ నియమితులయ్యారు. ప్రస్తుత సీవోవో జెఫ్ విలియమ్స్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. 'ప్రతిభావంతుడైన వ్యూహకర్త'గా ఖాన్ని యాపిల్ సీఈవో టిమ్ కుక్ అభివర్ణించారు. యాపిల్ సరఫరా వ్యవస్థను పటిష్టంగా తీర్చిదిద్దిన వారిలో ఆయన కూడా ఒకరని పేర్కొన్నారు. అమెరికాలోనే ఐఫోన్ల తయారీని చేపట్టాలంటూ అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, యాపిల్పై ఒత్తిడి తెస్తున్న పరిస్థితుల్లో కంపెనీ సీవోవోగా ఖాన్ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. 1966లో ఉత్తర్ప్రదేశ్లోని మొరాదాబాద్లో జన్మించిన ఖాన్, సింగపూర్లో పాఠశాల స్థాయి విద్యాభ్యాసం చేశారు. ఆ తర్వాత అమెరికాలో సెటిల్ అయ్యారు. 1995లో యాపిల్లో చేరిన తర్వాత గత మూడు దశాబ్దాలుగా యాపిల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం సీనియర్ వైస్ ప్రెసిడెంట్గా (ఆపరేషన్స్) ఉన్నారు. యాపిల్లో చేరక ముందు ఆయన జీఈ ప్లాస్టిక్స్లో అప్లికేషన్స్ డెవలప్మెంట్ ఇంజనీర్గా పని చేశారు. గత ఆరేళ్లుగా యాపిల్లో ఆయన గ్లోబల్ సప్లై చెయిన్, కొనుగోళ్లు, తయారీ, లాజిస్టిక్స్ తదితర విభాగాలను పర్యవేక్షిస్తున్నారు.

ఎన్విడియా @ 4 లక్షల కోట్ల డాలర్లు



న్యూయార్క్: అమెరికా చిప్ తయారీ దిగ్గజం ఎన్విడియా కొత్త రికార్డు సృష్టించింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా 4 ట్రిలియన్ (ట్రిలియన్ అంటే లక్ష కోట్లు) డాలర్ల శిఖరాన్ని చేరిన తొలి కంపెనీగా నిలిచింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్కు డిమాండ్ అంతకంతగా పెరుగుతున్న తరుణంలో ఇటీవల ఈ కంపెనీ షేరు దూసుకెళ్తోంది. అమెరికా మార్కెట్లో బుధవారం ట్రేడింగ్ సెషన్లో కంపెనీ షేరు ధర 2.5 డాలర్లు పెరిగి 164 డాలర్ల జీవితకాల గరిష్టాన్ని తాకింది. ఈ క్రమంలో కంపెనీ విలువ 4 లక్షల కోట్ల డాలర్ల మైలురాయిని సాధించింది. 2023 జూన్లో తొలిసారి ట్రిలియన్ డాలర్లు దాటిన ఈ చిప్ తయారీ కంపెనీ తర్వాత ఒక్క ఏడాదిలోనే మార్కెట్ విలువను ఏకంగా 3 రెట్లు పెంచుకుంది. అలా 3 ట్రిలియన్ డాలర్ల కంపెనీల సరసన నిలిచిన ఎన్విడియా 4 ట్రిలియన్ డాలర్ల మార్కునూ దాటేసి టాప్ లేపింది. మార్కెట్ క్యాప్ పరంగా ఎన్విడియా తర్వాత 3.75 లక్షల కోట్ల డాలర్లతో మైక్రోసాఫ్ట్ రెండో అతి పెద్ద కంపెనీగా కొనసాగుతోంది. ఎస్అండ్పీ500 ఇండెక్స్లో ఈ షేరు 7.3%తో అత్యధిక వెయిటేజీ కలిగి ఉంది. యాపిల్ 7%, మైక్రోసాఫ్ట్ 6% వెయిటేజీలతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

టాటా ఆటోకాంప్, స్కోడా జట్టు

రైల్వే పరికరాల తయారీపై జేవీ దృష్టి

TATA AUTOCOMP SYSTEMS LIMITED

న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల దేశీ కంపెనీ టాటా ఆటోకాంప్ తాజాగా యూరోపియన్ దిగ్గజం స్కోడా గ్రూప్తో చేతులు కలిపింది. తద్వారా రైల్వే రంగ పరికరాల తయారీకి వీలుగా భాగస్వామ్య కంపెనీ(జేవీ)ని ఏర్పాటు చేయనున్నాయి. జేవీ దేశీయంగా రైల్వే ప్రొపల్షన్ సిస్టమ్స్, కంపోనెంట్స్ తయారు చేయనుంది. దీంతో భారత్కు మల్టీ మిలియన్ యూరో పెట్టుబడులు లభించనున్నాయి. తాజా భాగస్వామ్యం వృద్ధిలో ఉన్న దేశీ రైల్వే, మొబిలిటీ మార్కెట్లకు మద్దతివ్వనున్నట్లు టాటా ఆటోకాంప్ ఒక ప్రకటనలో పేర్కొంది. యూరోపియన్ దిగ్గజం స్కోడా గ్రూప్ ప్రధానంగా ప్రజా రవాణాకు వినియోగించే వాహన విడిభాగాల తయారీలో పేరొందింది. మరోవైపు ఎలక్ట్రిక్ వాహనాల సిస్టమ్స్, విడిభాగాల మార్కెట్లో టాటా ఆటోకాంప్ పటిష్ట వాటాను కలిగి ఉంది. జేవీ ప్రధానంగా మీడియం, హైస్పీడ్ ప్రాంతీయ రైళ్లు, మెట్రోలు, లైట్ రైల్ వాహనాల తయారీలో వినియోగించే కన్వెర్టర్లు, డ్రైవ్స్, ఆగ్జిలరీ కన్వెర్టర్లు తదితరాలను రూపొందించనుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్లో..
మళ్లీ ఈక్విటీ ఫండ్స్ జోరు.. | వేదాంత గ్రూప్ ఓ పేకమేడ — వైస్రాయ్ రీసెర్చ్ సంచలన రిపోర్ట్

ఐటీ అంతంత మాత్రమే!

క్యూ1 ఆదాయాలపై అంచనాలు

వివిధ విభాగాల్లో తగ్గిన డిమాండ్ • రాణించనున్న మిడ్ క్యాప్ కంపెనీలు
నేడు టీసీఎస్తో ఫలితాల సీజన్ షురూ...



వివిధ విభాగాలవ్యాప్తంగా డిమాండ్ నెమ్మదించడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశీ ఐటీ కంపెనీల ఆదాయాల వృద్ధి ఒక మోస్తరు స్థాయికే పరిమితం కావొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. అయితే, మధ్య స్థాయి కంపెనీలు మాత్రం మెరుగ్గా రాణించవచ్చని విశ్లేషకులు, బ్రోకరేజీ సంస్థలు లెక్కలు వేస్తున్నాయి. ప్రధాన కరెన్సీలతో పోలిస్తే దాలరు బలహీనపడటమనేది సీక్వెన్షియల్గా 100–200 బేసిస్ పాయింట్ల మేర ఆదాయాల వృద్ధికి కలిసి రావచ్చనే అభిప్రాయం నెలకొంది.

ఐటీ దిగ్గజాల ఆర్థిక ఫలితాల సీజన్ గురువారం నుంచి ప్రారంభమవుతోంది. జూలై 10న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), 14న హెచ్సీఎల్ టెక్, 16న టెక్ మహీంద్రా.. ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్ ఫలితాలను ప్రకటించనున్నాయి. అలాగే జూలై 17న ఎల్టీఐమైండ్ట్రీ, 23న ఇన్ఫోసిస్ ఆర్థిక ఫలితాలు వస్తాయి. 'క్యూ2లో ఐటీ రంగం ఆర్థిక ఫలితాలు మిశ్రమంగా ఉండొచ్చు. ప్రథమ శ్రేణి సంస్థల ఆదాయ వృద్ధి స్థిర కరెన్సీ ప్రాతిపదికన ఒక మోస్తరు స్థాయికే పరిమితం కావచ్చు. అదే సమయంలో మధ్య స్థాయి కంపెనీలు పటిష్టమైన వృద్ధి సాధించవచ్చు' అని హెచ్డీఎఫ్సీ సెక్యూరిటీస్ ఒక నివేదికలో పేర్కొంది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ 2026 పూర్తి ఆర్థిక సంవత్సరానికి కంపెనీలు గతంలో ప్రకటించిన గైడెన్స్నే కొనసాగించే అవకాశం ఉందని వివరించింది. అమెరికా టారిఫ్లు, స్థూల ఆర్థిక పరిస్థితులపరమైన సవాళ్లు మొదలైన అంశాలు క్లయింట్ల వ్యయాలపై ప్రభావం చూపవచ్చని, కాకపోతే త్రైమాసికం ప్రారంభంలో భావించినంతగా డిమాండ్ పడిపోలేదని హెచ్డీఎఫ్సీ సెక్యూరిటీస్ తెలిపింది.

'చేసే ఖర్చుకు తగ్గట్లుగా పనితీరును మెరుగుపర్చుకోవడం, మౌలిక సదుపాయాలను ఆధునీకరించుకోవడం, ఏఐ తదితర అంశాలకు సంబంధించిన డీల్స్ గణనీయంగానే ఉన్నాయి' అని వివరించింది.

90 రోజుల విరామం సానుకూలం..

టారిఫ్ల వడ్డనకు అమెరికా 90 రోజులు విరామం ప్రకటించడమనేది, ఐటీ కంపెనీలకు అతి పెద్ద మార్కెట్పై గల భయాలను కాస్త తగ్గించిందని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ తెలిపింది. గత రెండు నెలలుగా నిఫ్టీ ఐటీ 10 శాతం పైగా ర్యాలీ చేయడం ఇందుకు నిదర్శనమని వివరించింది. అయినప్పటికీ కొత్త డీల్స్కి పెద్దగా ఊతం లభించలేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో కోఫోర్జ్, పర్సిస్టెంట్ మినహా ఐటీ కంపెనీలు, ఈఆర్అండ్డీ (ఇంజనీరింగ్ రీసెర్చ్, డెవలప్మెంట్) సంస్థల ఆదాయాలు ఒక మోస్తరు స్థాయికే పరిమితం కావచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపింది. డాలర్ల మారకంలో ఆదాయం కొంత మెరుగ్గా ఉంటుందని వివరించింది. ఆదాయాల వృద్ధిపరంగా మిడ్-క్యాప్, లార్జ్ క్యాప్ కంపెనీల మధ్య వ్యత్యాసం గణనీయంగా పెరుగుతోందని పేర్కొంది. 'కన్జూమర్, తయారీ, ఆటో, లాజిస్టిక్స్, కమ్యూనికేషన్ విభాగాల్లో డిమాండ్ నెమ్మదించింది' అని తెలిపింది.

ఇతర బ్రోకరేజీల అంచనాలు..

మోతీలాల్ ఓస్వాల్: భౌగోళిక రాజకీయ పరిస్థితులు, టారిఫ్లపరంగా అనిశ్చితి వల్ల కొత్తగా భారీ డీల్స్ కుదుర్చుకోవడంపై ప్రతికూల ప్రభావం పడినప్పటికీ, ప్రస్తుత ఒప్పందాలు యథాప్రకారంగానే అమలవుతున్నాయి. క్లయింట్లు ప్రాజెక్టులను వాయిదా వేయడం, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పరిధిని కుదించడం గానీ చేయలేదు. క్యూ1 ఫలితాల్లో ఇది ప్రతిఫలించవచ్చు. లార్జ్-క్యాప్స్కి సంబంధించి త్రైమాసికాలవారీగా ఆదాయాలు, కాంట్రాక్టుల విలువ పెద్ద ఆకర్షణీయంగా ఉండకపోవచ్చు. త్రైమాసికాలవారీగా లార్జ్ క్యాప్స్ వృద్ధి 'మైనస్ 2.5% నుంచి ప్లస్ 1.5%' మధ్యలో ఉండొచ్చు. 'మైనస్ 2.0% నుంచి ప్లస్ 7% మధ్య వృద్ధి'తో మిడ్-క్యాప్స్ మరోసారి ఆకర్షణీయమైన పనితీరు కనపర్చవచ్చు. బలహీన డాలరు వల్ల 100-200 బేసిస్ పాయింట్ల మేర ప్రయోజనం లభించవచ్చు.

ప్రభుదాస్ లీలాధర్: టారిఫ్లపరమైన అనిశ్చితి కాస్త తగ్గినప్పటికీ, వాటి ప్రభావం పడే విభాగాల్లో డిమాండ్ పుంజుకోలేదు. ప్రస్తుత పరిస్థితులరీత్యా ఆదాయాల వృద్ధి బలహీనంగానే ఉండొచ్చు.

బోర్డ్ మీటింగ్స్

కంపెనీ	తేదీ (జులై)
టీసీఎస్	10
హెచ్సీఎల్ టెక్	14
టెక్ మహీంద్రా, ఎల్అండ్ టీ టెక్	16
ఎల్టీఐమైండ్ట్రీ	17
ఇన్ఫోసిస్	23

టెక్, ఆయిల్ షేర్లలో అమ్మకాలు

- మళ్లీ వాణిజ్య యుద్ధ భయాలు
- క్యూ1 ఫలితాలముందు అప్రమత్తత
- సెన్సెక్స్ నష్టం 176 పాయింట్లు

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పలు దేశాలతో వాణిజ్య యుద్ధానికి తెర లేపడంతో ఈక్విటీ మార్కెట్లు బుధవారం నష్టాలు చవిచూశాయి. దేశీయంగా తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభం కానుండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. సెన్సెక్స్ 176 పాయింట్లు కోల్పోయి 83,536 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 46 పాయింట్లు నష్టపోయి 25,476 వద్ద నిలిచింది. ఆయిల్అండ్గ్యాస్, మెటల్, రియల్టీ, ఐటీ, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. భారత్ సహా బ్రిక్స్ సభ్య దేశాలపై 10% అదనపు సుంకాలు విధించనున్నట్లు ట్రంప్ ప్రకటనతో ప్రపంచ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.



- అమెరికా షార్ట్ సెల్లర్ వైస్రాయ్ రీసెర్చ్ నివేదికతో వేదాంత లిమిటెడ్ షేరు 3% నష్టపోయి రూ.441 వద్ద స్థిరపడింది. వైస్రాయ్ రీసెర్చ్ నివేదికలో 'ఆర్థికంగా నిలకడలేనిది' అంటూ ఆరోపించింది. ఇంట్రాడేలో 8% క్షీణించి రూ.421 వద్ద కనిష్టాన్ని తాకింది.
- నష్టాల మార్కెట్లోనూ ఎడ్యుకేషన్ టెక్ కంపెనీ క్రిజాక్ లిస్టింగ్ మెప్పించింది. ఇష్యూ ధర (రూ.245)తో పోలిస్తే 14% ప్రీమియంతో రూ.280 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 26% పెరిగి రూ.308 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 25% లాభంతో రూ.307 వద్ద స్థిరపడింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-తెలంగాణ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-సోషల్ స్టడీస్
» గ్రూప్స్ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జీఎస్-సైన్స్ అండ్ టెక్నాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- బ్యాంకింగ్ అవేర్నెస్

విద్య, ఉద్యోగ సమాచారం

ఎఫ్డీడీఐలో ఫ్యాకల్టీ పోస్టులు

రోహతక్(హర్యానా)లోని ఫుట్వేర్ డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ (ఎఫ్డీడీఐ).. ఫ్యాకల్టీ, జూనియర్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ లేదా పీజీ, బీటెక్/బీఈ/బీఎస్సీ ఇంజనీరింగ్ లేదా ఎంటెక్/ఎంఈ/ఎంఎస్సీ ఇంజనీరింగ్లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** జూనియర్ ఫ్యాకల్టీకి 35 ఏళ్లు, ఫ్యాకల్టీకి 40 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు ఫ్యాకల్టీకి రూ.65,000, జూనియర్ ఫ్యాకల్టీకి రూ.45,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.07.2025
» **వెబ్సైట్:** https://fddiindia.com

గోవా షిప్యార్డ్ లిమిటెడ్లో 102 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

గోవా షిప్యార్డ్ లిమిటెడ్(జీఎస్ఎల్) ఒప్పంద ప్రాతిపదికన నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 102.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ సూపర్వైజర్ (సేఫ్టీ-ఎలక్ట్రికల్)-03, అసిస్టెంట్ సూపరింటెండెంట్-03, టెక్నికల్ అసిస్టెంట్-40, నర్స్ (మేల్)-01, ఆఫీస్ అసిస్టెంట్-క్లరికల్ స్టాఫ్-14, ఆఫీస్ అసిస్టెంట్-03, షిప్రైట్ ఫిట్టర్-04, స్ట్రక్చరల్ ఫిట్టర్-10, వెల్డర్-08, మెషినిస్ట్-04, సేఫ్టీ స్టివార్డ్-04, పెయింటర్-08.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.28,700 నుంచి 45,700.
» **వయసు:** టెక్నికల్ అసిస్టెంట్కు 36 ఏళ్లు, ఆఫీస్ అసిస్టెంట్కు 35 ఏళ్లు, ఇతర పోస్టులకు 33 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 12.07.2025
» **ఆన్లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 11.08.2025
» **వెబ్సైట్:** https://goashipyard.in

ఎన్సీడీసీ, న్యూఢిల్లీలో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ కోఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్(ఎన్సీడీసీ).. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్(లీగల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** లా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి రూ.70,000.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** career@ncdc.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 31.07.2025.
» **వెబ్సైట్:** https://www.ncdc.in

రైట్స్ లిమిటెడ్, గుర్గావ్లో సైట్ అసెస్సర్ పోస్టులు

గుర్గావ్లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్).. ఒప్పంద ప్రాతిపదికన సైట్ అసెస్సర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 27.07.2025 నాటికి 40 ఏళ్లలోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.25,120.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.07.2025
» **వెబ్సైట్:** https://www.rites.com

ఈస్ట్ కోస్ట్ రైల్వేలో 18 టెక్నీషియన్ పోస్టులు

భువనేశ్వర్లోని ఈస్ట్ కోస్ట్ రైల్వేలో తాత్కాలిక ప్రాతిపదికన వివిధ విభాగాల్లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 18.
» **పోస్టుల వివరాలు:** టెక్నీషియన్-1(ఎస్ఎం)-05, టెక్నీషియన్2(ఎస్ఎం)-01, టెక్నీషియన్-3(ఎస్ఎం)-06, టెక్నీషియన్-1(టీసీఎం)-01, టెక్నీషియన్-2 (టీసీఎం)-01, టెక్నీషియన్-3(టీసీఎం)-04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ/యాక్ట్ అప్రెంటిస్షిప్, ఇంటర్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగ అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఉద్యోగానుభవం, వైవా వాయిస్ టెస్ట్, కంప్యూటర్ పరిజ్ఞానం ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా.
» **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.08.2025.
» **వెబ్సైట్:** https://eastcoastrail.indianrailways.gov.in

ఏఏఐ, కోల్కతాలో 34 అప్రెంటిస్లు

కోల్కతాలోని ఎయిర్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ).. ఒప్పంద ప్రాతిపదికన గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 34.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్లు-09, డిప్లొమా అప్రెంటిస్లు-12, ట్రేడ్ అప్రెంటిస్లు(ఐటీఐ)-13.
» **విభాగాలు:** ఇంజనీరింగ్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానిక్స్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్.
» **అర్హత:** సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్కు రూ.15,000, డిప్లొమా అప్రెంటిస్కు రూ.12,000, ట్రేడ్ అప్రెంటిస్కు రూ.9000.
» **వయసు:** 30.07.2025 నాటికి 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు వయో సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, షార్ట్లిస్ట్, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ల పరిశీలన, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా.
» **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.07.2025
» **వెబ్సైట్:** https://www.aai.aero

మల్టీటాస్కింగ్ కొలువుల పిలుపు

భారత ప్రభుత్వ నియామకాల సంస్థ స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్సీ).. మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (నాన్ టెక్నికల్), హవల్దార్ ఎగ్జామినేషన్ 2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా మల్టీ టాస్కింగ్ స్టాఫ్, హవల్దార్ పోస్టులను భర్తీ చేయనుంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, పీఈటీ/పీఎస్టీల ఆధారంగా ఎంపిక చేస్తుంది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్సీ ఎంటీఎస్, హవల్దార్ పోస్టులు, వేతనాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపికప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» ఎంటీఎస్ నాన్ టెక్నికల్, హవల్దార్ పోస్టులకు నోటిఫికేషన్
» పదో తరగతి ఉత్తీర్ణతతో దరఖాస్తు చేసుకోవచ్చు
» ఆన్లైన్ పరీక్ష, పీఈటీ/పీఎస్టీలతో ఎంపిక



ఎస్ఎస్సీ ఎంటీఎస్, హవల్దార్ ఎగ్జామ్ 2025 నోటిఫికేషన్ ద్వారా కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖలు/విభాగాలు/కార్యాలయాలతోపాటు వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలోని రాజ్యాంగబద్ధ సంస్థలు/స్టాట్యుటరీ బాడీస్/ట్రిబ్యునల్స్లో జనరల్ సెంట్రల్ సర్వీస్ గ్రూప్ సీ నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్ స్థాయిలో మల్టీ టాస్కింగ్ స్టాఫ్(నాన్ టెక్నికల్) పోస్టులను భర్తీ చేయనుంది. దీంతోపాటు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్(సీబీఎన్)లో జనరల్ సెంట్రల్ సర్వీస్ గ్రూప్ సీ నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్ స్థాయిలో హవల్దార్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది.

పోస్టుల వివరాలు

- **మల్టీ టాస్కింగ్స్టాఫ్(నాన్ టెక్నికల్):** పోస్టుల సంఖ్యను వెల్లడించలేదు.
- **హవల్దార్ ఇన్ సీబీఐసీ, సీబీఎన్:** 1075 పోస్టులు
- **అర్హతలు:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉడాలి.
- **వయసు:** 01.08.2025 నాటికి 18 ఏళ్ల నుంచి 27 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
- **వేతనం:** పే లెవెల్ 1 వేతన శ్రేణి లభిస్తుంది. నెలకు రూ.18,000–56,900 వేతనం అందుతుంది.

ఎంపిక ప్రక్రియ

- ఎంటీఎస్ పోస్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. అదేవిధంగా హవల్దార్ పోస్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్షతోపాటు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(పీఈటీ)/ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్టీ) ఉంటాయి.
- కంప్యూటర్ ఆధారిత పరీక్షకు హిందీ, ఇంగ్లిష్తో పాటు మరో 13 భాషల్లో హాజరయ్యే అవకాశం ఉంది. అభ్యర్థులు తమకు ఇష్టమైన భాషను పరీక్ష మాధ్యమంగా ఎంచుకోవచ్చు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు తెలుగు/ఉర్దూలో పరీక్షకు హాజరుకావచ్చు.

కంప్యూటర్ ఆధారిత పరీక్ష

- కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ప్రశ్న పత్రంలో సెషన్1, సెషన్ 2 ఉంటాయి. సెషన్ 1లో న్యూమరికల్ అండ్ మ్యాథమెటికల్ ఎబిలిటీ 20 ప్రశ్నలు–60 మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ అండ్ ప్రాబ్లం సాల్వింగ్ 20 ప్రశ్నలు–60 మార్కులకు ఉంటాయి. ఈ సెషన్ పరీక్ష వ్యవధి 45 నిమిషాలు. అదేవిధంగా సెషన్ 2లో జనరల్ అవేర్నెస్ 25 ప్రశ్నలు– 75 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రెహెన్షన్ 25 ప్రశ్నలు–75 మార్కులకు ఉంటాయి.ఈ సెషన్ పరీక్ష వ్యవధి 45 నిమిషాలు.రెండు సెషన్లు ఒకే రోజు జరుగుతాయి. రెండు సెషన్లకు హాజరవడం తప్పనిసరి.45 నిమిషాలు పూర్తికాగానే సెషన్ 1 ముగుస్తుంది. ఆ తర్వాత సెషన్ 2 మొదలవుతుంది. అనంతరం 45 నిమిషాలకు సీబీఈ పరీక్ష పూర్తవుతుంది.
- కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో, మల్టిపుల్ ఛాయిస్ విధానంలో జరుగుతుంది. సెషన్ 1లో ఎలాంటి నెగిటివ్ మార్కుల నిబంధన లేదు. కాని సెషన్ 2లో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ఇందులో ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.
- సీబీఈ పరీక్షను వేర్వేరు షిఫ్ట్లల్లో నిర్వహిస్తే నార్మలైజేషన్ ప్రక్రియను అనుసరిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేది:** 24.07.2025
- **ఫీజు చెల్లింపునకు చివరి తేది:** 25.07.2025
- **దరఖాస్తుల సవరణ తేదీలు:** 29.07.2025 నుంచి 31.07.2025
- **కంప్యూటర్ బేస్డ్ పరీక్ష తేదీలు:** 20 సెప్టెంబర్ నుంచి 24 అక్టోబర్ 2025 వరకు
- **వెబ్సైట్:** https://ssc.gov.in

రాత పరీక్షలో రాణించేలా

- న్యూమరికల్ అండ్ మ్యాథమెటికల్ ఎబిలిటీ విభాగంలో.. ఇంటీజర్స్, హోల్ నంబర్స్, ఎల్సీఎం, హెచ్సీఎఫ్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, రిలేషన్షిప్స్ బిట్వీన్ నంబర్స్, అరిథమెటిక్ ఆపరేషన్స్, బాడ్మాస్, పర్సంటేజెస్, రేషియో అండ్ ప్రపోర్షన్స్, వర్క్ అండ్ టైమ్, డైరెక్ట్ అండ్ ఇన్వర్స్ ప్రపోర్షన్స్, యావరేజెస్, సింపుల్ ఇంటరెస్ట్, ప్రాఫిట్ అండ్ లాస్, డిస్కౌంట్, ఏరియా అండ్ పెరిమీటర్ ఆఫ్ బేసిక్ జామెట్రిక్ ఫిగర్స్, టైమ్ అండ్ డిస్టెన్స్, లైన్స్ అండ్ యాంగిల్స్, సింపుల్ గ్రాఫ్స్, డేటా,స్క్వేర్ అండ్ స్క్వేర్ రూట్స్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఈ విభాగంలో మంచి స్కోర్ చేసేందుకు పదో తరగతి వరకు గణితాంశాలపై పట్టు సాధించాలి. ఆ తర్వాత గత ప్రశ్నలను, మోడల్ పేపర్లను ప్రాక్టీస్ చేయాలి.
- రీజనింగ్ ఎబిలిటీ అండ్ ప్రాబ్లం సాల్వింగ్ విభాగంలో.. అడిగే ప్రశ్నలు అభ్యర్థి నేర్చుకునే సామర్థ్యాన్ని పరిశీలించేలా ఉంటాయి. ఇందులో ప్రధానంగా అల్ఫాన్యూమరిక్ సిరీస్, కోడింగ్–డికోడింగ్, అనాలజీ, డైరెక్షన్స్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, జంబ్లింగ్, ప్రాబ్లం సాల్వింగ్ అండ్ అనాలసిస్తోపాటు డయాగ్రమ్స్, ఏజ్ క్యాలికులేషన్స్, క్యాలెండర్, క్లాక్ ఆధారిత నాన్ వెర్బల్ రీజనింగ్ ప్రశ్నలు అడుగుతారు. ఇందులో రాణించేందుకు అభ్యర్థులు ప్రతి రోజూ సాధ్యమైనన్ని ఎక్కువ మాదిరి ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.
- జనరల్ అవేర్నెస్ విభాగంలో.. హిస్టరీ, జాగ్రఫీ, ఆర్ట్, కల్చర్, సివిక్స్, ఎకానమిక్స్ తోపాటు జనరల్ సైన్స్, ఎన్విరాన్మెంటల్ స్టడీస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందులో అడిగే ప్రశ్నలు సాధారణంగా పదోతరగతి స్థాయిలో ఉంటాయి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగంలో.. ఈ భాషపై అభ్యర్థికి ఉన్న ప్రాథమిక అవగాహనను పరిశీలించేలా ప్రశ్నలు అడుగుతారు. ముఖ్యంగా వొక్యాబులరీ, గ్రామర్, సెంటెన్స్ స్ట్రక్చర్, సినానిమ్స్, యాంటోనిమ్స్, కాంప్రెహెన్షన్, పేరాగ్రాఫ్ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి. దీని కోసం అభ్యర్థులు ఇంగ్లిష్ వొక్యాబులరీతోపాటు గ్రామర్పై అవగాహన పెంచుకోవాలి. మాదిరి ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.



సింహగిరికి మబ్బుల గొడుగు

పచ్చని కొండల మధ్య సుందర నగరాన్ని నల్లటి మబ్బులు కమ్మేశాయి. గురు పౌర్ణమి రోజున లక్షల మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తుంటే వారికి గొడుగు పట్టినట్లు కారు మబ్బులు అలముకున్నాయి. ఆ మబ్బులను చీల్చుకుంటూ వస్తున్న సూర్యుడి కిరణాల అద్భుత దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



పంట పండింది..

మత్స్యకారుల పంట పండింది. గురువారం విశాఖ హార్బర్‌లో వేటకు వెళ్లిన వారి వలలకు భారీ చేపలు చిక్కాయి. కొమ్ము కోనెం, ట్యూనా చేపలు పెద్ద సంఖ్యలో లభించాయి. దీంతో సాయంత్రం ఫిషింగ్ హార్బర్‌లో సందడి నెలకొంది. కొంత మంది వాటికి అక్కడే వేలం నిర్వహించగా.. మరికొందరు ఎగుమతులకు సిద్ధం చేసుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



బెల్జియం వంతెనలు కాదు.. బెజవాడ సౌందర్యం

కొండపై కొలువైన దుర్గమ్మ భక్తులను కాపాడుతుండగా.. బిరబిరా ప్రవహించే కృష్ణమ్మ సిరుల పంటలు పండిస్తూ, బెజవాడ అందాన్ని మరింత పెంచుతోంది. నదిపై నిర్మించిన వంతెనలు, వాటిగుండా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు, చుట్టూ పచ్చదనం.. విజయవాడ సహజ సౌందర్యాన్ని ఇనుమడింపచేస్తున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కూటమి వల.. క్యాంపస్ విలవిల

ఒంగోలు ట్రిపుల్ ఐటీకి నో ఆప్షన్

- 183 ఖాళీలతో రాష్ట్రంలో అత్యధిక సీట్లు మిగిలిపోయిన కాలేజీగా గుర్తింపు
- కూటమి ప్రభుత్వ నిర్వాకంతో కాలేజీలో చేరడంపై విద్యార్థుల అనాసక్తి
- అధికారుల అసంబద్ధ నిర్ణయాలతో చిరాకు
- తరచూ క్యాంపస్‌లను మార్చడమే ప్రధాన కారణం
- నిత్యం సమస్యలు సృష్టించడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో భయాందోళనలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ట్రిపుల్ ఐటీల ప్రతిష్ట మసకబారింది. ఒంగోలు ట్రిపుల్ ఐటీ కాలేజీలో బయటి వ్యక్తుల పెత్తనంతో భ్రష్టుపట్టిపోయింది. కాలేజీలో పచ్చ బ్యాచ్‌ను నాన్ టీచింగ్ సిబ్బందిగా నియమించడం ద్వారా క్యాంపస్ ఎత్తివేత కుట్రలకు ప్రభుత్వం తెరదీసింది. ఏడాది పాటు ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు క్యాంపస్ అద్దె చెల్లించకుండా నిలిపేసింది. కరెంటు బిల్లులూ చెల్లించలేదు. మౌలిక సదుపాయాలపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. చివరకు క్యాంపస్‌ను ఎత్తివేసింది. ఈ పరిణామాలతో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో చేరాలంటే విద్యార్థులు భయపడిపోయే పరిస్థితి దాపురించింది. తాజాగా జరిగిన కౌన్సెలింగ్‌లో రాష్ట్రంలోనే అత్యధిక సీట్లు మిగిలిపోయిన కాలేజీగా నిలవడం పరిస్థితికి అద్దం పడుతోంది.



ఒంగోలు ట్రిపుల్ ఐటీ ఎస్ఎస్ఎన్ క్యాంపస్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు ఉండగా ఒక్కో క్యాంపస్‌కు 1100 సీట్లున్నాయి. ఈ ఏడాది జూన్ 30 నుంచి జూలై 5వ తేదీ వరకు కౌన్సెలింగ్ జరిగింది. ఈ కౌన్సెలింగ్‌లో మొత్తం 598 సీట్లు ఖాళీగా మిగిలాయి. ఇందులో ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి 183 సీట్లు ఖాళీగా మిగిలి రాష్ట్రంలోనే అత్యధిక సీట్లు మిగిలిపోయిన కాలేజీగా నిలిచింది. గతంలో ఎన్నడూ ఇన్ని సీట్లు మిగలలేదని కాలేజీ ఉద్యోగులు చెబుతున్నారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో ఈ సీట్లు ఎన్ని భర్తీ అవుతాయో చూడాలి.

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో రాజకీయ జోక్యం మితిమీరిపోయింది. రాష్ట్ర ప్రభుత్వంలో అత్యంత కీలక పదవిలో ఉన్న మంత్రికి సన్నిహితుడైన ఒక ప్రైవేటు కాలేజీ అధినేత కాలేజీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం మొదలుపెట్టారు. తన గ్రామానికి చెందిన 50 మంది టీడీపీ కార్యకర్తలకు నాన్ టీచింగ్ స్టాఫ్‌గా నియమించినట్లు సమాచారం. అప్పటి వరకు ప్రశాంతంగా కొనసాగిన ఒంగోలు క్యాంపస్‌లో రచ్చ మొదలైంది. ఆ 50 మంది పచ్చ బ్యాచ్‌కు ఎలాంటి విధులు అప్పగించకుండా కూర్చోబెట్టి జీతాలు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. క్యాంపస్‌లోని ఎగ్జామ్ సెల్ పక్కనే ఉన్న ఒక గదిని డెన్‌గా మార్చుకున్న సదరు ఎల్లో బ్యాచ్ డ్యూటీ చేయకుండా టీవీలు చూస్తూ టైం పాస్ చేసేవారని విమర్శలు వచ్చాయి. అంతేకాకుండా కాలేజీ నిబంధనలకు వ్యతిరేకంగా తమ ఇష్టమొచ్చినప్పుడు కాలేజీకి వచ్చి సంతకాలు చేసేసి వెళ్లిపోయేవారని సమాచారం. దీంతో క్యాంపస్‌లో గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయి. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే క్యాంపస్ అద్దె చెల్లించలేదు. దాంతో రూ.2.50 కోట్ల అద్దె బకాయి మిగిలిపోయింది. కరెంటు బిల్లు సైతం కోటి రూపాయలకు పైగానే చెల్లించకుండా నిలిపేశారు. దీంతో తరచుగా కరెంటు కట్ చేయడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారు. మోటార్లు కాలిపోయి నీటి సరఫరా ఆగిపోయినా పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. రకరకాల సాకులు చూపి రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌ను ఎత్తివేశారు. ఇది విద్యార్థుల మీద తీవ్ర ప్రభావం చూపిందని కాలేజీ అధ్యాపకులు చెబుతున్నారు.

ఎస్ఎస్ఎన్‌లో ఆదిలోనే హంసపాదు...

రావ్ అండ్ నాయుడు క్యాంపస్ ఎత్తేసిన తరువాత ఒంగోలులో మిగిలింది ఎస్ఎస్ఎన్ క్యాంపస్. కాలేజీ తరగతులు ప్రారంభం కాకముందే ఇక్కడ మరో పచ్చ బ్యాచ్ రచ్చ రచ్చ చేసి విద్యార్థుల్లో భయాందోళనలు సృష్టించిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కాలేజీ క్యాంటిన్ నిర్వహణను రెండుగా విభజించి ఇద్దరికి ఇచ్చారు. బాలికల క్యాంటిన్‌ను చవటపాలెం గ్రామానికి చెందిన ఒకరికి, బాలుర క్యాంటిన్‌ను కొత్తపట్నం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చారు. ఈ ఇద్దరూ టీడీపీ నాయకులు, సానుభూతిపరులు కావడం గమనార్హం. గత బుధవారం బాలికల క్యాంటిన్‌ను తెరవడంతో బాలుర క్యాంటిన్ కాంట్రాక్టర్ గొడవకు దిగారు. 20 మంది యువకులను తీసుకొచ్చి కాలేజీలోకి బలవంతంగా ప్రవేశించి బాలికల క్యాంటిన్ నిర్వాహకురాలి భర్త మీద దాడి చేశారు.

క్యాంటిన్‌లోని వస్తువులతోపాటు ఆహార పదార్థాలను రోడ్డు మీద పడేశారు. ఈ దాడితో కాలేజీలో రిపోర్టింగ్ చేయడానికి వచ్చిన విద్యార్థులు, వారి తలిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. అసలు క్యాంటిన్ నిర్వహణ బాధ్యతను ఇద్దరికి కట్టబెట్టడం వలన గొడవలు జరిగే అవకాశం ఉందని అంచనా వేయడంలో అధికారులు వైఫల్యం చెందారన్న విమర్శలు వినవస్తున్నాయి. ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌ను కూడా ఎత్తివేసే క్రమంలోనే అధికార పార్టీ పక్కా ప్రణాళికతో గొడవలు సృష్టించిందని కొందరు విశ్లేషిస్తున్నారు.

సొంత భవనాలు ఎప్పుడు నిర్మిస్తారో...

ఒంగోలు ట్రిపుల్ ఐటీలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపకపోవడానికి ప్రధాన కారణాల్లో ఒకటి తరచుగా క్యాంపస్‌లను మార్చడం. తొలుత ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీలో ఒంగోలు క్యాంపస్‌ను నిర్వహించారు. అక్కడ నుంచి మార్చి ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌లో ఏర్పాటు చేశారు. అంతా బాగుందనుకుంటున్న విద్యార్థులకు ఐదేళ్ల తరువాత కూటమి ప్రభుత్వం వచ్చి ఒంగోలు క్యాంపస్‌ను నూజివీడుకు మార్చింది. పిల్లి పిల్లను తీసుకొని ఇంటింటికి తిరుగుతున్నట్లు విద్యార్థులు తరచుగా క్యాంపస్‌లు మారాల్సి రావడంతో చిరాకుకు గురౌతున్నారు. కొత్తగా చేరే విద్యార్థులపై తీవ్రమైన ప్రభావం పడింది.

ఒంగోలులో ట్రిపుల్ ఐటీకి సొంత భవనాలను నిర్మించడం ఒక్కటే దీనికి పరిష్కారమని కొందరు అధ్యాపకులు చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ విషయంలో కూడా తరచుగా మాట మారుస్తోంది. తొలుత పామూరులో ట్రిపుల్ ఐటీ కాలేజీని నిర్మిస్తామన్నారు. తాజాగా కనిగిరిలో ట్రిపుల్ ఐటీ కాలేజీ ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. ఒకవేళ మార్కాపురాన్ని జిల్లాగా మారిస్తే కనిగిరి.. మార్కాపురం జిల్లా పరిధిలోకి వెళ్లిపోతుంది. అప్పుడు ఒంగోలుకు అసలు ట్రిపుల్ ఐటీ కాలేజీ లేకుండా పోయే ప్రమాదం ఉందని మరికొందరు వాదిస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులోనే ట్రిపుల్ ఐటీ కాలేజీకి సొంత భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.

పోలీసు బందోబస్తు మధ్య క్యాంటిన్ నిర్వహణ..

బాలికల క్యాంటిన్ నిర్వాహకుడి మీద దాడి జరిగిన రోజు రాత్రి జిల్లాకు చెందిన ఒక కీలక ఎమ్మెల్యే నివాసంలో అర్ధరాత్రి వరకు రాజీ ప్రయత్నాలు సాగినట్లు ప్రచారం జరిగింది. అంతా అయిపోయింది. తెల్లారేసరికల్లా ఇద్దరూ కలిసిపోయారని చెప్పారు. ఈ లోపు ఏం జరిగిందో ఏమో కానీ దాడికి గురైన బాలికల క్యాంటిన్ నిర్వాహకులు శుక్రవారం సంతనూతలపాడు పోలీసు స్టేషన్లో కేసు పెట్టినట్లు సమాచారం. అదే రోజు క్యాంపస్‌కు వచ్చిన పోలీసులు విచారణ జరిపి దాడి తాలుకు సీసీ ఫుటేజీలను తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. శనివారం నుంచి పోలీసు బందోబస్తు మధ్య బాలికల క్యాంటిన్‌ను నిర్వహిస్తున్నారని సమాచారం. కాలేజీ క్యాంపస్‌లో పోలీసు పహారా మధ్య విద్యార్థులు భోజనాలు చేయడానికి భయపడిపోతున్నట్లు తెలుస్తోంది. ట్రిపుల్ ఐటీ అధికారుల వైఫల్యం వల్లనే ఇలాంటి దౌర్భాగ్యం నెలకొందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అక్రమాలకు అడ్డా.. ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కలకలం రేపిన బాధితుని ఆందోళన



ఉండి రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రంగబాబు

ఉండి: భూ అక్రమార్కులకు పశ్చిమగోదావరి జిల్లాలోని ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అడ్డాగా మారిందంటూ రంగబాబు అనే వ్యక్తి గురువారం కార్యాలయం ముందు టెంట్ వేసి ఆందోళనకు దిగడం స్థానికంగా కలకలం రేపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చినగొల్లపాలెంలో తమ ఆస్తికి సంబంధించి అక్రమాలు జరుగుతున్నాయన్నారు. భూ అక్రమాలకు సంబంధించి తనతో పాటు మరికొందరు గత కొద్దికాలం నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రావడంతో సబ్ రిజిస్ట్రార్ సెలవుపై వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. కృష్ణాజిల్లాతో పాటు రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల నుంచి రిజిస్ట్రేషన్‌ల కొరకు ఉండికి తరలివస్తున్నట్లు తెలిపారు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు లంచాలు తీసుకుంటున్న అధికారులు భూ ఆక్రమణ దారులకు కొమ్ముకాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు తగిన న్యాయం చేయకపోతే భార్యాబిడ్డలతో ఉండి రిజిస్ట్రార్ ఆఫీసు ముందు ఆత్మహత్యకు పాల్పడతానని హెచ్చరించారు. తమకు సంబంధించిన 32 ఎకరాల భూమిని అక్రమంగా ఆక్రమించుకునేందుకు ఓ మంత్రి సమీప ఉద్యోగి, రిజిస్ట్రేషన్ శాఖలో ఓ ఉన్నతాధికారి ప్రయత్నిస్తున్నట్లు తనకు అనుమానంగా ఉందని చెప్పారు. దీనిపై అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, అక్రమ రిజిస్ట్రేషన్ల ఆరోపణలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఇన్‌చార్జి టి.శరాబందురాజు ఖండించారు. ఇలా చేయడం ఎవరివల్లా కాదన్నారు. ఆరోపణలు చేస్తున్న రంగబాబు ఆస్తి కోర్టు పరిధిలో, అదీ నిషేధిత భూముల జాబితాలోనూ ఉందని పేర్కొన్నారు. సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్ళారు గానీ, ఎవ్వరికీ భయపడికాదని స్పష్టం చేశారు.

నలుగురు 'ఎర్ర' స్మగ్లర్లు అరెస్ట్

22ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పోలీసుల అదుపులో ఉన్న స్మగ్లర్లు, స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

తిరుపతి మంగళం: అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజ్ అటవీ ప్రాంతంలో నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేయడంతో పాటు, వారి నుంచి 22 ఎర్రచందనం దుంగలు, మూడు మోటారు సైకిళ్లను గురువారం తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్, డిఎస్పీ జి.బాలిరెడ్డి అధ్వర్యంలో ఆర్ఎస్ఐ ఎం. మురళీధరరెడ్డి టీమ్ బుధవారం రాత్రి నుంచి సానిపాయ పరిధిలోని వీరబల్లి మీదుగా గడికోట వైపు కూంబింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున నాయనూరు ప్రాంతం చేరుకోగా అక్కడ మూడు మోటారు సైకిళ్లు కనిపించాయి. సమీపంలో కొందరు వ్యక్తులు గుమికూడి కనిపించారు. వారిని చుట్టు ముట్టే క్రమంలో వారు పారిపోవడానికి ప్రయత్నించారు. అయితే టాస్క్ ఫోర్స్ పోలీసులు వారిని వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. అక్కడ పరిశీలించగా 22ఎర్రచందనం దుంగలు కనిపించాయి. పట్టుబడిన వారిని అన్నమయ్య జిల్లా వాసులుగా గుర్తించారు. వారిని దుంగలతో సహా తిరుపతిలోని టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించి కేసు నమోదుచేశారు.

భార్య దారుణ హత్య

ఆస్తి పెద్ద కొడుక్కి రాసివ్వమన్నందుకు అంతమొందించాడు

అనంతరం ఆత్మహత్యకు యత్నించిన భర్త



దారుణ హత్యకు గురైన భార్య జయలక్ష్మి

కైకలూరు: ఆస్తిని పెద్ద కొడుక్కి రాసివ్వమని అడిగిన భార్యను అంతమొందించాడో భర్త. ఈ ఘటన ఏలూరు జిల్లా కలిదిండి మండలం ఎస్ఆర్‌పీ అగ్రహారంలో చోటుచేసుకుంది. వివరాలివీ.. గ్రామానికి చెందిన కట్టా పెద్దిరాజు (50), జయలక్ష్మి (47) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు మగ సంతానం. పెద్ద కుమారుడికి ఇటీవల పెళ్లైంది. ఇద్దరు కుమారులు వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. పెద్దిరాజుకు గ్రామంలో 40 సెంట్ల భూమి ఉంది. దీనిని అమ్మకానికి సిద్ధం చేస్తున్నాడు. పెద్ద కొడుక్కి వివాహం జరగడంతో దంపతులు ఇల్లు కట్టుకుంటారని, స్థలం పెద్ద కొడుక్కి రాయాలని జయలక్ష్మి భర్తను కోరింది. ఈ విషయంలో తరచూ భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. తన కంటే బిడ్డలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని పెద్దిరాజు భార్యపై ద్వేషం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి నిద్రపోతున్న జయలక్ష్మిపై కత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. దీంతో ఆమె ఘటనాస్థలిలోనే ప్రాణం విడిచింది. అనంతరం పెద్దిరాజు భయపడి పురుగు మందు తాగి, చాకుతో పీక కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఇరుగు పొరుగువారు పోలీసులకు సమాచారమందించారు. ప్రాణాలతో ఉన్న పెద్దిరాజును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోజు గడవకముందే మరో హత్య

ఇదిలా ఉండగా ఇదే మండలం పోతుమర్రు శివారు గొల్లగూడెంలో తన భార్యను వివాహేతర సంబంధానికి సహకరిస్తోందనే అనుమానంతో ఎదురింటి వరలక్ష్మీదేవి (39)ని కట్టా రామాంజనేయులు అనే వ్యక్తి మంగళవారం మధ్యాహ్నం కత్తితో నరికి చంపాడు. ఈ ఘటన జరిగిన ఒకరోజు వ్యవధిలోనే కలిదిండి మండలంలో మరో హత్య జరిగడం గమనార్హం.

పరుపుల పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

- ఏలూరు నగర శివారు వంగాయగూడెంలో ఘటన
- తప్పిన పెనుప్రమాదం



ఏలూరు క్యాన్సర్ హాస్పిటల్ సమీపంలోని పరుపుల పరిశ్రమలో ఎగిసిపడుతోన్న అగ్నికీలలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో శివారు వంగాయగూడెంలోని పరుపుల పరిశ్రమలో గురువారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. వంగాయగూడెం క్యాన్సర్ హాస్పిటల్ సమీపంలో గల సుస్మిత ఫర్నిర్ కుషనింగ్ పరిశ్రమలో ఉదయం 9.30 గంటల సమయంలో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. ప్రాణనష్టం లేకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఎవరూ రాకముందే ఈ ప్రమాదం జరగడంతో ప్రాణనష్టం తప్పింది. ఇక్కడ అత్యంత ప్రమాదకరమైన రసాయనాలతో ఫోమ్‌ను తయారు చేస్తారు. ఈ రసాయనాల మిక్సింగ్‌కు వినియోగించే ట్యాంకర్‌ను మైనస్ డిగ్రీల్లో చల్లబరుస్తారు. కెమికల్ మిక్సింగ్ ట్యాంకర్‌కు సంబంధించిన ఏసీలను ఆన్ చేసిన వాచ్‌మెన్లు ఇద్దరూ కాలకృత్యాలు తీర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆ సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాప్తి చెందటంతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేశారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్, పోలీస్ సిబ్బంది సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ ప్రమాదంలో భారీ ఆస్తి నష్టం సంభవించిందని అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు.

కంటైనర్ బోల్తా.. 14 ఆవులు మృతి



దెందులూరు: జాతీయరహదారిపై ఆవులను తరలిస్తున్న కంటైనర్ వాహనం బోల్తా పడి 14 ఆవులు మృతి చెందాయి. ఈ ఘటన ఏలూరు జిల్లా దెందులూరు మండలం సోమవరప్పాడు వద్ద జరిగింది. విశాఖ నుంచి ఇతర ప్రాంతాలకు ఆవులను తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో మరో 6 ఆవులు తీవ్రంగా గాయపడ్డాయి. మరో 15 ఆవులు స్వల్ప గాయాలకు గురయ్యాయి. సమాచారం అందుకున్న దెందులూరు ఎస్ఐ ఆర్.శివాజీ, సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. ఈ ఘటనపై వెంటనే మండల పశువైద్యాధికారి డాక్టర్ హరికి సమాచారం అందించి ఘటనాస్థలికి రావాల్సిందిగా సూచించారు. ఘటనాస్థలికి చేరుకున్న డాక్టర్ హరి, వైద్య సిబ్బంది తీవ్ర, స్వల్ప గాయాలకు గురైన ఆవులను సమీపంలోని గేదెల ఫారం వద్దకు తరలించి వైద్య సేవలందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా...

సత్యకుమారికి సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ 2025 అవార్డు



డాబాగార్డెన్స్: సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ అవార్డ్–2025లో ఛేంజ్ మేకర్ విభాగం పురస్కారానికి విశాఖ నగరానికి చెందిన ఉన్నవ వెంకట సత్యకుమారి ఎంపికయ్యారు. గురువారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ అవార్డుల కార్యక్రమం చెన్నైలోని ఎంసీసీ స్కూల్ ఆడిటోరియంలో ఈనెల 9న జరిగిందన్నారు.ట్విల్ మ్యాగజైన్ వ్యవస్థాపకుడు దీపక్ టాటర్ జైన్ నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. సేవ, మహిళల సాధికారత రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ఈ పురస్కారాలను అందిస్తారని సత్యకుమారి వివరించారు.

కరెంట్ కాటుకు విద్యార్థి బలి

మెగా పీటీఎంకు వెళ్లొచ్చిన కాసేపటికే ఘటన



మెళియాపుట్టి : శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం గొప్పిలి గ్రామానికి చెందిన ఐదో తరగతి విద్యార్థి నవగాపు మహేష్ (10) విద్యుదాఘాతంతో గురువారం మృతిచెందాడు. గొప్పిలి ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పీటీఎంకు హాజరయ్యాడు. స్కూల్‌లో ఇచ్చిన మొక్కను తీసుకుని సాయంత్రం ఇంటి మేడపై ఉన్న కుండీలో నాటేందుకు వెళ్లాడు. అక్కడ పడి ఉన్న జీఏ వైరును తీసి పక్కన పెడదామనుకుని పట్టుకోగా.. షాక్ కొట్టి అక్కడే పడిపోయాడు. శ్లాబ్ గోడకు బలంగా తగలడంతో తీవ్రంగా రక్తస్రావమైంది. మెట్ల నుంచి రక్తం బొట్టుబొట్టుగా రావడం చూసిన కుటుంబ సభ్యులు మేడపైకి వెళ్లేసరికి బాలుడు విగతజీవిగా పడి ఉన్నాడు. బిడ్డ మృతదేహాన్ని చూసి తల్లి గుండెలవిసేలా రోదించింది. విద్యార్థి తండ్రి చంద్రరావు ఇటీవలే మృతిచెందారు. పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పీఐబీ ఏపీ డైరెక్టర్‌గా రత్నాకర్

సాక్షి, అమరావతి: ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ఆంధ్రప్రదేశ్ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా పి.రత్నాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అండ్ ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియాకు(పీఆర్‌జీఐ) డిప్యూటీ ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్‌గా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) సీనియర్ అధికారైన రత్నాకర్ పీఐబీలో బాధ్యతలు స్వీకరించడానికి ముందు విజయవాడలోని సీబీసీ ప్రాంతీయ కార్యాలయంలో డైరెక్టర్‌గా సేవలందించారు. రాష్ట్రంలోని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన వివిధ క్షేత్ర ప్రచార విభాగాలు, వార్తా విభాగాల్లోనూ పని చేశారు.

నర్సాపూర్ ప్రత్యేక రైలుకు వీరవాసరంలో హాల్టింగ్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల అవసరా మేరకు నర్సాపూర్-తిరువన్నమలై ప్రత్యేక రైలుకు పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం స్టేషన్‌లో రెండు నిమిషాలు హాల్టింగ్ సదుపాయం కల్పించినట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌ఓ నుస్రత్ మండ్రుప్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ నుంచి తిరువన్నమలై వెళ్లే ప్రత్యేక రైలు (07219) వీరవాసరం స్టేషన్‌కు మధ్యాహ్నం 1.23 గంటలకు చేరుకుని, 1.25 గంటలకు బయలుదేరి వెళుతుంది. అదే విధంగా తిరువన్నమలై నుంచి నర్సాపూర్ వెళ్లే రైలు (07220) రాత్రి 11.28 గంటలకు వీరవాసరం స్టేషన్‌కు చేరుకుని, తిరిగి 11.30 గంటలకు బయలుదేరి వెళుతుంది.

సాక్షి ప్లస్
గురువారం । 10-7-2025

‘ఈగల్’ దూకుడు

మత్తు ముఠాలపై వరుస దాడులు



- స్థానిక పోలీసులతో కలిసి జాయింట్ ఆపరేషన్లు నిర్వహిస్తున్న స్పెషల్ టీం
- మత్తు పదార్థాల స్వాధీనం.. నిందితుల ఆస్తుల జప్తు
- తాజాగా సంగారెడ్డిలో అల్ప్రాజోలం విక్రయ ముఠాకు చెందిన రూ.30 కోట్ల ఆస్తుల జప్తు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సరిహద్దుల్లోకి మత్తు ముఠాలు రావాలంటే వణికే పరిస్థితి రావాలని, తెలంగాణలో ఎక్కడ డ్రగ్స్ మూలాలున్నా కనిపెట్టేలా ‘ఈగల్’రంగంలోకి దిగుతుందని అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ‘యాంటీ నార్కోటిక్స్ బ్యూరోను ఇకపై ఈగల్ (ఇలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్)గా మారుస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రకటించడం తెలిసిందే. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉండడంతో డ్రగ్స్ కట్టడిపై ‘ఈగల్’(ఈగల్ అంటే ఇలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్)మరింత ఫోకస్ పెంచింది. రాష్ట్రస్థాయిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం, విక్రయాల కట్టడికి స్థానిక పోలీసు బృందాలతో జాయింట్ ఆపరేషన్లు నిర్వహిస్తుంది. మత్తు ముఠాల ఆర్థిక మూలాలు దెబ్బకొట్టే వ్యూహాలతో ఈగల్ ముందుకు వెళ్తోంది. అల్ప్రాజోలం విక్రయ ముఠా సభ్యులకు చెందిన ఆస్తులను జప్తు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. సంగారెడ్డిలో అల్ప్రాజోలం ముఠాకు చెందిన ఆరుగురు సభ్యులకు చెందిన రూ.30 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌డీపీఎస్ యాక్ట్ సెక్షన్ 68 (ఎఫ్)కింద జప్తు చేశారు.

టెక్నాలజీతో డేగకన్ను

ఈగల్ టీం వద్ద ఉన్న సాంకేతికత.. దేశంలోని మరే పోలీస్‌శాఖ విభాగం వద్ద లేదని, తాము అత్యాధునిక టెక్నాలజీ వాడుతున్నట్టు యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య స్పష్టం చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వాడుతూ మాదక ద్రవ్యాల సరఫరాదారులే లక్ష్యంగా డేటాబేస్ రూపొందిస్తున్నారు. దీంతో ఆయా మాదకద్రవ్యాల సరఫరాదారుల నెట్‌వర్క్‌ను కనుగొనే అవకాశాలు పెరుగుతున్నాయి. సోషల్ మీడియా, డార్క్ వెబ్‌తో సహా గోవా, బెంగళూరు, ముంబై లాంటి నగరాల నుంచి హైదరాబాద్‌కు సరఫరా అవుతున్న సింథటిక్ డ్రగ్స్‌పై ఈగల్ టీమ్ ప్రత్యేక దృష్టి పెట్టింది. గంజాయి, సింథటిక్ డ్రగ్స్ స్మగ్లర్లు, కొరియర్ల నుంచి స్వాధీనం చేసుకునే సెల్ ఫోన్లు, ఇతర పరికరాలను డిజిటల్ ఫోరెన్సిక్ ద్వారా విశ్లేషించి.. ఆయా ముఠాలకు సంబంధించి స్మగ్లర్ల ప్రొఫైల్‌ను తయారు చేస్తున్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, డీఆర్ లాంటి కేంద్ర సంస్థలు సహా ఏపీ, ఒడిశా, గోవా పోలీసులతో కలిసి జాయింట్ ఆపరేషన్లను నిర్వహించనున్నారు. ఇతర మత్తు పదార్థాలతో పోలిస్తే.. ఇటీవల ద్వితీయ శ్రేణి పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు గంజాయి విక్రయాలు విస్తరించాయి. గంజాయిపైనా స్థానికపోలీసులతో కలిసి ఈగల్ టీంలు సంయుక్త ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. సాంకేతికతను వినియోగిస్తున్న ప్రత్యేక బృందాలు డ్రగ్స్ నెట్‌వర్క్ రాష్ట్ర సరిహద్దుల నుంచి సప్లై చైన్ వరకు ఎలా విస్తరిస్తుందో పక్కాగా నిఘా సమాచారం వచ్చిన తర్వాతే క్షేత్రస్థాయిలో ఆపరేషన్లు నిర్వహిస్తుండటంతో విజయాల శాతం పెరుగుతోంది. ప్రధానంగా ఏపీ, ఒడిశా సహా ఏజెన్సీ ప్రాంతాల నుంచి రవాణా అవుతున్న గంజాయికి అడ్డుకట్ట వేయగలుగుతున్నారు. ఈగల్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను రంగంలోకి దింపేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. డ్రగ్స్, గంజాయి కేసుల్లో పట్టుబడిన పాత నేరస్తులు, కస్టమర్ల డేటా ఆధారంగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించేలా ప్రణాళికలు వేసుకుంటున్నారు.

సరిహద్దుల నుంచి రాకుండా కట్టడి..

రాష్ట్ర పరిధిలో స్పెషల్ ఆపరేషన్లకే పరిమితం కాకుండా.. రాష్ట్రంలోకి డ్రగ్స్ సరఫరా అవుతున్న ప్రాంతాల్లోనూ డెకాయి ఆపరేషన్లు నిర్వహించడం, మాటు వేసి మత్తు ముఠాల గుట్టు కనిపెట్టడంలోనూ ఈగల్ బృందాలు విజయవంతమవుతున్నాయి. ఇటీవల ఇదే తరహాలో గోవా పబ్బుల్లో డీజేలుగా పనిచేస్తూ.. హైదరాబాద్‌కు కొకైన్ సప్లయ్ చేస్తున్న డీజే వనిష్ టక్కర్, సప్లయర్ బాలకృష్ణను ఇటీవల అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో నమోదైన కేసుల్లో నిందితులుగా ఉన్న డ్రగ్స్ సప్లయర్ల కాంటాక్ట్స్, కస్టమర్ల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా.. అధికారులు గోవాలో ఇటీవలే సోదాలు నిర్వహించడం తెలిసిందే. గోవాలో దాదాపు 50 మంది నైజీరియన్లు పనిచేస్తున్నట్టు పక్కా సమాచారం సేకరించిన తర్వాత.. డ్రగ్స్ కింగ్‌పిన్‌గా భావిస్తున్న మ్యాక్స్ నెట్‌వర్క్‌లోని హవాలా వ్యాపారులు ఉత్తమ్ సింగ్, రాజు సింగ్, మహేందర్ ప్రజాపతిలను అరెస్ట్ చేసి ఢిల్లీ పోలీసులకు అప్పగించారు. వీరి నుంచి రూ.49.65 లక్షలు సీజ్ చేశారు. ఈ క్రమంలోనే ఓ నైజీరియన్‌ను అరెస్ట్ చేసి రూ.1.64 కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఇలా అంతర్రాష్ట్ర ఆపరేషన్లలోనూ దూకుడుగా వెళ్తున్నారు.

కేసుల నమోదు అరెస్టులు ఇలా..

(ఈ ఏడాది ఏప్రిల్ 30 వరకు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం)

సంవత్సరం	2024	2025
నమోదు చేసిన కేసులు	2169	863
అరెస్టయిన నిందితులు	5205	1797
పట్టుబడిన డ్రగ్స్ విలువ	148.09 కోట్లు	18.64 కోట్లు

మంత్రి ఉత్తమ్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్

‘ఎన్నికల కోడ్ ఉల్లంఘన’లో జారీ చేసిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు



సిటీ కోర్టు: గత ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని పలు కేసుల్లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. గత ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా.. అప్పటి ఎమ్మెల్యే అభ్యర్థి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎన్నికల నియమావళిని పాటించకుండా సభలు ఏర్పాటుచేయడంతో ట్రాఫిక్ జామ్ అయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని, అంతేకాక తప్పుడు స్పీచ్‌లు ఇచ్చారని హుజూర్‌నగర్, మఠంపల్లి, గారిడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సెక్షన్ 188, 341 ఐపీసీ కింద పోలీసులు కేసులు నమోదుచేశారు. ఈ కేసులకు సంబంధించి చార్జిషీట్‌ను పోలీసులు కోర్టులో దాఖలు చేశారు. వీటిపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసుల విచారణకు మంత్రి ఉత్తమ్ హాజరుకాకపోవడంతో బుధవారం కోర్టు వారెంట్ జారీ చేసింది. తదుపరి విచారణకు ఆయన నేరుగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశిస్తూ విచారణను ఈనెల 16కు వాయిదా వేసింది. ఆరోజు మంత్రి కోర్టుకు హాజరై వారెంట్‌ను రీ కాల్ చేయించుకోవాల్సి ఉంటుంది.

కాంగ్రెస్ మళ్లీ గెలిస్తే గాంధీభవన్‌కు తలను వేలాడదీసుకుంటా

మాజీ ఎమ్మెల్యే రసమయి



సాక్షి, హైదరాబాద్: ‘కాంగ్రెస్ జన్మలో మళ్లీ అధికారంలోకి రాదు. ఒక వేళ కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తే నా తలను గాంధీ భవన్‌కు వేలాడదీసుకుంటా. ఇదే నా మరణ వాంగ్మూలం’అని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రకటించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో రసమయి బాలకిషన్ మీడియాతో మాట్లాడారు. ‘ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కేసీఆర్, కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతలు అసభ్యంగా ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో చేసిందేమీ లేకపోగా, ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక దందాలు చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో రేవంత్ ఎక్కడ ఉన్నారో అందరికీ తెలుసు. అసెంబ్లీలో సభ్యులుగా లేని మధుయాష్కీ లాంటి వారు కూడా కేసీఆర్ అసెంబ్లీకి రావాలని అంటున్నారు. చర్చలకు కేటీఆర్ వస్తేనే పారిపోయిన వారు కేసీఆర్ రావాలని సవాళ్లు చేస్తున్నారు. అసెంబ్లీ పెట్టే అధికారం ఉన్నా కేసీఆర్ లేఖ రాయాలని అనడం విడ్డూరం. సాంస్కృతిక సారథి నుంచి సస్పెండ్ చేసిన ముగ్గురు ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి’అని రసమయి డిమాండ్ చేశారు.

భద్రాద్రి భూమిని అంగుళం కూడా వదులుకోం: వీహెచ్‌పీ

సాక్షి, హైదరాబాద్: ఎట్టి పరిస్థితుల్లో భద్రాద్రి రాముల వారి అంగుళం భూమి కూడా వదులుకునేది లేదని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి బుధవారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. అందుకోసం ఎంతటి ఉద్యమానికైనా వెనకాడేది లేదన్నారు. దక్షిణ అయోధ్యగా పిలుచుకునే భద్రాద్రి రాముడి దేవాలయ భూములు కబ్జా కావడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. భద్రాద్రి రాముడిపై భక్తితో ఓ దాత 900 ఎకరాల స్థలాన్ని దానం చేశారని, అయితే దాన్ని నేడు కొందరు కబ్జా చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. గతంలో దేవాలయ గోశాలను కూడా కబ్జా చేస్తూ గోశాలకు వెళ్లేందుకు దారిని మూసివేసిన విషయంపై విశ్వహిందూ పరిషత్ భారీ ఎత్తున ఆందోళన చేసిందని బాలస్వామి గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి జగన్ ప్రభుత్వం భద్రాద్రి రాముడి భూముల రక్షణకు ప్రత్యేక కమిటీ వేసిందన్నారు. కానీ ఇప్పుడు కబ్జాదారులు చెలరేగిపోవడం, ఏకంగా ఆలయ ఈవోపైనే దాడి చేయడం అత్యంత హేయమని పేర్కొన్నారు. ఆలయ ఈవోపై దాడిని బాలస్వామి తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కోర్టు ఉత్తర్వులున్నా ఎలా జోక్యం చేసుకుంటారు?

శిల్పాచక్రవర్తి భూవివాదంపై పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: యాంకర్ శిల్పా చక్రవర్తికి చెందిన నల్లగొండ జిల్లా కుర్మెడ్‌లోని 32 ఎకరాల భూవివాదంపై సివిల్ కోర్టు ఇంజక్షన్ ఉత్తర్వులిచ్చినా ఎలా జోక్యం చేసుకుంటారని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. సివిల్ అంశాల్లో తలదూర్చొద్దని ఎన్నిసార్లు చెప్పినా తీరు మారడం లేదని మరోసారి అసహనం వ్యక్తంచేసింది. నల్లగొండ జిల్లా చింతపల్లి ఎస్సై రామ్మూర్తికి వ్యక్తిగత హోదాలో నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ ఆగస్టు 5కు వాయిదా వేసింది. కుర్మెడ్‌లోని భూమికి సంబంధించిన వివాదంలో పోలీసుల జోక్యాన్ని సవాల్ చేస్తూ జడ కల్యాణ్ యాకయ్య, అతని భార్య టీవీ యాంకర్ శిల్పాచక్రవర్తి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ తడకమల్ల వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ‘2017లో అబ్దుల్ అజీజ్ నుంచి కొంత భూమిని కొనుగోలు చేయగా, 2013లో తనఖా డీడ్ ద్వారా మరికొంత భూమిపై పిటిషనర్లు హక్కులను పొందారు. 2017 సివిల్ కోర్టును ఆశ్రయించి వారు ఇంజక్షన్ ఉత్తర్వులు పొందారు. అయితే అబ్దుల్ అజీజ్‌తో కుమ్మక్కైన పోలీసులు పిటిషనర్లను వేధింపులకు గురిచేస్తున్నారు. భూ రక్షణకు నియమించిన వ్యక్తిని స్టేషన్‌కు పిలిచి గంటల తరబడి కూర్చోబెడుతున్నారు. వివాదాన్ని సెటిల్ చేసుకోవాలని ఎస్సై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు’అని తెలిపారు. వాదనలను విన్న న్యాయమూర్తి పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు.

హోర్డింగ్‌ల ఏర్పాటుపై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో హోర్డింగ్‌ల ఏర్పాటులో ద్వంద్వ నిబంధనలు పాటిస్తున్నారన్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఎంఏయూడీ ముఖ్య కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ (ప్రకటనలు) తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఆగస్టు 6కు వాయిదా వేస్తూ ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు జీహెచ్‌ఎంసీ పరిధిలో 15 అడుగుల కంటే ఎత్తున్న అన్ని ఎల్‌ఈడీ హోర్డింగ్‌లను తొలగించాలని ప్రభుత్వం జీవో 68 జారీ చేసింది. తొలగింపు చర్యలను నిలిపివేయాలని కోరుతూ 2024, జనవరి 25 నుంచి 2025, జూన్ 26 వరకు 19సార్లు వినతిపత్రాలు సమర్పించినా అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదంటూ తెలంగాణ ఔట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ సహా 53 ప్రకటన సంస్థలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. కొన్ని ప్రకటన సంస్థలకు ఇచ్చిన సడలింపును తమకు అమలు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్ జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ‘ఎంపిక చేసిన కంపెనీలకు సడలింపు ఇవ్వడం చట్టబద్ధంగా అన్యాయం. పిటిషనర్ అసోసియేషన్, దాని సభ్యులు మున్సిపల్, రాష్ట్ర చట్టాలను కచ్చితంగా పాటిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ, పట్టణ స్థానిక సంస్థలకు ప్రకటన రుసుములలో ఏటా కోట్లాది రూపాయలను చెల్లిస్తోంది. రాష్ట్రంలో లక్ష మందికి పైగా వ్యక్తులకు ఉపాధి కల్పిస్తోంది. వీరిలో కొందరికి ఒకలా.. మరికొందరికి మరోలా నిబంధనలు వర్తింపజేయడం సరికాదు. పిటిషనర్ అసోసియేషన్ ఇచ్చిన వినతిపత్రాలపై నిర్ణయం తీసుకునేలా అధికారులను ఆదేశించాలి. 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో హోర్డింగ్‌ల ఏర్పాటుకు అనధికారిక ప్రతివాదులకు ఇచ్చిన సడలింపులను పిటిషనర్లకు వర్తింపజేయాలి’అని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

రిజర్వేషన్ల పెంపు తర్వాతే స్థానిక ఎన్నికలు

పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో ఈనెల 15న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. బీసీ ప్రజాప్రతినిధుల ఫోరమ్, తెలంగాణ సర్పంచుల సంఘం, తెలంగాణ ఎంపీటీసీల సంఘం, తెలంగాణ జెడ్పీటీసీల సంఘాలు సంయుక్తంగా ఈ ధర్నా చేస్తున్నట్లు వెల్లడించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ఆవిష్కరించారు. బీసీ మేధావుల ఫోరమ్ కన్వీనర్ చిరంజీవులు, ఎంపీటీసీల రాష్ట్ర అధ్యక్షుడు కుమార్ గౌడ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ప్రణీల్ చందర్, సుర్వి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికో వీఎస్‌హెచ్‌జీ

తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి ఒక వికలాంగుల స్వయం సహాయక సంఘాన్ని (వీఎస్‌హెచ్‌జీ) ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య బుధవారం సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్‌తో సమావేశమయ్యారు. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా వీఎస్‌హెచ్‌జీ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 18 వేల గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులు ఉన్నాయని, గ్రామ స్థాయిలో ఒక్కో గ్రామానికి ఒక వీఎస్‌హెచ్‌జీ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ వార్డు స్థాయిలో ఒక సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఒక్కో సంఘంలో కనీసం 5 నుంచి 20 మంది వరకు సభ్యులుగా ఉండేలా చూడాలన్నారు. స్వయం సహాయక సంఘాల మాదిరిగానే వీఎస్‌హెచ్‌జీలకు పొదుపు, ఆర్థిక చేకూర్పు అంశాలపై అవగాహన కల్పించి వారిలో ఆర్థిక క్రమశిక్షణ అలవాటు చేయాలని వీరయ్య విన్నవించారు. ఒక్కో సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందించనున్న విషయాన్ని గుర్తుచేశారు. ఇందుకు సెర్ప్ సీఈఓ దివ్య సానుకూలంగా స్పందిస్తూ వేగంగా నిబంధనలు రూపొందించి అమలు చేస్తామన్నారు.



గౌతమినగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయం

గురుపౌర్ణమికి ముస్తాబు

షిర్డీ సాయిబాబా ఆలయంలో ఏర్పాట్లు

ఫెర్టిలైజర్ సిటీ (రామగుండం): ఓం సాయి.. శ్రీసాయి.. జయజయ సాయి.. అంటూ భక్తుల నుంచి నిత్య పూజలందుకుంటున్నాడు గౌతమినగర్‌లోని షిర్డీ సాయిబాబా. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని నగరంలోని గౌతమినగర్‌లో 1993వ సంవత్సరంలో కొలువైన సాయినాథుడు రెండు దశాబ్దాల నుంచి నిత్య పూజలందుకుంటూ భక్తుల కోర్కెలను తీరుస్తున్నాడు. గురువారం గురుపౌర్ణమి జరుపుకునేందుకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఆలయంలోని వినాయకుడు, దత్తాత్రేయుడు, నాగదేవత, ఆంజనేయస్వామి, శివాలయం, వైభవలక్ష్మి దేవతలకు ప్రత్యేక అభిషేకాలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీ సేవలను నిర్వహించేందుకు ఆలయ ప్రముఖులు ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తొలి ఆలయం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రామగుండం నియోజకవర్గంలో ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లో ఇది తొలి సాయిబాబా ఆలయం. కోరుకున్న కోరికలు నెరవేరడంతో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటోందని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో హనుమాన్ ఆలయం, వైభవలక్ష్మి ఆలయం, శివాలయం, దత్తాత్రేయ స్వామి ఆలయాలను నిర్మించారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్ ప్రతీరోజు పూజలు నిర్వహిస్తారు. నాడు పేరం కనకయ్య, ప్రభాకర్, మల్లయ్య, గద్దె నర్సింహరావు, బొల్లం రవికుమార్‌ల ఆధ్వర్యంలో అంకురార్పణ జరిగి నేటి చైర్మన్ మినేశ్ నారాయణ్ తాండన్, ధర్మారెడ్డి, ఆంజనేయులు, మనోజ్‌కుమార్ అగర్వాల్, సురేశ్ ఆధ్వర్యంలో ట్రస్ట్‌ను కొనసాగిస్తున్నారు.

ప్రతీ గురువారం భక్తులకు అన్న ప్రసాద వితరణ

గత కొన్ని సంవత్సరాలుగా ఆలయంలో దాతల సహకారంతో ప్రతీ గురువారం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేస్తున్నారు. అన్న ప్రసాద వితరణలో సుమారు 800 నుంచి 1,000 మంది వరకు భక్తులు పాల్గొంటున్నారు.



విద్యుత్ ఉద్యోగుల నిరసన

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగుల జాతీయ సమన్వయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణవ్యాప్తంగా బుధవారం విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలిపారు. హైదరాబాద్ విద్యుత్ సౌధలో ఉద్యోగులు విధులు బహిష్కరించి, కేంద్ర విధానాలను వ్యతిరేకిస్తూ నినదించారు. ఆందోళనల్లో పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారని ఉద్యోగుల జేఏసీ నేతలు సాయిబాబా, రత్నాకర్, శ్రీధర్, బీసీరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత ప్రమాణాలు పెంచాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పాఠశాల విద్యశాఖకు సూచించారు. చట్టపరంగా వారికి అందే ప్రయోజనాలపై ఉన్నత స్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, ఎస్.సేనావత్ రాంబాబు నాయక్‌తో కలిసి బుధవారం ఆయన పాఠశాల విద్య డైరెక్టరేట్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో జిల్లా విద్యాశాఖ అధికారులతో మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖలో అమలవుతున్న రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్స్, బ్యాక్‌లాగ్ ఖాళీలు, పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గురించి డైరెక్టరేట్ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. పెద్ద ఎత్తున ఉపాధ్యాయ నియామకాలు, పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు అమలు చేసిన రిజర్వేషన్ వివరాలను, బడిబాట జరిగిన తీరును పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్.. వెంకటయ్యకు వివరించారు. సమావేశంలో అదనపు డైరెక్టర్ లింగయ్యతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు పరం చేస్తున్న మోదీ

కార్మికుల నిరసన కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి కూనంనేని



నిరసన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీపీఐ కార్యదర్శి కూనంనేని

సాక్షి, హైదరాబాద్: దేశంలో కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రధాని మోదీ ప్రైవేట్ పరం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్మికుల నిరసనలో భాగంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన నిరసన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. దేశంలోని అన్ని వర్గాలు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు కేంద్రం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నిరసన గళం విప్పారన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ సమ్మెలో 30 కోట్ల మంది కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారని వెల్లడించారు. 8 గంటల పని హక్కును మార్చు చేయాలని కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించాల్సిన తెలంగాణ ప్రభుత్వం కూడా రోజుకు 10 గంటలు పని చేయాలని సర్క్యులర్ జారీచేసిందన్నారు. రైల్వేను, అత్యంత సున్నితమైన రక్షణ రంగాన్ని కూడా ప్రవేట్ పరం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎలాన్ మస్క్ ట్రంప్‌నకు సహాయం చేసి నేనే పాలన చేస్తా అన్నట్టు.. రేపు నరేంద్రమోదీకి సహాయపడిన అదానీ, అంబానీలు కూడా పాలన సాగిస్తారని వ్యాఖ్యానించారు. ర్యాలీలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సింహాచలేశా నమోస్తుతే!



విశాఖ జిల్లాలోని సింహాచలంలో గిరిప్రదక్షిణ మహోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచే భక్తులు సింహగిరికి చేరుకున్నారు. తొలి పావంచా దగ్గర అప్పన్న స్వామికి కొబ్బరికాయ కొట్టి 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. ఆయా దృశ్యాలివీ...!



క్లుప్తంగా...

'కడా' అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

కుప్పం: సింగపూర్‌కు చెందిన ఓ సంస్థ ద్వారా కుప్పం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) అభివృద్ధి మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. బుధవారం కడా కార్యాలయ ప్రాగణంలో జరిగిన విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడుతూ, కుప్పం మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధికి సింగపూర్ బృందం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ప్రస్తుతం కడా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధిపై మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏడాది పాలనలో రూ.1,200 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, వాటిలో రూ.130 కోట్ల పనులు పూర్తిచేసినట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు నియోజకవర్గానికి 6 పరిశ్రములు తీసుకొచ్చామని, దీన్ని ద్వారా 13 వేల ఉద్యోగాలు స్థానికులకు అందుబాటుల్లో ఉంటాయని ఆయన తెలిపారు.

నల్లపరెడ్డి ఇంటిపై దాడి హేయమైన చర్య

చిట్టమూరు: వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిపై దుండగులు చేసిన దాడి హేయమైన చర్య అని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ చైర్మన్ డాక్టర్ షేక్ జిలానీబాషా పేర్కొన్నారు. తిరుపతి జిల్లా చిట్టమూరులో ఆయన బుధవారం మాట్లాడుతూ రాజకీయ ముసుగులో గుండాల చేత నల్లపరెడ్డి ఇంటిపై దాడి చేయించడం తగదన్నారు. ఈ విషయంపై పారదర్శకంగా పోలీసులు విచారణ జరిపి దాడులకు ప్రేరేపించిన వారిపైన, దాడులకు దిగిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శ్రీసిటీని సందర్శించిన కేంద్ర గృహనిర్మాణ శాఖ కార్యదర్శి

శ్రీసిటీ (వరదయ్యపాళెం): కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కటికితల, ఆ శాఖ ఉన్నతాధికారులతో కలసి బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రణాళిక, ప్రస్థానం, పారిశ్రామిక ప్రగతి గురించి వివరించారు. చర్చల సందర్భంగా, శ్రీసిటీలో అభివృద్ధి చెందుతున్న సామాజిక వసతులపై ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. గృహ సముదాయాలు, విద్యా వసతులు, షాపింగ్ కేంద్రాలు, ఇతర కీలక సౌకర్యాల గురించి హైలైట్ చేశారు. అలాగే ఇక్కడ అమలు చేస్తున్న సమర్థవంతమైన నీటి వనరుల నిర్వహణ, మురుగునీటి రీసైక్లింగ్, ఘన వ్యర్థాల నిర్వహణ, హరితహిత చర్యలు, ఇతర సుస్థిరత కార్యక్రమాలను వివరించారు. టౌన్‌షిప్‌ల అభివృద్ధి ద్వారా "వాక్ టువర్క్" ఆవశ్యకతను ప్రస్తావిస్తూ, ఇందుకోసం అవసరమైన సహకారం అందించాలని కార్యదర్శికి విన్నవించారు.

యుద్ధ నౌకకు 'ఉదయగిరి' పేరు


ఉదయగిరి: చారిత్రాత్మక నేపథ్యం ఉన్న శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని 'ఉదయగిరి'కి భారత ప్రభుత్వం గుర్తింపు కల్పించింది. ఒక యుద్ధ నౌకకు 'ఉదయగిరి'అనే పేరును నామకరణం చేశారు. ఎఫ్–35 పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ యుద్ధనౌకను అధికారికంగా ఆగస్టు 26వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభిస్తారని విశాఖపట్నం నేవీ లెఫ్టినెంట్ కమాండర్ ప్రశాంత్ వెల్లడించారు. ఈ యుద్ధనౌక 148 మీటర్ల పొడవుతో 40 మిస్సైల్స్ ప్రయోగించేలా రూ.600 కోట్ల వ్యయంతో నౌకను తయారు చేశారు. ఇంత ప్రాధాన్యత కలిగిన యుద్ధనౌకకు 'ఉదయగిరి'పేరు పెట్టడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హైడ్రో ప్రాజెక్టు అనుమతులు రద్దు కోరుతూ తీర్మానం

మహారాణిపేట: అరకు, అనంతగిరిలో ప్రతిపాదిత హైడ్రో ప్రాజెక్టుపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాజెక్టు వల్ల ఏజెన్సీ ప్రాంతానికి, పర్యావరణానికి, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొంటూ హైడ్రో ప్రాజెక్టు సర్వేను తక్షణమే నిలిపివేయాలని, ప్రాజెక్టు అనుమతులను రద్దు చేయాలని బుధవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు.

విధులు చెబుతారు.. నిధులు ఇవ్వరు





మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ కోసం ప్రభుత్వం హడావుడి

వారం రోజులుగా బోధనకు దూరంగా టీచర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ:

సర్కారు రికార్డుల పిచ్చి టీచర్లకు తలనొప్పిగా మారింది. కనీస నిధులు ఇవ్వకుండా పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రస్తుతం మెగా పేరెంట్–టీచర్స్ మీటింగ్(పీటీఎం) పేరిట కూటమి ప్రభుత్వం చేస్తున్న హడావుడి సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. గిన్నిస్‌బుక్‌లో రికార్డుల కోసం అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులను నానా అవస్థలకు గురి చేస్తున్నారు.

పీటీఎం కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులను పిలిచి విద్యార్థుల ప్రగతిని వివరించడం .. వారికి అక్కడే మధ్యాహ్న భోజనం, క్రీడల నిర్వహణ, సమావేశం, అతిథులు ప్రసంగాలు.. ఇలా ఉదయం 9 గంటల నుంచే వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు. ఇందుకోసం పాఠశాలల్లో 17 రకాల కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తిల మేరకు కొన్ని కుదించారు. ఆహ్వాన పత్రికలు, వేదికల ఏర్పాట్లు, బహుమతుల ప్రదానం, పాఠశాల ఆవరణలో మొక్కలు



విద్యాశాఖ జారీచేసిన పేరెంట్–టీచర్స్ మీటింగ్ మోడల్ ఫ్లెక్స్

నాటించడం.. ఇలా వివిధ ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు రావడంతో ఆ బాధ్యతంతా ఉపాధ్యాయులపైనే పడుతోంది.

బోధనకు దూరంగా టీచర్లు..

నిన్న యోగాంధ్ర.. నేడు పేరెంట్స్ మీట్ అంటూ టీచర్లను సమావేశాలకు, సన్నాహాలకు పరిమితం చేస్తుండడంతో వారు బోధనకు దూరమవుతున్నారు. తాజాగా రెండు వారాల నుంచి తల్లిదండ్రుల సమావేశామంటూ నానా హంగామా చేస్తున్నారు. హోలిస్టిక్ ప్రొగ్రెస్ కార్డుల పేరిట చాంతడంత డేటాను పూరిస్తున్నారు. దీంతో విద్యాబోధన రెండు అడుగులు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్న చందంలా తయారైంది. దీనికి తోడు తమ ప్రచార యావ, రికార్డుల కోసం ఉపాధి హామీ పథకం వేతనదారులను వాడుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. విద్యార్థులకు సంరక్షకులుగా వారిని వినియోగించుకుని ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయించుకోవాలని చూస్తున్నట్లు సమాచారం.

అంతా 'లీప్' యాప్‌లోనే..

తల్లిదండ్రుల సమావేశం సందర్భంగా సమావేశం జరిగిన వెంటనే 30 సెకన్ల వీడియో, మూడు ఫొటోలను లీప్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. విద్యార్థులతో మొక్కలు నాటించడం.. దాన్ని లీప్ యాప్‌లో నమోదు చేయించడం, ప్రతి మూడు నెలలకు ఆ మొక్క ఫొటోలను అప్‌లోడ్ చేయించడం ఇదంతా ఉపాధ్యాయుల పనే. దీనిపై టీచర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చేతిచమురు వదులుతోంది..

అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, వీఐపీలు, అతిథులు, పూర్వపు విద్యార్థులు, దాతలు ఇలా అనేక మందిని పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు ఆహ్వానిస్తున్నారు. వీరిందరికీ భోజనాలు, స్నాక్స్ తో పాటు ఇతరత్రా ఏర్పాట్లకు కనీసం రూ.70వేల నుంచి లక్ష వరకు ఖర్చు అవుతున్నట్టు ప్రచారం సాగుతోంది. పాఠశాల గ్రాంట్ కింద కనీస నిధు లు విడల్చకుండా అందులో 20 శాతం వాడుకోండని ఆదేశాలివ్వడంపై హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు మండిపడుతున్నారు. స్థానికంగా ఉండే టీచర్లు, లెక్చరర్లు గత్యంతరం వారే తలా కొంత డబ్బులు వేసుకుని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

తమ పనితీరుకు 'సాక్ష్యం'పై గుర్రు..

పేరెంట్ టీచర్స్ సమావేశాల పర్యవేక్షణకు ఒక్కో పాఠశాల, కళాశాలలకు ఇతర శాఖల నుంచి ఒక ఉద్యోగిని కేటాయించారు. వీరు కార్యక్రమ నిర్వహణకు సాక్షిగా ఉంటారని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయడంపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో, స్థానికంగా ఉండే ఉద్యోగులు(ఐడీ నంబర్‌తో), పెద్దలను(ఆధార్ నంబర్‌తో) నియమించుకోవచ్చని సర్దుబాటు ఉత్తర్వులు ఇచ్చింది.

పరీక్షలు లేని ప్రోగ్రెస్ కార్డులు ఎందుకు..?



ఈ ఏడాది ఇప్పటి వరకు ఎలాంటి పరీక్షలు జరగలేదు. ఇప్పుడు ప్రోగ్రెస్ కార్డులు ఎందుకో అర్థం కావడం లేదు. ఊరికే సమావేశం తప్ప ప్రయోజనం లేదు.

– తమ్మినేని చందనరావు, ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రికార్డుల కోసం మీటింగులు తగదు..



గిన్నిస్‌బుక్‌లో రికార్డుల కోసం రాష్ట్రప్రభుత్వం పేరెంట్ టీచర్స్ మీటింగ్ 2.0 ను నిర్వహిస్తుండటం బాధాకరం. పూర్తిస్థాయిలో నిధులు కేటాయింపు చేయలేదు. టీచర్లే తలా చేయి వేసి నిర్వహిస్తున్నారు.

– బి.వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్(1938) జిల్లా ప్రధాన కార్యదర్శి

మంత్రి గారు...నాకు న్యాయం చేయండి

- స్నేహితుడైన టీడీపీ నేత నిలువునా ముంచేశాడు
- వైరల్‌గా మారిన ఆత్మహత్య చేసుకున్న ఓ వ్యాపారి చివరి మాటలు ఆడియో



ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఇందూరి నాగభూషణరావు

సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులోని ఓ చిరు వ్యాపారి స్నేహితుడైన (టీడీపీ మాజీ కౌన్సిలర్) వడ్డీ వ్యాపారి అరాచకానికి బలయ్యాడు. బుధవారం ఉదయం 4.30 సమయంలో తన ఎలక్ట్రిక్ షాపులోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్నేహితుడే తనను నట్టేట ముంచేశాడంటూ ఆత్మహత్యకు ముందు చిరువ్యాపారి ఇందూరి నాగభూషణరావు రికార్డు చేసిన ఆడియోను మిత్రులకు పంపించాడు. సాలూరులోని మామిడిపల్లి కూడలిలో ఎలక్ట్రిక్ షాపు నడుపుతున్న వ్యాపారి ఇందూరి నాగభూషణరావు పట్టణంలోని డబ్బీవీధికి చెందిన వడ్డీ వ్యాపారి డబ్బి కృష్ణారావు వద్ద తన వ్యాపార అవసరాల కోసం రూ.40 లక్షలు అప్పుచేశాడు. ఆ డబ్బు ఎప్పటికీ తిరిగి ఇవ్వడం లేదని ఎలక్ట్రిక్ షాపును వడ్డీ వ్యాపారి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. రూ.కోటి విలువైన షాపును రూ.75 లక్షలకే రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. నాగభూషణరావు తీసుకున్న రూ.40 లక్షలు అప్పు మినహాయిస్తే మిగిలిన రూ.35 లక్షలు ఆయన చేతికి ఇవ్వాల్సి ఉండగా, రూ.10 లక్షలు అప్పుగా తిరిగిచ్చాడు. నాగభూషణరావు నుంచి కొనుగోలు చేసుకున్న షాపునే వ్యాపారికి నెలకు రూ.20వేలు అద్దెప్రాతిపదికన తనఖా ఇచ్చాడు. షాపుకి అద్దె కింద నెలకు రూ.20 వేలు, పది లక్షలకు వడ్డీ రూ.పదివేలు చొప్పున నెలకు ప్రతినెలా రూ.30 వేలు వడ్డీ వ్యాపారి వసూలు చేస్తున్నాడు. తన డబ్బునే ఉంచుకుని, తనకు అప్పుకింద ఇచ్చి వడ్డీ వసూలు చేస్తూ ఆర్థిక కష్టాల్లోకి నెట్టేశాడని, ఎదిరించే ధైర్యంలేక ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆడియోలో పేర్కొన్నారు. నాగభూషణరావుకి భార్య పద్మావతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు సాలూరు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన నాగభూషణరావు జేబులో రాతపూర్వక లేఖ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. పోలీసులు ఆలేఖను స్వాధీనం చేసుకున్నారు.

కుటుంబాన్ని ఆదుకోండి..

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని ఉద్దేశించి చిరువ్యాపారి నాగభూషణరావు ఆడియో విడుదల చేశాడు. తన స్నేహితుడు కృష్ణారావు మోసాన్ని భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన వేడుకున్నాడు. తనకు కృష్ణారావు ఇవ్వాల్సిన డబ్బు రూ.15లక్షలు, నెలనెలా చెల్లించిన డబ్బు రూ.12 లక్షలు తన కుటుంబానికి ఇప్పించాలని కోరాడు. తన కుటుంబానికి అదే ఆస్తి అని చెప్పాడు. డబ్బి కృష్ణారావు మోసాన్ని మీతో చెప్పడానికి ప్రయత్నించానని, కానీ పరిస్థితి అనుకూలించక చెప్పలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. వడ్డీవ్యాపారి డబ్బి కృష్ణరావు మాజీ కౌన్సిలర్‌కాగా, మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అనుచరుడిగా పేరుంది.

పాత కక్షలతో రౌడీషీటర్ హత్య

విశాఖలోని మాధవదారలో ఘటన

పోలీసుల అదుపులో నిందితులు

గోపాలపట్నం (విశాఖ జిల్లా): విశాఖలోని గోపాలపట్నం కొత్తపాలెంలో యువకులు కత్తితో దాడి చేసిన ఘటన మరువక ముందే ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి మాధవదారలో మంగళవారం అర్ధరాత్రి రౌడీషీటర్ హత్య జరిగింది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం రాత్రి మాధవదారలో కుంచుమాంబ అమ్మవారి పండుగ జరిగింది. ఈ పండగను చూసేందుకు పెందుర్తి పులగానిపాలేనికి చెందిన మాసపు లోహిత్ (20) అలియాస్ నాని వచ్చాడు. మాధవధారలో స్నేహితులతో కలిసి ఉండగా ఇక్కడి మహత్ కాలనీకి చెందిన ఎద్దు హేమంత్ అలియాస్ శ్రీరామ్‌తో కలిసి మరి కొందరు లోహిత్ వారి స్నేహితులతో వాగ్వాదానికి దిగారు. పరిస్థితిని గమనించి అక్కడి నుంచి వెళ్లిపోతున్న లోహిత్‌ను వెంబడించిన ఎద్దు హేమంత్ విచక్షణారహితంగా కత్తితో దాడి చేయగా..ఒంటి నిండా గాయాలయ్యాయి. ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దాడికి గల కారణాలను విచారించారు. తీవ్ర గాయాలైన లోహిత్‌ను కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.



మృతి చెందిన లోహిత్

లోహిత్ బ్యాచ్‌కు ఎద్దు హేమంత్ బ్యాచ్‌కు గతంలో వినాయక చవితి పండగలో గొడవలు జరిగాయి. లోహిత్ జైలుకు వెళ్లి వచ్చాడు. లోహిత్‌పై రౌడీషీట్ కూడా తెరిచారు. గతంలో లోహిత్ మాధవధార ఉడాకాలనీ నివాసం ఉండేవాడు. ఆ తరువాత పెందుర్తి పులగానిపాలెం వెళ్లిపోయారు. పండగకు వస్తాడని తెలిసి పక్క ప్లాన్‌తో దాడి చేశారని స్థానికులు, పోలీసులు చెబుతున్నారు. హత్యకు పాల్పడిన 5 మంది నిందితులను ఎయిర్‌పోర్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హేమంత్‌తో పాటు కుంచమాంబ కాలనీకి చెందిన బలగ శ్యామలరావు, బలగ సురేష్, మాధవధారకు చెందిన సనపల వంశీ, సీతన్న గార్డెన్‌కు చెందిన గర్ల వలస సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు అనుమానితులు పరారీలో ఉన్నారు. మృతుడు లోహిత్‌కు తండ్రి సంజీవ రావు, తల్లి స్వాతి, తమ్ముడు మున్నా ఉన్నారు. తల్లి స్వాతి ఫిర్యాదు మేరకు సీఐ ఉమామహేశ్వరరావు దర్యాప్తు చేపట్టారు.

వరద గోదావరి

ఏలూరు జిల్లాలో ముంపు మండలాల్లో అప్రమత్తం

- ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు
- పోటెత్తుతున్న గోదావరి, శబరి
- 8 రోజుల వ్యవధిలో పోలవరం నుంచి 13.88 లక్షల క్యూసెక్కులు విడుదల
- మరో వారం కొనసాగనున్న గోదావరి ఉధృతి



సాక్షి ప్రతినిధి, ఏలూరు: వరద గోదావరి మళ్లీ పోటెత్తుతుంది. ఎగువ రాష్ట్రాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు గోదావరిలో జలకళ మొదలైంది. గత వారం రోజులుగా రోజుకు సగటున 2 లక్షల క్యూసెక్కుల నీరు పోలవరం ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో తీవ్రత మరింత పెరుగుతుందని దానికనుగుణంగా 9.32 లక్షల క్యూసెక్కుల నీరు 15 కల్లా వస్తుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు వరద ప్రవాహంతో ముంపు మండలాల్లో అలజడి మొదలైంది. గోదావరికి వరదల సీజన్ ప్రారంభమైంది. వాస్తవానికి జూలై మొదటి వారం నుంచి వరద హడావుడి ప్రారంభమై ఆగస్టు వరకు రెండు సార్లు ముంపు మండలాల్ని అతలాకుతలం చేస్తోంది. ఈ ఏడాది వర్షాలు కొంత ఆలస్యం కావడం, ఇతర కారణాలతో వరద ఉధృతి గతంతో పోల్చితే తక్కువగానే ఉంది. ఈ నెల 2 నుంచి ప్రారంభమైన వరద నీరు క్రమేపీ పెరుగుతూ వచ్చింది. మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో వారం రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురవడంతో గోదావరి ఉపనది శబరి పోటెత్తుతుంది. ఈ క్రమంలో ఈనెల 2న 1.06 లక్షల క్యూసెక్కుల నీరు పోలవరం స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేశారు. 5వ తేదీ నాటికి 2.09 లక్షల క్యూసెక్కులు, 9 నాటికి 2.27 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. వరద పోటెత్తే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు అంచనా వేశారు. ఈ నెల 15 కల్లా 9,32,288 క్యూసెక్కుల నీరు పోలవరానికి చేరుతుందని, అదే విధంగా భద్రాచలం వద్ద 43 అడుగుల నీటిమట్టంతో మొదటి ప్రమాదహెచ్చరిక జారీ చేయవచ్చని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. దిగువకు విడుదలవుతున్న నీటిని పోలవరం నుంచి పూర్తి స్థాయిలో డిశ్చార్జ్ చేస్తున్నారు.

ముంపు మండలాల్లో భయం.. భయం

పోలవరం ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడుకు వరద ప్రమాదం పొంచి ఉంది. ఈ క్రమంలో 9.32 లక్షల క్యూసెక్కులు దాటితే మొదటి ప్రమాద హెచ్చరికకు రహదారులపైకి నీరు చేరడం, 11.44 లక్షల క్యూసెక్కులు దాటితే రెండవ ప్రమాద హెచ్చరికకు రహదారులు నీటమునిగి రాకపోకలు నిలిచిపోయి పదుల సంఖ్యలో గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ళలోకి నీరు చేరుతుంది. 14.26 లక్షల క్యూసెక్కులు దాటితే మూడో ప్రమాద హెచ్చరికతో రెండు మండలాల్లో 18 గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధంలోకి వెళ్తాయి. ఈ క్రమంలో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కే.వెట్రిసెల్వి ఆదేశించారు.

కొనసాగనున్న ఉధృతి

బుధవారం మధ్యాహ్నానికి భద్రాచలంలో 22.40 అడుగుల మేర నీటిమట్టం ఉంది. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండటంతో గురువారానికి 3 నుంచి 4 అడుగులు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. 1986లో 75.60 అడుగుల మేర నీటి మట్టం ఉండటంతో 27 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలైంది. ఇంతవరకు అత్యధికంగా వచ్చిన వరద ఇదే. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో అత్యధిక గ్రామాలు భారీగా నష్టపోయాయి. ఆ తరువాత 2022లో 71.30 అడుగుల నీటిమట్టంతో 21.78 లక్షల క్యూసెక్కుల నీరు పోలవరానికి ఒకేసారి విడుదలైంది. ఈ క్రమంలో ముంపు మండలాలతో పాటు పశ్చిమలోని లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. 2022లో జూలై 6న, 2023లో జూలై 20న 2024 జూలై 19న వరదలు ప్రారంభమై సుమారు వారం రోజులు పాటు ఇన్‌ఫ్లో కొనసాగింది.



అమ్మవారంటే సాక్షాత్తూ అమ్మే. ఈ సృష్టిలోని జీవరాసులన్నింటికీ అమ్మ అయిన జగన్మాత అందరి ఆకలిని తీర్చడానికి శాకంబరి దేవి అవతారంలో ఉద్భవించింది. ఈ దేవిని పూజించటం వల్ల కరువు కాటకాల నుంచి విముక్తి లభిస్తుందనీ, ఆకలి బాధ ఉండదనీ భక్తులు విశ్వసిస్తారు. వరంగల్‌లోని భద్రకాళీ అమ్మవారికి శాకంబరీ దేవి ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా, అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరిస్తారు. ఇందుకు సంబంధించిన పురాణ గాధ తెలుసుకుందాం...



● ఆషాఢ ఉత్సవాలు

జయహో శాకంబరీ మాత!





● వరంగల్‌లోని శ్రీ భద్రకాళి ఆలయం

వేదకాలంలో దుర్గమాసురుడు అనే రాక్షసుడు ఉండేవాడు. అతను బ్రహ్మ గురించి ఘోర తపస్సు చేసి వేదాలన్నీ తనలో దాచేసుకున్నాడు. దానితో అందరూ వేదాలు, పూజలు, యజ్ఞాలు, యాగాలు, క్రతువులు అన్ని మర్చిపోయారు. తత్ఫలితంగా దేవతలకు హవిస్సులు అందక శక్తి హీనులైపోయారు. నదీ నదాలు ఎండిపోయాయి. వర్షాలు లేక వృక్ష జాతి నశించింది. లోకమంతా ఆకలితో అలమటించసాగింది.

ఋషులు, దేవతలు సర్వ శక్తిస్వరూపిణి అయిన పార్వతీదేవిని ప్రార్థించారు. అప్పుడు ఆ దేవి కరుణతో 'శతాక్షి'గా అనేకమైన కన్నులతో భూమి మీదకు వచ్చింది. బీటలు వారిన భూమిని, కరవు కాటకాలను, లోకంలో వున్న దుస్థితిని చూసి అమ్మవారి ఒక కన్నులోంచి నీరు రాగా, ఆ నీరు ఏరులై, వాగులై, నదులన్నీ నిండి లోకం అంతా ప్రవహించింది. అయితే భూములు సాగు చేసి పండించటానికి కొంచెం వ్యవధి పడుతుందని, ప్రజల ఆకలి వెంటనే తీర్చటానికి, అమ్మవారు అమితమైన దయతో శాకంబరి అవతారం దాల్చి వివిధమైన కాయగూరలు, పళ్ళతో సహా ఒక పెద్దచెట్టు లాగా దర్శనమిచ్చింది. ప్రజలంతా ఆ కాయగూరలు, పళ్ళు తిని ప్రాణాలు నిలుపుకున్నారు. ఎన్ని కోసుకున్న ఇంకా తరగని సంపదతో వచ్చింది ఆ అమ్మవారు. ఆవిడ అపరిమితమైన కరుణా కటాక్షాలకు ప్రతీకయే ఈ శాకంబరి అవతారం.

పార్వతీదేవి దుర్గగా, తన నుంచి ఉద్భవించిన కాళిక, భైరవి, శాంభవి, త్రిపుర మొదలైన 32 శక్తులతో దుర్గమాసురునితో, రాక్షస సైన్యాలతో తొమ్మిది రోజుల పాటు యుద్ధం చేసి చివరకు దుర్గమాసురుని సంహరించింది. అలనాటి ఈ ఘటనకు ప్రతీకగా విజయవాడ ఇంద్రకీలాద్రితోపాటు తెలుగు రాష్ట్రాల్లోని పలు దేవీ ఆలయాల్లో ఆషాఢ మాసంలో శాకంబరీ ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. శుక్లపక్ష త్రయోదశి నుంచి పౌర్ణమి వరకు మూడు రోజులు ఈ ఉత్సవాలు సాగుతాయి.

వరంగల్‌లోని భద్రకాళీ ఆలయంలో మొదటిసారిగా ఆషాఢ శుద్ధ పౌర్ణమి నాడు శాకంబరీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. క్రమంగా ఇవి కనకదుర్గమ్మ ఆలయం, శ్రీశైలం భ్రమరాంబ అమ్మవారి ఆలయంలో కూడా ప్రారంభించారు. దేవీ భాగవతంతో పాటు మార్కండేయ పురాణంలోని చండీసప్తశతిలో శాకంబరీ దేవి గురించిన ప్రస్తావన ఉంది. 'నీటి చుక్క కూడా లేకుండా వందేళ్ల కాలం వరకు ఒక సమయంలో అనావృష్టి సంభవించగలదు... అప్పుడు ఈ భూలోకంలోని మునీశ్వరులు నన్ను స్తుతిస్తారు... వారి కోరిక మేరకు నేను అయోనిజనై అవతరిస్తాను.. నా శత నయనాలతో చూస్తూ లోకాలను కాపాడుతాను.. అప్పుడు ప్రజలందరూ నన్ను శతాక్షీదేవిగా కీర్తిస్తారు. ఆ తర్వాత నా దేహం నుండి శాకములను పుట్టించి,







మళ్లీ వర్షాలు పడేంత వరకు జనుల ఆకలి తీర్చి, ప్రాణాలను రక్షిస్తాను. అందువల్లనే నేను శాకంబరీదేవిగా ప్రసిద్ధి పొందుతానని' అమ్మవారు చెప్పినట్టుగా పురాణాల్లో ఉంది.

కనకదుర్గ గుడిలో కూరగాయలతో అలంకరణ

ఈ సమయంలోనే దుర్గముడనే రాక్షసుని సంహరించిన జగన్మాత దుర్గాదేవిగా కీర్తిపొందింది. శాకంబరీ దేవి నీల వర్ణంలో సుందరంగా ఉన్న కమలాసనంపై కూర్చుని ఉంటుంది. తన పిడికిలి నిండా వరి మొలకలను పట్టుకొని ఉంటుంది. మిగిలిన చేతులతో పుష్పాలు, ఫలాలు, చిగురుటాకులు, దుంపగడ్డలు మొదలైన కూరగాయల సముదాయాన్ని ధరించి ఉంటుంది.

ఈ శాకాల సముదాయం అంతులేని కోర్కెలను తీర్చే రసాలు కలిగి ఉంటాయి. జీవులకు కలిగే ఆకలి, దప్పిక, మృత్యువు, ముసలితనం, జ్వరం మొదలైనవి పోగొడతాయి. కాంతులను ప్రసరించే ధనుస్సును ధరించే పరమేశ్వరిని శాకంబరీ, శతాక్షి, దుర్గ అనే పేర్లతో కీర్తింపబడుతుంది. ఈ దేవి శోకాలను దూరం చేసి, దుష్టులను శిక్షించి శాంతిని కలుగజేయడమే కాదు పాపాలను పోగొడుతుంది. ఉమాగౌరీ సతీ చండీ కాళికా పార్వతి అనే పేర్లతో కూడా ఈ దేవి ప్రసిద్ధి పొందింది. ఈ శాకంబరీ దేవిని భక్తితో స్తోత్రం చేసేవారు, ధ్యానించేవారు. నమస్కరించేవారు, జపించేవారు, పూజించేవారు తరిగిపోని అన్నపాన అమృత ఫలాలను అతి శీఘ్రంగా పొందుతారు. శుక్లపక్ష చంద్రుడు ప్రతిరోజు వృద్ధి చెందుతూ పౌర్ణమినాడు షోడశకళా ప్రపూర్ణుడవుతాడు.

ఆషాఢమాసంలో ఆలయానికి వెళ్లే అవకాశం లేని భక్తులు కనీసం అమ్మవారి ముందు రకరకాల పండ్లు, కూరగాయలను ఉంచి, వీలయితే వాటితో అమ్మవారిని అలంకరించి, ముందుగా కొన్ని మనం స్వీకరించి ఆ తర్వాత వాటిని పేదలకు పంచిపెడితే చాలా మంచిది. అందుకు కూడా వీలు లేనివారు కనీసం శాకంబరీ ఉత్సవాలు జరిగే రోజుల్లో అమ్మవారిని తలచుకుని పేదలకు పండ్లు, ఆకుకూరలు, కాయగూరలు దానం చేయడం ఫలదాయకం.

వరంగల్ శ్రీభద్రకాళి దేవాలయంలో గత నెల జూన్ 26న సహస్ర కలశాభిషేకంతో శాకంబరీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 15రోజుల పాటు అమ్మవారికి వివిధ క్రమాలలో పూజలు నిర్వహించారు. నేడు గురువారం పౌర్ణమి సందర్భంగా మహాశాకంబరీ అమ్మవారిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.

– అడ్లూరి సునందాశివప్రసాద్
సాక్షి, హన్మకొండ కల్చరల్

● బౌద్ధ వాణి

బుద్ధుడు అనారోగ్యం పాలయ్యాక 'ఇక నేను ఎక్కువకాలం జీవించలేను' అని ప్రకటించాడు. దాంతో ధర్మంలో పరిపూర్ణత సాధించలేక పోయినవారు ఆవేదన చెందారు. 'అంత గొప్ప మానవీయ ధర్మాన్ని ప్రబోధించిన బుద్ధుడు ఇక మనకు ఆట్టే కాలం కనిపించడా?' అని కలవరపడ్డారు. ఇక తాము చేయాల్సిన విధులన్నీ దాదాపుగా మాని ఆయన వెంటే పడి తిరుగుతూ ఉండేవారు. ఆయనకు సేవ చేయడానికి పోటీపడేవారు. ఆ మహనీయుని సేవలో గడపడం గొప్ప కార్యంగా భావించేవారు.

వారిలో అత్తదత్తుడు అనే వాడు మాత్రం బుద్ధుని చూడ్డానికీ, సేవకూ ఎప్పుడూ రాలేదు. బుద్ధుని విషయం తెలిసినప్పటినుంచి బుద్ధుని దగ్గరకు రావడమే మానుకున్నాడు. నిరంతరం ధ్యాన సాధనలో లీనమై పోయి ఉండేవాడు.

అనుకరణ.. అనుసరణ..!



ఒకరోజున భిక్షువులందరూ అతని మీద నింద మోపి బుద్ధుని ముందుకు తీసుకొచ్చి–

'భగవాన్! చూశారా! మేమందరం మీ చెంతే ఉంటున్నాం. ఈ అత్తదత్తుడు మాత్రం ఈ ఛాయలకే రావడం లేదు'' అని చెప్పారు.

''భిక్షూ! వీరి ఆరోపణ నిజమేనా? నీవు ఏం చేస్తున్నావు?'' అని అడిగాడు బుద్ధుడు చిరునవ్వుతో.

''నిజమే భగవాన్! నేను ధ్యానంలో పరిపూర్ణత సాధించలేదు. అర్హంతుడను కాలేదు. మీరు జీవించి ఉండగానే నేను అర్హంతుడను కావాలని నిశ్చయించుకున్నాను. అందుకే నిరంతరం ఆ మార్గంలోనే ఉంటున్నాను'' అని చెప్పాడు.

అప్పుడు బుద్ధుడు–

''భిక్షువులారా! అత్తదత్తుడు చెప్పిందే సత్యం. మీరు ధర్మాన్ని అనుసరించడమ అంటే నన్ను అనుసరించడం కాదు. నా మార్గాన్ని అనుసరించడం. అర్హంతులు కావడం ఇకనైనా మీరు అర్హంత సాధనకు మళ్లండి'' అని ప్రబోధించాడు.

మిగిలిన భిక్షువులు అత్తదత్తుణ్ణి అనుసరించారు. వ్యక్తి మీద గౌరవం చూపడం కంటే ఆ వ్యక్తి నిర్దేశించిన మార్గంలో పయనించడమే అసలైన ఆదర్శం అని తెలియజెప్పే ఈ కథ ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసినది, అనుసరించవలసిందీనూ.

(అర్హంతుడు -అర్హుడు, అర్హంత- అర్హత)

– డా. బొర్రా గోవర్ధన్

● ఇస్లాం వెలుగు

అన్ని స్థితులనూ ఆస్వాదించగలగాలి

జీవితం విభిన్న స్థితుల సంగమం. ఇక్కడ సుఖమూ ఉంది, దుఃఖమూ ఉంది. సంతోషమూ ఉంది, బాధా ఉంది. ఆనందమూ ఉంది, విచారమూ ఉంది. తీపీ ఉంది, చేదూ ఉంది. శీతలమూ ఉంది, ఉష్ణమూ ఉంది. సంతృప్తీ అసంతృప్తీ రెండూ ఉన్నాయి. శాంతి, అశాంతీ కూడా ఉన్నాయి. ఇదంతా దైవాభీష్టం, దేవుని ఆదేశానుసారం, ఆయన నిర్ణయం మేరకే.

అందుకని మానవులు కష్టాలొచ్చినప్పుడు కుంగిపోకూడదు, ఎటువంటి పరిస్థితులు ఎదురైనప్పటికీ నిరాశా నిస్పృహలకు లోను కాకూడదు. ధైర్యంతో స్వాగతం పలకాలి. ఇవన్నీ దేవుని తరపునే అని భావిస్తూ, ఆ కరుణామయుడే వీటినుండి విముక్తి కలిగిస్తాడని నమ్మాలి.



ఇదేవిధంగా కష్టాలు దూరమై, పరిస్థితులు మెరుగుపడి, అంతా సజావుగా జరిగిపోతూ, సుఖసంతోషాలు ప్రాప్తమైతే ఇదంతా తమ గొప్పదనమేనని, తమ రెక్కల కష్టార్జిత ఫలితమేనని భావించి విర్రవీగకూడదు. ఇదంతా అల్లాహ్ అనుగ్రహమని, ఆ కరుణామయుని ప్రసాదితమన్న విశ్వాసం హృదయంలో జనించాలి. ఆయన ఎప్పుడు కోరితే అప్పుడు తాను ప్రసాదించిన అనుగ్రహాలను తిరిగి లాక్కోగలడు. కాబట్టి ప్రతి అనుగ్రహానికీ ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఉండాలి.

ముహమ్మద్ ప్రవక్త(స)ప్రవచనం ఇలా ఉంది: 'ఎవరైతే ధన, ప్రాణ నష్టాల్లో కూరుకుపోయి, ఆ విషయం ఎవరి ముందూ బహిర్గతం చేయకుండా, ప్రజలతో ఫిర్యాదు చేయకుండా ఉంటాడో అతణ్ణి క్షమించడం అల్లాహ్ బాధ్యత.'

అల్లాహ్ ఇలా అంటున్నాడు: 'మానవులారా! నా ప్రసన్నత కోసం, నేను ప్రసాదించే పుణ్యాన్ని పొందే సంకల్పంతో, దుఃఖ సమయం ఆసన్నమైనప్పుడు సహనం వహించినట్లయితే, నేను స్వర్గంకన్నా తక్కువైనదాన్ని, స్వర్గం తప్ప మరిదేన్నీ మీకు ప్రసాదించడానికి ఇష్టపడను.'

ప్రాపంచిక జీవితంలో కష్టనష్టాలు, సుఖ సంతోషాలు చాలా సహజ విషయాలు. వీటి ద్వారా దైవప్రసన్నత, ఆయన సామీప్యం పొందడానికి శక్తివంచనలేని ప్రయత్నం చేయాలి. సుఖ సంతోషాలు, శాంతి సంతృప్తులు ప్రాప్తమైనప్పుడు అల్లాహ్‌కు కృతజ్ఞతలు సమర్పించుకోవాలి. కష్టాలు కడగండ్లు ఎదురైతే, జరగరాని సంఘటనలు ఏమైనా జరిగి కష్టనష్టాలు, బాధలు సంభవిస్తే దాస్య ఔన్నత్యానికి ప్రతిరూపంగా అనన్యసామాన్యమైన సహనం వహించాలి.

హృదయం కృతజ్ఞతతో నిండి ఉండాలి. అంటే, అన్ని స్థితులనూ సమానంగా ఆస్వాదించగలగాలి. దీన్నే 'స్థితప్రజ్ఞత' అంటారు.

ఇలాంటి వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు. తన కారుణ్య ఛాయలో చోటు కల్పిస్తాడు. స్వర్గసీమను అనుగ్రహిస్తాడు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

సార్థక జీవితం

అల్ప పదాలలో అనంతార్థాన్ని చూపే ప్రసంగ కళా శాస్త్ర పండితుడిగా, ధర్మశాస్త్ర నిపుణుడిగా పేరొందిన అపొస్తలుడైన పౌలు క్రీస్తు మరణాన్ని చూసే విధానం అద్భుతమనే చెప్పాలి.

'నా సువార్త ప్రకారంగా' అంటూ పౌలు మహాశయుడు దేవుని సంకల్ప ప్రకారమైన క్రీస్తు సత్యసువార్తను కుదించి కేవలం మూడే మూడు పదాలతో సువార్తను నిర్వచించాడు. క్రీస్తు మరణం, సమాధి, పునరుత్థానం అంటూ సువార్తను వివరించాడు. ఇదే క్రీస్తు సువార్తను మరల మరింతగా క్లుప్తంగా చేసేస్తూ విషయ సారం ఇదే అనేంత తేటగా అసలును తేల్చేస్తూ అది హుందాగా మన ముందు పెడతాడు. క్రీస్తు మరణమే సువార్త అంటూ ఒకే ఒక్క మాటతో ఇలా సులభం చేసేశాడు. అయితే క్రీస్తు సువార్త ఎప్పుడూ దేవుని సంకల్పంతో ముడిపడి ఉంటుంది. సువార్తను దేవుని సంకల్పంతో ఎన్నడూ వేరుచేసి చూడలేము.

పౌలు క్రీస్తు మరణాన్నే సువార్తగా అదే తన జీవిత పరమావధిగా, గమ్యంగా చేసుకొని జీవితాంతం ఈ ఒక్క అతిశయంతోనే సువార్తను అంతటా ప్రకటించాడు. మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటిస్తున్నాము అంటాడు ఒకసారి. క్రీస్తు వచ్చు వరకు ఆయన మరణాన్ని ప్రచారం చేయండి అంటూ సంఘానికి పిలుపునిస్తూ ఆజ్ఞాపిస్తాడు ఇంకొకసారి. ఔను, నిజానికి క్రీస్తు మరణమే సువార్త.

అయితే సమాధి, పునరుత్థానాలు అను రెండు అంశాలు కూడా సువార్తను బలపరచేవే. ఎలాగంటే, మరణించిన క్రీస్తును సమాధి చేశారు. అలాకాకుండా ఆయన కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ ఉంటే ఏ వైద్యశాలకో ఆయన్ను తరలించేవారు. అలా జరుగలేదు. రోమా ప్రభుత్వం ఆయన మరణించాడు అన్నది నిర్ధారణ చేసుకొనే ఆయన పార్థివ దేహాన్ని సంబంధిత వ్యక్తులు, శిష్యులకు అప్పగించింది. ఇక పునరుజ్జీవం విషయానికి వస్తే, క్రీస్తు మరణం నుండి తిరిగి లేవకపోతే క్రైస్తవులకు మనుగడే అనగా నిరీక్షణే లేదని పౌలే బలంగా నొక్కి వక్కాణిస్తుంటాడు. అయినా సరే, పౌలు దృష్టి కోణంలో క్రీస్తు మరణమే సువార్త. సువార్త అంటే క్రీస్తు మరణం... క్రీస్తు మరణమే సువార్త అన్నంతగా పౌలు జీవితంతో క్రీస్తు సువార్త ముడిపడి పెనవేసుకొంది.

మరో విధంగా చూస్తే, ఒక వ్యక్తి సమాధి చేయబడ్డాడు అంటే మరణించాడు అనేకదా అర్థం. మరణించిన వారే సమాధి చేయబడతారు. అదేవిధంగా మరణించాడు అనంటే ఒక వ్యక్తి ఎక్కడో ఒకచోట పుట్టాడు అనే కదా దీనర్థం. కాబట్టి ఈ కోణంలోనూ మరణమే సువార్త అయ్యింది.

– జేతమ్

● సువార్త



మరణంతోనే వెలుగు


చేతల పరమైన సత్క్రియలు, వీరోచిత కార్యాలు, ధైర్య సాహసాలు మాట్లాడినంత గట్టిగా ఏవీ మాట్లాడలేవు. ఒక సైనికుడు తన వీర మరణంతోనే వెలుగులోకి వస్తాడు. కొత్తగా ఈ ప్రపంచానికి పరిచయం అవుతాడు. ఇక అప్పటి నుండే అతని పుట్టుక, పేరు, ఊరు, తల్లిదండ్రులు, అతడు చదివిన పాఠశాల, సంబంధిత ఇతర విద్యా సంస్థలు, అతనికి చదువు చెప్పిన గురువులు, అతని సన్నిహిత స్నేహితులు, బంధు మిత్రులు అంతా మీడియా కెక్కుతారు. దేశానికి అతని త్యాగపూరిత మరణం చేసిన గొప్ప మేలునే ఎప్పుడూ మరువక దేశ ప్రజలు అంతా గుర్తుపెట్టుకుంటారు. ఇలాంటిదే, ఇంతకు మించినదే క్రీస్తు మరణం.

● పరిహారం

వృత్తి ఉద్యోగాలలో అభివృద్ధి లేదా?

వృత్తి ఉద్యోగాల్లోని అవరోధాల వల్ల చాలామంది నిరాశా నిస్పృహలకు లోనవుతుంటారు. పనికి తగిన ప్రతిఫలం, గుర్తింపు దక్కకపోవడం ఎవరికైనా మనస్తాపం కలిగిస్తుంది. పనిచేసే చోట రాజకీయాల వల్ల తరచుగా నష్టపోతూ ఉన్నట్లయితే విరక్తిలో కూరుకుపోతారు. ఇలాంటి దుస్థితిని ఎలా అధిగమించాలంటే...

- అసూయాపరుల కారణంగా ఉద్యోగ జీవితంలో ఎదురయ్యే అవాంతరాలను అధిగమించాలంటే, శుక్రవారం రాత్రివేళ కిలో మినుములను నీట్లో నానబెట్టండి. శనివారం ఉదయం స్నానాదికాల తర్వాత ముందురోజు నానబెట్టిన మినుములను ఒక పళ్లెంలోకి తీసుకోండి. ఆ మినుములను మూడు సమ భాగాలుగా చేయండి. ఒక భాగాన్ని గుర్రానికి, ఒక భాగాన్ని గేదెకు, ఒక భాగాన్ని ఆవుకు తినిపించండి.



- ప్రభుత్వోద్యోగాల్లో కొనసాగుతున్న వారు ఉద్యోగ జీవితంలో అవరోధాలు తొలగిపోవాలంటే సూర్య ఆరాధన చేయడం వల్ల ఫలితం ఉంటుంది. ప్రతిరోజూ ఆదిత్య హృదయం పఠించండి. ప్రతి ఆదివారం ఒక చిన్న బెల్లంముక్కను ప్రవహించే నీటిలో విడిచిపెట్టండి.
- ఉద్యోగ జీవితంలో శత్రులు కుతంత్రాలకు బాధితులు బలి కాకుండా ఉండాలంటే, ప్రతి శుక్రవారం ఉపవాసం చేయండి. శుక్రవారం ఉదయం స్నానాదికాల తర్వాత దేవీ అర్గళ స్తోత్రాన్ని మూడుసార్లు ఏకాగ్రతతో పఠించండి. అనాథ బాలికలకు కొత్త దుస్తులు ఇవ్వండి.
- ఉద్యోగ జీవితంలో పురోగతికి ఏర్పడుతున్న అవరోధాలు తొలగిపోవాలంటే ప్రతి శనివారం ఉదయం స్నానాదికాలు, నిత్యపూజ తర్వాత రావిచెట్టు మొదట్లో గుప్పెడు నానబెట్టిన మినుములు, ఒక చిన్న బెల్లం ముక్క నివేదనగా ఉంచి, నీలిరంగు పూలతో పూజించాలి. గాయత్రీ హోమం చేయడం ద్వారా కూడా ఫలితం ఉంటుంది.

– సాంఖ్యాయన

● మంచి మాటలు

- మనం చేసే పని ఎంతమంది చూస్తారన్నది ముఖ్యం కాదు. అది ఎంత మందికి ఉపయోగపడింది అనేదే ముఖ్యం. మంచిపని చేసేటపుడు మనం కనపడాల్సిన అవసరం లేదు. మంచితనం కనపడితే చాలు.
- 'చిరునవ్వును మించిన అలంకరణ లేదు. వినయాన్ని మించిన ఆభరణం లేదు.
- 'డబ్బు ఆస్తులను సంపాదించి పెడుతుంది. కానీ మంచితనం మనుషుల్ని సంపాదించి పెడుతుంది.
- మంచితనం సంపాదించుకున్న మనిషికి పేదరికం రావొచ్చేమో కానీ ఒంటరితనం ఎప్పటికీ రాదు'.
- 'చెడుని ప్రశ్నించడం, మంచిని ప్రశంసించడం నేర్చుకున్నప్పుడు అది మనలో మంచిని పెంచి చెడుని తొలగిస్తుంది'.

విజయం కోసం... జయ శ్లోకం

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః
దాసోహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః
న రావణ సహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః
అర్దయిత్వా పురీం లంకామభివాద్య చ మైథిలీం
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్



జయశ్లోకం అనే పేరుగల ఈ శ్లోకాన్ని మన కోరికను లేదా సమస్యను బట్టి శుచిగా ఉండి 5/11/21/40 రోజులపాటు నిత్యం భక్తిశ్రద్ధలతో చదువుకుంటూ హనుమంతుడికి అరటిపండ్లు నివేదించడం వల్ల ఎంతటి క్లిష్ట సమస్యలైనా తీరిపోతాయని ప్రతీతి.

● ధర్మసందేహం

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే...



గాలి ఎక్కువగా పీల్చుకోవడం, నీళ్ళు ఎక్కువగా తాగడం, మితంగా సాత్విక ఆహారం తీసుకోవడం, మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం ఇవి మన ఆరోగ్య సౌధానికి నాలుగు ప్రధాన స్తంభాలు. ఆ పైన ఈ కింది స్తోత్రాలు అనుసంధిస్తే భగవదనుగ్రహం వల్ల పరిపూర్ణ ఆరోగ్యం ఉంటుంది.

- ప్రతిరోజు ఉదయించే సూర్యుని ముందు నిల్చొని, ఆదిత్య హృదయం చదవాలి. శాస్త్ర పద్ధతిలో సూర్యనమస్కారాలు కూడా చేస్తే మంచిది.
- వాల్మీకి రామాయణం యుద్ధకాండలోని యాభై తొమ్మిదవ సర్గను పారాయణం చేయాలి. ఇది మనలోని అహంకారాన్ని, అంతః శత్రువులను తగ్గిస్తుంది. ఆరోగ్యాన్నిస్తుంది.
- మన కర్మ ఫలాలను, ప్రధానంగా అనారోగ్యాలను నియంత్రించే ఆదేశాలను భగవంతుడు నరసింహ దివ్యరూపంలో సుదర్శనుల వారికి కటాక్షిస్తాడని ప్రసిద్ధి. అందువల్ల వారికి ప్రీతి కలిగించే సుదర్శన శతకం, సుదర్శనాష్టకం, నృసింహాష్టకం, లక్ష్మీ నరసింహ అష్టోత్తర శతనామావళి పారాయణం, అర్చన చేయడం మంచిది.
- అనారోగ్యాన్ని దూరం చేయడానికి ధన్వంతరి అష్టోత్తర శతనామ పారాయణం సత్ఫలితాన్నిస్తుంది.
- అంటువ్యాధులు ప్రబలినప్పుడు శీతలాష్టకం చదవడం వల్ల సత్ఫలితాలుంటాయని పెద్దలు చెబుతారు.

బిజినెస్ రీల్

శాంసంగ్ నుంచి 3 ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్లు



న్యూయార్క్: శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ప్రీమియం ఫోల్డబుల్ గెలాక్సీ సిరీస్‌లో మూడు కొత్త మోడల్స్‌ను ప్రవేశ పెట్టింది. గెలాక్సీ జెడ్ ఫోల్డ్7, ఫ్లిప్ 7, ఫ్లిప్7 ఎఫ్ఈ వీటిలో ఉన్నాయి. గెలాక్సీ జెడ్ ఫోల్డ్ సిరీస్‌లో ఇవి ఏడో జనరేషన్ ఫోన్లు. మరింత వెడల్పాటి స్క్రీన్, తక్కువ బరువు, 200 మెగాపిక్సెల్ వైడ్-యాంగిల్ కెమెరా, కృత్రిమ మేథపరంగా కొత్త ఫీచర్లు మొదలైనవి వీటిలో ఉన్నాయి. ఫోన్‌ను బట్టి స్నాప్‌డ్రాగన్ 8 ఎలీట్ ప్రాసెసర్లు, 8.5 అంగుళాల డైనమిక్ అమోలెడ్ 2ఎక్స్ మెయిన్ డిస్‌ప్లే, 16 జీబీ వరకు మెమరీ, 1 టీబీ స్టోరేజీ మొదలైన ప్రత్యేకతలు ఉంటాయి.

తెలుగులో ట్యాక్స్ ఫైలింగ్‌కి క్లియర్‌ట్యాక్స్ ఏఐ అసిస్టెంట్

బెంగళూరు: ఫిన్‌టెక్ సంస్థ క్లియర్‌ట్యాక్స్ తాజాగా ఐటీ రిటర్నులను ఫైలింగ్ చేసేందుకు సంబంధించి తెలుగు తదితర 7 భాషల్లో సహాయం పొందే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చింది. బహు భాషల్లో పని చేసే కృత్రిమ మేథ (ఏఐ) ఆధారిత క్లియర్‌ట్యాక్స్ ఏఐ అసిస్టెంట్‌ను ఆవిష్కరించింది. దీనితో వాట్సాప్, స్లాక్ తదితర మాధ్యమాల ద్వారా తమకు కావాల్సిన భాషలో చాటింగ్ చేస్తూ, మూడు నిమిషాల వ్యవధిలోనే ఫైలింగ్ చేయొచ్చని సంస్థ వివరించింది. మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ఫైల్ చేసేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. దీనితో కొత్తగా 1 కోటి మంది ట్యాక్స్ ఫైలర్లను వ్యవస్థ పరిధిలోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.



బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో ఒప్పో రెనో14 సిరీస్ ఫోన్లు



ఎస్ఆర్‌నగర్‌లో సినీ నటి ఈషా రెబ్బా సందడి చేశారు. బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఎస్ఆర్ నగర్ బ్రాంచ్‌లో ఒప్పో రెనో14 సిరీస్ 5జీ మొబైల్ ఫోన్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో చార్లెస్, బజాజ్ ఎలక్ట్రానిక్స్ బిజినెస్ హెడ్ మొహమ్మద్ నాజర్ అహ్మద్‌తో పాటు ఇతర అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-7-2025

విశాఖ	540-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	680.7	1.76
BAJFINANCE	941	1.44
COALINDIA	387.85	1.31
HINDUNILVR	2,421.30	1.2
ULTRACEMCO	12,550.00	0.84

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HCLTECH	1,673.00	-2.05
HINDALCO	673.05	-1.83
TATASTEEL	159.2	-1.71
APOLLOHOSP	7,450.50	-1.51
TECHM	1,612.30	-1.41

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,355
ఎన్ఎస్ఈ	95,306
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,24,252
ఎఫ్ఐఐ	+ 77
డీఐఐ	+ 921

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.31 (రాత్రి 11.30కు)	$	68.33 (క్రితం ముగింపు)
బ్రెంట్	70.17 (రాత్రి 11.30కు)	$	70.15 (క్రితం ముగింపు)

మళ్లీ ఈక్విటీ ఫండ్స్ జోరు..




- ఐదు నెలల తగ్గుదల ట్రెండ్‌కు బ్రేక్...
- జూన్‌లో రూ.23,587 కోట్ల పెట్టుబడులు
- మే నెలలో పోలిస్తే 24 శాతం జంప్...
- పటిష్టమైన స్టాక్ మార్కెట్ల దన్ను...
- సిప్ పెట్టుబడులూ రయ్ రయ్...

న్యూఢిల్లీ: గత ఐదు నెలలుగా దిగజారుతూ వస్తున్న ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పెట్టుబడుల ప్రతికూల ట్రెండ్‌కు ఎట్టకేలకు బ్రేక్ పడింది. జూన్‌లో ఈక్విటీ ఫండ్స్‌లోకి నికరంగా రూ.23,587 కోట్ల నిధులు వెల్లువెత్తాయి. మే నెలలో వచ్చిన రూ.19,013 కోట్లతో పోలిస్తే 24 శాతం జంప్ చేశాయి. స్టాక్ మార్కెట్లు భారీగా పుంజుకోవడంతో అన్ని ఫండ్ విభాగాలకూ దన్నుగా నిలుస్తోంది. కాగా, ఈక్విటీ ఫండ్స్ విభాగంలోకి వరుసగా 52వ నెలలోనూ నికర పెట్టుబడులు నమోదయ్యాయి. మరోపక్క, ఇన్వెస్టర్ల సానుకూల ధోరణితో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) పెట్టుబడులు కూడా జోరుందుకున్నాయి. జూన్‌లో వివిధ పథకాల్లోకి రూ. 27,269 కోట్లు సిప్ రూపంలో వచ్చి చేరాయి. మే నెలలో ఈ మొత్తం రూ.26,688 కోట్లుగా ఉంది. మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫీ) విడుదల చేసిన తాజా గణాంకాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

ఇతర ముఖ్యాంశాలివీ...

- గతేడాది నవంబర్‌లో రూ.35,943 కోట్ల నుంచి డిసెంబర్‌లో రూ.41,156 కోట్లకు ఎగబాకిన ఈక్విటీ ఎంఎఫ్ పెట్టుబడులు... ఆ తర్వాత నెల నుంచి అంతకంతకూ పడిపోతూనే వచ్చాయి. మే నెలలో ఏకంగా రూ.20,000 కోట్ల దిగువకు చేరాయి. జూన్‌లో దీనికి అడ్డుకట్టపడటం మార్కెట్లో సానుకూల ధోరణికి నిదర్శనం.
- ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి జూన్‌లో రికార్డు స్థాయిలో రూ.5,733 కోట్లు వచ్చి పడ్డాయి, తర్వాత స్థానాల్లో స్మాల్ క్యాప్ ఫండ్స్ (రూ.4,024 కోట్లు), మిడ్ క్యాప్ ఫండ్స్ (రూ.3,754 కోట్లు), లార్జ్ క్యాప్ ఫండ్స్ (రూ.1,694 కోట్లు) నిలిచాయి.
- ఈక్విటీ ఆధారిత సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్)లోకి జూన్‌లో రూ.566 కోట్ల నిధులు వచ్చాయి.
- ఈక్విటీల మాదిరిగానే హైబ్రిడ్ ఫండ్స్‌లోకి కూడా దండిగానే పెట్టుబడులు ప్రవహించాయి. రూ.23,223 కోట్లు లభించాయి. మే నెలలో ఇది రూ.20,765 కోట్లుగా నమోదైంది.
- మొత్తంమీద మ్యూచువల్ ఫండ్ పరిశ్రమకు జూన్‌లో రూ.49,000 కోట్ల నిధులు లభించాయి. మే నెలలో ఈ మొత్తం రూ.29,000 కోట్లుగా ఉంది.
- బంగారం ధరల పటిష్ట ధోరణికి అద్దం పడుతూ గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఆదారణ భారీగా పెరిగింది. మే నెలలో కేవలం రూ.292 కోట్లు గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి రాగా... జూన్‌లో ఏకంగా రూ. 2,081 కోట్ల నికర పెట్టుబడులు వచ్చిపడ్డాయి. జనవరి తర్వాత మళ్లీ ఈ స్థాయిలో నిధులు వెల్లువెత్తడం ఇదే తొలిసారి.
- మరోపక్క, డెట్ ఫండ్స్ నుంచి నిధుల ఉపసంహరణ వేగం కూడా తగ్గింది. జూన్‌లో రూ.1,711 కోట్లు బయటికెళ్లాయి. మే నెలలో ఈ మొత్తం రూ.15,908 కోట్లుగా ఉంది. దీనికి ముందు ఏప్రిల్‌లో డెట్ ఫండ్స్ ఏకంగా రూ.2.2 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడం గమనార్హం.
- తాజా నిధుల జోరుతో జూన్ చివరి నాటికి ఎంఎఫ్ పరిశ్రమ నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల (ఏయూఎం) విలువ రూ. 74.4 లక్షల కోట్లకు ఎగబాకింది. మే చివరికి ఏయూఎం రూ.72.2 లక్షల కోట్లుగా నమోదైంది.



సిప్ దన్ను...



ఫండ్స్ నిర్వహణ ఆస్తులు (ఏయూఎం) వృద్ధి పథంలో పయనించడానికి రిటైల్ ఇన్వెస్టర్ల బలమైన భాగస్వామ్యమే కారణం. సిప్ పెట్టుబడులు స్థిరంగా నమోదవుతుండటం ఫండ్ పథకాలకు దన్నుగా నిలుస్తోంది.

– వెంకట్ చలసాని, యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్

పరిశ్రమకు సానుకూలం...



ఈక్విటీ ఫండ్స్‌లోకి నిధుల ప్రవాహం క్రమంగా పుంజుకోవడం... ఇన్వెస్టర్లలో మళ్లీ విశ్వాసం నెలకొందనడానికి నిదర్శనం. ఎంఎఫ్ పరిశ్రమకు, దేశీ స్టాక్ మార్కెట్లకు ఇది అత్యంత సానుకూలాంశం.

– అఖిల్ చతుర్వేది, మోతీలాల్ ఓస్వాల్ ఏఎంసీ ఈడీ, సీబీఓ

స్టాక్ మార్కెట్ జోరుతో



దేశీయంగా స్టాక్ మార్కెట్లు మళ్లీ పరుగులు పెడుతుండటంతో అన్ని విభాగాలూ కళకళలాడుతున్నాయి. నిఫ్టీ50తో పాటు మిడ్, స్మాల్ క్యాప్ సూచీలూ పటిష్టమైన ర్యాలీ చేశాయి. ఈక్విటీ పెట్టుబడులకు ఇన్వెస్టర్లు మళ్లీ ఉత్సాహంగా ముందుకొస్తున్నారు.

– హిమాన్షు శ్రీవాస్తవ, మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్

వేదాంత గ్రూప్ ఓ పేకమేడ..!

- మాతృ సంస్థ ఓ పారసైట్‌లాంటిది; పోంజీ స్కీము నడిపిస్తోంది
- అమెరికా షార్ట్‌సెల్లర్ వైస్రాయ్ రీసెర్చ్ సంచలన రిపోర్ట్
- ఖండించిన వేదాంత



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌ను హిండెన్‌బర్గ్ రీసెర్చ్ లక్ష్యంగా చేసుకున్నట్లుగా తాజాగా మరో దిగ్గజం వేదాంత గ్రూప్‌ను ఇంకో అమెరికన్ షార్ట్‌సెల్లింగ్ సంస్థ వైస్రాయ్ రీసెర్చ్ టార్గెట్ చేసింది. వేదాంత గ్రూప్ అనేది భారీ అప్పులు, కొల్లగొట్టిన ఆస్తులు, కల్పిత అకౌంటింగ్ గాథలతో కట్టిన ఓ పేకమేడలాంటిది అని ఓ సంచలన నివేదికలో ఆరోపించింది. హోల్డింగ్ కంపెనీ అయిన వేదాంత రిసోర్సెస్ (వీఆర్ఎల్), భారత అనుబంధ సంస్థను పారసైట్‌లాగా భ్రష్టు పట్టిస్తోందని 85 పేజీల రిపోర్టులో తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'వేదాంత రిసోర్సెస్ ఓ పారసైట్‌లాంటి హోల్డింగ్ కంపెనీ. అదొక పోంజీ స్కీము నడిపిస్తోంది. దానికంటూ చెప్పుకోతగ్గ కార్యకలాపాలేమీ లేవు. భారతీయ విభాగం వేదాంత లిమిటెడ్‌ను (వీఈడీఎల్) కొల్లగొడుతూ బతికేస్తోంది' అని వీఆర్ఎల్ బాండ్లలో షార్ట్ పొజిషన్లు తీసుకున్న వైస్రాయ్ రీసెర్చ్ పేర్కొంది. మాతృ సంస్థకు డివిడెండ్ల రూపంలో వేల కోట్లు సమర్పించుకున్నాక వీఈడీఎల్ దగ్గర నగదు నిల్వలు పూర్తిగా ఖాళీ అయిపోయాయని, ఎక్కడా అప్పు పుట్టే పరిస్థితి కూడా లేకుండా పోయిందని తెలిపింది. ఇంతగా నిధులు వస్తున్నప్పటికీ, వీఆర్ఎల్ వడ్డీ వ్యయాలు వార్షికంగా 200 మిలియన్ డాలర్ల మేర పెరిగినట్లు వివరించింది. కంపెనీ 9–11 శాతం వడ్డీ రేటుతో బాండ్లను ఇష్యూ చేయగా, వడ్డీ భారాన్ని చూస్తుంటే ఏకంగా 15.8 శాతం స్థాయిలో కనిపిస్తోందని నివేదిక తెలిపింది. ఇదంతా చూస్తుంటే ఓ స్థాయిలో ఆర్థిక అవకతవకలు చోటు చేసుకుంటున్నట్లు ఉందని వివరించింది. వేరే ఖర్చులను వడ్డీల రూపంలో మోసపూరితంగా చూపిస్తుండటం, సిసలైన రుణభారం తెలియకుండా అధిక వడ్డీ రేట్లకు స్వల్పకాలిక రుణాలను తీర్చేస్తుండటం, లేదా రుణ రేట్లు .. షరతులను సరిగ్గా వెల్లడించకపోవడంలాంటివి కారణాలుగా ఉండొచ్చని పేర్కొంది.

నిరాధార ఆరోపణలు: వేదాంత గ్రూప్

వార్షిక సర్వ సభ్య సమావేశంలో వేదాంత లిమిటెడ్ చైర్మన్ అనిల్ అగర్వాల్ పాల్గొనడానికి ఒక రోజు ముందు ఈ నివేదిక వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది. రిపోర్టును బైటపెట్టిన సమయం చూస్తే, వైస్రాయ్ రీసెర్చ్ తీరు సందేహాలకు తావిచ్చేదిగా ఉందని వేదాంత గ్రూప్ పేర్కొంది. ఇదంతా నిరాధార ఆరోపణలు, వారికి అనువైన సమాచారాన్ని ఉపయోగించుకుని చేస్తున్న విషపూరిత ప్రచారమని తెలిపింది. వివరణ కోసం వైస్రాయ్ రీసెర్చ్ తమను కనీసం సంప్రదించకుండానే రిపోర్ట్ తయారైందని పేర్కొంది. అయితే, దీనికి వైస్రాయ్ రీసెర్చ్ కౌంటర్ ఇచ్చింది. తమ రిపోర్టును వేదాంత గ్రూప్ తోసిపుచ్చలేదని, ప్రశ్నలేవైనా ఉంటే సమాధానాలివ్వడానికి సిద్ధంగా ఉన్నామని మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

వైస్రాయ్ రీసెర్చ్ రిపోర్ట్ దెబ్బతో వేదాంత షేర్లు బుధవారం బీఎస్ఈలో 6 శాతం పడిపోయింది. తర్వాత కొంత కోలుకుని 3.4 శాతం నష్టంతో రూ. 440.80 వద్ద క్లోజయ్యింది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు నిధులు

బాండ్ల జారీతో రూ. 1,000 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్ బాండ్ల జారీ విజయవంతమైంది. బాండ్ల ఇష్యూ ప్రారంభమైన కొద్ది గంటల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్ లభించింది. వెరసి మార్పిడికి వీలుకాని డిబెంచర్ల(ఎన్‌సీడీలు) జారీ ద్వారా రూ. 1,000 కోట్లు సమీకరించింది. బుధవారం(9న) ప్రారంభమైన ఎన్‌సీడీ ఇష్యూ ఈ నెల 22న ముగియనుంది. అయితే అధిక స్పందన కారణంగా గడువుకంటే ముందుగానే ముగించే వీలున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. నిర్ధారిత(ఫిక్స్‌డ్) వడ్డీ రేటుతో ఇన్వెస్టర్లకు బాండ్లను(ఎన్‌సీడీలు) జారీ చేయడం ద్వారా కంపెనీలు నిధులు సమీకరించే సంగతి తెలిసిందే. అదానీ గ్రూప్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్ తాజాగా 9.3 శాతం వార్షిక వడ్డీతో ఎన్‌సీడీలను ఆఫర్ చేసింది. ఇష్యూకి మధ్యాహ్నానికల్లా రూ. 1,400 కోట్ల విలువైన బిడ్స్ దాఖలైనట్లు స్టాక్ ఎక్స్ఛేంజీల డేటా వెల్లడించింది. ముందుగా వచ్చినవారికి ముందుగా పద్ధతిలో కంపెనీ బాండ్ల ఇష్యూని చేపట్టడం గమనార్హం! ఇది రెండో ఇష్యూకాగా.. కంపెనీ ఇంతక్రితం గతేడాది సెప్టెంబర్‌లోనూ రూ. 800 కోట్ల విలువైన ఎన్‌సీడీలను జారీ చేసింది. రూ. 500 కోట్ల ప్రాథమిక విలువతో ప్రస్తుత ఆఫరింగ్‌ను చేపట్టింది. అధిక స్పందన లభిస్తే మరో రూ. 500 కోట్ల విలువైన బాండ్ల జారీకి వీలుగా గ్రీన్‌షూ ఆప్షన్‌తో ఇష్యూకి తెరతీసింది. ఒక్కో ఎన్‌సీడీ ముఖవిలువ రూ. 1,000కాగా.. ఇన్వెస్టర్లు కనీసం 10 బాండ్లకు దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఇష్యూ నిధుల్లో కనీసం 75 శాతాన్ని రుణ చెల్లింపులకు వినియోగించనుంది. ఎన్‌సీడీలను 24, 36, 60 నెలల గడువుతో జారీ చేస్తోంది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు బీఎస్ఈలో స్వల్ప నష్టంతో రూ. 2,582 వద్ద ముగిసింది.

ఇండిగో వెంచర్స్‌కు పెట్టుబడులు

రూ. 450 కోట్ల నిధుల సమీకరణ



ముంబై: విమానయాన దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ కార్పొరేట్ వెంచర్ క్యాపిటల్ విభాగం ఇండిగో వెంచర్స్ తొలి ఫండ్ ద్వారా రూ. 450 కోట్లు సమీకరించింది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతితో గతేడాది ఆగస్ట్‌లో రూ. 600 కోట్ల సమీకరణ లక్ష్యంగా తొలిసారి ఫండ్‌కు తెరతీసింది. తొలి దశలో రూ. 450 కోట్లు సమకూర్చుకున్నట్లు ఇండిగో వెంచర్స్ తెలియజేసింది. కాగా.. హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటైన ఏరోస్పేస్ స్టార్టప్ జే ఏరోస్పేస్‌లో తొలి పెట్టుబడికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించింది. అయితే పెట్టుబడి వివరాలు వెల్లడించలేదు. నిధులను అడ్వాన్స్‌డ్ డిజిటల్ తయారీ మౌలికసదుపాయాలు, ఏఐ ఆధారిత ఉత్పాదకత పెంపు(ప్రొడక్షన్ ఆప్టిమైజేషన్), సరఫరా చైన్ వ్యవస్థలను ఏకంచేసే ప్లాట్‌ఫామ్స్ అభివృద్ధి, ఇంజినీరింగ్, ప్రొడక్షన్ నిపుణులను ఆకట్టుకోవడం తదితరాలకు వినియోగించనున్నట్లు ఇండిగో వెంచర్స్ వివరించింది. విమానయానం, తత్సంబంధిత రంగాలలో స్టార్టప్‌లకు ప్రాథమిక దశలో పెట్టుబడులను సమకూర్చేందుకు ఇండిగో వెంచర్స్ ఫండ్‌కు తెరతీసింది.

బీఎస్ఈలో ఇండిగో షేరు 0.8 శాతం బలపడి రూ. 5,847 వద్ద ముగిసింది.

యాంథమ్ బయో @ రూ. 540-570

- ఈ నెల 14–16 మధ్య ఐపీవో
- రూ. 3,395 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: ఫార్మా రంగ సీఆర్‌డీఎంవో సర్వీసుల కంపెనీ యాంథమ్ బయోసైన్స్ ఐపీవోకు తాజాగా రూ. 540–570 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 14న ప్రారంభమై 16న ముగియనున్న ఇష్యూలో భాగంగా ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు రూ. 3,395 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. దీంతో ఇష్యూ నిధులు కంపెనీకి లభించవు. పబ్లిక్ ఇష్యూ ధర ప్రకారం కంపెనీ మార్కెట్ విలువ రూ. 31,800 కోట్లుగా నమోదుకానుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 11న షేర్లను కేటాయించనుంది. కొత్త ఆవిష్కరణలపై దృష్టిపెట్టిన కంపెనీ టెక్నాలజీ ఆధారిత కాంట్రాక్ట్ రీసెర్చ్, అభివృద్ధి, తయారీ(సీఆర్‌డీఎంవో) సర్వీసులు అందిస్తోంది. డ్రగ్ డిస్కవరీసహా.. అభివృద్ధి, తయారీ తదితర సమీకృత కార్యకలాపాలు కలిగి ఉంది. అంతేకాకుండా క్లిష్టతరహా ప్రత్యేక ఫెర్మంటేషన్ ఆధారిత ఏపీఐలనూ రూపొందించి విక్రయిస్తోంది. వీటిలో ప్రోబయోటిక్స్, ఎంజైమ్స్, పెప్టయిడ్స్, న్యూట్రిషనల్ యాక్టివ్స్, బయోసిమిలర్స్ ఉన్నాయి. కంపెనీ సేవలందిస్తున్న విభాగంలో సాయి లైఫ్ సైన్సెస్, సింజీన్ ఇంటర్నేషనల్, సువెన్ లైఫ్ సైన్సెస్, దివీస్ ల్యాబొరేటరీస్ తదితర లిస్టెడ్ దిగ్గజాలు పోటీ పడుతున్నాయి. 2006లో ఏర్పాటైన కంపెనీ 2025 మార్చికల్లా రెండు తయారీ కేంద్రాలను నిర్వహిస్తోంది. వీటిలో కర్ణాటకలోని బొమ్మసంద్రలో యూనిట్–1, హరోహళ్లిలో యూనిట్–2 ఉన్నాయి. వీటి ద్వారా వార్షికంగా 270 కిలోలీటర్ల కస్టమ్ సింథసిస్ సామర్థ్యంతోపాటు.. 142 కిలోలీటర్ల ఫెర్మంటేషన్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ యూనిట్లలో చేపట్టిన విస్తరణ కార్యక్రమాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి అర్ధభాగంలో అందుబాటులోకి రానున్నట్లు కంపెనీ అంచనా వేస్తోంది. గతేడాది(2024–25) ఆదాయం 30 శాతం జంప్‌చేసి రూ. 1,844 కోట్లను తాకగా.. నికర లాభం 23 శాతం ఎగసి రూ. 451 కోట్లకు చేరింది.

సీవోఏఐ చైర్‌పర్సన్‌గా వొడా ఐడియా సీవోవో కిషోర్



న్యూఢిల్లీ: టెల్కోల సమాఖ్య సీవోఏఐ చైర్‌పర్సన్‌గా (2025–26 సంవత్సరానికి) వొడాఫోన్ ఐడియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అభిజిత్ కిషోర్ మరోసారి ఎన్నికయ్యారు. భారతి ఎయిర్‌టెల్ చీఫ్ రెగ్యులేటరీ ఆఫీసర్ రాహుల్ వత్స్ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. దేశీయంగా టెలికం పరిశ్రమలో కిషోర్‌కి మూడు దశాబ్దాల అనుభవం ఉంది. వొడాఫోన్ ఐడియాలో సీవోవో బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆయన చీఫ్ ఎంటర్‌ప్రైజ్ బిజినెస్ ఆఫీసర్‌గా వ్యవహరించారు.

ఐపీవోకు ఐసీఐసీఐ ప్రు ఏఎంసీ



సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ) పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా 1.76 కోట్ల ఈక్విటీ షేర్లను యూకే ప్రమోటర్ ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్ విక్రయానికి ఉంచనుంది. కొత్తగా ఈక్విటీ జారీ లేకపోవడంతో ఐపీవో నిధులు ప్రమోటర్లకు చేరనున్నాయి. ప్రయివేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ అనుబంధ సంస్థ ఇది. ఈ భాగస్వామ్య సంస్థలో ఐసీఐసీఐ బ్యాంక్ వాటా 51 శాతంకాగా.. ప్రుడెన్షియల్ కార్పొరేషన్‌కు 49 శాతం వాటా ఉంది. కాగా.. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీలో 2 శాతం అదనపు వాటా కొనుగోలుకి బోర్డు అనుమతించినట్లు మాతృ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్ తాజాగా వెల్లడించింది. తద్వారా సంస్థలో మెజారిటీ వాటాను నిలుపుకోనున్నట్లు తెలియజేసింది. ఐపీవో ద్వారా దేశీయంగా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన ఐదో అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ నిలవనుంది.

బీఎస్ఈలో ఐసీఐసీఐ బ్యాంక్ షేరు 0.7 శాతం నష్టంతో రూ. 1432 వద్ద ముగిసింది.

డీల్స్ డీలా



- అనిశ్చితి ఎఫెక్ట్
- జూన్ త్రైమాసికంలో విలీనాలు, పీఈ ఒప్పందాలు 48 శాతం డౌన్
- 17 బిలియన్ డాలర్లకు పరిమితం
- గ్రాంట్ థార్న్‌టన్ భారత్ నివేదిక

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా అనిశ్చితి పెరిగిపోతుండటం, పెట్టుబడుల విషయంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తుండటం తదితర అంశాల నేపథ్యంలో ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో విలీనాలు, కొనుగోళ్ల (ఎంఅండ్ఏ), ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) డీల్స్‌పై ప్రభావం పడింది. లావాదేవీలు ఏకంగా 48 శాతం పడిపోయాయి. 17 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. పరిమాణంపరంగా 2025 తొలి త్రైమాసికంతో పోల్చి చూస్తే రెండో త్రైమాసికంలో ఎంఅండ్ఏ, పీఈ డీల్స్ 13 శాతం క్షీణించి 582కి పరిమితమయ్యాయి. 2023 రెండో క్వార్టర్ తర్వాత త్రైమాసికాలవారీగా డీల్ విలువ ఇంత తక్కువగా నమోదు కావడం ఇదే ప్రథమం. కన్సల్టెన్సీ సంస్థ గ్రాంట్ థార్న్‌టన్ భారత్ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఇరాన్–ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు, అనిశ్చితి, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, పెరుగుతున్న బంగారం ధరలు మొదలైన భౌగోళికరాజకీయాంశాల వల్ల ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీనపడింది. అయితే, మందగమనంలోనూ ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులు నిలకడగా వస్తుండటం, కొత్త యూనికార్న్‌లు ఆవిర్భవిస్తుండటం మొదలైనవి సానుకూలాంశాలని గ్రాంట్ థార్న్‌టన్ భారత్ పార్ట్‌నర్ (గ్రోత్) శాంతి విజేత తెలిపారు. మౌలిక సదుపాయాలు, బ్యాంకింగ్‌లాంటి రంగాలపై ఇన్వెస్టర్లు ఆసక్తి కనపరుస్తున్నారని వివరించారు.

నివేదికలో మరిన్ని విశేషాలు..

- జూన్ త్రైమాసికంలో 5.4 బిలియన్ డాలర్ల విలువ చేసే 197 ఎంఅండ్ఏ లావాదేవీలు నమోదయ్యాయి. 2023 క్యూ2 తర్వాత ఇది కనిష్ట స్థాయి. తాజా క్యూ2లో బిలియన్ డాలర్ డీల్ ఒకే ఒక్కటి (యస్ బ్యాంక్‌లో సుమితోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ 1.57 బిలియన్ డాలర్ల పెట్టుబడి) నమోదైంది. 2025 క్యూ1లో ఇలాంటి డీల్స్ నాలుగు ఉన్నాయి.
- పీఈ కార్యకలాపాలు, గత త్రైమాసికంతో పోలిస్తే తగ్గినప్పటికీ 2022 నాలుగో త్రైమాసికం తర్వాత అత్యధిక స్థాయిలో 7.5 బిలియన్ డాలర్ల విలువ చేసే 357 డీల్స్ నమోదయ్యాయి.
- క్యూ2లో పబ్లిక్ మార్కెట్ ద్వారా నిధుల సమీకరణ పెద్దగా జరగలేదు. వరుసగా మూడో త్రైమాసికంలోనూ ఐపీవో కార్యకలాపాలు నెమ్మదించాయి. జూన్ త్రైమాసికంలో కంపెనీలు 12 ఐపీవోల ద్వారా 1.9 బిలియన్ డాలర్లు సమీకరించాయి. క్రితం త్రైమాసికంతో పోలిస్తే డీల్స్ పరిమాణం 25 శాతం, విలువ 26 శాతం తగ్గింది.
- అయితే, జూన్‌లో పరిస్థితులు కాస్త మెరుగుపడుతున్న సంకేతాలు కనిపించాయి. నెలవారీగా చూస్తే, ఈ ఏడాది మొత్తం మీద అత్యధిక సంఖ్యలో ఐపీవోలు, నిధుల సమీకరణ విషయంలో జూన్ రెండో స్థానంలో నిల్చింది. లీలా హోటల్స్ (407 మిలియన్ డాలర్లు), ఏథర్ ఎనర్జీ (343 మిలియన్ డాలర్లు), ఏజిస్ వొప్యాక్ టెర్మినల్స్ (326 మిలియన్ డాలర్లు) లాంటి పెద్ద లిస్టింగ్‌లు నమోదయ్యాయి.
- దాదాపు క్రితం త్రైమాసికం తరహాలోనే క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్స్‌కి (క్యూఐపీ) సంబంధించి 2.2 బిలియన్ డాలర్ల విలువ చేసే 16 ఇష్యూలు నమోదయ్యాయి.

రంగు వేసుకోవాల్సి వచ్చిందంటే...

రిటైర్మెంట్‌కు సమయం వచ్చినట్లే ● విరాట్ కోహ్లి వ్యాఖ్య





లండన్: ఇంగ్లండ్ పర్యటన ఆరంభానికి కొద్దిరోజుల ముందు విరాట్ కోహ్లి టెస్టు క్రికెట్‌కు అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇంకా ఎంతో ఆడగలిగే సత్తా ఉండి కూడా తప్పుకోవడం పట్ల అన్ని వైపుల నుంచి ఆశ్చర్యం వ్యక్తమైంది. ఇప్పుడు దీనికి సంబంధించి స్వయంగా కోహ్లి హాస్యోక్తంగా జవాబిచ్చాడు. మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ ఫౌండేషన్ నిధుల సేకరణ కార్యక్రమంలో అతను పాల్గొన్నాడు. మైదానంలో కోహ్లి లేని లోటు కనిపిస్తోందంటూ వ్యాఖ్యాత చెప్పడంతో దానికి స్పందిస్తూ అతను తన రిటైర్మెంట్‌పై సరదా వ్యాఖ్య చేశాడు. 'నా గడ్డానికి రెండు రోజుల క్రితమే రంగు వేసుకున్నాను. ప్రతీ నాలుగు రోజులకు ఒకసారి ఇలా గడ్డానికి రంగు వేసుకోవాల్సి వస్తోందంటేనే మీరు ప్రశాంతంగా విశ్రాంతి తీసుకునే సమయం వచ్చిందని అర్థం చేసుకోవాలి' అని విరాట్ అన్నాడు. **ప్రస్తుతం కోహ్లి లండన్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్నాడు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రవిశాస్త్రిని ఉద్దేశించి మాట్లాడిన కోహ్లి అతనితో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నాడు. 'భారత జట్టు టెస్టుల్లో సాధించిన కొన్ని ఘనతలు రవిశాస్త్రి** సహకారం లేకపోతే సాధ్యం కాకపోయేవి. మేమిద్దరం ఎంతో స్పష్టతతో కలిసికట్టుగా నిర్ణయాలు తీసుకున్నాం. మీడియా సమావేశాల్లో కఠిన ప్రశ్నలు తనే ఎదుర్కొంటూ నాకు కూడా కీలక సమయాల్లో ఆయన ఎంతో అండగా నిలిచారు. అందుకే ఆయనంటే నాకు ఎంతో గౌరవం. నా కెరీర్ ప్రయాణంలో రవిశాస్త్రికి కూడా ప్రధాన పాత్ర ఉంది' అని **కోహ్లి చెప్పాడు. గత 15** ఏళ్ల కాలంలో భారత **జట్టుపై అత్యంత ప్రభావం** చూపించిన ఆటగాడిగా కోహ్లి నిలిచాడని రవిశాస్త్రి కితాబిచ్చాడు.

స్టార్లు హాజరు...

యువరాజ్ సింగ్‌కు చెందిన 'యు వి కెన్' ఫౌండేషన్ నిధుల సేకరణ కార్యక్రమం లండన్‌లో పెద్ద స్థాయిలో జరిగింది. భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన కుటుంబంతో సహా దీనికి హాజరయ్యాడు. కోహ్లితో పాటు పలువురు దిగ్గజాలు బ్రియాన్ లారా, క్రిస్ గేల్, కెవిన్ పీటర్సన్ తదితరులు కూడా ఇందులో పాల్గొన్నారు. శుబ్‌మన్ గిల్ సారథ్యంలో భారత క్రికెట్ టీమ్ సభ్యులంతా కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. టీమిండియా ఆటగాళ్లు అక్కడి నుంచి నిష్క్రమించిన తర్వాతే కోహ్లి వచ్చాడు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత, మాజీ ఆటగాళ్లంతా ఎన్నో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. కీపర్ రిషభ్ పంత్ పాల్గొన్న వేలం ఇక్కడ హైలైట్‌గా నిలిచింది. కళాకృతులతో ప్రత్యేకంగా రూపొందించిన ఒక బ్యాట్‌ను భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు అందించే అవకాశం కోసం వేలం జరిగింది. అక్కడికి వచ్చిన అతిథులతో వేలంలో పోటీ పడిన పంత్ 17 వేల పౌండ్లకు (సుమారు రూ.20 లక్షలు) ఆ చాన్స్‌ను దక్కించుకోవడం విశేషం. ఈ కార్యక్రమం ద్వారా యువరాజ్ ఫౌండేషన్‌కు సుమారు రూ.12 కోట్ల నిధులు వచ్చాయి.

ఆగస్టు 29 నుంచి ప్రొ కబడ్డీ లీగ్



ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్ ఈ ఏడాది ఆగస్టు 29 నుంచి ప్రారంభం కానుంది. ఇటీవల పీకేఎల్ వేలం ముగియగా... అన్ని ఫ్రాంచైజీలు జట్లను సిద్ధం చేసుకున్నాయి. త్వరలోనే వేదికలతో పాటు సీజన్ షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. '12 ఫ్రాంచైజీలు వేలంలో తమ తమ జట్లను బలోపేతం చేసుకున్నాయి. 12వ సీజన్ కోసం అన్నీ జట్లు సమాయత్తమవుతున్నాయి. గతం కంటే మరింత రసవత్తరంగా మ్యాచ్‌లు జరగడం ఖాయం' అని నిర్వాహకులు వెల్లడించారు. మే 31, జూన్ 1న ముంబై వేదికగా పీకేఎల్ వేలం పాట జరగగా... రికార్డు స్థాయిలో 10 మంది ఆటగాళ్లు కోటి రూపాయాల కంటే ఎక్కువ ధర దక్కించుకున్నారు. వచ్చే నెల ఆఖరులో ప్రారంభం కానున్న పీకేఎల్‌లో హర్యానా స్టీలర్స్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది. ఇక గత సీజన్‌లో 22 మ్యాచ్‌లాడిన తెలుగు టైటాన్స్... 12 విజయాలు, 10 పరాజయాలతో పట్టికలో ఏడో స్థానానికి పరిమితమైంది.

భారత్ తొలి ప్రత్యర్థి నమీబియా

హాకీ జూనియర్ మహిళల వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల

లుసానే (స్విట్జర్లాండ్): మహిళల జూనియర్ వరల్డ్ కప్ హాకీ తొలి మ్యాచ్‌లో భారత జట్టు నమీబియాతో తలపడుతుంది. చిలీ రాజధాని సాంటియాగోలో డిసెంబర్ 1 నుంచి జరిగే ఈ టోర్నీలో భాగంగా తొలి రోజే భారత్ తమ మొదటి మ్యాచ్ ఆడుతుంది. అదే రోజు జర్మనీ, ఐర్లాండ్ మధ్య జరిగే మ్యాచ్‌లో టోర్నీ మొదలు కానుండగా... మూడో మ్యాచ్ ఆతిథ్య జట్టు చిలీ, నెదర్లాండ్స్ మధ్య జరుగుతుంది. డిసెంబర్ 13 వరకు నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో మొత్తం 24 జట్లు బరిలోకి దిగుతున్నాయి. టీమ్‌లను 6 గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'సి'లో భారత్‌తో పాటు నమీబియా, జర్మనీ, ఐర్లాండ్ ఉన్నాయి. నెదర్లాండ్స్, జపాన్, చిలీ, మలేసియా, అర్జెంటీనా, బెల్జియం, జింబాబ్వే, వేల్స్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, చైనా, ఆస్ట్రియా, ఆస్ట్రేలియా, స్పెయిన్, కెనడా, స్కాట్లాండ్, అమెరికా, కొరియా, న్యూజిలాండ్, ఉరుగ్వే జట్లు ఈ వరల్డ్ కప్‌లో ఆడనున్నాయి.

టెన్నిస్‌కు ఫాగ్‌నిని వీడ్కోలు



లండన్: ప్రొఫెషనల్ టెన్నిస్ నుంచి వైదొలుగుతున్నట్లు ఇటలీ టెన్నిస్ స్టార్ ఫాబియో ఫాగ్‌నిని ప్రకటించాడు. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫాగ్‌నిని తొలి రౌండ్‌లో ఓడిపోయాడు. డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కరాజ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో 38 ఏళ్ల ఫాగ్‌నిని ఐదు సెట్‌లు పోరాడాడు. ఈ ఏడాది చివర్లో ఆటకు గుడ్‌బై చెప్పాలని ఫాగ్‌నిని అనుకున్నాడు. అయితే ఈ సీజన్‌లో వరుసగా పది పరాజయాలు ఎదురు కావడంతో వింబుల్డన్ టోర్నీ సందర్భంగానే అతను రిటైర్మెంట్ ప్రకటనను జారీ చేశాడు. 'ఆటకు గుడ్‌బై చెప్పాక ఏం చేస్తానో ఇప్పుడే చెప్పలేను. ప్రస్తుతం మాత్రం కుటుంబంతో గడుపుతాను' అని కెరీర్‌లో 9 సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన ఫాగ్‌నిని తెలిపాడు. 2019లో మోంటెకార్లో మాస్టర్స్ సిరీస్ టైటిల్ నెగ్గిన ఫాగ్‌నిని అదే ఏడాది కెరీర్ బెస్ట్ 9వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. 2015 యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ చాంపియన్ ఫ్లావియా పెనెట్టా (ఇటలీ)ను పెళ్లి చేసుకున్న ఫాగ్‌నిని తన 20 ఏళ్ల కెరీర్‌లో మొత్తం 63 గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడాడు. 2011 ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరుకోవడమే గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో అతని అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన. ప్రస్తుతం ఫాగ్‌నిని 138వ ర్యాంక్‌లో ఉన్నాడు.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో శుబ్‌మన్ గిల్

మళ్లీ వరల్డ్ నంబర్‌వన్‌గా హ్యారీ బ్రూక్

దుబాయ్: ఇంగ్లండ్ జట్టుతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో పరుగుల వరద పారిస్తున్న భారత జట్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్... అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధించాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో గిల్ ఏకంగా 15 స్థానాలు ఎగబాకాడు. కెరీర్‌లో తొలిసారి టాప్-10లోకి దూసుకొచ్చాడు. 24 ఏళ్ల గిల్ 807 రేటింగ్ పాయింట్లతో కెరీర్ బెస్ట్ 6వ ర్యాంక్‌లో నిలిచాడు. ఇంగ్లండ్‌తో బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టులో గిల్ తొలి ఇన్నింగ్స్‌లో 269 పరుగులు... రెండో ఇన్నింగ్స్‌లో 161 పరుగులు చేశాడు. మరోవైపు 858 రేటింగ్ పాయింట్లతో భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. రిషభ్ పంత్ ఒక స్థానం పడిపోయి ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్నాడు.

ఏడు నెలల తర్వాత...

ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ ఏడు నెలల తర్వాత మళ్లీ వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. భారత్‌తో రెండో టెస్టుకు ముందు రెండో ర్యాంక్‌లో ఉన్న బ్రూక్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 886 రేటింగ్ పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు.


బ్రూక్


గిల్

బర్మింగ్‌హామ్ టెస్టులో బ్రూక్ తొలి ఇన్నింగ్స్‌లో 158 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 23 పరుగులు చేశాడు. గత డిసెంబర్‌లో బ్రూక్ తొలిసారి నంబర్ వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. అగ్రస్థానంలో ఉన్న ఇంగ్లండ్‌కే చెందిన జో రూట్ 868 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. న్యూజిలాండ్ స్టార్ కేన్ విలియమ్సన్ 867 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు.



'వింబుల్డన్' వీక్షణలో భారత క్రికెటర్లు

ప్రతిష్ఠాత్మక గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ వింబుల్డన్‌ను వీక్షించేందుకు టీమిండియా క్రికెటర్లు 'క్యూ' కడుతున్నారు. లండన్‌లోని ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో తమ అభిమాన ప్లేయర్ల ఆటను ఆస్వాదిస్తున్నారు. భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి భార్య అనుష్క శర్మతో కలిసి జొకోవిచ్ మ్యాచ్‌కు హాజరు కాగా... టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి, రిషభ్ పంత్, జస్‌ప్రీత్ బుమ్రా టెన్నిస్ మ్యాచ్‌లను వీక్షించారు. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం ప్రస్తుతం భారత క్రికెట్ జట్టు ఇంగ్లండ్‌లో పర్యటిస్తుండగా... వీలు కుదిరినప్పుడు టీమిండియా ప్లేయర్లు టెన్నిస్ మ్యాచ్‌లు వీక్షిస్తున్నారు. శస్త్రచికిత్స కోసం లండన్‌లో ఉన్న భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, దీపక్ చాహర్ సతీ సమేతంగా వింబుల్డన్ టోర్నీ మ్యాచ్‌లను వీక్షించారు.

భారీ విజయంతో బోణీ


ఉత్తమ్ సింగ్

ఎయిండ్‌హోవెన్ (నెదర్లాండ్స్): యూరోప్ పర్యటనను భారత 'ఎ' పురుషుల హాకీ జట్టు భారీ విజయంతో ప్రారంభించింది. ఐర్లాండ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 'ఎ' 6-1 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున ఉత్తమ్ సింగ్, అమన్‌దీప్ లాక్రా, సెల్వం కార్తీ, బాబీ సింగ్ ధామి ఒక్కో గోల్ చేయగా... ఆదిత్య లలాగే రెండు గోల్స్ సాధించాడు. ఈ పర్యటనలో రెండో మ్యాచ్‌లోనూ ఐర్లాండ్‌తోనే భారత్ తలపడుతుంది. అనంతరం ఫ్రాన్స్, ఇంగ్లండ్, బెల్జియం, నెదర్లాండ్స్ జట్లతో భారత్ పోటీపడుతుంది.

జాస్మిన్‌పై నిషేధం



న్యూఢిల్లీ: భారత షాట్‌పుట్ క్రీడాకారిణి జాస్మిన్ కౌర్ డోప్ పరీక్షలో విఫలమైంది. నిషేధిత ఉత్ప్రేరకాలు వినియోగించినందుకు ఆమెపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) తాత్కాలిక నిషేధం విధించింది. 22 ఏళ్ల జాస్మిన్ కౌర్ ఈ ఏడాది డెహ్రాడూన్ వేదికగా జరిగిన జాతీయ క్రీడల్లో పసిడి పతకం సాధించింది. ఆమె ఇనుప గుండును 15.97 మీటర్లు విసిరింది. పంజాబ్‌కు చెందిన జాస్మిన్ గతేడాది ఇంటర్ యూనివర్సిటీ క్రీడల్లో రెండో స్థానంలో నిలిచింది. మరోవైపు అండర్-20 రెజ్లింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్ రజత పతక విజేత నీతికపై నాలుగేళ్ల నిషేధం పడింది. ఆమెపై విధించిన నిషేధం గతేడాది మే 28 నుంచి అమల్లోకి వచ్చినట్లు 'నాడా' వెల్లడించింది.

ఇక చాలు!

రెడ్‌బుల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బాధ్యతల నుంచి హార్నర్‌కు ఉద్వాసన ● 20 ఏళ్లుగా జట్టుతో మమేకం



మిల్టన్ కీన్స్ (ఇంగ్లండ్): సుదీర్ఘ కాలంగా ఫార్ములా వన్ (ఎఫ్1) రెడ్‌బుల్ టీమ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న క్రిస్టియన్ హార్నర్‌ను ఆ జట్టు అర్ధాంతరంగా తప్పించింది. 20 సంవత్సరాలుగా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ... 8 సార్లు డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్స్ గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించిన హార్నర్‌ను తొలగిస్తున్నట్లు రెడ్‌బుల్ బుధవారం ప్రకటించింది. అతడి సేవలకు ధన్యవాదాలు తెలిపిన రెడ్‌బుల్ యాజమాన్యం తప్పించడం వెనుక ఉన్న కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. 'అతడు మా జట్టు చరిత్రలో ఎప్పటికీ ఒక ముఖ్యమైన వ్యక్తే' అని ఏకవాక్య ప్రకటన విడుదల చేసింది. హార్నర్ చీఫ్‌గా ఉన్న సమయంలో రెడ్‌బుల్ జట్టు 405 రేసుల్లో పాల్గొని 124 విజయాలు సాధించింది. 8 డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్స్, 6 కన్‌స్ట్రక్టర్స్ టైటిల్స్ గెలుచుకుంది. హార్నర్ స్థానంలో రెడ్‌బుల్ జట్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా తమ సొంత జట్టు రేసింగ్ బుల్స్‌కు చెందిన లారెంట్ మెకీస్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ నెల 27న జరగనున్న బెల్జియం గ్రాండ్‌ప్రితో మెకీస్ జట్టు బాధ్యతలు అందుకోనున్నాడు. 'రేసింగ్ బుల్స్ జట్టు స్ఫూర్తి అద్భుతమైంది. ఇది కేవలం ప్రారంభమే అని బలంగా విశ్వసిస్తున్నా. రెడ్‌బుల్ అప్పగించిన బాధ్యతలను అందుకునేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. సవాలుతో కూడుకున్నదే అయినా నా వంతు కృషి చేస్తా. డ్రైవర్లకు సహాయ సహకారాలు అందిస్తూ వారిని సరైన దిశలో నడిపించడమే నా బాధ్యత' అని మెకీస్ ఒక ప్రకటనలో తెలిపాడు. అయితే అతడు ఇందులో కనీసం హార్నర్ పేరును ప్రస్తావించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇక మెకీస్ స్థానంలో అలాన్ పెర్మనే రేసింగ్ బుల్స్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందాడు.

ఆది నుంచి అతడే...

రెడ్‌బుల్ జట్టు తొలిసారి 2005లో ఫార్ములావన్‌లో అడుగు పెట్టగా... అప్పటి నుంచి హార్నర్ టీమ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తూ వస్తున్నాడు. ఇటీవల బ్రిటన్ గ్రాండ్‌ప్రిలో సైతం హార్నర్ తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాడు. రెడ్‌బుల్ జట్టుకు చెందిన సెబాస్టియన్ వెటెల్, వెర్‌స్టాపెన్ వరుసగా నాలుగుసార్లు సార్లు చొప్పున డ్రైవర్స్ చాంపియన్‌షిప్ సాధించడం వెనక హార్నర్ కీలకంగా వ్యవహరించాడు. ఈ సీజన్‌లో మెక్‌లారెన్ డ్రైవర్లు సత్తా చాటుతుండగా... డిఫెండింగ్ చాంపియన్ వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక జట్ల విషయానికి వస్తే రెడ్‌బుల్ నాలుగో స్థానంలో ఉంది. ఇటీవల బ్రిటన్ గ్రాండ్‌ప్రి సందర్భంగా... వచ్చే ఏడాది రెడ్‌బుల్‌తో కొనసాగడంపై ఇప్పుడే స్పష్టత ఇవ్వలేనని వెర్‌స్టాపెన్ వెల్లడించిన నేపథ్యంలో... ఆ జట్టు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో రెడ్‌బుల్ జట్టు నుంచి వైదొలుగుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. కారు రూపకల్పనలో నిష్ణాతుడైన అడ్రియన్ రెడ్‌బుల్‌ను వీడి ఆస్టన్ మార్టిన్ జట్టుతో చేరగా... స్పోర్టింగ్ డైరెక్టర్ జొనాథన్ వెట్లీ సాబెర్‌కు మారాడు. ఇక గత సీజన్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయిన పెరెజ్‌ను రెడ్‌బుల్ జట్టు వదిలేసుకుంది. అతడి స్థానంలో లియామ్ లాసన్‌ను ఎంచుకుంది.

32 ఏళ్ల వయసులోనే...

1997లో డ్రైవర్‌గా కెరీర్ ప్రారంభించిన హార్నర్ 2005లో రెడ్‌బుల్ బాధ్యతలు చేపట్టే నాటికి అతడి వయసు కేవలం 32 సంవత్సరాలే. పిన్న వయసులోనే పెద్ద బాధ్యతలు అందుకున్న హార్నర్ రెండు దశాబ్దాల పాటు వాటిని సమర్థవంతంగా నిర్వర్తించాడు. ఆరంభంలో 'పార్టీ టీమ్'గా ముద్ర పడ్డ జట్టును... వరుస విజయాలు సాధించే స్థాయికి తీసుకొచ్చాడు. హార్నర్ హయాంలో 2009లో తొలిసారి రెడ్‌బుల్ డ్రైవర్ వెటల్ చైనా గ్రాండ్ ప్రిలో విజయం సాధించగా... ఆ తర్వాత 2010 నుంచి వరుసగా నాలుగేళ్ల పాటు అతడు డ్రైవర్స్ చాంపియన్‌గా నిలిచాడు. 2016లో రెడ్‌బుల్ తరఫున మ్యాక్స్ వెర్‌స్టాపెన్ అరంగేట్రం చేయగా... ట్రాక్‌పై అడుగుపెట్టిన తొలి రేసు స్పానిష్ గ్రాండ్ ప్రిలో విజేతగా నిలిచిన ఈ ఘనత సాధించిన పిన్న వయస్కుడి (18 సంవత్సరాలు)గా రికార్డు సృష్టించాడు. 2019లో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన 'డ్రైవ్ టు సర్వైవ్' తొలి సీజన్ హార్నర్‌కు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చింది.





స్విమ్మింగ్ పూలే ఆఫీసు

సిబ్బంది ఒత్తిడిని దూరం చేయడం కోసం కొన్ని సంస్థలు ఆఫీసులోనే జిమ్, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తుంటాయి. కానీ.. ఓ చైనీస్ కంపెనీ మాత్రం.. స్విమ్మింగ్ పూల్‌నే ఆఫీసుగా మార్చేసింది. ఆఫీస్‌గా మారిన పూల్ ఫొటోలు, వీడియోలు.. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. స్విమ్మింగ్ పూల్ చుట్టూ.. ఫ్లోర్ సాకెట్లు, ఎక్స్‌టెన్షన్ కేబుళ్లతో ఉన్న వర్క్‌స్టేషన్ ఇప్పుడు ఉద్యోగుల భద్రత గురించి ఆందోళనలు రేకెత్తించడంతో చివరకు ఖాళీ చేయాల్సి వచ్చింది. చైనాకు చెందిన లుబాన్ డెకరేషన్ గ్రూప్ అనే డెకరేషన్ కంపెనీ ఖాళీగా ఉన్న ఈత కొలనును తాత్కాలిక వర్క్‌స్పేస్‌గా మార్చింది. జిమ్ పక్కన ఉన్న గాజు తలుపు నుంచి పూల్ ఆఫీస్‌లోకి వస్తారు. పూల్‌లో ఉన్న సైడ్ నిచ్చెనలు ఉపయోగించి తమ డెస్క్ దగ్గరకు వెళ్తారు. అలాగే.. వాటి ద్వారా తిరిగి బయటికి వస్తారు. సిబ్బంది రెండు నెలలుగా అక్కడ పనిచేస్తున్నారు. ఈ విచిత్రమైన సెటప్‌కు సంబంధించిన వీడియో ఒకటి సిబ్బంది ఆన్‌లైన్‌లో పెట్టడంతో చర్చనీయాంశమైంది. ఉద్యోగులు తన డెస్క్ నుండి కిందికి చూస్తే, కనిపించే పూల్ లేన్ గుర్తుల కారణంగా వారు చిన్న డైవింగ్ ట్యాంక్‌లో ఉన్నట్లు అనిపిస్తుంది. తాము ఒక సైన్స్ ఫిక్షన్ సినిమాలో ఉన్నట్లు అనిపిస్తుందని, వింతగా ఉన్నప్పటికీ బాగుందని తెలిపారు. కొందరు ఇది సృజనాత్మకంగా ఉందంటే.. మరికొందరేమో ఉద్యోగుల భద్రత గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఏదైనా అత్యవసర సమయాల్లో తరలింపు మార్గాలు లేకపోవడం, అవసరమైన అగ్నిమాపక భద్రతా లక్షణాలు లేకపోవడం ఆన్‌లైన్‌లో చర్చకు దారితీసింది. పూల్ ప్రాంతంలో పనిచేసే ఉద్యోగుల భద్రత గురించి ఆందోళనలు తలెత్తాయి. 'ఈ కార్యాలయ సెటప్ నిజంగా ప్రత్యేకమైనది. మీరు నిర్లక్ష్యంగా ఉంటే మాత్రం కష్టమే' అని కొందరు, 'ఈ కార్యాలయం ట్రెండీగా కనిపించవచ్చు, కానీ తేమ వల్ల రుమాటిజం రావచ్చు. లోతైన చివరలో ఎక్కువ గంటలు కూర్చోవడం వల్ల కీళ్ళకు నష్టం జరుగుతుంది' అని మరికొందరు హెచ్చరించారు. అయితే.. ఆఫీస్ పునరుద్ధరణ కారణంగా పూల్‌కు మార్చామని, ఈ సెటప్ తాత్కాలిక పరిష్కారమేనని సంస్థ తెలిపింది. అయినప్పటికీ.. కంపెనీ తాత్కాలిక కార్యాలయాన్ని పరిశీలించిన స్థానిక అగ్నిమాపక విభాగం ఆ స్థలాన్ని ఖాళీ చేయించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్


ఈత కొలను ప్రాంతంలో ఏర్పాటైన ఆఫీసు


రాజుగారి విందు


బ్రిటన్ రాజు చార్లెస్-3 మంగళవారం విండ్సర్ కోటలో ఏర్పాటు చేసిన విందు ఇది. కార్యక్రమానికి బ్రిటన్ ప్రధాని స్టార్మర్ దంపతులు, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ దంపతులు హాజరయ్యారు.

3,500 ఏళ్లనాటి పురాతన నగరం

పెరూ పురాతన నాగరికతకు నిలయం. ముఖ్యంగా మచుపిచు వంటి ప్రదేశాలకు ప్రసిద్ధి చెందింది. ఇది వివిధ జాతుల సమూహాల మిశ్రమం. అలాంటి పెరూలో మరో ప్రాముఖ్యత వెలుగులోకి వచ్చింది. పురావస్తు శాస్త్రవేత్తలు.. పెరూలోని ఉత్తర బరాంకా ప్రావిన్స్‌లో ఒక పురాతన నగరాన్ని కనుగొన్నారు. ఇది 3,500 సంవత్సరాల పురాతనమైన పెనికో అనే నగరంగా గుర్తించారు. పసిఫిక్ తీరప్రాంతంలో ఆదిమ సమాజాలను ఆండీస్ పర్వతాలు, అమెజాన్ బేసిన్‌లో నివసించే వారితో అనుసంధానించే కీలక వాణిజ్య కేంద్రంగా ఇది పనిచేసిందని నమ్ముతున్నారు. లిమాకు ఉత్తరాన 200 కి.మీ దూరంలో ఉన్న ఈ ప్రదేశం సముద్ర మట్టానికి దాదాపు 600 మీటర్ల ఎత్తులో ఉంది. ఇది మధ్యప్రాచ్యం, ఆసియాలో ఆదిమ నాగరికతలు అభివృద్ధి చెందుతున్న సమయంలో క్రీస్తుపూర్వం 1,800–1,500 మధ్య స్థాపించిందై ఉంటుందని భావిస్తున్నారు.

ఈ నగరానికి సంబంధించిన డ్రోన్ ఫుటేజీను కూడా పరిశోధకులు విడుదల చేశారు. ఇందులో నగర కేంద్రంలోని కొండవాలు టెర్రస్‌పై వృత్తాకార నిర్మాణం కనిపిస్తోంది. దాని చుట్టూ రాతి, మట్టి భవనాల అవశేషాలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో ఎనిమిదేళ్లపాటు పరిశోధన చేసిన శాస్త్రవేత్తలు 18 నిర్మాణాలను వెలికితీశారు. వాటిలో దేవాలయాలు, ఇళ్లు కూడా ఉన్నాయి. భవనాల్లో పండుగలకు ఉపయోగించే వస్తువులు, మనుషులు, జంతువుల బొమ్మలు, మట్టి శిల్పాలు, పూసలు, సముద్రపు గవ్వలతో తయారు చేసిన హారాలు ఉన్నాయి. పెరూలోని సూప్ లోయలో 5వేల ఏళ్లకిందటి అమెరికా ఖండాల్లో అత్యంత పురాతనమైన నాగరికతగా గుర్తింపు పొందిన కారల్ ఉన్న ప్రదేశానికి సమీపంలో పెనికో ఉంది. ఇక, కారల్‌లో 32 స్మారక చిహ్నాలు ఉన్నాయి. వాటిలో పెద్ద పిరమిడ్ నిర్మాణాలు, అధునాతన నీటిపారుదల పద్ధతులు, వ్యవసాయం, పట్టణ స్థావరాలు ఉన్నాయి. ఇది భారత్, ఈజిప్ట్, సుమేరియా, చైనాలోని ఇతర ఆదిమ నాగరికతల సమయంలోనే విడిగా అభివృద్ధి చెందిందని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. వాతావరణ మార్పుల వల్ల కారల్ నాగరికత క్షీణించిన తర్వాత దాని పరిస్థితి ఏమిటనేది అర్థం చేసుకోవడానికి పెనికో ఆవిష్కరణ పనికొస్తుందని 1990లలో పెనికోపై ఇటీవలి పరిశోధనలు, కారల్ తవ్వకాలకు నాయకత్వం వహించిన పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ రూత్ షాడీ తెలిపారు. సముద్ర తీరంలో, ఎత్తైన ప్రాంతంలో ఉన్న పెనికో.. ఆ కాలంలో అడవుల్లో జీవిస్తున్న సమాజాల ప్రజల వాణిజ్యానికి, వస్తు మార్పిడికి ఉపయోగించే విధంగా వ్యూహాత్మక ప్రదేశంలో ఉందని చెప్పారు.

– సాక్షి, నేషనల్ డెస్క్


తవ్వకాల్లో బయటపడ్డ నగరం ఆనవాళ్లు

'గగన్‌యాన్' హాట్‌టెస్టులు విజయవంతం

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ ప్రాజెక్టులో మరో ముందడుగు పడింది. గగన్‌యాన్ సర్వీసు మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్(ఎస్ఎంపీఎస్)కు ఇస్రో రెండు హాట్‌టెస్టులు విజయవంతంగా నిర్వహించింది. కర్ణాటక రాష్ట్రం మహేంద్రగిరిలోని ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో ఈ నెల 3న ఈ పరీక్షలు జరిగాయి. మొదటి టెస్టు 30 సెకండ్లు, రెండో టెస్టు 100 సెకండ్లలో పూర్తయినట్లు ఇస్రో బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. త్వరలో పూర్తి వ్యవధి పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొంది. గగన్‌యాత యాత్రను 2027లో ప్రారంభించే అవకాశం ఉంది.

12మంది మావోయిస్టులు లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో బుధవారం 12 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 9 మందిపై మొత్తం రూ.28.50 లక్షల రివార్డుంది. రూ.8 లక్షల నగదు రివార్డు కలిగిన కీలక నేత చంద్రన్న అలియాస్ బుర్సు పునెమ్ కూడా ఉన్నాడని ఎస్పీ గౌరవ్‌రాయ్ వెల్లడించారు. ఇతడు బస్తర్ డివిజన్ కమిటీ సభ్యుడిగా ఉన్నాడన్నారు. దంతెవాడ జిల్లాలో ఇప్పటి వరకు 1,005 మంది మావోయిస్టులు లొంగిపోగా 249 మంది నగదు రివార్డులు కలిగిన ముఖ్య నేతలున్నారని తెలిపారు.

నిమిషా ప్రియకు ఉరిశిక్ష ఆగేనా?

- కేరళ నర్సును ఈ నెల 16న ఉరితీయాలని యెమెన్ అధికారుల నిర్ణయం
- క్షమాభిక్ష కోసం పోరాడుతున్న సామాజిక కార్యకర్తలు
- బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు ప్రయత్నాలు

సనా: అరబ్ దేశం యెమెన్‌లో మాజీ వ్యాపార భాగస్వామిని హత్య చేసిన కేసులో ఉరిశిక్ష పడిన భారతీయ నర్సు నిమిషా ప్రియను కాపాడేందుకు ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఆమెకు ఈ నెల 16న ఉరిశిక్ష అమలు చేయాలని యెమెన్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఇప్పటికే జైలు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు 'సేవ్ నిమిషా ప్రియ కౌన్సిల్' పేరిట స్వచ్ఛంద, సామాజిక కార్యకర్తలు ఆమెను ఉరిశిక్ష నుంచి తప్పించడానికి ఉద్యమిస్తున్నారు. ప్రజల మద్దతు కూడగడుతున్నారు. హత్యకు గురైన మెహదీ కుటుంబం క్షమాభిక్ష ప్రసాదిస్తే శిక్ష నుంచి ఆమె బయటపడే అవకాశం ఉంది. బాధిత కుటుంబానికి బ్లడ్‌మనీ కింద చెల్లించడానికి నిమిషా ప్రియ బంధువులు, మిత్రులు, మద్దతుదారులు రూ.7,35,000 సేకరించారు. మెహదీ కుటుంబం స్పందన కోసం ఎదురు చూస్తున్నామని



'సేవ్ నిమిషా ప్రియ కౌన్సిల్' సభ్యుడు, సామాజిక కార్యకర్త బాబు జాన్ చెప్పారు. ఆమెను ఎలాగైనా రక్షించాలన్నదే తమ ఆశయమని అన్నారు. ఇప్పటికైనా క్షమాభిక్ష ప్రసాదించాలని, ఒక మహిళ ప్రాణాలు కాపాడాలని మెహదీ కుటుంబాన్ని కోరారు. నిమిషా ప్రియకు మద్దతు ప్రకటిస్తూ సోషల్ మీడియాలో చాలామంది పోస్టులు చేస్తున్నారు. ఉరిశిక్ష నుంచి బయటపడి ఆమె క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారు.

నర్సుకు ఎందుకు ఉరిశిక్ష?

కేరళ రాష్ట్రం పాలక్కాడ్ జిల్లాలోని కొల్లెంగోడ్‌కు చెందిన నిమిషా ప్రియ నర్సింగ్ విద్య అభ్యసించింది. మెరుగైన జీవితం కోసం 2008లో యెమెన్ చేరుకుంది. వేర్వేరు ఆసుపత్రుల్లో పని చేసింది. కొంత అనుభవం గడించిన తర్వాత సొంతంగా ఆసుపత్రి నిర్వహించాలన్న ఆలోచనతో 2014లో తలాల్ అబ్దో మెహదీ అనే యెమెన్ పౌరుడిని వ్యాపార భాగస్వామిగా చేర్చుకుంది. సొంత క్లినిక్ ఏర్పాటు చేసింది. యెమెన్ చట్టాల ప్రకారం.. విదేశీయులు వ్యాపారం చేయాలంటే స్థానికులు అందులో తప్పనిసరిగా భాగస్వామిగా ఉండాలి. కొంత కాలం తర్వాత నిమిషా ప్రియ, మెహదీ మధ్య గొడవలు మొదలయ్యాయి. ఆమె ఫిర్యాదు మేరకు 2016లో మెహదీని పోలీసులు అరెస్టు చేశారు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఆమెను బెదిరింపులకు గురిచేశాడు. ఆమె పాస్‌పోర్టు లాక్కున్నాడు. చంపేస్తానని పలుమార్లు హెచ్చరించాడు. 2017లో మెహదీ నీళ్ల ట్యాంక్‌లో శవమై కనిపించాడు. అతడి శరీరం ముక్కలు ముక్కలుగా నరికేసి ఉంది. విషపు ఇంజెక్షన్లు ఇచ్చిన మెహదీని హత్య చేసినట్లు నిమిషా ప్రియాపై పోలీసులు అభియోగాలు మోపారు. అరెస్టు చేసి యెమెన్ రాజధాని సనా సిటీలోని సెంట్రల్ జైలుకు తరలించారు. 2018లో ట్రయల్ కోర్టు ఆమెను దోషిగా తేల్చింది. ఉరిశిక్ష ఖరారు చేసింది. సుప్రీం జ్యుడీషియల్ కౌన్సిల్ సైతం 2023 నవంబర్‌లో ట్రయల్ కోర్టు తీర్పును సమర్థించింది. హౌతీ తిరుగుబాటుదారులు ఆమెకు ఉరిశిక్ష అమలు చేసేందుకు ఈ ఏడాది జనవరిలో అనుమతి ఇచ్చారు. యెమెన్‌లో చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. తమ పౌరుడిని హత్య చేస్తే కోర్టులు మరణశిక్ష విధిస్తాయి.

శిక్ష తప్పే మార్గం ఉందా?

బాధిత కుటుంబ సభ్యులు బ్లడ్‌మనీ(నష్ట పరిహారం కింద నగదు) స్వీకరించి, క్షమాభిక్ష ప్రసాదిస్తే నిమిషా ప్రియకు ఉరిశిక్ష తప్పుతుంది. బ్లడ్‌మనీ ఎంత అనేది బాధిత కుటుంబమే నిర్ణయాల్సి ఉంటుంది. నిమిషా ప్రియ తల్లి కేరళలో ఉంటున్నారు. పనిమనిషిగా జీవనం సాగిస్తున్నారు. తన బిడ్డ ప్రాణాలు కాపాడుకొనేందుకు ఆమె ఇప్పటికే తన ఇల్లు అమ్మేశారు. మెహదీ కుటుంబాన్ని ఒప్పించేందుకు నిమిషా ప్రియ మద్దతుదారులు ప్రయత్నిస్తున్నారు. ఆమెకు ఉరిశిక్ష తప్పించేలా భారత ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలని కోరుతూ సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ బుధవారం విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌కు లేఖ రాశారు. సనా సిటీ ప్రస్తుతం హౌతీ తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉంది. వీరికి ఇరాన్ అండగా నిలుస్తున్న సంగతి తెలిసిందే. ఇరాన్‌ను ఒప్పించి హౌతీ తిరుగుబాటుదారులపై ఒత్తిడి పెంచితే ఉరిశిక్ష ఆగిపోయే అవకాశం ఉందని విదేశాంగ నిపుణులు సూచిస్తున్నారు.

దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి పథకానికి 'ఆధార్' తప్పనిసరి

న్యూఢిల్లీ: దివ్యాంగులకు సంబంధించిన నైపుణ్యాభివృద్ధి పథకం ద్వారా లబ్ధి పొందడానికి ఆధార్ కార్డు సమర్పించడం తప్పనిసరి అని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ స్పష్టంచేసింది. నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఏపీ-ఎస్‌డీపీ)లో చేరాలనుకొనే దివ్యాంగులకు ఆధార్ నెంబర్ తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అదే సమయంలో ఆధార్ కార్డు లేకపోవడం లేదా గుర్తింపు నిర్ధారణ విఫలం కావడం వంటి కారణాలతో అర్హులకు పథకాన్ని నిరాకరించే ప్రసక్తే లేదని వెల్లడించింది. అర్హులందరికీ పథకాన్ని వర్తింపజేస్తామని తెలియజేసింది.

ఢిల్లీ సీఎం నివాస పునర్నిర్మాణ పనుల టెండర్ రద్దు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా అధికార నివాస బంగ్లా పునర్నిర్మాణ పనులు సంబంధించిన పనుల టెండర్లను ప్రభుత్వం రద్దు చేసింది. పరిపాలనాపరమైన కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం వివరించింది. ఢిల్లీ సీఎంకు రాజ్‌నివాస్ మార్గ్‌లో పీడబ్ల్యూడీకి చెందిన రెండు బంగ్లాలను కేటాయించారు. ఇందులో ఒకదానిని నివాసంగా, మరో బంగ్లాను క్యాంప్ ఆఫీసుగా వాడుకుంటున్నారు. అధికారిక నివాసానికి రూ.60 లక్షలతో తలపెట్టిన 14 ఏసీలు, పలు టీవీ సెట్లు, ఇతర ఎలక్ట్రికల్ పరికరాల అమరిక పనులకు సంబంధించిన టెండర్‌ను తాజాగా నిలిపివేశారు.



మహారాష్ట్ర ఎన్నికల్లో రిగ్గింగ్ బిహార్‌లో అలా జరగనివ్వం

రాహుల్ గాంధీ హెచ్చరిక

- పట్నాలో ఈసీ కార్యాలయం ఎదుట నిరసన

పట్నా: 2024లో మహారాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా రిగ్గింగ్ జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. త్వరలో బిహార్‌లో జరిగే ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలను పునరావృతం చేయాలని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగా ఈసీ చేపట్టిన ఓటరు జాబితా (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సవరణ ద్వారా ప్రజల నుంచి ఓటు హక్కును లాగేసుకునేందుకు కుట్ర పన్నిందన్నారు. పట్నాలోని ఎన్నికల కమిషన్ కార్యాలయం ఎదుట బుధవారం ఇండియా కూటమి పార్టీలు ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. బీజేపీ మహారాష్ట్రలో బోగస్ ఓట్లను భారీగా చేర్పించడం ద్వారా ఫలితాలను అనుకూలంగా మార్చుకున్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన ఎన్నికల కమిషన్ బీజేపీ ఆదేశాల మేరకు పనిచేస్తోందని విమర్శించారు. బీజేపీ నామినేట్ చేసిన ఎన్నికల కమిషనర్లు, ఆ పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారన్నారు. ప్రజల ఓట్లు, ముఖ్యంగా యువత నుంచి ఓటు హక్కును దొంగిలించేందుకు ఈసీ చేసే ప్రయత్నాలను తాము కొనసాగనీయబోమని స్పష్టం చేశారు. రాజ్యాంగ ప్రతిని చూపుతూ రాహుల్ ప్రసంగించారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ట్రేడ్ యూనియన్లు చేపట్టిన జాతీయ స్థాయి నిరసనల్లో భాగంగా చేపట్టిన ఈ ర్యాలీలో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీ మాదిరిగా తయారైందని దుయ్యబట్టారు. ఓటర్ల జాబితా నుంచి ఇప్పుడు పేర్లు తీసేస్తున్నారు..ఆ తర్వాత రేషన్, పింఛను కూడా రాకుండా చేస్తారంటూ నితీశ్ సర్కార్‌పై మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఈ సర్కార్‌కు ఘోర పరాజయం తప్పదన్నారు. అనంతరం సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ ప్రధాన కార్యదర్శులు డి.రాజా, ఎంఏ బేబీ, దీపాంకర్ భట్టాచార్య కూడా మాట్లాడారు.

ఉక్రెయిన్‌పై 728 డ్రోన్లు 13 క్రూయిజ్ మిస్సైళ్లు

కీవ్: రష్యా మరోసారి ఉక్రెయిన్‌పై గగనతల దాడులను తీవ్రతరం చేసింది. మంగళవారం రాత్రి ఏకంగా 728 షహీద్ డ్రోన్లతోపాటు 13 క్రూయిజ్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఈ దఫా మరో 10 ప్రాంతాలతోపాటు ఉక్రెయిన్ సైనిక రవాణాకు అత్యంత కీలకంగా ఉన్న లుట్స్క్‌ను ప్రధాన లక్ష్యంగా చేసుకుంది. ఉక్రెయిన్‌కు 10 ప్రేట్రియాటిక్ క్షిపణులతోపాటు గగనతల ఆయుధ వ్యవస్థలను సరఫరా చేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం తెల్సిందే. దీంతోపాటు, యుద్ధాన్ని కొనసాగిస్తున్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌పైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది జరిగిన మరునాడే రష్యా దాడులను మరింత ముమ్మరం చేయడం గమనార్హం. కాగా, రష్యా ప్రయోగించిన 296 డ్రోన్లను కూల్చి వేశామని, మరో 415 డ్రోన్లను జామ్ చేయడంతో దారి తప్పాయని ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. రష్యా డ్రోన్లను అడ్డుకోవడంలో పశ్చిమదేశాలతో కలిసి ఉత్పత్తి చేస్తున్న ఇంటర్‌సెప్టార్ డ్రోన్లు చాలా బాగా పనిచేస్తున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. దాడులతో కీవ్‌లో ఇద్దరు గాయపడ్డారని, మిగతా ప్రాంతాల్లో జరిగిన నష్టంపై అంచనా వేస్తున్నామన్నారు. లుట్స్క్ నగరం పోలండ్, బెలారస్ సరిహద్దులకు అత్యంత సమీపంలో ఉంటుంది. ఇతర దేశాల నుంచి ఉక్రెయిన్‌కు అందే సైనిక సరఫరాలు ఇక్కడికే చేరుతుంటాయి. సరుకు రవాణాతోపాటు యుద్ధ విమానాలు సంచరించే ప్రాంతమిది. ఈ ప్రాంతంలో సప్లయ్ చైన్‌ను చిరాకు పరచాలన్నదే రష్యా లక్ష్యమని విశ్లేషకులు అంటున్నారు. ఈ నెల 4న రష్యా ఇలాగే భారీ దాడులకు దిగడం తెల్సిందే. రష్యా తాజా దాడులతో పోలండ్ తన తన యుద్ధ విమానాలను, సాయుధ బలగాలను అప్రమత్తం చేసింది. ఇలా ఉండగా, మంగళవారం రాత్రి రష్యాలోని ఆరు ప్రాంతాలపైకి ఉక్రెయిన్ ప్రయోగించిన 86 డ్రోన్లను అడ్డుకున్నట్లు రక్షణ శాఖ తెలిపింది. మాస్కోలోని విమానాశ్రయాల్లో విమానాలను నిలిపివేశామంది.



పప్పు చెడిపోయిందని క్యాంటిన్ కాంట్రాక్టర్‌పై దాడి

మహారాష్ట్ర ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ నిర్వాకం

ముంబై: పాడైపోయిన భోజనం పెట్టారన్న కారణంతో క్యాంటిన్ కాంట్రాక్టర్‌పై అధికార కూటమి ఎమ్మెల్యే దాడి చేయడం వివాదాస్పదంగా మారింది. మహారాష్ట్రలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. శివసేన(షిండే) ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ ముంబైలోని ఎమ్మెల్యేల హాస్టల్ క్యాంటిన్‌లో రాత్రి భోజనం కోసం వచ్చారు. ఆయనకు వడ్డించిన పప్పు చెడిపోయినట్లు గుర్తించారు. దాంతో ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే క్యాంటిన్ కాంట్రాక్టర్‌ను పిలిపించారు. పప్పు వాసన చూడాలంటూ కాంట్రాక్టర్‌ను ఒత్తిడి చేశారు. ఇది ఎలా తినాలంటూ మండిపడ్డారు. సహనం కోల్పోయి కాంట్రాక్టర్ చెంప చెల్లుమనిపించారు. ముఖంపై గట్టిగా కొట్టారు. దెబ్బల తీవ్రతకు కాంట్రాక్టర్ ఒక్కసారిగా కింద పడిపోయారు. పైకి లేచేందుకు ప్రయత్నించగా ఎమ్మెల్యే మళ్లీ మళ్లీ దాడి చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

శివసేన స్టైల్ ఇదే

ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ అనుచిత ప్రవర్తన పట్ల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు సైతం మండిపడ్డాయి. ఇలాంటి ఘటనలు ఎమ్మెల్యేల ప్రతిష్టను దెబ్బతీస్తాయని ఫడ్నవీస్ అన్నారు. హింసను తాను సమర్థించబోనని ఏక్‌నాథ్ షిండే చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే చట్టపరంగా ముందుకెళ్లాలని సూచించారు. ఇతరులను అకారణంగా కొట్టడం సరైంది కాదన్నారు. మరోవైపు తన వ్యవహార శైలిని ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ సమర్థించుకున్నారు. శివసేన స్టైల్ ఇదేనని తేల్చిచెప్పారు. క్యాంటిన్‌లో ఆహారం నాణ్యంగా లేదని చాలాసార్లు ఫిర్యాదు చేశానని, ఎవరూ పట్టించుకోలేదని విమర్శించారు. తన ఫిర్యాదును లెక్కచేయనప్పుడు ఇంకేం చేయాలి? చచ్చిపోవాలా? అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌ను కొట్టడం పట్ల తానేమీ విచారించడం లేదన్నారు. సంజయ్ గైక్వాడ్ వివాదాస్పద ఎమ్మెల్యేగా పేరుగాంచారు.

మళ్లీ బ్యాంకింగ్ రంగంలోకి సునాక్

లండన్: భారత సంతతికి చెందిన బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి రిషి సునాక్ తిరిగి బ్యాంకింగ్ రంగంలోకి అడుగుపెట్టారు. అమెరికాకు చెందిన ప్రఖ్యాత గోల్డ్‌మన్ సాచ్స్ గ్రూప్ సీనియర్ అడ్వైజర్‌గా కొత్త బాధ్యతలు చేపట్టారు. తన సంపాదనను భార్య అక్షతా మూర్తితో కలిసి ఇటీవల ఏర్పాటు చేసిన 'రిచ్‌మండ్ ఎడ్యుకేషన్ ఛారిటీకి అందజేయాలని నిర్ణయించుకున్నారు. రాజకీయాల్లోకి ప్రవేశించేందుకు ముందు వరకు రిషి సునాక్ గోల్డ్‌మన్ సాచ్స్‌లోనే పనిచేశారు. సాధారణ ఎన్నికల్లో ఓటమి చెందడంతో బ్రిటన్ ప్రధానిగా ఆయన గతేడాది జూలై 4వ తేదీన రాజీనామా చేశారు. నిర్దేశిత ఏడాది గడువు ముగియడంతో కొత్త బాధ్యతల గురించిన ప్రకటన చేశారు. పదవి నుంచి వైదొలిగిన రెండేళ్ల వరకు మాజీ ప్రధానులు ఇతర బాధ్యతలను చేపట్టాలంటే ముందుగా యూకే అడ్వైజరీ కమిటీ ఆన్ బిజినెస్ అపాయింట్‌మెంట్స్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. తాజాగా రిషి సునాక్‌కు అనుమతినిచ్చిన కమిటీ కొన్ని షరతులను సైతం విధించింది.

రిటైర్ అయ్యాక వ్యవసాయం చేస్తా: అమిత్ షా

అహ్మదాబాద్: రాజకీయాల నుంచి రిటైర్ అయ్యాక హాయిగా ప్రకృతి వ్యవసాయం చేసుకుంటానని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. 'అంతర్జాతీయ సహకార ఏడాది'ని పురస్కరించుకుని గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్తాన్ సహకార సంస్థల మహిళ సభ్యులతో అమిత్ షా 'సహకార్ సంవాద్' కార్యక్రమంలో మాట్లాడారు. ''రిటైర్ అయ్యాక ఏం చేయాలో ఎప్పుడో నిర్ణయించుకున్నా. వేదాలు, ఉపనిషత్తులు పఠిస్తా. హాయిగా ప్రకృతి వ్యవసాయం చేసుకుంటా ప్రకృతి ఒడిలో సేదతీరుతా. నాకు పుస్తక పఠనం అంటే ఎంతో ఆసక్తి. నా వద్ద 8,000 పుస్తకాలు ఉన్నాయి. శాస్త్రీయ సంగీతం అంటే మక్కువ'' అని అన్నారు.

రాజధానిని రాచకొండకు మార్చిందెవరు?

అనపోతనాయకుడు తన రాజధానిని ఆమనగంటి నుంచి రాచకొండకు మార్చాడు. రాచకొండ దుర్గానికి రాజాద్రి, రాజగిరి, రాజా చలమనే పేర్లున్నాయి. దట్టమైన అడవులు, పర్వత పంక్తుల మధ్య ఉన్న ఈ దుర్గం అభేద్యం. అక్కడి శాసనాల్ని బట్టి 1365కి ముందే రాజధానిని మార్చినట్లు తెలుస్తోంది. రాజధానిని పటిష్టం చేసుకున్న తర్వాత అనపోతనాయకుడు 1368లో ఓరుగల్లును ముట్టడించాడు. అనుమకొండ సమీపంలోని భీమవరం వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అతడు కాపయనాయకుడిని సంహరించాడు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కాకతీయానంతర యుగం

పద్మనాయకులు

ప్రసాదిత్య నాయకుడి కుమారుడు వెన్నమ నాయకుడు ప్రతాపరుద్రుడి సేనానిగా ప్రసిద్ధుడు. 1303లో అల్లాఉద్దీన్ ఖిల్జీ కాకతీయ రాజ్యంపై చేసిన దండయాత్రను తిప్పికొట్టిన వారిలో ఇతడు ప్రముఖుడు. వెన్నమ నాయకుడి కుమారుడు ఎరదాచానాయకుడు, సబ్బినాయకుడి కుమారుడు (ప్రసాదిత్య నాయకుడి మనవడు) నలదాచానాయకుడు కూడా ప్రతాపరుద్రుడి సేనానులే. కాకతీయులకు పాండ్య రాజుల (1316)తో, హోయసాల రాజులతో జరిగిన యుద్ధాల్లో ఎరదాచానాయకుడు కీలక పాత్ర పోషించాడు. ప్రతాపరుద్రుడు ఇతడి పరాక్రమానికి మెచ్చి పంచ పాండ్యదళ విభాళ, పాండ్య గజకేసరి అనే బిరుదులిచ్చాడు.

ఎరదాచానాయకుడికి ముగ్గురు కుమారులు. వారు ఒకటో సింగమనాయకుడు, వెన్నమనాయకుడు, ఏచమనాయకుడు. నలదాచానేనికి మాధవ నాయకుడు, దామానేడు అనే ఇద్దరు కుమారులున్నారు. వీరిలో సింగమనాయకుడు (1326-1361) ప్రసిద్ధుడు. తండ్రితోపాటు పాండ్య యుద్ధంలో పాల్గొని చిన్నతనంలోనే పరాక్రమం చూపాడు. కంపిలి రాజ్యంతో జరిగిన యుద్ధం (1320)లో కూడా విజయం సాధించి ప్రతాపరుద్రుడి ప్రశంసకు పాత్రుడయ్యాడు. ఢిల్లీ సుల్తాన్ల దాడిలో ప్రతాపరుద్రుడు బందీ అయ్యాక మహ్మద్ బిన్ తుగ్లక్ మాలిక్‌ను ఓరుగల్లు పాలకుడిగా నియమించాడు. ముసునూరి ప్రోలయ నాయకుడు, సింగమనాయకుడు, వేమారెడ్డి ముస్లింలను ఎదిరించి స్వతంత్ర రాజ్యస్థాపనకు పూనుకున్నారు. ముసునూరి ప్రోలయనాయకుడు తీరాంధ్ర నుంచి తురుష్కులను వెళ్లగొట్టాడు. ఇతడి తర్వాత పినతండ్రి కుమారుడు కాపయనాయకుడు రాజయ్యాడు. కాపయనాయకుడి నాయకత్వంలో సింగమనాయకుడు, వేమారెడ్డి తదితరులు ఏకమై 1336లో ఓరుగల్లును ఆక్రమించారు. కాపయ ఓరుగల్లు పాలకుడయ్యాడు. సింగమనాయకుడు వారసత్వంగా వచ్చిన ఆమనగల్లు రాజ్యంలో స్వతంత్రించాడు. అంతేగాక ఈ సమయంలో సింగమనాయకుడు తన కుమారులతో కలిసి మహబూబ్‌నగర్ ప్రాంతాన్ని, కృష్ణా, తుంగభద్ర మధ్య ప్రాంతాన్ని జయించి తన రాజ్యంలో కలుపుకున్నాడు.

రెడ్డి, వెలమ రాజ్యాల వైరం

చక్రవర్తి కావాలనుకున్న కాపయనాయకుడు సింగమనీడు పాలిస్తున్న ఆమనగంటి రాజ్యాన్ని ఆక్రమించి తన ప్రతినిధిగా ఎరబోతు లెంకను నియమించాడు. కాపయ ఆక్రమించిన ఆమనగల్లు, పిల్లలమర్రి ప్రాంతాన్ని సింగమనీడు 1360 ప్రాంతంలో తిరిగి జయించాడు. ఈ చర్యకు ఆగ్రహించిన కాపయ సామంతులు, స్నేహితులైన క్షత్రియులు సింగమనేని బావమరిదైన చింతపల్లి సింగమనాయుడిని ఓరుగల్లు మండలంలోని జల్లపల్లి కోటలో బంధించారు. సింగమనీడు ఈ కోటను ముట్టడించాడు. క్షత్రియులు సంధి పేరుతో తంబళ్ల బ్రహ్మజీని రాయబారిగా పంపి సింగమను హత్య చేయించారు. అతడి కుమారులు అనపోతానాయకుడు, మాదానాయుడు రాజులై జల్లిపల్లి, ఇనుగుర్తి కోటలను ముట్టడించి క్షత్రియులను చంపి పగతీర్చుకున్నారు. కొందరు క్షత్రియులు హుజూరాబాద్, మొలంగూరు కోటల్లో దాచుకున్నారు. కరీంనగర్ జిల్లా మొలంగూరు సమీపంలోని చెంజర్ల వద్ద దాక్కొన్న సోమవంశ క్షత్రియులనందరినీ 1361లో సంహరించారు.

ఈ సమయంలో కాపయ ప్రోత్సాహంతో క్షత్రియులకు సహాయంగా వచ్చిన రెడ్డి రాజులను మాదానాయకుడు, నాగానేడు చేజెర్ల, మొగళ్లూరు ప్రాంతం నుంచి తరిమి వేశారు. శ్రీశైలం ప్రాంతమంతటినీ జయించి తమ రాజ్యంలో కలుపుకున్నారు. తర్వాత రెడ్డి రాజ్యభాగమైన ధరణికోటను ముట్టడించి అనపోతారెడ్డిని ఓడించారు. ఈ యుద్ధం 1361లో చెంజర్ల యుద్ధం తర్వాత జరిగింది. ఈ యుద్ధంతో మొదలైన రెడ్డి, వెలమ రాజ్యాల వైరం ఈ రాజ్యాల పతనం దాకా కొనసాగింది. క్షత్రియుల్లో కొందరు భువనగిరి ప్రాంతం చేరి అనపోతనాయకుడి శత్రువులను కలుపుకొని యుద్ధానికి సిద్ధమయ్యారు. అనపోతా నాయకుడు భువనగిరి సమీపంలో మూసీనది తీరంలో ఇంద్ర్యాల వద్ద వీరిని జయించాడు. ఈ యుద్ధం కూడా 1361లోనే జరిగింది. భువనగిరి కోట అనపోతనాయకుడి వశమైంది.

పద్మనాయకుల పైచేయి

ఈ విజయాల అనంతరం అనపోతనాయకుడు రాజధానిని ఆమనగంటి నుంచి రాచకొండకు మార్చాడు. రాచకొండ దుర్గానికి రాజాద్రి, రాజగిరి, రాజా చలమనే పేర్లున్నాయి. దట్టమైన అడవులు, పర్వత పంక్తుల మధ్య ఉన్న ఈ దుర్గం అభేద్యం.



అక్కడి శాసనాల్ని బట్టి 1365కి ముందే రాజధానిని మార్చినట్లు తెలుస్తోంది. రాజధానిని పటిష్టం చేసుకున్న తర్వాత అనపోతనాయకుడు 1368లో ఓరుగల్లును ముట్టడించాడు. అనుమకొండ సమీపంలోని భీమవరం వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అతడు కాపయనాయకుడిని సంహరించాడు. ఇరు రాజ్యాల ఆధిపత్య పోరే ఈ యుద్ధానికి కారణం. ఆంధ్ర దేశాధీశ్వరులమని ఇరువురూ చెప్పుకోవడం అందుకు నిదర్శనం. ఈ యుద్ధం 1369లో ముగిసింది. ఓరుగల్లు ప్రాంతం పద్మనాయకుల వశమైంది. ముసునూరి వంశం అంతమైంది. ఓరుగల్లు, భువనగిరి, సింగవరం మొదలైన ప్రాంతాలను అనపోతానాయకుడు స్వాధీనం చేసుకున్నాడు.

ఓరుగల్లు స్వాధీనమయ్యాక ఆంధ్రదేశమంతటినీ జయించాలనే ఉద్దేశంతో అనపోతా నాయకుడు కళింగ మీద దండెత్తాడు. వీర నరసింహదేవుడు యుద్ధంలో ఓడిపోయి తన కుమార్తె కనక లక్ష్మీదేవిని అనపోతనాయకుడి మనవడైన రెండో అనపోతనకిచ్చి సంధి చేసుకున్నాడు. ఇది 1380కి ముందు జరిగింది. అప్పటికి పద్మనాయక రాజ్యానికి ఉత్తరాన గోదావరి, దక్షిణాన శ్రీశైలం, తూర్పున కొండవీటి రాజ్యం, పశ్చిమాన బహమనీ రాజ్యం సరిహద్దులు. అంటే తెలంగాణ ప్రాంతమంతా పద్మనాయకుల పాలనలోకి వచ్చింది. అప్పటి నుంచి ఒక శతాబ్దం వరకూ పద్మనాయకుల చరిత్రే తెలంగాణ చరిత్ర అని చరిత్రకారులు చెప్పిన మాట వాస్తవం.

దాయాదుల పాలన

పై విజయాలు పూర్తయ్యాక రాజ్యవిస్తీర్ణం, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా దేవరకొండ ప్రాంతానికి తన సోదరుడైన మాదానాయకుడిని అధిపతిగా నియమించాడు. అప్పట్నుంచి రాచకొండ రాజ్యంలోని దక్షిణభాగాన్ని మాదానాయకుడి సంతతి పరిపాలించింది. రెండు రాజ్యకేంద్రాలు ఏర్పడినప్పటికీ ఇరు కుటుంబాల మధ్య ఎన్నడూ పొరపొచ్చాలు రాకపోవడం చరిత్రలో అరుదైన అంశం. అనపోతానాయకుడి కుమారులు రెండో సింగభూపాలుడు, ధర్మానాయకుడు. మాదానాయకుడి కుమారుడు వేదగిరి నాయకుడు.

అనపోతానాయకుడి తర్వాత రెండో సింగభూపాలుడు 1384లో రాచకొండలో సింహాసనం అధిష్టించాడు. అదే సంవత్సరం దేవరకొండలో పెదవేదగిరి నాయకుడు అధికారంలోకి వచ్చాడు. సింగభూపాలుడి రాజ్య ఆరంభకాలంలో విజయనగరరాజు రెండో హరిహరరాయలు రాచకొండ రాజ్యంలోని కొత్త కొండ (మహబూబ్‌నగర్)పై దండెత్తాడు. సింగ భూపాలుడు విజయనగర సైన్యాలను ఓడించాడు. తాను యువరాజుగా ఉన్నప్పుడే కల్యాణి (గుల్బర్గా) దుర్గాన్ని ఆక్రమించిన అనుభవం ఈ యుద్ధంలో ఉపయోగపడింది. ఈ యుద్ధం తర్వాత సింగ భూపాలుడు కళింగ దేశాన్ని జయించడానికి వెళ్లి గోదావరి జిల్లాలోని బెండపూడి, వేములకొండ ప్రాంతాల్ని జయించి 1387లో సింహాచల క్షేత్రంలో శాసనం వేయించాడు. 1397లో రెండో బుక్కరాయలు పాత పగతో మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ తాలూకాలోని పానుగల్లు కోటను రెండు సంవత్సరాల యుద్ధానంతరం స్వాధీనం చేసుకున్నాడు. ఈ సమయంలోనే రెండో బుక్కరాయలు దేవరకొండ మీద దండెత్తగా, పెద వేదగిరినాయకుడు తన కుమారుడైన మూడో మాదానీడును పంపి ఓడించాడు. ఇతడు విజయనగర సైన్యాధ్యక్షుడైన గుండదండాధీశుడిని సంహరించి ఓరుగల్లును ఆక్రమించాడని వెలుగోటి వంశావళి తెలుపుతోంది. రెండో సింగభూపాలుడికి ఆరుగురు కుమారులు. వారిలో పెద్దవాడైన రెండో అనపోతానాయకుడు (1400-1420), సింగభూపాలుడి అనంతరం రాజ్యానికి వచ్చాడు. అధికారం చేపట్టగానే మెదక్ దుర్గాన్ని ఆక్రమించిన విజయనగర సైన్యాలను తరిమేశాడు.

విజయనగర రాజులతో మైత్రి

రెండో హరిహరరాయల మరణానంతరం వారసుల మధ్య విభేదాలు తలెత్తాయి. కొండవీటి రెడ్డి రాజ్యంలో కుమారగిరి రెడ్డి పెద కోమటి వేమారెడ్డి మధ్య వైరం మొదలైంది. ఇదే అదనుగా భావించిన అనపోతానాయుడు విజయనగర రాజ్యంపై దండెత్తి చెన్నపట్నం వరకు ఉన్న భూభాగాలను ఆక్రమించాడు. కొండవీటి రెడ్ల ఆధీనంలోని వాడపల్లి, చిలుకూరు, వేదాద్రులను జయించాడు. దీంతో కొండవీటి రాజులు, బహమనీ ఫిరోజ్ షాలు ఒక్కటయ్యారు. దీంతో అనపోతానాయకుడు విజయనగర రాజులతో మైత్రి చేసి, వారి సాయంతో పానగల్లు (మహబూబ్‌నగర్) మీద దాడిచేసిన ఫిరోజ్‌షా సైన్యాలను ఓడించి తమ పూర్వరాజ్య భాగమైన పానగల్లును వశపరచుకున్నాడు.

ఇదే సమయంలో కొండవీటి రాజు పెద కోమటి వేమారెడ్డి దేవరకొండ రాజ్యంపై దండెత్తి పినవేదగిరిని సంహరించాడు. దీంతో అనపోతానాయుడు విజయనగర రాజుల సహాయంతో కొండవీడును ముట్టడించి వేమారెడ్డిని సంహరించాడు. కొండవీడు రాజ్యాన్ని పద్మనాయకులు, విజయనగరాధీశులు, గజపతులు ఆక్రమించారు (మిగిలిన కొద్ది భాగాన్ని పాలించిన రాచవేమారెడ్డితో కొండవీటి రాజ్యం అంతరించింది.) పద్మనాయకుల ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన గొప్ప పరాక్రమవంతుడు అనపోతానాయుడు. ఇతడు విజయనగర రాజులతో మైత్రి చేసినందువల్ల బహమనీయులు శత్రుభావం పెంచుకున్నారు. అందువల్ల పద్మనాయక రాజ్యానికి ముప్పు తలెత్తింది.

రెండో అనపోతానాయుడి తర్వాత అతడి కుమారులు చిన్న వారు కావడం వల్ల అతడి చిన్న తమ్ముడు రావు మాదానాయుడు రాజయ్యాడు. దేవరకొండ రాజ్యంలో అంతకు ముందే పెదవేదగిరి మూడో మనవడూ, మూడో మాదానీ చిన్న కుమారుడూ అయిన లింగమనీడు రాజ్యానికొచ్చాడు. బహమనీ ఫిరోజ్‌షా కుమారుడు అహ్మద్‌షా పానగల్లు యుద్ధంలో జరిగిన అవమానానికి ప్రతీకారంగా విజయనగరంపై దండెత్తాడు. విజయనగర రాజులతో మైత్రి ఉండటం వల్ల మాదానీడు, లింగమనీడు విజయనగరం పక్షాన యుద్ధం చేశారు. ఇరు సైన్యాల ధాటికి తట్టుకోలేక అహ్మద్‌షా లొంగిపోయి 1422లో విజయనగరంతో సంధి చేసుకున్నాడు.

ఈ యుద్ధంలో మాదానీడు విజయనగర పక్షం వహించడం వల్ల బహనీయులు (అహ్మద్ షా) పద్మనాయకులపై పగ పెంచుకున్నారు. తమ ఇరువురి మధ్య జరిగిన సంధి వల్ల విజయనగర రాజులు పద్మనాయకులకు దూరమయ్యారు. దీంతో పద్మనాయకుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. ఇదే అదనుగా అహ్మద్‌షా ఓరుగల్లు మీద దాడి చేశాడు. మూడో సింగభూపాలుడు తన పినతండ్రి రావు మాదానీడు, లింగమనేనిల సహాయంతో అజీమ్‌ఖాన్‌లాంటి సర్దారులను ఓడించి 1425లో ఓరుగల్లును స్వాధీనం చేసుకున్నాడు. రెండో అనపోతానేని కుమారుడైన సింగభూపాలుడు సింహాసనాన్ని అధిష్టించాడు. సింగమనాయకుడు పదేళ్లపాటు ఏ ఇబ్బంది లేకుండా రాజ్యాన్ని పాలించాడు. ఇతడు పోతనను, శ్రీనాథుడిని ఆదరించి కవి పండిత పోషకుడిగా పేరొందాడు.

బహమనీల దాడి

మాళవ, గుజరాత్ దేశాలతో పోరాడుతున్న అహ్మద్‌షా వారితో సంధి చేసుకొని తిరిగి ఓరుగల్లుపై దండెత్తాడు. కళాపోషకుడైన సింగమనాయకుడు సహజంగానే యుద్ధ విముఖుడు కాబట్టి అహ్మద్‌షాను ఎదుర్కొనకుండానే సంధి చేసుకొని భువనగిరిని వదులుకున్నాడు. పైకి సంధికి అంగీకరించిన అహ్మద్‌షా భువనగిరిలో సంజర్‌ఖాన్‌ను నియమించి వెళ్లాడు. కానీ తెలంగాణ మొత్తాన్నీ జయించమని సంజర్‌ఖాన్‌ను ఆదేశించాడు. సంజర్‌ఖాన్ 1436లో ఓరుగల్లును ఆక్రమించాడు. దేవరకొండ మినహా తెలంగాణ అంతా బహమనీయుల వశమైంది. బహమనీ రాకుమారుడు దాసూర్‌ఖాన్ రాచకొండ ప్రతినిధి అయ్యాడు. ఆ తర్వాత సింగమనాయకుడి చరిత్ర, పద్మనాయక చరిత్ర లింగమనీడు చరిత్రతో కలిసిపోయింది. 1420లో దేవరకొండ శాఖలో రాజ్యానికొచ్చిన లింగమనీడు పద్మనాయక రాజుల్లో మరో గొప్ప పరాక్రమవంతుడు లింగమనీడు ఏకధాటిగా 32 దుర్గాలను జయించడం అందుకు నిదర్శనం. ఇతడు సింగమనాయకుడితో కలిసి అహ్మద్‌షా ఆక్రమించిన ఓరుగల్లును 1425లో జయించాడు. తర్వాత 1428 నాటికి తూర్పు దండయాత్రల్లో అల్లయ వేమారెడ్డిని, వీరభద్రారెడ్డిని ఓడించి రాజమండ్రి, సింహాచలాన్ని జయించాడు.

తర్వాత వేములకొండ, మామిడాల, సప్తమాడియాలు, ఆవంచ, గంగవరాలను ఆక్రమించాడు. ఈ సమయంలోనే కళింగ గంగరాజైన నాలుగో భానుదేవుణ్ని తొలగించి కపిలేశ్వర గజపతి కళింగ సింహాసనాన్ని అధిష్టించాడు. అధికారంలోకి రాగానే రెడ్డి రాజ్యభాగాల్లో ప్రవేశించాడు. ఈ ఆక్రమణను, లింగమనీడు విజృంభణనూ సహించని విజయనగర దేవరాయలు తెలుంగ రాయలను సింహాచలంపైకి పంపాడు. దీంతో గజపతులు, లింగమనీడు వెనక్కి మరలాల్సి వచ్చింది. ఈ పరిస్థితి వీరిద్దరూ చేయికలపడానికి దారితీసింది. అలా కపిలేశ్వర గజపతి సహాయంతో లింగమనీడు మెదట కొండవీడు ప్రాంతాలను జయించాడు. శ్రీశైలాన్ని ఆక్రమించాడు.

మొదటి తరైన్ యుద్ధం జరిగిన కాలం?

జాగ్రఫీ

1. లిటిల్ అండమాన్ -కార్ నికోబార్ దీవుల మధ్య ఉన్న చానల్?
   1) 8° 2) 9°
   3) 10° 4) డంకన్ చానల్
2. ముంబై - పుణెల మధ్య ఉన్న కనుమ ఏది?
   1) పాల్ ఘాట్ 2) థాల్ ఘాట్
   3) బోర్ ఘాట్ 4) షీన్ ఘాట్
3. ఉష్ణోగ్రత వల్ల అధికంగా బీటలు వారే నేలలు ఏవి?
   1) ఒండలి నేలలు 2) నల్ల నేలలు
   3) లాటరైట్ నేలలు 4) ఎర్ర నేలలు
4. భారతదేశం ఏ నిల్వలను అధికంగా కలిగి ఉంది?
   1) ప్లుటోనియం 2) ప్లాటినం
   3) థోరియం 4) యురేనియం
5. 2011 భారతదేశ జనాభా లెక్కల ప్రకారం అత్యధిక జనాభా గల రెండో రాష్ట్రం ఏది?
   1) మధ్యప్రదేశ్ 2) ఉత్తరప్రదేశ్
   3) మహారాష్ట్ర 4) బిహార్
6. ఆంధ్రప్రదేశ్‌లో ఏ జిల్లాలో వంశధార ప్రవహిస్తోంది?
   1) నెల్లూరు 2) విశాఖపట్నం
   3) శ్రీకాకుళం 4) కర్నూలు
7. విజ్జేశ్వరం సహజవాయువు విద్యుత్ కేంద్రాన్ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
   1) 1989 2) 1990
   3) 1980 4) 1979
8. నువ్వుల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ ఎన్నో స్థానంలో ఉంది?
   1) 2 2) 4 3) 5 4) 7
9. క్వార్ట్జ్ నిక్షేపాలు ఉన్న జిల్లా?
   1) గుంటూరు 2) నెల్లూరు
   3) ప్రకాశం 4) పైవన్నీ
10. '+' దేనికి సాంకేతిక చిహ్నంగా వాడతారు?
   1) నూనె బావి 2) ఊట బావి
   3) బావి 4) ఏదీకాదు
11. వాతావరణంలో ఎక్కువగా ఉండే మూలకం ఏది?
   1) ఆక్సిజన్ 2) ఆర్గాన్
   3) నైట్రోజన్ 4) కార్బన్‌డైఆక్సైడ్
12. 'ధూళి మేఘ' సిద్ధాంత కర్త ఎవరు?
   1) చాంబర్లీన్ మౌల్టన్
   2) క్లాడియసెటాలమ్ 3) లాప్లెస్
   4) ఇమ్మాన్యుయేల్ కాంట్
13. అతిథి గ్రహాలు అని వేటిని పిలుస్తారు?
   1) ఉల్కలు 2) తోకచుక్కలు
   3) ప్లానిటాయిడ్స్ 4) ఉపగ్రహాలు
14. ప్రతి గ్రహణం మళ్లీ అదే రీతిలో ఏర్పడా లంటే పట్టే కాలం?
   1) 10సం॥ 18 రో॥ 2) 18సం॥ 10రో॥
   3) 16సం॥ 18రో॥ 4) 18సం॥ 18రో॥
15. కిందివాటిలో విలుప్త అగ్నిపర్వతాన్ని గుర్తించండి?
   1) వెసూవియస్ 2) హెల్రా కోలా
   3) అకన్ గువా 4) ఆరావళి
16. భూకంప నాభి లోతు పెరిగే కొద్దీ?
   1) భూకంప నాభి విస్తరిస్తుంది
   2) భూకంపం సంభవించే ప్రాంతం విస్తరిస్తుంది
   3) భూకంప తీవ్రత పెరుగుతుంది.
   4) R తరంగాలు ఏర్పడవు
17. సమాచార వ్యవస్థ పొర అని ఏ వాతావరణ పొరని పేర్కొంటారు?
   1) ఎక్సో ఆవరణం 2) థర్మో ఆవరణం
   3) మిసో ఆవరణం 4) స్ట్రాటో ఆవరణం
18. భూమి సగటు ఉష్ణోగ్రత?
   1) 11°C 2) 13°C
   3) 9°C 4) 22°C
19. కిందివాటిలో పర్వత పాద పీఠభూమి?
   1) మెక్సికో 2) యాంట్రిమ్
   3) పెటగోనియా 4) ఓజార్క్
20. యూరప్ ఖండానికి వెచ్చని దుప్పటిగా అభివర్ణించే సముద్ర ప్రవాహం?
   1) ఉత్తర భూమధ్యరేఖా ప్రవాహం
   2) ఉత్తర అట్లాంటిక్ డ్రిఫ్ట్
   3) బెంగ్యులా ప్రవాహం
   4) దక్షిణ అట్లాంటిక్ డ్రిఫ్ట్
21. ఆస్ట్రేలియా ఎడారిలో నివసించే తెగ?
   1) బుష్‌మెన్‌లు 2) బిడానియన్స్
   3) బిండిబాలు 4) హిస్స్ పల్లా
22. శృంగాకారపు అడవులు ఉన్న ప్రాంతం?
   1) ఆర్కిటిక్ ప్రాంతం
   2) ఉప ఆర్కిటిక్ ప్రాంతం
   3) మధ్యధరా ప్రాంతం
   4) రుతుపవన మండలం
23. ప్రపంచ సార్డైన్ రాజధాని మాంటెరె ఏ మండలంలో ఉంది?
   1) స్టెప్పీ మండలం 2) సవన్నా మండలం
   3) మధ్యధరా మండలం
   4) భూమధ్యరేఖా మండలం
24. ఆసియాలో గొప్ప జలపాతం?
   1) ఏంజెల్ 2) నయాగరా
   3) కోహినే 4) జోర్సప్పా
25. దక్షిణ అమెరికా ఖండంలో మధ్యధరా శీతోష్ణస్థితి గల ప్రాంతం?
   1) పెరూ 2) పరాగ్వే
   3) ఈక్వెడార్ 4) చిలీ

హిస్టరీ

26. ఏ ప్రజలు తమ అనుభవాలను గుహ చిత్రాలుగా గీసేవారు?
   1) రామాపిథికస్ 2) ఆస్ట్రోపిథికస్
   3) హోమో ఎరక్టస్ 4) హోమోసెఫియన్స్
27. సూర్యుడు ప్రధానదైవంగా గల నాగరికత?
   1) ఈజిప్ట్, సుమేరియా
   2) మెసపటోమియా, సుమేరియా
   3) పర్షియన్, సుమేరియా
   4) ఈజిప్ట్, చైనా

టెట్/డీఎస్సీ ప్రత్యేకం

సోషల్ స్టడీస్

28. ఆర్యుల కాలంలో 'భాగ' అంటే?
   1) భూస్వాములు 2) పురోహితులు
   3) సేనాపతి 4) భాగదుగ
29. అకామినిద్ రాజ్యంలో అధికార భాష?
   1) మాండరిన్ 2) పర్షియన్
   3) గ్రీకు 4) హీబ్రూ
30. కజ్ రాజధాని నగరంగా గల నాగరికత?
   1) మయా 2) ఇన్‌కాస్
   3) అజెటిక్స్ 4) కుష్
31. చైనాలో ఏ రాజ వంశస్థులు ఫార్మోసాను జయించి తమ భూభాగంలో కలుపుకున్నారు?
   1) టాంగ్ 2) సుంగ్
   3) సూయి 4) మింగ్
32. సింధు నాగరికత లక్షణం కానిది?
   1) హరప్పా, మొహంజొదారోల్లో కోటల నిర్మాణం
   2) సర్కోతాదలో గుర్రం ఎముకలు లభించాయి
   3) సింధు ప్రజలది మాతృస్వామిక వ్యవస్థ
   4) హరప్పా ప్రజలు ద్రవిడ లిపిని ఉపయోగించారు
33. సోమ, సుర పానీయాల గురించి వివరించిన వేదాలు ఏవి?
   1) యజుర్వేదం 2) రుగ్వేదం
   3) సామవేదం 4) అధర్వణ వేదం
34. జైన మతం వాస్తు శిల్పకళ ఉన్న ఉదయగిరి గుహలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
   1) రాజస్థాన్ 2) కర్ణాటక
   3) మహారాష్ట్ర 4) ఒడిశా
35. ఉగ్రసేనుడు అనే బిరుదు ఉన్న రాజు?
   1) శిశునాగుడు 2) కాలాశోకుడు
   3) ధననందుడు
   4) మహాపద్మనందుడు
36. మెహరోలి ఉక్కుస్తంభం ఏ గుప్తరాజు కాలానికి చెందింది?
   1) సముద్రగుప్తుడు 2) రామగుప్తుడు
   3) రెండో చంద్రగుప్తుడు
   4) రెండో కుమారగుప్తుడు
37. చేబ్రోలు భీమేశ్వరాలయం నిర్మాత ఎవరు?
   1) రెండో పులకేశి 2) కుబ్జవిష్ణువర్ధనుడు
   3) నరసింహవర్మ 4) చాళుక్య భీముడు
38. పల్లవుల కాలంలో గ్రంథమైన 'కురుళ్' రచయిత ఎవరు?
   1) తిరుమంగై 2) నామల్ వార్
   3) తిరువల్లువర్ 4) భారవి
39. మొదటి తరైన్ యుద్ధం జరిగిన కాలం?
   1) 1191 2) 1192
   3) 1195 4) 1190
40. ఇల్‌టుట్‌మిష్.. ముల్తాన్ పాలకుడు నాసిరుద్దీన్ కుబాచాను ఏ సంవత్సరంలో ఓడించాడు?
   1) 1216 2) 1217
   3) 1218 4) 1219
41. పశ్చిమ బెంగాల్‌లో భక్తి ఉద్యమాన్ని ముందుకు నడిపించిన భక్తి ఉద్యమకారులు?
   1) రామానందుడు, మీరాబాయి
   2) నామదేవ్, తుకారాం
   3) చైతన్యుడు, వల్లభాచార్యుడు
   4) తుకారాం, చైతన్యుడు
42. గోపాలకృష్ణ గోఖలే సూచన మేరకు అహ్మదాబాద్‌లో గాంధీజీ సబర్మతీ ఆశ్రమాన్ని ఏ సంవత్సరంలో స్థాపించారు?
   1) 1914 2) 1915
   3) 1916 4) 1918
43. ఇంగ్లండ్‌లో జరిగిన అంతర్యుద్ధంలో ఉరిశిక్షకు గురైన ఇంగ్లండ్ రాజు?
   1) మొదటి జేమ్స్ 2) 2వ ఛార్లెస్
   3) మొదటి ఛార్లెస్ 4) 2వ జేమ్స్
44. రూసోను మార్గదర్శకుడిగా ప్రకటించుకున్న ఫ్రాన్స్ జాతీయ ఉద్యమ నాయకుడు?
   1) జోసెఫ్ మాజినీ 2) గారిబాల్డీ
   3) బిస్మార్క్ 4) నెపోలియన్
45. కాంగో, సెనెగల్, ఐవరీకోస్ట్‌లను ఆక్రమించుకున్న దేశం?
   1) పోర్చుగల్ 2) ఇటలీ
   3) ఫ్రాన్స్ 4) ఇంగ్లండ్
46. నానాజాతి సమితి వైఫల్యానికి కారణం?
   1)26 రాజ్యాల ప్రతినిధులు ప్రపంచశాంతి పరిరక్షణకు చేసిన ప్రయత్నం విఫలం
   2) గ్రీస్- బల్గేరియా వివాదం
   3) పోలండ్.. లిత్వేనియాకు చెందిన విల్నాను ఆక్రమించడం
   4) డాంజింగ్‌ను స్వేచ్ఛా నగరంగా ప్రకటించడం
47. జపాన్‌లో భూస్వామ్య విధానం రద్దు చేసి, పాశ్చాత్య విధానాలు, యూరప్ తరహా విధానాలను ప్రవేశపెట్టిన జపాన్ చక్రవర్తి?
   1) టోకుగవా షోగునేట్
   2) ముత్సుషిటో (మెయిజీ)
   3) కోమిన్ టర్న్
   4) షెమొనోషికి

ఎకనామిక్స్

48. ఆర్థిక శాస్త్రంలో ఆర్థిక వృద్ధి భావనకు ప్రాధాన్యతను ఇచ్చిన ఆర్థికవేత్త?
   1) జాకోబ్ వైనర్
   2) లయోనల్ రాబిన్స్
   3) పాల్ శామ్యూల్ సన్
   4) ఆల్‌ఫ్రెడ్ మార్షల్
49. బొగ్గు, విద్యుత్ మొదలైన శక్తి వనరులను ఏమంటారు?
   1) వినియోగ వస్తువులు
   2) మూలధన వస్తువులు
   3) మాధ్యమిక వస్తువులు 4) ఏదీకాదు
50. డిమాండ్ రేఖ ఎడమ నుంచి కుడికి కిందికి వాలి ఉండటానికి కారణం?
   1) క్షీణోపాంత ప్రయోజన సూత్రం
   2) ప్రత్యామ్నాయ ప్రభావం
   3) ఆదాయ ప్రభావం
   4) పైవన్నీ
51. సప్లయ్‌ని నిర్ణయించే అంశం కానిది?
   1) ప్రభుత్వ విధానాలు
   2) ఉత్పత్తి కారకాల ధరలు
   3) వస్తువు ధరలు
   4) వినియోగదారుని ఆదాయం
52. విత్త విధానాన్ని రూపొందించి అమలు పరిచే ప్రధాన విభాగం?
   1) RBI 2) వాణిజ్య బ్యాంక్
   3) కేంద్ర ప్రభుత్వం 4) ప్రపంచ బ్యాంక్
53. ఉత్పత్తి కారకాల దృష్ట్యా నికర జాతీయోత్పత్తిని జాతీయాదాయం అని అంటారు. దీని సమీకరణాన్ని సూచించండి?
   1) $C+I+G+(x-m)+(R-P)$
   2) $C+I+G+(x-m)+(R-P)-D$
   3) $C+I+G+(x-m)+(R-P)-IT+S-D$
   4) $C+I+G+(x-m)+(R-P)-IT+S$
54. స్థూల జాతీయోత్పత్తికి, పరోక్ష పన్నులకు మధ్య తేడా?
   1) వ్యయార్హ ఆదాయం
   2) వ్యక్తిగత ఆదాయం
   3) మార్కెట్ ధరల వద్ద జాతీయాదాయం
   4) ఉత్పత్తి కారకాల వ్యయం వద్ద జాతీయాదాయం
55. వార్షిక ఆర్థిక నివేదికలో కోశ లోటు, వడ్డీ చెల్లింపుల భేదాన్ని ఏమంటారు?
   1) రెవెన్యూ లోటు 2) బడ్జెట్ లోటు
   3) కోశ లోటు 4) ప్రాథమిక లోటు
56. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 1974 2) 1975
   3) 1976 4) 1978
57. ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో కనీస సభ్యుల సంఖ్య ఎంత?
   1) 5 2) 4 3) 2 4) 3
58. ద్వితీయ రంగ ఆర్థిక వ్యవస్థకు ఉదాహరణ?
   1) అడవులు 2) పశు సంవర్ధనం
   3) నీటి సరఫరా 4) రియల్ ఎస్టేట్
59. స్వచ్ఛమైన సేవలకు ఉదాహరణ?
   1) గాలి 2) రోడ్లు
   3) రైల్వే 4) దేశ రక్షణ
60. ద్రవ్యోల్బణం సంవత్సరానికి 3 శాతం కంటే తక్కువ ఉన్నట్లయితే దానిని ఇలా అంటారు?
   1) నడిచే ద్రవ్యోల్బణం
   2) దూకుడు ద్రవ్యోల్బణం
   3) పరుగెత్తే ద్రవ్యోల్బణం
   4) పాకే ద్రవ్యోల్బణం

సివిక్స్

61. ప్రపంచ నాగరికతకు మూలమైన అంశం?
   1) ప్రభుత్వం 2) సంస్కృతి
   3) సమాజం 4) కుటుంబం
62. భారతదేశంలో గృహహింసా నిరోధక చట్టం ఏ సంవత్సరంలో అమలు జరిగింది?
   1) 1961 2) 2004
   3) 2005 4) 2006
63. మూడువేల నుంచి ఐదువేల మంది గ్రామ సభ సభ్యులకు ఎంతమంది గ్రామవార్డ్ సభ్యులు ఉంటారు?
   1) 9 2) 13
   3) 15 4) 11
64. రాష్ట్రపతి పార్లమెంటుకు ఎంతమంది సభ్యులను నామినేట్ చేస్తారు?
   1) 12 2) 8 3) 14 4) 2
65. గవర్నర్ తన శాసనాధికారాల్లో భాగంగా విధాన పరిషత్‌కు ఎంతమందిని నామినేట్ చేస్తారు?
   1) 1/3వ వంతు 2) 1/6వ వంతు
   3) 1/12వ వంతు 4) 1/4వ వంతు
66. ₹ 500 జరిమానా, 6 మాసాల కఠిన కారాగార శిక్షను విధించే కోర్టులు?
   1) ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు
   2) సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు
   3) థర్డ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు
   4) ఏదీకాదు
67. భారతదేశంలో ప్రస్తుతం లోకాయుక్త (పౌర నియంత్రణ) విధానం ఎన్ని రాష్ట్రాల్లో అమలులో ఉంది?
   1) 15 2) 16 3) 17 4) 18
68. సమాచార హక్కు చట్టాన్ని పార్లమెంట్ ఎప్పుడు ఆమోదించింది?
   1) 2005, జూన్ 15
   2) 2005, అక్టోబర్ 12
   3) 2007, జూలై 15
   4) 2008, జూన్ 15
69. సామ్యవాద విధానాన్ని ఏ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ పీఠికలో చేర్చారు?
   1) 42వ రాజ్యాంగ సవరణ
   2) 43వ రాజ్యాంగ సవరణ
   3) 44వ రాజ్యాంగ సవరణ
   4) 48వ రాజ్యాంగ సవరణ
70. 1983లో అలీన దేశాల సమావేశాన్ని ఎక్కడ నిర్వహించారు?
   1) హరారే 2) హవానా
   3) కొలంబో 4) న్యూఢిల్లీ

సమాధానాలు

1) 3	2) 2	3) 2	4) 3	5) 3
6) 3	7) 2	8) 2	9) 4	10) 2
11) 3	12) 4	13) 2	14) 2	15) 3
16) 2	17) 2	18) 2	19) 3	20) 2
21) 3	22) 2	23) 3	24) 3	25) 4
26) 4	27) 1	28) 3	29) 2	30) 2
31) 3	32) 4	33) 2	34) 4	35) 4
36) 3	37) 4	38) 3	39) 1	40) 2
41) 3	42) 3	43) 3	44) 4	45) 3
46) 3	47) 2	48) 3	49) 2	50) 4
51) 4	52) 3	53) 3	54) 4	55) 4
56) 2	57) 3	58) 4	59) 4	60) 4
61) 4	62) 3	63) 2	64) 3	65) 2
66) 2	67) 3	68) 1	69) 1	70) 4

ప్రస్తుత ఇస్రో చైర్మన్ ఎవరు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

భారత అంతరిక్ష కార్యక్రమం

1. ఇస్రో ఏ దేశ సౌజన్యంతో సరళ్ అనే ఉపగ్రహాన్ని నిర్మించింది?
ఎ) ఫ్రాన్స్ బి) ఇజ్రాయెల్
సి) స్విట్జర్లాండ్ డి) అమెరికా
2. హబుల్ స్పేస్ టెలిస్కోపు తరహాలో భారత్ అభివృద్ధి చేస్తున్న ఖగోళశాస్త్ర పరిశోధన ఉపగ్రహం ఏది?
ఎ) ఆదిత్య బి) ఏస్ట్రోశాట్
సి) గెలీలియో డి) ఏదీకాదు
3. పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ రాకెట్లను నిర్మించే కేంద్రం ఏది?
ఎ) విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రం
బి) సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం
సి) స్పేస్ అప్లికేషన్స్ సెంటర్
డి) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ & టెక్నాలజీ
4. సుదూర రోదసిలోకి ప్రయోగించే చంద్రయాన్, మంగళ్‌యాన్ లాంటి ఉపగ్రహాల నుంచి సమాచారాన్ని తీసుకోవడానికి ఉద్దేశించిన ఇండియా డీప్ స్పేస్ నెట్‌వర్క్ (IDSN) అనే గ్రౌండ్ వ్యవస్థను ఎక్కడ ఏర్పాటు చేశారు ?
ఎ) గాదంకి, తిరుపతి
బి) బైలాలు, బెంగళూరు
సి) తిరువనంతపురం డి) హైదరాబాద్
5. మంగళ్‌యాన్ బరువు ఎంత?
ఎ) 2562 కిలోలు బి) 3333 కిలోలు
సి) 1337 కిలోలు డి) 5555 కిలోలు
6. ఇండియన్ రీజినల్ నేవిగేషనల్ శాటిలైట్ సిస్టమ్ ఇప్పటివరకు ఎన్ని ఉపగ్రహాలను ప్రయోగించింది?
ఎ) 1 బి) 2
సి) 3 డి) 4
7. భారత్ తొలిసారిగా రాకెట్‌ను ఎప్పుడు ప్రయోగించింది?
ఎ) 1963 నవంబర్ 21
బి) 1975 ఏప్రిల్ 1
సి) 1969 ఆగస్టు 15
డి) 1975 ఏప్రిల్ 19
8. ఇస్రో వాణిజ్య విభాగం ఏది?
ఎ) ఇస్రో శాటిలైట్ సెంటర్
బి) స్పేస్ అప్లికేషన్స్ సెంటర్
సి) యాంట్రిక్స్ కార్పొరేషన్
డి) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్
9. యురోపియన్ యూనియన్ అభివృద్ధి చేస్తున్న ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ ?
ఎ) క్వాశీజెనిథ్ బి) బీడే
సి) గెలీలియో డి) గ్లోనాస్
10. నాసా ప్రయోగించిన ఏ ఉపగ్రహం సౌర వ్యవస్థ వెలుపల అంతర నక్షత్ర ప్రాంతానికి చేరింది?
ఎ) క్యూరియాసిటీ బి) మావెన్
సి) అట్లాంటిస్ డి) వాయేజర్
11. ఇండియన్ రీజినల్ నావిగేషనల్ శాటిలైట్ వ్యవస్థ భారత భూభాగ సరిహద్దుల నుంచి ఎంత దూరం వరకు సేవలు అందిస్తుంది?
ఎ) 1500 కి.మీ. బి) 3000 కి.మీ.
సి) 5000 కి.మీ. డి) 6500 కి.మీ.
12. ఉపగ్రహ ఆధారిత నావిగేషన్ వ్యవస్థలో సేవలకు కనీసం ఎన్ని ఉపగ్రహాలు అవసరం?
ఎ) 1 బి) 2 సి) 4 డి) 6
13. ఇస్రో ప్రయోగించిన స్పాట్-6, స్పాట్-7 ఉపగ్రహాలు ఏ దేశానికి చెందినవి?
ఎ) ఫ్రాన్స్ బి) ఆస్ట్రేలియా
సి) జపాన్ డి) జర్మనీ
14. IRNSS-1D ఉపగ్రహం బరువు?
ఎ) 2,500 కిలోలు బి) 1425 కిలోలు
సి) 3,500 కిలోలు డి) 750 కిలోలు
15. దేశీయ క్రయోజనిక్ ఇంజన్‌ను విజయవంతంగా ప్రయోగించిన నౌక?
ఎ) పీఎస్ఎల్‌వీ సీ 27
బి) పీఎస్ఎల్‌వీ సీ 25
సి) జీఎస్ఎల్‌వీ డీ 3
డి) జీఎస్ఎల్‌వీ డీ 5
16. ఉపగ్రహ ఆధారిత విమానయానానికి ఉద్దేశించిన వ్యవస్థ?
ఎ) ఆకాశ్ బి) గగన్
సి) భువన్ డి) IRNSS
17. తొలిసారిగా జీపీఎస్‌ను అభివృద్ధి చేసిన దేశం?
ఎ) బ్రిటన్
బి) ఫ్రాన్స్
సి) అమెరికా
డి) రష్యా
18. 'మార్స్ వన్' కార్యక్రమానికి భారత్ నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. కిందివారిలో దీనికి ఎవరు ఎంపిక కాలేదు?
ఎ) రితికా సింఘ్ బి) అవినాష్ సక్సేనా
సి) శ్రద్ధ ప్రసాద్
డి) తరన్‌జీత్ సంఘ్ భాటియా
19. అమెరికా అభివృద్ధి చేసిన గ్లోబల్ పొజిషనింగ్ సిస్టంలోని ఉపగ్రహాల సంఖ్య?
ఎ) 16 బి) 24 సి) 28 డి) 32
20. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ ఎక్కడ ఉంది?
ఎ) డెహ్రాడూన్ బి) ముంబై
సి) తిరువనంతపురం డి) బెంగళూరు
21. చంద్రయాన్-1 ప్రయోగాన్ని ఎప్పుడు నిర్వహించారు?
ఎ) 2007
బి) 2008
సి) 2009
డి) 2010
22. చంద్రయాన్-1లో భారత్‌తో భాగస్వామ్యం కాని దేశం ?
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) యురోపియన్ యూనియన్
డి) బెల్జియం
23. 4500-5000 కిలోల బరువున్న ఉపగ్రహాలను సైతం ప్రయోగించగలిగే భారత అంతరిక్ష నౌక?
ఎ) పీఎస్ఎల్‌వీ - XL
బి) జీఎస్ఎల్‌వీ - మార్క్ I
సి) జీఎస్ఎల్‌వీ - మార్క్ II
డి) జీఎస్ఎల్‌వీ - మార్క్ III
24. పీఎస్ఎల్‌వీ ఇప్పటివరకు వరుసగా ఎన్ని విజయాలను నమోదు చేసుకుంది?
ఎ) 30 బి) 29 సి) 28 డి) 27
25. ఇస్రో ఆధ్వర్యంలో పనిచేసే ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ ఎక్కడ ఉంది?
ఎ) అహ్మదాబాద్ బి) పుణే
సి) తిరువనంతపురం డి) శ్రీహరికోట
26. సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రంలో పూర్తిస్థాయిలో ఎన్ని రాకెట్ లాంచింగ్ పాడ్‌లు ఉన్నాయి?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
27. ఇప్పటివరకు ఎన్ని జీఎస్ఎల్‌వీ ప్రయోగాలు నిర్వహించారు?
ఎ) 7 బి) 8
సి) 9 డి) 10
28. చుట్టూ స్ట్రాప్-ఆన్ మోటార్లు లేని పీఎస్ఎల్‌వీ కోర్ అలోన్ రూపం లిఫ్ట్-ఆఫ్ సమయంలో బరువు ఎంత?
ఎ) 294 టన్నులు బి) 320 టన్నులు
సి) 230 టన్నులు డి) 630 టన్నులు
29. అత్యధికంగా ఒకేసారి పది ఉపగ్రహాలను ప్రయోగించిన పీఎస్ఎల్‌వీ నౌక ఏది?
ఎ) పీఎస్ఎల్‌వీ సీ 8
బి) పీఎస్ఎల్‌వీ సీ 9
సి) పీఎస్ఎల్‌వీ సీ 10
డి) పీఎస్ఎల్‌వీ సీ 11
30. నేషనల్ అట్మాస్ఫెరిక్ రీసెర్చ్ లాబొరేటరీ ఎక్కడ ఉంది?
ఎ) హైదరాబాద్ బి) తిరుపతి
సి) చెన్నై డి) బెంగళూరు
31. ఇస్రో ప్రయోగించిన జపాన్ ఉపగ్రహం?
ఎ) టెక్సర్ బి) అజైల్
సి) యూనిబ్రైట్ డి) ప్రొ మెటరస్
32. ఇస్రో ఇప్పటివరకు కిందివాటిలో ఏ దేశ ఉపగ్రహాలను ప్రయోగించలేదు?
ఎ) అల్జీరియా బి) లక్సెంబర్గ్
సి) అర్జెంటీనా డి) నైజీరియా
33. భారత వ్యోమగామి అధికారిక పేరు?
ఎ) వ్యోమోనాట్ బి) రోదసీనాట్
సి) ఖగోళనాట్ డి) పైవేవీకావు
34. ప్రస్తుత ఇస్రో చైర్మన్ ఎవరు?
ఎ) మాధవన్ నాయర్
బి) కస్తూరి రంగన్ సి) వి.నారాయణన్
డి) రాధాకృష్ణన్
35. అంగారక కక్ష్యలోకి విజయవంతంగా మంగళ్‌యాన్ చేరినట్లు మొదట గుర్తించింది?
ఎ) ఇండియా డీప్ స్పేస్ నెట్‌వర్క్
బి) కాన్‌బెర్రా డీప్ స్పేస్ నెట్‌వర్క్
సి) నాసా డీప్ స్పేస్ నెట్‌వర్క్
డి) యురోపియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్
36. అంగారకుడిపై ప్రధానంగా ఏ వాయువును గుర్తిస్తే జీవ సంకేతాలకు సమాచారం లభించే అవకాశముంటుంది?
ఎ) అమ్మోనియా బి) మీథేన్
సి) హైడ్రోజన్ డి) ఆక్సిజన్
37. చంద్రయాన్-1లో భాగంగా ఏ దేశానికి చెందిన పరికరం చంద్రునిపై నీటి జాడలను గుర్తించింది?
ఎ) భారత్ బి) అమెరికా
సి) బెల్జియం డి) జర్మనీ
38. ఇస్రో పీఎస్ఎల్‌వీ - సీ 18 ద్వారా ప్రయోగించిన జుగ్ను ఉపగ్రహాన్ని నిర్మించింది?
ఎ) ఐఐటీ, లక్నో బి) ఐఐటీ, చెన్నై
సి) ఐఐటీ, కాన్పూర్ డి) ఐఐటీ, ముంబై
39. ఈశాన్య రాష్ట్రాల్లో అంతరిక్ష సేవలను విస్తరించే లక్ష్యంతో ఏర్పాటైన నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ ఎక్కడ ఉంది?
ఎ) యుమియం, మేఘాలయ
బి) పాకియాంగ్, సిక్కిం
సి) దిస్‌పూర్, అస్సాం డి) అగర్తల, త్రిపుర
40. క్రయోజనిక్ ఇంజన్‌లో వినియోగించే ప్రొపెల్లెంట్?
ఎ) ద్రవ ఆక్సిజన్
బి) డై మిథైల్ హైడ్రోజన్
సి) ద్రవ హైడ్రోజన్
డి) పాలిబ్యుటాడైఈన్
41. ఇస్రో ఇనర్షియల్ సిస్టం యూనిట్ ఎక్కడ ఉంది?
ఎ) బెంగళూరు బి) అహ్మదాబాద్
సి) తిరువనంతపురం డి) ముంబై
42. జీఎస్ఎల్‌వీ కార్యక్రమం ఎప్పుడు మొదలైంది?
ఎ) 1990 బి) 1993
సి) 1995 డి) 1997

సమాధానాలు

1) ఎ;	2) బి;	3) ఎ;	4) బి;
5) సి;	6) డి;	7) ఎ;	8) సి;
9) సి;	10) డి;	11) ఎ;	12) సి;
13) ఎ;	14) బి;	15) డి;	16) బి;
17) సి;	18) బి;	19) బి;	20) ఎ;
21) బి;	22) ఎ;	23) డి;	24) సి;
25) ఎ;	26) బి;	27) బి;	28) సి;
29) బి;	30) బి;	31) డి;	32) డి;
33) ఎ;	34) సి;	35) బి;	36) బి;
37) బి;	38) సి;	39) ఎ;	40) సి;
41) సి;	42) ఎ..		

Writing on a Currency Note is..

BANK EXAMS
BANKING AWARENESS



1. Cash Management Bills (CMBs)
a) Government of India, in consultation with the Reserve Bank of India, has decided to issue a new short-term instrument, known as Cash Management Bills (CMBs), to meet the temporary mismatches in the cash flow of the Government.
b) The CMBs have the generic character of T-bills but are issued for maturities less than 91 days.
c) Like T-bills, they are also issued at a discount and redeemed at face value at maturity.
d) The tenure, notified amount and date of issue of the CMBs depends upon the temporary cash requirement of the Government.
e) All the above
2. Which of the following banking System is generally referred to involvement of financial intermediaries in aiding credit creation without regulatory oversight.
a) Tiered Banking
b) Shadow Banking
c) Multiple banking
d) Universal banking
e) Multicity Banking
3. BPSS stands for:
a) Banking Payment Settlement Systems
b) Board for Payment and Settlement Systems
c) Bank for Payment and Settlement Sector
d) Board for Payment Service Sector
e) None of the above
4. The main purpose of Anti Money Laundering is CFT, which stands for:
a) Criminal Financial Terrorism
b) Combating Financing of Terrorism
c) Combating Factional Terrorism
d) Common Financial Terrorism
e) None of the above
5. Own Your NPA' campaign to push managers to focus on top 20 bad loan accounts in their jurisdiction
a) IDBI Bank b) ICICI Bank
c) HDFC Bank
d) Karur Vysya Bank
e) Union Bank of India
6. What are the provisions of remuneration of the banking ombudsman ?
a) He is eligible for remuneration and other perquisites
b) This will be determined by the RBI
c) This has to be borne by banks proportionately
d) All the above
e) None of the above
7. Which of the following entity was set up in 1994 to oversee the Indian Financial System, comprising not only commercial banks, state cooperative banks, but also the All India Financial Institutions (AIFIs) and Non-Banking Finance Companies (NBFCs).?
a) Central Board of Directors (CBD)
b) RBI
c) Board of Financial Supervision (BFS)
d) IDBI e) NABARD
8. Which of the following specialised financial institutions has not been created by RBI?
a) National Bank for Agriculture and Rural Development (NABARD)
b) Deposit Insurance and Credit Guarantee Corporation of India (DICGC)
c) National Housing Bank(NHB)
d) Mudra bank
e) None of the above
9. National Institute of Bank Management (NIBM) is located at:
a) Mumbai b) Hyderabad
c) Pune d) Kolkata
e) New Delhi
10. Certificates of Deposit (CDs) and Commercial Paper (CPs) are the instruments widely used in which of the following Financial Sector market?
a) Credit Market b) Stock Market
c) Corporate Debt Market
d) Money Market
e) Forex Market
11. Bharatiya Reserve Bank Note Mudran Limited established as a fully owned subsidiary of the Reserve bank has it's Bank note press at
a) Mysore b) Dewas c) Nashik
d) Noida e) All the above places
12. What is the maximum percentage of Net Demand and Time Liabilities (NDTL) RBI is empowered to increase?
a) 50% b) 40% c) 30%
d) 60% e) No such stipulation
13. The Banking Ombudsman may reject a complaint at any stage if it appears that the complaint made is:
a) Not on the grounds of complaint referred to above
b) Compensation sought from the Banking Ombudsman is beyond Rs 10 lakh .
c) Requires consideration of elaborate documentary and oral evidence and the proceedings before the Banking Ombudsman are not appropriate for adjudication of such complaint
d) If in the opinion of the Banking Ombudsman there is no loss or damage or inconvenience caused to the complainant.
e) All the above
14. To authenticate a Digital signature in Cheque Truncation System (CTS), which of the following keys are used?
a) Private key b) Public Key
c) Master Key d) Only (ii) and (iii)
e) None of the above
15. In case of non-compliance of the award by the bank the baking ombudsman will report to;
a) Reserve bank of India.
b) Supreme court
c) Finance ministry
d) Consumer protection forum
e) Head Office of the concerned Bank
16. A & B are maintaining an 'E or S' account. D has been named as nominee. Balance in the account will be payable to ________ on the death of A.
a) Jointly to B and Nominee D
b) Jointly to B and legal heirs of A
c) B alone d) D alone
e) Will be referred to RBI
17. NREGA (National Rural Employment Guarantee Act) is renamed after :
a) Jawahar Lal Nehru
b) Mahatma Gandhi
c) Indira Gandhi
d) Rajeev Gandhi
e) Jayaprakash Narayan
18. Bank can grant loans against ___
a) LIC Policy b) CDs
c) FD issued by other bank
d) Mutual fund
e) None of the above
19. Which is not a retail deposit product?
a) Credit card b) Term deposits
c) Senior citizen deposits
d) No frills account
e) Letter of Credit
20. As per the RBI's Clean Note Policy, writing on a Currency Note is ...
a) An Offence b) A Crime
c) A Punishable Offence
d) The notes become non-legal tender
e) No such stipulations
21. A bank can purchase NPA from another bank, if in the books of selling bank, the account was NPA for ________
a) 2 years b) 3 years
c) 5 years d) 7 years
e) 18 months
22. Minimum Bank Rate is ______
a) 3% b) 4% c) 5%
d) 6.5% e) None
23. Which is not a major promoter of CIBIL?
a) HDFC b) SBI c) RBI
d) Trans Union International Inc.
e) None of the above
24. Which one is not a fund based service?
a) Short term finance
b) Letter of Credit
c) Bill discounting
d) Export credit e) Housing Loan
25. Which of the following is / are correct regarding Bharatiya Reserve Bank Note Mudran Private Limited?
a) It is one of the subsidiaries of Reserve Bank of India
b) It prints bank notes (Indian rupees) for Reserve Bank of India (RBI).
c) It was established in 1995 to address the demand for bank notes.
d) Only a & b e) All a, b & c
26. In strategic Alliance, the alliance partners:
a) Merge with each other
b) One partner acquires the other
c) Remain separate entities
d) Loses its name and identify
e) None of the above
27. In Manufacturing sector, small enterprises investment in plant and machinery is:
a) Less than 25 lakhs
b) 10 Lakhs to 2 Crores
c) 25 Lakhs to 5 Crores
d) 5 Crores to 10 Crores
e) Less than 50 lacs
28. Banks undertake to pay electricity bills, insurance premium for the customer regularly. Here the bank acts as ______
a) Debtor b) Creditor
c) Principle d) Agent
e) None of the above
29. In the online world of electronic commerce, what do the initials CEM stands for?
a) Costly E-Commerce Marketing
b) Customer Experience Management
c) Customer Experience Misleading
d) Cost Estimates are Mind Boggling
e) None of the above
30. Cash payment of Term deposits is possible, if the amount doesn't exceed:
a) Rs. 20000 b) Rs. 25000
c) Rs. 40000 d) Rs. 50000
e) Rs. 10,000
31. BCSBI has been set up as a / an ______
a) Autonomous Body
b) Society c) Company
d) Trust
e) Customer Service Club
32. Hypothecation is applicable in the case of
a) Movable goods
b) Immovable property
c) Book debts
d) Corporate guarantee
e) Staff loans
33. A stop payment instruction of a cheque can be issued by:
a) The payee b) The endorsee
c) The drawer d) The drawee
e) The collecting Bank
34. FIMMDA stands for:
a) Foreign Exchange Money Markets and Derivatives Association of India
b) Fixed Income Money Markets and Derivatives Association of India
c) Foreign Income Money Markets and Derivatives Association of India
d) Fixed Income Money Market Development Authority
e) None of the above
35. Creator of Trust is referred as:
a) Trustee b) Beneficiary
c) Settlor d) Garnishee
e) Registrar of trusts
36. Sale or purchase of Government Securities by RBI in open market is called as:
a) Credit Planning
b) SCC(Selective credit Control)
c) OMO(Open Market Operations)
d) CAS (Credit Authorisation Scheme
e) FPO(Follow on Public Offer)
37. How many types are T- bills (Treasury Bills) are issued?
a) 2 b) 3 c) 4 d) 5 e) 6
38. The bank that makes payment to the beneficiary on receipt of documents as per terms of Letter of Credit is:
a) Advising Bank
b) Negotiating Bank
c) Confirming Bank
d) Opening Bank
e) Prudential Bank
39. The deposit of cash under CRR requirement with RBI is ______ requirement.
a) Voluntary b) Discretionary
c) Mandatory
d) As per Negotiable Instruments Act
e) None of the above
40. Credit card is a small plastic card of around ______ cm.
a) 7.0 × 5.5 b) 8.5 × 5.0
c) 7.5 × 5.0 d) 8.5 × 5.5
e) 6.0 × 4.5

KEY

1) e	2) b	3) b	4) b	5) a
6) d	7) c	8) d	9) c	10) d
11) e	12) b	13) e	14) a	15) a
16) c	17) b	18) a	19) a	20) c
21) a	22) e	23) c	24) b	25) e
26) c	27) c	28) d	29) b	30) a
31) b	32) a	33) c	34) b	35) c
36) c	37) b	38) b	39) c	40) d.